# భాషా శాస్త్ర పరిచయం

## ఎం.ఏ. - తెలుగు, మొదటి సంవత్సరం

## సెమిస్టర్ - 1, పేపరు 2


**రచయితలు**

**ఆచార్య ఎల్. చక్రధరరావు** ఎం.ఏ., పి.హెచ్.డి.
తెలుగు శాఖ
ఆంధ్ర విశ్వవిద్యాలయం
విశాఖపట్టణం

**ఆచార్య వి. సుబ్బారావు**, యం.ఏ., పి.హెచ్.డి.
తెలుగు శాఖాధిపతి
ఆంధ్ర విశ్వ విద్యాలయం
విశాఖపట్టణం

**సంపాదకులు**
**ఆచార్య ఎల్. చక్రధరరావు**, ఎం.ఏ., పి.హెచ్.డి.
తెలుగు శాఖ
ఆంధ్ర విశ్వవిద్యాలయం
విశాఖపట్టణం

**సమన్వయకర్త :**
**డా॥ ఇరపని మాధవి,** యం.ఏ., యం.ఫిల్., పిహెచ్.డి.
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డైరెక్టర్ :**
**డా॥ బి. నాగరాజు**
దూరవిద్యా కేంద్రం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
నాగార్జున నగర్ - 522 510.
Ph : 0863 - 2293299, 2293356 (08645) 211023, 2110204 (Study Material)
Cell : 9848285518
e_mail : info.anucde.ac.in
Website : www.anucde.ac.in (or) www.anucde.info

**M.A. Sociology : Indian Society Structure and Change**

Edition: 2021

No. of Copies: 246

(C) Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of Distance Education, Acharya Nagarjuna University and this book is meant of limited circulation only.

Published by:

**Dr. NAGARAJU BATTU**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

Printed at:

**Romith Technologies**

Guntur.

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతిపథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే A గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి., మరియు పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా 'జీవన నైపుణ్యాలు' అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారు చేశారు. ఈ పాఠ్యాంశాల పై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి ముమ్మందు మరింత నిర్దిష్టంగా, అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే గాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది, ప్రజలందరికి అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూరవిద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో-ఆర్డినేటర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్,** M.A., M.Phil., Ph.D.

కులపతి (FAC)

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

M.A.Telugu - 1st semester - paper 2

# INTRODUCTION TO GENERAL LINGUISTICS

## భాషా శాస్త్రం- పరిచయం

1. భాష-వృద్ధి,నిర్వచనం- భాషోత్పత్తి వాదాలు-భాషా లక్షణాలు-చరిత్రక -వర్ణనాత్మక-తులనాత్మక భాషాశాస్త్ర విభాగాలు-భాషాశాస్త్ర చరిత్ర-ప్రాచ్య పాశ్చాత్య భాషా పండితుల కృషి

2.భాషల వర్గీకరణ-భౌగోళిక, రూపాశ్రిత, జన్యజనక సంబంధ మూలక వర్గీకరణ

3.ధ్వనిశాస్త్రం-విభాగాలు-వాగవయవాలు-భాషాధ్వనుల ఉత్పత్తి-వర్గీకరణ-ఉచ్చారణ విధేయ లిపి, వర్ణ విజ్ఞానం-ధ్వని- వర్ణం-సవర్ణం-నిర్వచనం-వర్ణ నిర్ణయ విధానం

4. పదాంశం విజ్ఞానం-పదం- పదాంశం- నిర్వచనం-పదాంశ రకాలు- పదాంశ విధానం

5. వాక్య విజ్ఞానం-వాక్యం-నిర్వచనం-సన్నిహిత అవయవ విశ్లేషణం-తెలుగు వాక్యం

### ఆధార గ్రంథాలు

1.తెలుగు వాక్యం-చేకూరి రామారావు

2.భాషా శాస్త్రం నిర్వచనం-పి.ఎస్. సుబ్రహ్మణ్యం

3. Language – Bloom fileld Leonard

4. Dialect Studies – Telugu Academic Publication

5. An Introduction to description Linguistics – GK Pearson H.A.

6. A Course in Modern Linguistics – Hockett C.P.

7. Language – Edward Sapin

# First Semester
# Telugu
# Paper- II: Introduction to General Linguistics

**ఈ క్రింది అన్ని ప్రశ్నలకు సమాధానములు వ్రాయండి.**

1. భాషని నిర్వచించి, భాషా లక్షణాలను తెలుపండి.
2. భాషోత్పత్తి వాదాలను వివరించండి.
3. ప్రాచ్య, పాశ్చాత్య భాషా పండితుల కృషిని గురించి వ్రాయండి.
4. భాషల రూపాశ్రిత వర్గీకరణను తెలుపండి.
5. భాషల భౌగోళిక వర్గీకరణను వివరించండి.

**ఈ క్రింది అన్ని ప్రశ్నలకు సమాధానములు వ్రాయండి.**

1. భాషాధ్వనుల ఉత్పత్తిని గురించి విశ్లేషించండి.
2. ధ్వని శాస్త్రం విభాగాలను గురించి వ్రాయండి.
3. పదాంశాల రకాలను తెలుపండి.
4. తెలుగు వాక్యాన్ని గురించి వ్రాయండి.
5. వాక్యంలోని రకాలను వివరించండి.

-----------

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| పాఠం | 1. | భాష - స్వరూప స్వభావాలు - నిర్వచనం - భాషావిర్భావం - వివిధ సిద్ధాంతాలు | 1.1 - 1.11 |
| పాఠం | 2. | ప్రాచ్య, పాశ్చాత్య దేశాలలోని భాషా వికాసం | 2.1 - 2.12 |
| పాఠం | 3. | భాషా శాస్త్ర విభాగాలు | 3.1 - 3.15 |
| పాఠం | 4. | ప్రపంచ భాషల వర్గీకరణ - భౌగోళిక వర్గీకరణ - పదాంశాలు గుణ వర్గీకరణ | 4.1 - 4.10 |
| పాఠం | 5. | వంశానుగుణ లేదా జన్మాత్మక వర్గీకరణ | 5.1 - 5.14 |
| పాఠం | 6. | ధ్వని శాస్త్రం - ఉచ్ఛారణాత్మక ధ్వని శాస్త్రం - ధ్వని తరంగాత్మక ధ్వని శాస్త్రం, శ్రవణాత్మక ధ్వని శాస్త్రం - ముఖ యంత్రం - ఉచ్ఛారణావయవాలు. | 6.1 - 6.11 |
| పాఠం | 7. | ధ్వనుల ఉత్పత్తి, ప్రాచ్య పాశ్చాత్యుల ధ్వనుల వర్గీకరణ - అంతర్జాతీయ ధ్వని పట్టిక సంక్షిప్త చరి&త్ర - అంతర్జాతీయ పట్టిక (ఐ.పి.ఏ.) ఆవశ్యకత - ధ్వని సంకేతాల అనువర్ణన. | 7.1 - 7.11 |
| పాఠం | 8. | ధ్వని విజ్ఞాన శాస్త్రానికి, వర్ణ విజ్ఞాన శాస్త్రానికి కుల భేదం - ధ్వని - వర్ణం - వర్ణాల లోని రకాలు - ధ్వన్యాత్మక లిపిలో ధ్వనులను ప్రయోగాత్మకంగా గుర్తించటం. | 8.1 - 8.13 |
| పాఠం | 9. | పదాంశ నిర్వచనం, సపదాంశ నిర్వచనం, పదాంశాలను గుర్తించే విధానం - పదాంశ భేదాలు. | 9.1 - 9.12 |
| పాఠం | 10. | పదాంశ నిర్మాణ పరిమితులను నిర్దేశించటం, సన్నిహిత సంబంధుల ఉదాహరణ పూర్వక పరిచయం. | 10.1 - 10.17 |


----------

# పాఠం - 1 భాష - స్వరూప స్వభావాలు - నిర్వచనం

# భాషావిర్భావం - వివిధ సిద్ధాంతాలు

పాఠ్యాంశ నిర్మాణ క్రమం

1.1 భాష
1.2 భాషా శాస్త్రం
1.3 స్వరూప స్వభావాలు
1.4 నిర్వచనం
1.5 జంతువులలో వార్తా ప్రసారం
1.6 మనిషి ఆలోచనలను బహిర్గతం చేసే ప్రక్రియ భాష
1.7 భాషా విధానం - లక్షణాలు
1.8 వివిధ సిద్ధాంతాలు

**లక్ష్యం:-** భాషా నిర్వచనాన్ని - స్వరూపాలను - భిన్న సిద్ధాంతాలను గురించి తెలుసుకుంటారు.

**1.1 భాష :** భాషించేది భాష . సంస్కృతంలో 'భాష్' అనే ధాతువుకు మాట్లాడటం అనే అర్థం ఉంది. మాట్లాడటం అనే మనోగత భావాల్ని కంఠధ్వనుల ద్వారా అభివ్యక్తం చేయడాన్ని భాష అనవచ్చు. ఆకలి, దాహం, ఉద్రేకం, కోపం, భయం వంటి చర్యల వల్ల మనిషి మెదడులో పుట్టే ఆలోచనల్ని బహిర్గతం చేసే ప్రక్రియే భాష .

**1.2 భాషాశాస్త్రం :** భాషను అభివర్ణించే శాస్త్రాన్ని భాషాశాస్త్రమంటారు. భాష సహజమైన వ్యవస్థ. అంటే కట్టుబాటు. ఇది స్థిరమైనది. పరిణామశీలం కలిగినటువంటిది. వ్యవహారంలో సజీవంగా ఉంటుంది. ఇలాంటి దీని స్వరూప స్వభావాలను ఎలాంటి పూర్వాభిప్రాయాల మీద ఆధారపడకుండా పరిశీలనే ప్రధానంగా నిర్ణయించే శాస్త్రం భాషాశాస్త్రం.

**1.3 స్వరూప స్వభావాలు :** మానవుడికున్న అమూల్యమయిన శక్తి భాషను మాట్లాడగలగటం. భాష మాట్లాడలేని మానవుడు లేనట్లే భాష మాట్లాడగలిగిన మానవేతర ప్రాణి ఏదీ లేదు. మెదడులో గాని, ముఖ యంత్రంలో గాని లోపాలున్న కొద్ది మందికి తప్ప మిగిలిన మాలవులందరికీ మాట్లాడేశక్తి ఉంది. మానవుడు తన మనస్సులోని అభిప్రాయాలని బహిర్గతం చెయ్యడానికి నోటి ద్వారా చేసే ధ్వనులే భాష. మనకు తెలియని భాష ఒకరు వ్యవహరిస్తున్నప్పుడు మనం వినేవి ఆ వ్యక్తి నోటి ద్వారా చేసే రక రకాల ధ్వనులే. ఆ భాష తెలిసిన వారికి ఆ ధ్వనుల అర్థం బోధపడుతుంది. తెలియని వారికి వాటి అర్థం బోధపడదు. కాబట్టి భాష అంటే కొన్ని ధ్వనుల సముదాయమేనని దీని వల్ల తెలుస్తుంది. కోతులు, పశు పక్ష్యాదులు కూడా భయం, ప్రేమ, కోపం, ఆకలి మొదలయిన భావాలను సూచించడానికి అరుపులు అరుస్తాయి. అయితే మానవ భాషకీ, పశు పక్ష్యాదుల అరుపులకీ మధ్య ఎంతో భేదం ఉంది. జంతువుల అరుపులలో ఏడెనిమిది లేదా పది, పన్నెండు కన్నా ఎక్కువ రకాలు ఉండవు. కాని మానవ భాషలో రకరకాల ధ్వనులు కలిసి అర్థవంతమయిన మాటలుగా ఏర్పడటం, రకరకాల మాటలు రకాలు వాక్యాలు ఏర్పడటంఉంది. దీనిని బట్టి జంతువుల అరుపులలో కంటే మానవ భాషలో వైవిధ్యంఎక్కువగా కన్పిస్తుంది.

ప్రతి మానవుడికి భాష మాట్లాడి, అర్థం తెలుసుకోగల శక్తి పుట్టుకతో వస్తుంది. కాని ఏ భాషా పుట్టుకతో మాత్రం రాదు. పుట్టిన బిడ్డ మొదట అవ్యక్త ధ్వనులు చేస్తూ పెరుగుతున్న కొద్దీ తన చుట్టూ ఉన్న వ్యక్తులు చేసే ధ్వనులు వింటూ అవి సూచించే అర్థాలు తెలుసుకుంటూ భాష మాట్లాడటం, అర్థం చేసుకోవటం చేస్తుంటాడు. నెలల బిడ్డని నిర్జన ప్రదేశంలో వదిలి వేస్తే ఆ బిడ్డ పెరిగి పెద్దయినా ఏ భాషా రాదు. అలాగే ఒక భాష మాట్లాడే తల్లిదండ్రుల పసి బిడ్డని మరొక భాష మాట్లాడే వారు తీసుకెళ్ళి పెంచుకుంటే ఆ బిడ్డ ఎదిగేక మాట్లాడేది తను పెరిగిన ప్రదేశంలోని భాషే గాని అసలు తల్లిదండ్రుల భాష కాదు. దీని వల్ల భాష జన్మ వల్ల సంక్రమించదు. కేవలం అభ్యాసం వల్లే వస్తుందనేది స్పష్టం.

**1.4 నిర్వచనం :** ప్రపంచంలో ఉన్న అనేక భాషలను పరిశీలించి భాషా శాస్త్రవేత్తలు భాషకు కొన్ని నిర్వచనాలనిచ్చారు.

ఎడ్వర్డ్ సపీర్ "Language is a purely human and non-instinctive method of communicating ideas, emotions and desires by means of a system of voluntary produced symbols"(Language P-8)

"మానవుడు తన మనసులోని భావాలను, ఉద్రేకాలను, కోరికలను సహజ ప్రవృత్తి ద్వారా కాకుండా స్వేచ్ఛా ప్రాదుర్భావ చిహ్న పద్ధతి ద్వారా ప్రకటించే సరణే భాష."

మానవేతర ప్రాణి కోటి కూడా తమకు కలిగే బాధల్ని, కోరికల్ని, ఉద్రేకాన్ని సహజ ప్రవృత్తుల ద్వారా ప్రకటిస్తాయి. మానవుడు తన అభిప్రాయాల్ని, భావాల్ని, కోరికల్ని, ఉద్రేకాన్ని కేవలం సహజ ప్రవృత్తుల ద్వారా మాత్రమే కాకుండా ధ్వని చిహ్నాల (భాష) ద్వారా ప్రకటిస్తాడు.

సైమస్ పాటర్ "వక్త తన ముఖ యంత్రం సాయంతో కావించే ధ్వనుల పరంపర - వక్తృ భావాన్ని శ్రోత శ్రవణేంద్రియం ద్వారా గ్రహిస్తాడు - వక్తృ శ్రోతల మధ్య నాడీ మండలంతో మేధతో పలు విధాల సహకరించుకొంటూ కొనసాగే సంక్లిష్ట సూత్రాల వలయమే భాష." అని అంటాడు.

బ్లాక్ & ట్రేగర్ "A Language is a system of arbitrary vocal symbols by means of which a social group co-operates" (An outline of lingustic Analysis) అంటారు. అంటే ' సంఘ సమూహం పరస్పర వ్యవహారం కోసం ఉపయోగించుకొనే స్వచ్ఛంధ

మౌఖిక చిహ్నాల వ్యవస్థ భాష' అనేది వారి అభిప్రాయం. ఇది ఎక్కువ మంది ఆమోదాన్ని పొందింది.

సి.ఎఫ్. హాకెట్ "A Language is a complex system of habits" - (A course in Modern Linguistics P. 137) అంటే అలవాట్ల సంక్లిష్ట వ్యవస్థే భాష అని నిర్వచించాడు.

పైన పేర్కొన్న భాషా వ్యస్థ 5 ప్రధాన ఉప వ్యవస్థలుగా పేర్కొనవచ్చు.

| | | |
|---|---|---|
| 1. వ్యాకరణ వ్యవస్థ | : | పదాంశాల సముదాయం, వాటి వరుస క్రమం. |
| 2. ధ్వన్యాత్మక వ్యవస్థ | : | వర్ణాల సముదాయం, వాటి వరుస క్రమం. |
| 3. సంధి వ్యవస్థ | : | వాక్యంలో రెండు పదాలు లేదా పదాంశాలు సంహితలో ఉన్నప్పుడు ధ్వనులలో జరిగే మార్పు లేదా మార్పులు. |
| 4. అర్థ సంబంధి వ్యవస్థ | : | ప్రకరణాన్ని బట్టి పదాంశాలకు ఉన్న అర్థాన్ని వివరించే పద్ధతి. ఒకే పదం అరపకరణ భేదం వల్ల అర్థ భేదం కలిగి ఉంటుంది. |
| 5. ధ్వని వ్యవస్థ | : | ఒక ధ్వని లేదా వర్ణం వ్యక్తి భేదాన్ని బట్టి ఉచ్చారణ భేదం కలిగి ఉంటుంది. |

పైన పేర్కొన్న వాటిలో మొదటి మూడు వ్యవస్థలు ప్రధానమైనవి. ఈ మూటిని ఆధారంగా చేసుకొనే చాలా మంది భాషా వ్యవహర్తలు భాషను నిర్వచించారు. 4,5 వ్యవస్థలు భాషా సంబంధులు కావని పలువురు భావించారు. శబ్ద ప్రాధాన్యాన్ని భావించిన పాశ్చాత్యులలో కొందరి భావాలు ఈ విధంగా ఉండగా శబ్దార్థాలు రెండూ ప్రధానాలే అని భారతీయులు భావించారు.

"వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతి పత్తయే
జగతః పితరౌవన్దే పార్వతీ పరమేశ్వరౌ" (రఘువంశః 1-1)

అని కాళిదాసు వాక్కు, అర్థాల రెంటి ప్రాముఖ్యాన్ని రఘు వంశంలో పేర్కొన్నాడు.

ప్రతి వ్యక్తి సంఘంలో సభ్యుడిగా ఉంటాడు. ఒకని కంటే ఎక్కువ సంఖ్యలో వ్యక్తులున్నప్పుడే భాషా వ్యవహారం సాధ్యం. భాషా వ్యవహారం లేకుండా సంఘ జీవనం సాధ్యం కాదు. భాష లేకుండా సంఘం ఉండదు. భాష వల్ల సంఘ సభ్యులు తమ భావాలను పరస్పరం తెలుసుకోగలుగుతారు.

**1.5 జంతువులలోని వార్తా ప్రసారం :** పశువులు, పక్షులు, కీటకాదులలో కూడా వార్తా ప్రసారం ఉంది. ఒక రకం ఎండ్రకాయలలో ఒకటి ఇంకొక దానిని భయ పెట్టడానికి ముందుకాలు గాని, వెనుకకాలు గాని ఎత్తుతుంది. ముందుకాలు ఎత్తటం వెనుకకాలు ఎత్తటం కంటే శత్రువుని పారదోలడానికి ఎక్కువ సమర్థమయినదని పరిశోధనలలో తేలింది.

స్టికిల్ బేక్సు అనే ఒక రకం చేపలలో వసంత కాలంలో తమ ప్రాంతంలోకి ఇతర ప్రాంతాల లోని చేపలు రాకుండా రక్షించుకొంటాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే చేపల పొట్ట, గొంతుకలలో ఎర్రరంగుని చూసి అవి వాటి సంతతికి సంబంధిచినవి కావని గ్రహించి వెంటనే వాటిని పారదోలటానికి ప్రయత్నిస్తాయి. ఒక ప్రాంతంలో దొరికే ఆహారం అక్కడ ఉన్నవాటికీ, వాటి పిల్లలకూ సరిపోయేలా చూడటానికి అవి అలా చేస్తాయి.

పక్షులూ, కోతులూ అనురాగం, భయం కలిగినప్పుడు అరుపులు అరుస్తాయి. భయం కలిగినప్పుడు అరుపులు పెద్ద ధ్వనితో ఉంటాయి. అనురాగ ప్రదర్శన సమయంలో అరుపులు ప్రతి మార్పులు కలిగి ఉంటాయి. ఇవి విన్న ఆయా జాతి పక్షులూ, కోతులూ పరిస్థితిని గ్రహించి దూరంగా పారిపోవడమో, దగ్గరగా చేరడమో చేస్తాయి.

కోతులలో వెర్వెట్ అనే తెగ కోతులు కనీసం ఆరు వివిధ రకాల అరుపులు అరుస్తాయి. వీటికి అపాయం కలిగించే చిరుతపులులు, పాములు, గద్దలు లాంటి ఒక్కో రకం జంతువును చూసినప్పుడు ఒక్కో రకం అరుపు ఇవి అరుస్తాయి. ఈ అరుపులలో రకాలను బట్టి మిగిలిన కోతులు వచ్చిన ప్రమాదకరమైన జంతువు ఏదో తెలుకొని తదనుగుణంగా ప్రవర్తిస్తాయి. అయితే అరుపులు అరిచే కోతి దగ్గరకు వచ్చిన జంతువు కలిగించిన భయం స్థాయి వల్ల రక రకాలుగా అరుస్తుండవచ్చు. కాబట్టి ఆ కోతి మిగిలిన కోతులకి ఫలానా జంతువు వచ్చిందనే వార్త చెప్పే ఉద్దేశంతో రకరకాలుగా అరుస్తుందని చెప్పలేం. అది ఉత్పత్తి చేసే ధ్వని దాని మనస్సులో ఏర్పడిన భయానికి ప్రతిఫలం మాత్రమే.

చీమలలో రసాయనిక సంకేతాలున్నాయి. చీమలు ఆహారం ఉన్న చోటును కనుక్కొని పుట్టకు తిరిగి వచ్చేటప్పుడు వాసన వేసే రసాయన పదార్థాన్ని దోవ పొడుగునా వదులుకుంటూ పోతాయి. మిగిలిన చీమలు ఈ పదార్థం ఉన్న దోవలో వెళ్ళి ఆహారాన్ని చేరుకొంటాయి. అదే విధంగా పావురాలకు కూడా రసాయనిక సంకేతాలున్నాయి.

తేనె టీగలలో స్పర్శ సంకేతం ఉంది. తేనెను చూసిన తేనెటీగ తేనెపట్టు దగ్గరకు వచ్చి నాట్యం చేస్తుంది. తన నృత్యం ద్వారా మిగిలిన తేనె టీగలకు తేనె ఎక్కడ ఉందో, ఏ దిక్కులో ఎంత దూరంలో ఉందో తెలియజేస్తుంది. నాట్యం చేస్తున్న తేనెటీగ తోక ఉన్న వైపు తేనె ఉన్న దిక్కు అని అర్థం. తేనెటీగ తన నిర్ణీత నాట్య భ్రమణాల సంఖ్య ద్వారా దూరాన్ని తెలుపుతుంది. తేనెను సంపాదించే తేనెటీగకు తేనెను సూచించే శక్తితో పాటు ఇటువంటి సూచనలను గ్రహించే శక్తి కూడా సహజ ప్రవృత్తి వల్ల ఉంటుంది. ఇటు వంటి జ్ఞానం ఒక జీవి చెప్పటం వల్ల గాని, మరో ప్రాణి నేర్చుకోవటం వల్ల గాని రాదు. ఈ జ్ఞానం జీన్సు ద్వారా పుట్టుకతోనే సంక్రమిస్తుంది. తేనెటీగ తేనెను గురించి మాత్రమే చెప్పగలదు. తేనెను గురించి మాత్రమే తెలుసుకోగలదు. అందువల్ల తేనెటీగల వార్తా ప్రసార సామర్థ్యం మిక్కిలి పరిమితమైనది. ఇంతే గాక ఈ విధమైన పరిజ్ఞానం జీన్సు ద్వారా సంక్రమిస్తుందే తప్ప నేర్పడం వల్ల గాని నేర్చుకోవటం వల్ల గాని రాదు.

పైన పేర్కొన్న ఉదాహరణల వల్ల మానవేతర జీవులలో కూడా కొన్ని సంకేతాలు వార్తా ప్రసరణకు ఉపయోగపడుతున్నాయని తెలుస్తోంది. మనో భావాలను అప్పటికప్పుడు అసంకల్పితంగా సహజ ప్రవృత్తుల వల్ల తోటి ప్రాణులకు తెలపటానికి వెలువడ్డ ధ్వనులే కాని భూతకాలమయిను భూతులను భవిష్యత్కాల కార్యక్రమ ప్రణాళికా రచనకు కాని వెలువరించిన ధ్వని సంకేతాలు కావు. మానవ భాషకు పశుపక్ష్యాదులొనరించే పై విధమైన ధ్వనులకు హస్తిమశకాంతరం ఉంది. భాషోత్పత్తి క్రమ పరిశోధనకు పశు పక్ష్యాదుల ధ్వని సంకేత విజ్ఞానం ఈ కారణంగా ఏ విధంగానూ ఉపయోగపడదు.

**1.6 మనిషి ఆలోచనల్ని బహిర్గతం చేసే ప్రక్రియ భాష :** వ్యక్తి పంచేంద్రియాల సహాయంతో సృష్టిలోని వివిధ వస్తువుల్నీ, వాటి గుణగణాల్నీ గ్రహించ గలుగుతున్నాడు. దీనిని గ్రాహకత (Perception) అంటారు. అలా గ్రహించిన విషయాన్ని, దానికి సంబంధించిన విషయేతరాలనీ కలగలిపి ఒక చోట చేర్చి వాటిని మెదడులో తిరిగి ముద్రించుకొనే విధానాన్ని భావుకత (Conception) అంటారు. మెదడులో ఆయా సమయాల్లో ముద్రించబడే అనేక గ్రహణాల (Percepts)ను ఎప్పటికప్పుడు గుర్తుంచగలుగుతూ వాటిని సంశ్లేషణ, విశ్లేషణల చేత భావనలు (Concepts)గా మార్చే నిరంతర చర్య ఆలోచన. భాష అనేది ఈ రకమైన ఆలోచనల వల్ల ఉత్పన్నమైన శక్తివంతమైన ప్రక్రియ. ఈ ఆలోచనా శక్తి పశు పక్ష్యాదులకు లేదు.

మనిషి మెదడులో రూపు చెందే భావనల్ని రెండు విధాలుగా వెల్లడి చేయగలడు. అవి (1). భాషా విధానం (2). భాషేతర విధానం. ఈ రెంటిలో భాషేతర విధానమే ముందు పుట్టింది.

భాషా విషయాలను చర్చించుకొనేటప్పుడు భాషేతర విధానాన్ని పరిశీలించడం సరైనదా అని అనిపించవచ్చు. భాషేతర విధానానికి గాని, భాషా విధానానికి గాని ధ్యేయం ఒక్కటే. అది భావనలను వెల్లడి చేయటం. అదీగాక, ఏ భాషకైనా, అది ఎంత పరిణత స్థితిలో ఉన్నా దానితో అంగ విక్షేపం (Gesture) జత గూడే ఉంటుంది. ఎవరయినా ఒక ప్రశ్న వేస్తే, వక్త అవునని చెబుతూనే తోడుగా తల కూడా కదుపుతాడు. రమ్మంటూ చేతులు ఊపటం, కోపం వచ్చినపుడు కళ్ళు ఎర్రగా మారి ముఖం వికృతం చేసుకోవడం అంగ విక్షేపాత్మక చర్యలే.

తొలి దశలో మానవుడు నోటినీ, ముక్కునూ కేవలం తిండి తినడానికీ, గాలి పీల్చడానికి మాత్రమే ఉపయోగించాడు. భాషోత్పాదన ఆ అంగాలకు తరువాత కాలంలో అలవడిన లక్షణం. అందువల్ల తొలినాట భాషేతర విధానమే అభిప్రాయ నివేదనకు ఉపయోగపడుతుండేది. అదే ఈ నాటికీ భాషకు సహాయకారిగా నిలుస్తూ ఉంది. అందువల్ల ఈ విధానాన్ని గురించి తెలుసుకోవడం కూడా అవసరమే.

భాషేతర విధానంలో భావ వ్యక్తీకరణకు బొమ్మలు, రంగులు, వెలుతురు, శబ్దం మొదలైనవి ప్రధాన భూమిక నిర్వహిస్తాయి.

**(ఎ). బొమ్మలు :** ఆది మానవుని గుహా చిత్రాలు, అక్షరాలకు బదులుగా సంకేతాలుగా ముళ్ళు వేసిన తాళ్ళు, చెక్కబద్దల వంటి బొమ్మలు ఆ నాడు భావ వ్యక్తీకరణ చేస్తుండేవి. ఈనాడు కూడా రోడ్డు నియమాలు పాటించడానికి బొమ్మలే ఆధారంగా

నిలుస్తున్నాయి. పరిగెత్తే పిల్లవాడి బొమ్మ పాఠశాలనూ, రైలు బండి బొమ్మ లెవెల్ క్రాసింగ్‌నూ తెలియజేస్తాయి. అక్షరాస్యత పూర్తిగా ఉండి, బాగా అభివృద్ధి చెందిన అమెరికా వంటి దేశాలలో కూడా బొమ్మల వాడకం ఉంది.

**(బి). రంగులు :** శత్రువు తో సంధి సూచనగా ఎగరవేసే తెల్లని జెండా ఆనాడు అభిప్రాయ నివేదనం చేయగలిగింది. రైలు గేటు దగ్గర ఎర్ర దీపం ఈనాడు వాహన గమనాన్ని ఆపుతుంది. పచ్చ జెండా నిలుచున్న రైలు బండిని కదిలిస్తుంది.

**(సి). వెలుతురు :** అడవుల మధ్య రగిల్చిన అగ్ని జ్వాలలు ఆనాటి మానవులకు ప్రత్యేక సమాచారాన్ని అందించేవిగా ఉండేవి. ఈనాడు లైట్‌హౌస్ వెదజల్లే కాంతి రేఖలు తీరస్థ జనావాసాన్ని తెలియజేస్తాయి.

**(డి). శబ్దం :** ప్రాచీన మానవుడు పెట్టిన పోలికతో విజయగర్వం వెల్లడించబడేది. ఈనాడు ఎడతెగక మోగే సైరన్ మోత కర్మాగారాల ప్రారంభ, విరామ సమయాలను తెలియజేస్తుంది.

పైన పేర్కొన్న సందర్భాలలో ఎక్కడా భాష వాడుక లేదు. కాని భావ వ్యక్తీకరణ జరుగుతోంది. ఈ పద్ధతే గాక, ధ్వని విరహితాలయిన తలను ఊపటం, చేతుల కదలిక, కనుబొమ్మల ఎగురవేత వంటివి కూడా ఎదుట మనిషికి నిర్దిష్టాభిప్రాయాన్ని అందించేవే. వీటినే అంగవిక్షేపం అని పిలుస్తారు. ఆంగిక చాలనం ద్వారా అభిప్రాయాన్ని అందించడమనేది ఆది మానవుడిలోనే గాక పశు పక్ష్యాదులలో కూడా కన్పిస్తుంది. ముక్కులు రాచుకుంటూ ప్రేమను వెల్లడించుకునే పక్షులు, రకరకాల చేష్టల ద్వారా యజమాని పట్ల తమ విశ్వాసాన్ని చాటుకునే కుక్కలు, పిల్లులూ మొ॥ జంతువులను మనం నిత్యం గమనిస్తూనే ఉంటాం. పశుపక్ష్యాదులలో కనిపించే ఈ గుణాన్ని మనిషి జంతు దశ నుండి తన వెంట తెచ్చుకొని దాని ద్వారా అభిప్రాయ నివేదనం ఈనాటికీ చేస్తూనే ఉన్నాడు.

శాస్త్రజ్ఞులు ఆంగిక చాలనాన్ని శాస్త్ర బద్ధంగా వివరించడానికి పూనుకున్నారు. ఒక విషయాన్ని మెదడు గ్రహించగానే ఆ గ్రహణ చర్యతోపాటు సమానంగా బహిరింద్రియాలలో చాలక చర్య (motor action) ఆరంభమవుతుంది. ఇది కొంత వరకు అసంకల్పిత చర్య (Involimtary Action) ఉదాహరణకు తప్పు చేసిన పిల్లవాడు తల్లిని ఎదురుగుండా చూడగానే కాళ్ళకు బుద్ధి చెప్పి పరుగెత్తుకుపోతాడు. ఇక్కడ తల్లిని చూడటం అనేది గ్రహణం. ఆవిడకు పట్టుపడకుండా ఉండాలనే భావం మెదడులో స్థిరపడ్డాక బహిరింద్రియాలైన కాళ్ళలో చాలక చర్య ఆరంభమవుతుంది. వెంటనే పిల్లవాడు పరుగెత్తి పోతాడు. పారే వాగులో నీటి చల్లదనం అనుభూతం కాగానే అనుకోకుండానే చేతులు నీటిలో మునిగి ఆ నీటిని వెదజల్లటం, తొలి చినుకుల వల్ల భూమి తడిసి మట్టి వాసన చుట్టుకోగా నోరు తెరచి గట్టిగా ఊపిరి లోపలికి పీల్చుకోవటం - ఇవన్నీ చాలక చర్యలే. ఇదే విధంగా ముఖేంద్రియ భాగాలైన గొంతు, పెదవులు, నాలుక, దౌడలు, దంతాలు మొదలైనవి మెదడులో గ్రహణం జరిగినపుడు చాలక చర్యలు ఆరంభించటంతోనే భాష తొలి అవస్థకు నాంది వాచనం జరిగింది. ఇదే భాష తొలి అంగంగా భాసించే అంగ విక్షేపాత్మక భాష (Gestural Language). దీని తరువాత రూపు చెందిన మరొక పద్ధతి చిత్ర లిపి భాష (Pictographic Language). ఇది ఎదుట లేని వారికి భావ వ్యక్తీకరణం చేసే పద్ధతి. మరో విధంగా చెప్పాలంటే ఇది లేఖన పద్ధతి.

చిత్రలిపి భాషకీ, సాంప్రదాయికమైన లేఖన శాస్త్రానికీ (Traditional Orthography) చాలా భేదం ఉంది. లేఖన శాస్త్రం ఏ భాషకైనా కొన్ని వేల సంవత్సరాల తర్వాత ఏర్పడుతుందని శాస్త్రవేత్తల అభిప్రాయం. అంటే వాగ్వ్యవహారం ముందూ, దాని లేఖన రూపం తర్వాత పరిణామ క్రమంలో ఏర్పడతాయి. ఇది హృదయగత భావనకు లిఖిత రూపమైన సంకేతమే కాని ధ్వని రూపమైన వాగ్వ్యవహారాన్ని తెలియజేసేది కాదు.

లేఖన శాస్త్రం (Orthography) వాగ్వ్యవహారంలో ఏ ధ్వనులు భావస్ఫోరకాలయి ఆవిష్కృతమవుతాయో ఆ ధ్వనుల్ని అక్షర రూపంలో తెలియ జేస్తుంది. అనగా చిత్రలిపి పద్ధతిలో లేఖనం భావనకు సంకేతం కాగా, లేఖన పద్ధతిలో చేర్చబడిన అక్షరాలు వాగ్వ్యవహారంలోని ధ్వనులకు సంకేతం. చిత్రలిపి పద్ధతి ముందూ లేఖన పద్ధతి దానికి వెనుకా ఉద్భవించాయనడంలో సమంజసం ఉంది. ప్రతి అభిప్రాయ నివేదనానికీ ఈ రెండు రకాలైన లేఖన పద్ధతులూ ఉంటాయి. ఇందులో మొదటిది భాషేతర విధానానికి చెందగా, రెండోది భాషా విధానాకి చెందుతుంది.

## 1.7 భాషా విధానం - లక్షణాలు

ముఖ యంత్రాంగాలు ఉత్పాదించే ధ్వని క్రమంగా వర్ణాలు గానూ, పదాలుగానూ ఏర్పడి, పదాల మధ్య ఒక నియతి ఏర్పడి భాషా విధానం రూపు దిద్దుకొంది. ముఖ యంత్ర సహాయం వల్ల ఒక భాషలో వర్ణాలుగా గుర్తింపబడిన ధ్వనినే శాస్త్రజ్ఞులు భాషా ధ్వనిగా అంగీకరించటం జరిగింది.

మానవ జాతి తనకు సన్నిహితమైన గిబ్బన్లు, చింపాంజీ, ఏప్ మొదలైన కోతి జాతుల నుంచి సుమారు ఒకటిన్నర కోట్ల సంవత్సరాలు పూర్వమే విడివడింది. భాష మాత్రం కేవలం 25 లేక 30 వేల సంవత్సరాలకు పూర్వమే ఆవిర్భవించిందనేది శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మానవుడి మెదడు అభివృద్ధి చెంది భాషా సంస్కృతి ప్రసారాలు ప్రారంభమయ్యాయి. గాలి, నీరు, ఆహారం వలె భాష కూడా మనిషికి ఎంతో అవసరం. అవసరమైన దాని కంటే మనిషి ఎక్కువగా మాట్లాడతాడు. చాలా సందర్భాలలో అనవసరంగా కూడా మాట్లాడతాడు. కొన్ని సందర్భాలలో లేని విషయాలను కల్పించి వార్త వలె చెప్పి మనిషి సంతోషపడతాడు. ఇటువంటి విషయాలను గమనించటం వల్ల మానవునికి భాష ఎంత ముఖ్యమో తెలుస్తుంది. భయం కలిగినప్పుడు, ఆకలి వేసినప్పుడు, ఆహారం కోసం, లైగింక వాంఛ కలిగినప్పుడు మానవేతర ప్రాణులు కొన్ని ధ్వనులు చేస్తాయే తప్ప అనవసరంగా, అసందర్భముగా, అసత్యంగా మానవ సంభాషణ వంటి ధ్వనులు చేయవు. మానవ, మానవేతర వార్తా ప్రసార విధానం (Communicative System)లో చాలా తేడా ఉంది.

మానవ భాషకు 7 ప్రత్యేక లక్షణాలున్నాయి. ఈ ఏడు లక్షణాలు కలిగి ఉన్న మరి ఏ మానవేతర ప్రాణీ లేదు. అవి :

(ఎ). ద్వైవిధ్యం (Duality)

(బి). ఉత్పాదకత (Productivity)

(సి). స్వచ్ఛందత / శబ్దార్థ సంబంధ సిద్ధి (Arbitrariness)

(డి). పరస్పర విషయ వినిమయం (Interchangeability)

(ఇ). ప్రత్యేకత (Specialization)

(ఎఫ్). ప్రేరణ దూరత / స్థాన దూరత (Displacement)

(జి). సాంస్కృతిక ప్రసరణ (Cultural Transmission)

**(ఎ). ద్వైవిధ్యం :** మానవ భాషలో రెండు రకాల నిర్మాణం ఉంది. కొన్ని ధ్వనులు కలసి ఒక పదంగా ఏర్పడటమూ, కొన్ని పదాలు కలసి ఒక వాక్యంగా ఏర్పడటమూ అన్ని భాషలలోనూ ఉన్నాయి. ఏ భాష వర్ణాల నిర్మాణ క్రమం ఆ భాషదే. ఏ రెండు భాషలూ ఒకే వర్ణ నిర్మాణ పద్ధతి కలిగి ఉండవు.

ప్రతి భాషలోనూ పదాలు క్రమ పద్ధతిలో కలసి వాక్య నిర్మాణం జరుగుతుంది. 1. వర్ణాత్మక వ్యవస్థ (Phonological System) 2. వ్యాకరణ వ్యవస్థ (Grammatical System) అనే రెండు వ్యవస్థలు ప్రపంచంలోని ప్రతి భాషలోనూ ఉన్నాయి. వీటినే ద్వైవిధ్యమంటారు.

వర్ణాల క్రమం అర్థ భేదకతను సాధిస్తుంది. వ్యాకరణ వ్యవస్థ వల్ల సంపూర్ణ సందేశం అందుతుంది. అర్థావగతికి వ్యాకరణ వ్యవస్థ దోహదం చేస్తుంది. మానవేతర ప్రాణులలో ద్వైవిధ్యం లేదు. తేనెటీగల నాట్య క్రమంలోని మార్పుల వల్ల తేనె ఎంత దూరంలో ఉంది లేదా ఎంత దగ్గరలో ఉంది తెలుస్తుంది. కాబట్టి తేనెటీగల వార్తా ప్రసరణలో కొంత ద్వైవిధ్యమున్నట్లు చెప్పవచ్చు.

**(బి). ఉత్పాదకత :** భాషా సముపార్జనానంతరం ఒక వ్యక్తి అంతకు పూర్వం ఎప్పుడూ వినని, తానెప్పుడూ పలకని వాక్యాలను కూడా నిర్మించగలడు. ఇతని వాక్యాలను శ్రోతలు పూర్తిగా అర్థం చేసుకోగలరు. ఈ నూతన వాక్య నిర్మాణానికి కారణం సామ్యం (Anology) మానవుడు మాట్లాడేటప్పుడు దేనినో ఒక దానిని అనుకరించటమో లేదా సామ్యం ద్వారానో అనేక నూతన పదాలను నేర్చుకుంటాడు. చిన్న పిల్లలు భాషను నేర్చుకోవడం ఈ శక్తి వల్లనే సాధ్యమవుతుంది.

**(సి). స్వచ్ఛందత / శబ్దార్థ సంబంధ సిద్ధి :** శబ్దానికి, అర్థానికి ఉన్న సంబంధం ఒకో భాషకు చెందిన వ్యక్తులు ఏర్పరచుకొన్న సంకేతమే తప్ప మరేమ కాదని ఈ స్వచ్ఛందతా లక్షణం తెలుపుతుంది. మాటలో ఉన్న శబ్దాలకు అర్థానికి ఏమీ

సంబంధం లేదు. ఉచ్చరిత శబ్దానికి అర్థానికి సంబంధం ఉండి ఉంటే ప్రపంచంలో ఇన్ని భాషలు ఏర్పడి ఉండేవి కాదు. స్వల్ప సంఖ్యాకమైన అనుకరణ శబ్దాలలో తప్ప శబ్దానికి అర్థానికీ సహజ సంబంధం లేదు.

**(డి). పరస్పర విషయ వినిమయం :** ప్రతి వ్యక్తికీ మాట్లాడ గల శక్తి, ఇతరులు మాట్లాడింది అర్థం చేసుకోగల శక్తి - ఉన్నాయి. తేనెటీగల నాట్యం లోనూ, కోతుల అరుపులలో కూడా కొంత వరకు ఈ లక్షణం ఉంది.

**(ఇ). ప్రత్యేకత :** వార్తా ప్రసరణ ప్రేరణ, ప్రతిక్రియ రెండూ ఉంటాయి. ప్రేరణకు ప్రతిక్రియకు సహజ సంబంధం లేకపోతే ఆ వార్తా ప్రసరణలో ప్రతిక్రియ ఉన్నట్లుగా భావించవచ్చు. ప్రేరణ ప్రతిక్రియలకు సన్నిహిత సంబంధం ఉంటే ఆ వ్యవస్థలో ప్రత్యేకత లేనట్లుగా, ప్రత్యేక సంబంధం లేకపోతే ఆ వ్యవస్థలో ప్రత్యేకత ఉన్నట్లుగా భావించాలి.

ప్రత్యేక నిర్దిష్ట సమయంలో గృహిణి భోజనాల గదిలో పాత్రలను సర్దుతున్నట్లు చప్పుడు విన్న గృహస్థు చేతులు కడుక్కొని భోజనాల గదికి వస్తాడు. భోజనాల గదిలోని పాత్రల చప్పుడు భోజనానికి ప్రేరణ అవుతుంది. ఈ పాత్రల చప్పుడే 'గృహస్థుకు భోజనం సిద్ధమయింది, సిద్ధం కండి' అనే ప్రేరణను కలిగిస్తోంది. పాత్రల సర్దుబాటుకు భోజనం సిద్ధం అవటానికి పరస్పర సన్నిహిత సంబంధం ఉంది. కాబట్టి ఇక్కడ ప్రత్యేకత లేదు. ఏ చప్పుడు లేకుండా 'భోజనం సిద్ధమయింది' అనే వాక్యం ద్వారా తెలిపినప్పుడు ప్రత్యేకత ఉంది. ఇక్కడ కేవలం శబ్దజాలం శక్తివంతంగా పని చేసింది. టేబులు సర్దుబాటు ఏ కారణం చేత జరిగినా అపార్థాలకు దాదాపు ఆస్కారం లేదు. భాషలోని వాక్యాలు విన్నవారికి కలిగే ప్రతిక్రియ సాంకేతికమయిన శబ్దార్థ సంబంధమయినది కాబట్టి ప్రత్యేకత ఉంది. గృహిణి వ్యవహరించిన భాష తెలియని వారి విషయంలో ఏ విధమైన ప్రతిక్రియ వ్యక్తం కాకపోవటాన్ని గమనించవచ్చు. మానవేతర జీవులు వేటిలోనూ ఈ ప్రత్యేకత లేదు.

**(ఎఫ్). ప్రేరణదూరత / స్థాన దూరత :** మానవుడు భూతభవిష్యత్తు వర్తమానాలను గురించి తోటి వారితో సంభాషించగలడు. మానవేతర జీవులు భూత, భవిష్యత్కాలాలకు సంబంధించిన ఏ విధమైన సమాచారాన్ని కూడా తెలపలేవు. తేనెటీగలు కూడా తాము చూపిన తేనె గురించి కొన్ని గంటల విరామం తర్వాత తెలప లేవు. ఇంతేకాక మానవేతర ప్రాణులు మానసికోద్రేకాన్ని పొందినప్పుడు సహజ ప్రవృత్తుల ద్వారా మాత్రమే కొన్ని పరిమిత విషయాలను గురించి వార్తా ప్రసారాన్ని అందించగలవు.

**(జి). సాంస్కృతిక ప్రసరణ :** మానవులు ఇతర ఆచార వ్యవహారాలు లాగే భాష కూడా ఒకరి నుంచి మరొకరు నేర్చుకుంటారు. అంతేగాక భాష ఒక తరం వారి నుంచి ఇతర తరాల వారికి నేర్చుకోవడం ద్వారా సంక్రమిస్తుంది. ఇది మానవులకున్న అనుకరణ శక్తి వల్ల సాధ్యమవుతుంది. చిన్నపిల్లలు పెద్దలను అనుకరించి భాష నేర్చుకోవడం, పిల్లలు మాట్లాడే తప్పులు సవరించి పెద్దలు భాష నేర్పడం సర్వ సాధారణం. కోతులలో అనుకరణ శక్తి ఉన్నా వాటిలో సాంస్కృతిక ప్రసరణ ఉన్నదా అనే విషయం సందేహమే. ఈ లక్షణం వల్లనే మానవ నాగరికత అభివృద్ధి చెందింది. అంతవరకు జరిగిన అభివృద్ధి నేర్చుకొని పురోభివృద్ధికి మానవుడు పాటుపడుతున్నాడు. దీనికి మానవుని జ్ఞాపకశక్తి దోహదం చేస్తోంది. మిగిలిన జీవరాశికి సహజ ప్రవృత్తులు మాత్రం ఉండగా మానవుడికి అపార జ్ఞాపకశక్తి, మౌలిక ఆలోచనా పద్ధతి ఉంది.

**1.8 వివిధ సిద్ధాంతాలు :** ఎంతో వైవిధ్యమున్న భాషా విధానం మానవ జాతికి లభ్యమైన పద్ధతిని గురించి ఇంచుమించు అన్ని జాతుల ప్రాచీన మత విశ్వాసాలలోనూ ఊహలు చెలరేగాయి. మత విశ్వాసాలన్నీ సృష్టిని తీర్చిదిద్దిన వాడు భగవంతుడనీ, అతడే భాషను కూడా సృష్టించి మానవుడికి ధారాదత్తం చేశాడనీ అభిప్రాయపడ్డాయి. హిందూమతం, హైందవ సాంప్రదాయాన్ని బట్టి భాషకు ఆది దేవత సరస్వతి. ఆవేదే వాగ్దేవి. తొలి మత గ్రంథాలయిన వేదాలు సృష్టికర్తకు నాలుగు ముఖాలు. సంస్కృతం దేవతలు మాట్లాడే భాష. అదే విధంగా, మహమ్మదీయులు అరబ్బీ భాషను, క్రైస్తవులు హిబ్రూ భాషను దేవ భాషలుగా పేర్కొన్నారు.

రానురాను భష పుట్టుకను గురించి తాత్విక చర్చలు ఎన్నో జరిగాయి. మన దేశంలో నైయాయికులు పదానికి ఈశ్వర దత్తమయిన శక్తి ఉన్నదనీ, పదానికీ అర్థానికీ ఉండే ఈ సంబంధం ఈశ్వరేచ్ఛా కల్పితమనీ అభిప్రాయపడ్డారు. స్ఫోటవాదులు శబ్దం బ్రహ్మమనీ దానికీ పరబ్రహ్మకూ స్వరూపమొకటే అనీ, పదానికీ అర్థానికీ ఉండే సంబంధం నిత్యమూ, అనాద్యమూ అని నిర్ణయించారు. వ్యాకరణవేత్తలు మాత్రం పదానికీ అర్థానికీ మధ్య ఉండే సంబంధం మానవ సంకేత జనితమే అని నిర్ణయించుకొన్నారు.

మీమాంసకుల్లో ఒక తెగవారు శబ్దార్థ సంబంధాలను బోధించే అభిదా లక్షణ వ్యంజనా శక్తులతో పాటు తాత్పర్య శక్తిని కూడా నిర్ణయించి దీనికే శబ్దార్థాలను కలిపి ఉంచే శక్తి ఉన్నదని వివరించారు. భారతదేశంలో ప్రాచీన లాక్షణికుల మతం ఇలా ఉండగా పాశ్చాత్య ప్రపంచంలో డార్విన్ ముఖ యంత్రాంగాలు అంగ విక్షేపాలను అసంకల్పితంగా అనుకరించటం వల్ల భాష ఉద్భవించిందని చెప్పాడు.

గ్రీకు తాత్త్వికులు పైథాగరస్, ప్లేటోలు ఇద్దరూ భాష పుట్టుకకు కారణంగా స్వభావాన్ని (Theory of in herent necessity)ని ప్రతిపాదించారు. మానవులు నాగరికత మయిపుకు పయనిస్తున్న కొద్దీ అవసరాన్ని బట్టి సహజంగా, అనాయాసంగా భాషను తనకు తానుగా ఏర్పరచుకొన్నాడని ఈవాద సారాంశం.

డెమొక్రటీస్, అరిస్టాటిల్‌లు ఇద్దరూ అన్వయవాదాన్ని (Theory of Agreement) ప్రతిపాదించారు. అవసరార్థులైన ఆది మానవులు గుంపులు గుంపులుగా ఒక చోట చేరి ఈ భావానికి ఈ ధ్వని రూపమైన సంకేతముండాలని అన్వయాన్ని స్థిర పరచుకున్నట్లుగా ఈ వాదం ప్రతిపాదించింది. అయితే కేవలం సమావేశ సమయాల్లో మాత్రమే అటువంటి సంకేతాలు ఎలా రూపు చెందాయన్నది సమాధానం లేని సందేహం.

ఇలాగే భాషాధ్వనులకూ, భావాలకూ లంకె ఎలా ఏర్పడిందనే విషయం మీద ఎన్నో భాషా సిద్ధాంతాలు వెలుగులోకి వచ్చాయి. అందులో ప్రధానమయినవి :

(అ). బౌవౌ సిద్ధాంతం (The Bow-Wow Theory)
(ఆ). పూపూ సిద్ధాంతం (The Pooh-Pooh Theory)
(ఇ). డింగ్-డాంగ్ సిద్ధాంతం (The Ding-Dong Theory)
(ఈ). యో-హే-హో సిద్ధాంతం (The Yo-He-Ho Theory)
(ఉ). సంజ్ఞా సిద్ధాంతం (The Gesture Theory)
(ఊ). సంగీత సిద్ధాంతం (The Musical Theory)
(ఋ). సంసర్గ సిద్ధాంతం (The Contact Theory)
(ౠ).సంపాదన సిద్ధాంతం (The Acquisition Theory)
(ఎ). స్వతస్సిద్ధ సిద్ధాంతం (The Innate Theory)
(ఏ). సింగ్ - సాంగ్ సిద్ధాంతం (The Sing-Song Theory)
(ఐ). టాటా సిద్ధాంతం (The Ta-Ta Theory)

భాష మానవుల సంఘ జీవనానికి దోహదకారిగా ఉంది. పద పదార్థ సంబంధం కలగటం మానవ భాషలోని వైచిత్రి. దీనికి సంబంధించిన ఒక్కో సిద్ధాంతాన్ని పరిశీలించుదాం.

**అ. బౌ-వౌ సిద్ధాంతం :** దీనికి మరో పేరు ధ్వన్యనుకరణ సిద్ధాంతం. సృష్టిలోని సహజ ధ్వనులను అనుకరిస్తూ పదాలు ఏర్పడ్డాయని ఈ సిద్ధాంత సారాంశం. జంతువుల, పిట్టల ధ్వనులను అనుకరించి వాటికి ఆయా పేర్లను ఆది మానవుడు పెట్టాడని ఈ బౌ-వౌ సిద్ధాంత ప్రవక్తలు ప్రతిపాదించారు. కుక్కలు బౌ-వౌ అని అరుస్తాయి. ఆ అరుపుకు బౌ-వౌ అని పేరు పెట్టారు. వాస్తవానికి కురకురలాడే, కొక్కిరించే కోళ్ళు ఉన్న చోట మాత్రమే ఈ సిద్ధాంతం పని జేస్తుంది గాని, వాటిని దాటి అవతలికి పోతే అంతా వ్యర్థమే అని హేళనాత్మకంగా దీనికి పై పేరును స్థిర పరచారు.

పై సిద్ధాంతాన్ని నిలబెట్టే ప్రముఖాంశం అనుకరణం. సృష్టిలో ప్రతి ప్రాణికీ అనుకరించే గుణం ఉంటుంది. ప్రకృతిలో ఉన్న సహజ ధ్వనుల్ని అనుకరించి మానవుడు భావ ప్రకటన కోసం భాషను నిర్మించుకొన్నాడన్నది ఈ సిద్ధాంత సారాంశం.కాకా అనే పక్షికి ఒక భాషలో సంకేతం కాకి కాగా మరో భాషలో కాకం. కూకూ అనే పక్షిని ఆంగ్లంలో కకూ అంటారు. అదే విధంగా భే అనేది భేకం, మే అనేది మేక, మియావ్ అనేది పిల్లి. ఈ అరుపులన్నీ ఆయా భాషల్లో ఆయా జంతువులకు ఏర్పడిన పేర్లు. బౌ-వౌ అనేది కుక్కకు సంకేతం కాబట్టి ఈ సిద్ధాంతానికి పేరు వచ్చింది.

**ఈ సిద్ధాంతం లోని లోపాలు :**

1. సృష్టిలో ఉన్న వస్తు భయమంతా ధ్వని పూర్వకమైనది కాదు. గోడ, ఇల్లు, కర్ర, నేల వంటి ఎన్నో శబ్దాలకు ధ్వనితో సంబంధం లేదు. వీటికి సంబంధించిన సంకేతాలు ఈ సిదా&ధంత బలంతో పుట్టాయని చెప్పడం కదరదు.

2. సృష్టిలో ఉండే ధ్వనులు అందరికీ ఒకే రకంగా వినిపించకపోవచ్చు. ఒకరికి కొక్కరోకో అని వినిపించే కోడి కూత మరొకరికి 'చిచ్చిరీ చీ' అని వినిపించవచ్చు. ఒక్కొక్కరికి ఒక్కో విధంగా వినిపించే ధ్వనుల్ని ఆధారంగా చేసుకొని అందరికీ సమ్మతాలైె సంకేతాలను ఏర్పరచుకోవటం ఎంత వరకు సమంజసమనే ప్రశ్న తలెత్తక మానదు.

**ఆ. ఫూఫూ సిద్ధాంతం :** దీనికి ఆశ్చర్య వాదం (The Interjectional Theory) అని మరో పేరుంది. ఇది మానవ మనస్తత్వ విశ్లేషణ మీద ఆధారపడ్డ సిద్ధాంతం. సృష్టిలో ఒక్కో వస్తువుకు ఒక్కో భావానికి, ఒక్కో ధ్వనికి మనం అన్ని వేళలా వివరించడానికి వీలులేని సంబంధం ఉంటుందని, ఆ ధ్వనే ఆయా వస్తువులకు సంకేతాలేర్పడేటప్పుడు భాషలో ప్రాధాన్యం వహిస్తుందనీ ఈ సిద్ధాంత సారాంశం. ఉదాహరణకు చకార ధ్వనికీ చెడ్డతనానికీ తెలుగులో సంబంధముందని చెప్పవచ్చు. చెడ్డ, చేటు, చెడు, చెట్ట, ఛా, ఛీ పదాల ఉత్పత్తికి ఈ సంబంధమే కారణం. అదే విధంగా బకార ధ్వనికీ గోళాకార వస్తువులకూ సంబంధాన్ని సూచించవచ్చు. ఈ ధ్వనిని ఉచ్చరించేటప్పుడు పెదవులు రెంటినీ వలయాకారంలో అతికి, బుగ్గల్ని కొద్దిగా బూరిటిల్ల జేసి గాలిని స్ఫోటనం చేయవలసి వస్తుంది. అప్పుడు బుగ్గలు, పెదవులు పొందిన ఆకారాన్ని పోలి గుండ్రంగా బూరిటిల్ల గలిగే వస్తువులకన్నిటికీ ఆ ధ్వని సంకేతం అవుతుందని చెప్పడం యుక్తి సహజమైన విషయమే. బుట్ట, బూరె, బుంగ, బంతి, బుడ్డి, బుడగ, బోలె, బోడి వంటి తెలుగు పదాలే కాక, బాస్కెట్, బాల్, బాగ్, బౌల్, బన్, బండిల్ వంటి ఆంగ్లపదాలు కూడా పయి పద్ధతి వల్ల ఉత్పన్నమయ్యాయని చెప్పవచ్చు.

ఈ అంశాన్ని వివరిస్తూ జార్జి విల్లీస్ అనే భాషావేత్త ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అమాయకులూ, నిష్కపటులూ అయిన పసి పిల్లలు కేరింతలు కొడుతూ చేసే 'గీ' అనే ధ్వని నుండి Good, God అనే పదాలు ఉద్భవించి ఉంటాయనీ, నిశ్శబ్దాన్ని సూచిస్తూ పెదవులు బిగించటం వల్ల జనించే మకార ధ్వని Mute, Mystery, Myme వంటి సంకేతాలు జనించడానికి కారణమయిందనీ వివరించాడు. సంస్కృతంలోని మూక శబ్దమూ తెలుగు మూగ శబ్దమూ కూడా పయి పట్టికలో చేరడానికి అర్హత కలవి అవుతాయి. అదే విధంగా ఆశ్చర్యాన్నీ, అసహ్యాన్నీ, కోపాన్నీ సూచించడానికి ఏర్పడ్డ సంకేతాల్లో 'ఫ'కార ధ్వని వినిపిస్తుంది. Fire, Friend, Foul, Foe వంటి పదాలు ఆ రకంగా జనించినవేననీ విల్లీస్ భావించటం చేత ఈ సిద్ధాంతానికి ఫూఫూ సిద్ధాంతమనే పేరు స్థిరపడింది.

**ఇ. యో-హే - హో సిద్ధాంతం :** దీనికీ, ఫూఫూ వాదానికీ దగ్గిర పోలికలున్నాయి. 19 శతాబ్దికి చెందిన నోరే (Noire) ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. రాతిని పెళ్ళగించేటప్పుడు గాని, చెట్టును పెకలించేటప్పుడు గాని మనుషుల గుంపు చేసే శ్రమ వల్ల జనించే ధ్వనుల వల్ల భాష ఉద్భవిస్తుందని ఈ సిద్ధాంతం ప్రతిపాదిస్తోంది. కష్టమయిన పనులు చేసేటప్పుడు మనం అసంకల్పితంగా కొన్ని ధ్వనుల్ని చేస్తామనేది అనుభవ సిద్ధ విషయం. శ్రమ కలిగినప్పుడు ఊపిరి గట్టిగా లోపలికి పీల్చుకొని నాద తంత్రుల ద్వారా కంఠం నుంచి బయటికి గాలిని పంపేటప్పుడు స్పర్శ వర్గాలతో పాటు అచ్చులు కూడా వెలువడతాయి. ఇటువంటి మౌఖిక ధ్వనుల సమాహారం నుంచి హీవ్ (Heave), రెస్ట్ (Rest), లిఫ్ట్ (Lift) మొదలయిన పదాలు ఏర్పడి ఉంటాయి. ఈ సిద్ధాంతంలో రెండు ముఖ్య భాషా లక్షణాలున్నాయి. భాష సామూహిక ప్రయత్న సాధ్యమనీ, విధి పూర్వకమనీ (Commands) ఇది తెలుపుతోంది. మానవుడు భాష పుట్టటానికి పూర్వం సంఘ జీవి కాని కారణంగా ఈ సిద్ధాంతం సరికాదని కొందరు భావించారు. కాని మానవుని సంఘజీవి విధానం భాషావిర్భావం ఏక కాలంలో జరిగాయని భావించటం సమంజసం. ఎ.ఎస్. డైమండ్ (A.S. Diamond) విధి పూర్వక వాక్యాలే భాషావిర్భావ సమయంలో మొదట ప్రయోగించబడేవనీ ఇవి కొట్టు (Strike), పగల కొట్టు (Break), నరుకు (Cut) మొదలైన వాక్యరీతులలో ఉండేవనీ భావించాడు. వేటాడేటప్పుడు, చెట్లను పడగొట్టేటప్పుడు, పనిముట్లను తయారు చేసుకొనేటప్పుడు మానవులకు పరస్పరం సహకారం అవసరమవుతుండేది.

**ఈ. డింగ్ - డాంగ్ సిద్ధాంతం :** ఇది మాక్సుముల్లర్ స్వయంగా ప్రతిపాదించిన సిద్ధాంతం. దీనికి నిదాన సిద్ధాంతం (Pathogenic Theory) అని మరొక పేరు కూడా ఉంది. ప్రకృతిలో ఉండే ప్రతి వస్తువులోనూ, అంతర్నిహితంగా ఒక విధమైన లయ(Rhythm) ఉంటుంది. దాని వలన ఆయా వస్తువులు మనుషుల్లో ఒక రకమైన సంచలనాన్ని కలుగజేసే శక్తిని పొంది ఉంటాయి.

మనుష్యుడు ఆ సంచలనానికి అనుగుణమయిన సంకేతాలనే ఆ వస్తువులకు కల్పించుకొంటాడు. అంటే జడమూ, చేతనా రహితమూ అయిన రాతి బండలో కూడా ప్రకంపనాలుంటాయని మనం నమ్మవలసి ఉంటుంది. అప్పుడే ఈ సిద్ధాంతానికి సార్థక్యం ఉంటుంది.

గంట మోగితే దానిలోని ప్రకంపనాలు మనుష్యుడి మనస్సులో డింగ్-డాంగ్ అనే సంకేతాల్ని సృష్టించవచ్చు. అయితే గిన్నె బాగా మెరుస్తుంటే చూసేవాడికి తన మనస్సులో 'తళతళ' అనే సంకేతాన్ని సృష్టించగల ప్రకంపనాల్ని కలిగి ఉంటుందని అనగలమా? కనకన, ధగధగ, భగభగ, ధనధన వంటి ధ్వన్యనుకరణ శబ్దాలూ, పెద్ద పెద్ద బండలు, మంచి మంచి పళ్ళూ అనే చోట్ల వచ్చే పునరుక్తులూ ఈ సిద్ధాంతం వల్ల వివరించవచ్చునేమో కాని భాష లోని సమస్త పదజాలాన్ని ఈ సిద్ధాంతం వివరించలేదు.

**ఉ. సంజ్ఞా సిద్ధాంతం :** భాషకు పూర్వం మానవుడు హస్తాద్యవయవ సంజ్ఞల ద్వారా తన భావాలను వ్యక్తీకరించే వాడని కొందరు భాషా శాస్త్రజ్ఞులు భావించారు. నేటికీ మనిషి మాట్లాడేప్పుడు అంగ విక్షేపం చేస్తూనే ఉంటాడు. జంతువులతో పాటు ఆదిమజాతి వారు అంగ విక్షేపాలను అధికంగా చేస్తారు. భిన్న భాషలకు చెందిన రెడ్ ఇండియన్లు (Red Indians) తాము సంప్రదించుకొనేటప్పుడు సంజ్ఞలనే పూర్వం ఉపయోగించేవారు. ఆదిమ మానవుడు సంజ్ఞలను భాషకు ఏక కాలంలో ఉపయోగించి ఉండవచ్చు. సంజ్ఞా భాషా సిద్ధాంతంలో కొన్ని లోపాలున్నాయి. మనిషికి చేతులు ఖాళీగా ఉన్నప్పుడే సంజ్ఞలను చేయగలడు. చేతులతో పనులు చేసేటప్పుడు భావాల్ని వ్యక్తీకరించలేడు. కాబట్టి భాషలాగా ఇది సమగ్రమయినది కాదు. చీకట్లోనూ, చెట్లూ మొదలయినవి అడ్డు వచ్చినపుడు సంజ్ఞలు పనికిరావు. ఈ అన్ని కారణాల వల్ల మానవుడికి భాషను కనిపెట్టవలసిన అవసరం కలిగింది. మన మానవ భాషకు కూడా ముఖ సంజ్ఞా జనితాలే అని సర్ రిజర్డ్ పేజట్ (Sir Richard Pajet) పేర్కొన్నాడు. చేతుల దైనికావసరాలు అధికమైన కారణంగా మౌఖిక సంజ్ఞల ద్వారా సమగ్ర భాషను మానవుడు సృష్టించుకొన్నాడని ఈ సిద్ధాంతం చెబుతోంది. ఆంగ్లంలోని 'Sir, Sup' వంటి పదాలు ఈ సిద్ధాంతాన్ని కొంత వరకు బలపరుస్తున్నాయి.

**ఊ. సంగీత సిద్ధాంతం:** సంగీతం, భాష ఏకకాలంలో ఆవిర్భవించాయని ఆటో జస్పర్సన్ (Otto Jes Person) భావించాడు. ఆదిమ భాషలు స్వర ప్రాధాన్యమున్నవనేది ఈయన సిద్ధాంతం.

వైదిక సంస్కృత భాషా పరిశీలన ఈ సిద్ధాంతానికి ఉపబలకంగా ఉంది. మొదట ప్రేమాది భావాల్ని ఆది మానవుడు సంగీతం ద్వారా వ్యక్తం చేసే వాడనేది ఈ వాద సారం. అయితే ఈ వాదంలో కొంత వరకు వాస్తవం లేకపోలేదని కొందరి భావన.

**ఋ. సంసర్గ సిద్ధాంతం:** మానవుడు తన సహచరులతో సంసర్గాన్ని పెంపొందించుకోవాలని భాషను సృష్టించుకొన్నాడని జి. రెవెజ్ (G. Revesz) ప్రతిపాదించాడు. మొదట ధ్వనుల ద్వారా తర్వాత కేకల ద్వారా ఆ తర్వాత భాష ద్వారా మానవుడు తన భావాలను వ్యక్తం చేశాడని ఈ సిద్ధాంతం చెబుతోంది. వీళ్ళు సంసర్గానికి ప్రాధాన్యమిచ్చారే కాని భాష ఏ విధంగా పుట్టిందో చెప్పటానికి మాత్రం అంత ప్రాధాన్యతనీయలేదు.

**ౠ. సంపాదన సిద్ధాంతం :** విజ్ఞానం జన్మ సిద్ధం కాదనీ, అనుభవమే విజ్ఞానానికి మూలమని తెలిపే అనుభవ సిద్ధాంతం (Empericism) ఈ సంపాదన సిద్ధాంతానికి మూలం.మనస్సు శూన్యంగా ఉంటుందనీ దాని పై అనుభవం ముద్ర వేస్తుందనీ అనుభవవాదుల అభిప్రాయం. పుట్టుకతో భాషా వాసన మానవ మస్తిష్కంలో ఉండదనీ, భాషను పెద్దలను చూసి అనుకరించి, అభ్యసిస్తాడనీ ఈ సిద్ధాంత కర్తలు చెబుతారు. సైకిలు తొక్కటం దీనికి ఉదాహరణగా పేర్కొంటారు. ఇంద్రియాల ద్వారానే జ్ఞానాన్ని సంపాదిస్తామనీ, పరస్పర స్పందన వల్ల ఏర్పడ్డ అలవాట్లే (Resists) జ్ఞానానికి, భాషా సముపార్జనకు కారణమని బి. ఎఫ్. స్కిన్నర్ మొదలైన మనస్తత్వ శాస్త్ర పరిశోధకుల అభిప్రాయం.

**(ఎ). స్వతస్సిద్ధ సిద్ధాంతం :** అనుభవవాద పురస్కృతమయిన సంపాదన వాదాన్ని ఖండించి హేతువాద (Rationalism) సహితమైన స్వతస్సిద్ధ వాదాన్ని (Innate Theory) భాషాశాస్త్రంలో భాషోత్పత్తికి గాను కనిపెట్టిన వ్యక్తి సుప్రసిద్ధ భాషా శాస్త్రవేత్త నోమ్ చామ్స్కీ(Noam Chomsky). స్వతస్సిద్ధంగా మానవుడికి జీన్సు (Genes) ద్వారా భావాలు, భాష ఉంటాయనీ పరిసర ప్రాంత వాసుల భావాలు, భాష వీటికి ఉద్దీప్తిని మాత్రం కల్పిస్తాయని హేతువాదులు భావిస్తున్నారు. భాషను మాట్లాడే శక్తి జన్మతః జీన్సు ద్వారా మానవుడికి సంక్రమిస్తుందనేది నేడు భాషా శాస్త్రజ్ఞులు అంగీకరించిన సిద్ధాంతం.

**ఏ. సింగ్ - సాంగ్ సిద్ధాంతం :** ఈ సిద్ధాంతం భాషలో ఉండే పదజాలమంతాఆదికాలపు మంత్రోచ్చారణ మీద ఆధారపడి ఉద్భవించిందని నిర్ణయిస్తుంది. అయితే ఈ మంత్రాలు ఉద్భవించడానికి అవసరమైన చరిత్రను ఈ సిద్ధాంతం స్పష్టం చెయ్యదు. దీనికి బలమైన ఉదాహరణలు కూడా అన్ని భాషల నుంచి సేకరించడం కష్టం.

**ఐ. టాటా సిద్ధాంతం :** ఇది చార్లెస్ డార్విన్ అభిప్రాయాన్ని అనుసరించి పుట్టిన సిద్ధాంతం. భాషలో ఉండే పదజాలమంతా ముఖ యంత్రం వల్ల ఉత్పన్నమవుతుంది. అయితే ముఖయంత్రాంగాలన్నీ అంగ విక్షేపాలను అసంకల్పిత చర్యగా అనుకరించడం వల్ల ధ్వన్యాత్మకాలైన వర్ణాలనూ, వాటి వల్ల పదాలనూ ఉత్పన్నం చేటడానికి సమర్థాలవుతున్నాయనేది ఈ సిద్ధాంతం చెబుతోంది.

ఉదాహరణకు వక్త ఎదుట వ్యక్తిని పొమ్మని నిర్దేశించడానికి తన చేతిని అది ఉన్న స్థానాన్నుండి ముందుకు విసురుగా కదిలిస్తాడు. ఆ కదలికను అనుకరిస్తూ పెదవుల దగ్గర స్ఫోటనం చెందే గాలి పెదవుల్ని విడిచి ముందుకు దూసుకుపోయినప్పుడే 'పో' అనే ధ్వని ఉద్భవించి అది భాషాధ్వనిగా మారుతుంది. అదే రమ్మన్నప్పుడు చేతి కదలిక, అది ఉన్న స్థానాని కంటే బాగా వెనక్కు కదులుతుంది. 'రా' అన్న ధ్వనిని ఉచ్చరించేటప్పుడు రకారంతో కూడిన 'అ'కార స్థానం ముఖ యంత్రంలో బాగా వెనకగా ఉంటుంది. దీనిని బట్టి ఉచ్చారణకూ, ఆంగిక చాలనానికీ సంబంధం ఉన్నదనే నిర్ణయించవచ్చు. అందువల్ల ఈ వాదం కొంతలో కొంత యుక్తి సహమైనదిగా కనిపిస్తుంది.

ఈ విధంగా పైన పేర్కొన్న భాషా సిద్ధాంతాలన్నీ వేటికవి సమగ్రాలు కావు. ఒక్కో వాదం కొన్ని రకాల పదోత్పత్తికి కారణాలు చెప్తుంది. కాని మొత్తం భాష కంతటికీ సమగ్ర వ్యాఖ్యానం ఏ ఒక్క సిద్ధాంతం చెయ్యలేదు. అయితే భా, అనేది మానవుడికి క్రమానుగతంగా లభించిన అభ్యస్త విషయమే గాని భగవద్దత్తమైనది మాత్రం కాదని ఈ సిద్ధాంతాలన్నీ నిర్ణయించ గలుగుతున్నాయి.

**సమీక్ష:-** భాషా అంటే ఏమిటో, భాషా ప్రసారం, భాషలోని భిన్న వాదాలను పరిశీలించాం.

## ప్రశ్నలు

1. భాష అనగానేమి? భాష స్వరూప స్వభావాలను - లక్షణాలను ఆవిర్భావ వికాసాలను తెలపండి.
2. వివిధ భాషోత్పత్తి వాదాలను గూర్చి చర్చించండి.
3. భాషా నిర్వచనంలోని భేధాభిప్రాయాల్ని తెలిపి సరైన నిర్వచనాన్ని నిరూపించండి.

## ఆధార గ్రంథ పట్టిక


1. Bloomfield, Leonard, 1933. Language, New York : Holt
2. Hockett. Charles F, 1958 A Course in Modern Linguistics, New York, Macmillan.
3. సుబ్రహ్మణ్యం పి. ఎస్. 1984 ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్-4.

# పాఠం - 2 ప్రాచ్య, పాశ్చాత్య దేశాలలోని భాషా వికాసం

పాఠ్యాంశ నిర్మాణ క్రమం

**2.1** **ప్రాచ్య (భారత) దేశంలోని భాషా వికాసం**

**2.2** **పాశ్చాత్యదేశాలలో భాషా వికాసం**

**2.3** **పందొమ్మిదో శతాబ్దంలో పరిణామాలు**

**2.4** **ఇరవైయవ శతాబ్దంలో పరిణామాలు**

**2.5** **భాషా శాస్త్రంలో విభిన్న శాఖలు**

**లక్ష్యం:-** భాషాశాస్త్ర పరిశోధన భారతదేశంలోను, ఇతర దేశాలలోను జరిగిన విశేషాలు తెలుసుకుంటారు.

## 2.1 ప్రాచ్య (భారత) దేశాల్లోని భాషా వికాసం:

(ప్రాచ్య దేశాలంటే తూర్పు దేశాలలోని భాషా వికాసాన్ని గురించి చెప్పవలసి ఉంటుంది. ఒక్క భారతదేశంలో తప్ప మిగిలిన తూర్పు దేశాలలో జరిగిన భాషా వికాసం లభ్యం కాలేదు. కాబట్టి ఈ వ్యాసం భారతదేశంలోని భాషా వికాసానికి మాత్రమే పరిమితం)

"చత్వారి శృంగా త్రయో అస్య పాదా
ద్వే శీర్షే సప్త హస్తాసో అస్య
త్రిధా బద్ధో వృషభోరోరవీతి
మహాదేవో మర్త్యా ఆవివేశ"

- ఋగ్వేదం (మండలం 4, అధ్యాయం 5, సూక్తం 58, ఋక్ 3)

అని ఋగ్వేదంలోని అగ్ని దేవతా పరమయిన మంత్రాన్ని వైయా కరణులు శబ్ద శాస్త్ర పరంగా వ్యాఖ్యానించారు. మానవులందరి లోపల అంతర్యామిగా ఉన్న పర శబ్దం లోకం లోని వృషభం కంటే విలక్షణమయినదని ప్రతిపాదించటం జరిగింది.

మహా దేవుడయిన శబ్దం కామాలను వర్షించే వృషభం. అస్య = దీనికి, శృంగా = కొమ్ములు, చత్వారి = నాలుగు - లోకం లోని వృషభానికి రెండు కొమ్ములుండగా శబ్ద రూప దేవుడికి నామం, అఖ్యాతం, ఉపసర్గ, నిపాంతం అని నాలుగు రకాల పదాలే కొమ్ములు.

| | | |
|---|---|---|
| త్రయో అస్య పాదా | = | దీనికి మూడు పాదాలు - అంటే భూత, భవిష్యద్వర్తమాన కాలాలనే మూడు పాదాలు. |
| ద్వేశీర్షే | = | రెండు తలలు - శబ్దానికున్న రెండు రూపాలు : 1. నిత్య స్ఫోట (వ్యంగ్యం), 2. అనిత్యవైఖరి (వ్యంజకం) |
| సప్త హస్తాసః | = | ఏడు చేతులు - అంటే ఏడు విభక్తులు |
| త్రిధాబద్ధః | = | మూడు విభాగాలుగా కట్టబడింది - వక్షస్థలం, కంఠం, శిరస్సు (తల) (ఈ మూడు చోట్ల శబ్దం అభివ్యక్తమవుతుంది) |
| వృషభః | = | వర్షించేది (ఎద్దు) కోర్కెల్ని తీర్చేది (సుశబ్ద యోగం వల్ల కోర్కెలు సిద్ధిస్తాయని ప్రాచీన పండితుల విశ్వాసం) |
| రోరవీతి | = | రంకెలు వేస్తుంది / శబ్దం చేస్తుంది. (శబ్దం నాద రూపంగా ఉంటుంది.) అలాంటి మహాదేవుడయిన శబ్దం మనుష్యుల్ని ఆవేశించింది. |

పైన పేర్కొన్న ఋగ్వేదంలోని ఋక్కు వల్ల మన భారతదేశంలో వేద కాలం నుంచి భాషను దైవంగా భావించే వారనీ, భాషను పరిశీలించే వ్యాకరణ శాస్త్రానికి ప్రాధాన్యమిచ్చేవారనీ తెలుస్తోంది.

దీనిని బట్టి మన దేశంలో వేద కాలం నుంచీ భాషను దైవంగా భావించే వారనీ, భాషను పరిశీలించే వ్యాకరణ శాస్త్రానికి ప్రాముఖ్యం ఇచ్చేవారనీ తెలుస్తోంది. వేద కాలపు భాష కాలక్రమాన మార్పులు చెందుతూ ఉండటంతో వేద మంత్రాల ఉచ్చారణను యథాతథంగా పరిరక్షించడమూ, వాటిలో శబ్దాల అర్థాలను తెలుసుకోవడమూ తరువాత కాలం పండితులకు ఆవశ్యకమయింది. వేద మంత్రాల ఉచ్చారణలో కొంచెం తప్పు వచ్చినా దాని ఫలితం లేకపోగా దుష్టోచ్చారణ అపకారం కలిగిస్తుందని నమ్మేవారు. అందువల్ల వేదోచ్చారణలో లోపాలను నివారించడానికి ధ్వనులు ముఖ యంత్రంలో ఎలా పుడతాయి? ఒక్కొక్క ధ్వనికి గల స్థానకరణ ప్రయత్నాలేవి? ఇటువంటి చర్చ మొదలయింది.

### (ఎ) శిక్షలు, ప్రాతిశాఖ్యలు:

ధ్వనులను గురించి చర్చించే గ్రంథాలు శిక్షాప్రాతిశాఖ్యలు.

ప్రాతిశాఖ్యలు వేదాల ఉచ్చారణలోని గుణ దోషాలు, సంధులు మొదలయిన వాటిని వివరించే గ్రంథాలు. వేదాలలోని ప్రతిశాఖకు సంబంధించినవి. ఇవి అసంఖ్యాకంగా ఉండాలి. ప్రస్తుతం ఆరు మాత్రమే నిల్చి ఉన్నాయి.

1. ఋక్ ప్రాతిశాఖ్య + (ఋగ్వేదానికి)
2. ఋక్ తంత్ర వ్యాకరణం (సామవేదానికి)
3. తైత్తరీయ ప్రాతిశాఖ్య (కృష్ణయజుర్వేదానికి)

4. వాజసనేయ లేక కాత్యాయనీయ ప్రాతిశాఖ్య (శుక్లయజుర్వేదానికి)
5. అథర్వ ప్రాతిశాఖ్య (అథర్వ వేదానికి)
6. మైంత్రాయణీయ ప్రాతిశాఖ్య (అముద్రితం)

ఇంకా అశ్వలాయన, వాష్కల, చారాయణ ప్రాతిశాఖ్యలు ఉపలబ్ధాలు కావు. ప్రాతిశాఖ్యలకే 'పార్షద' లేక పారిషదములనీ వ్యవహారం. 'పరిషదిభవం పార్షదమ్' వేద సభల్లో పండితులు గావించిన చర్చల సారాంశం. ఇవి వ్యాకరణ రచనకు ఉపయుక్తమయ్యే ప్రాథమిక రచనలు.

**(బి) శిక్షలు :** ధ్వని శాస్త్రానికి (Phonetics) భారతీయ వ్యవహారమే శిక్ష. శిక్షలు చాలా ఉన్నాయి. కాని 'పాణినీయ శిక్ష' మాత్రం సుప్రసిద్ధం. ఇది సంక్షిప్త ధ్వని శాస్త్రం. ఇది పాణిని కృతం కాదని, పాణిని అనుయాయులెవరో రాసి ఉంటారనీ అంటారు. కొందరు పింగళిముని రాశాడంటారు.

శిక్షాధ్యయనం వ్యాకరణాధ్యాయనానికి ఎంతో సహాయకారి. అత్యంత ప్రాచీన కాలంలోనే భారతదేశంలో ధ్వని శాస్త్రం, స్వతంత్రంగా 'శిక్ష'లనే పేరుతో వ్యవహృతం కావటం గమనార్హం. ఇవి ఏ ఒక్కదానికి సంబంధించినవి కావు. ప్రాతిశాఖ్యలకు పూర్వమో పరమో నిర్ణయించటం కూడా కష్టమే.

ఈశిక్షలు ఏదో ఒక వేదానికి పరిమితం కాక ధ్వన్యుత్పత్తి చర్చని చేస్తూ ప్రాతిశాఖ్యలలో చెప్పని విషయాలను వివరిస్తూ వాటికి అనుబంధప్రాయంగా ఉంటాయి. ప్రాతిశాఖ్యలన్నిటికీ మూలమయిన ఒక శిక్ష ఉండి ఉండాలని తైత్తరీయారణ్యకంలోని 'అథ శిక్షాం వ్యాఖ్యాస్యామః' అనే పేరు గలది ప్రాచీన తమమయినదని కొందరి అభిప్రాయం. కాని ఇది పాణినీయ విరచితమనే విషయమూ, ఇదే ప్రాచీనతమయినదనే అభిప్రాయమూ - రెండూ వివాదాస్పదాలే. శిక్షలు చాలా ఉన్నాయి. సిద్దేశ్వర వర్మ కాలానికి 65 ఉన్నట్లుగా ఆయన పేర్కొన్నారు. వీటిలో ఒక్క పాణినీయ శిక్ష తప్ప మిగిలినవన్నీ ఏదో ఒక విశేషాంశాలను వివరించేవే.

ప్రాతిశాఖ్యలూ, వాటికి ఆధారమయి ఇప్పుడు అలభ్యమయిన శిక్షా పాణిని కాలాని కంటే ముందువి. వీటిలో ధ్వన్యుత్పత్తి క్రమమూ, స్థానకరణ ప్రయత్న భేదాలూ, సంధులూ వివరించబడ్డాయి. ఆధునిక కాలంలో ధ్వని శాస్త్రవేత్తలు శిక్షా ప్రాతిశాఖ్యాలలోని సిద్ధాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఆమోదించి వాటిని తమ పరిశోధనకు ప్రాతిపదికగా గ్రహించారు. విట్నీలాంటి వారు గాఢ పరిశీలన చేయక వాటిని నిరసించడానికి సాహసించారనీ స్పష్టమవుతోంది.

పాణినికి ముందే ధ్వనుల సావర్ణ్యం, అంతర తమత్వం మొదలయిన ధ్వన్యుత్పత్తి సంబంధి విషయాలు శిక్షా ప్రాతిశాఖ్యలలో వివరంగా ఉన్నాయి. అలాగే స్థాన కరణాల నిర్వచనమూ, అచ్చులకూ హల్లులకూ గల భేదమూ తైత్తరీయ ప్రాతిశాఖ్య (2:31-34)లో ఉంది.

"స్వరాణాం యత్రోప సంహారః తత్ స్థానం
యదుప సంహరతి తత్కరణం
అన్యేషాంతు యత్ర స్పర్శనం తత్ స్థానం
యేన స్పర్శ యతి తత్ కరణమ్"

ధ్వనులు సమీప ధ్వనుల వలన ప్రభావితమవుతాయనే విషయం కూడా మన ప్రాచీనులు గుర్తించటం జరిగింది.

ఒక ధ్వనికీ మరొక ధ్వనికీ భేదం ఏర్పడటానికి గల వివిధ కారణాలను కూడా వీళ్ళు గమనించారు.

'అనుప్రదానాత్ సంసర్గాత్ స్థానాత్ కరణ విభ్రమాత్
జాయతే వర్ణ వైశేష్యం పరిమాణాచ్చ పంచమాత్'
-(తైత్తరీయ ప్రాతిశాఖ్య 13:2)

ఈ శ్లోకంలో ధ్వనికీ ధ్వనికీ మధ్య భేదం ఏర్పడటానికి అయిదు కారణాలను చెప్పారు. అవి అను ప్రదానం (శ్వాసం, నాదం), సంసర్గం (మహా ప్రాణం, అనునాసిక్యం), స్థానం, కరణ విన్యయం (స్పృష్టం, వివృతం), పరిమాణం (హ్రస్వ, దీర్ఘ, ప్లుత భేదం). ఇలా అనేక విషయాలు మనకు శిక్షలలోనూ, ప్రాతిశాఖ్యలలోనూ కనిపిస్తాయి.

**(సి) నిరుక్తం :** దీనిని యాస్క మహర్షి రాశారు. ఈయన క్రీ. పూ. 8వ శతాబ్దికి చెందినవాడు. నిరుక్తం ముఖ్యంగా వేద భాషలో ఉండి తరువాత కాలంలో వ్యవహార భ్రష్టమయిన పదాల వ్యుత్పత్తినీ, వాటి అర్థాలను గురించి చర్చించింది.

నిరుక్తం నిఘంటువు అనే అయిదు అధ్యాయాల గ్రంథానికి విపుల వ్యాఖ్యానం. అయితే ఈ నిఘంటువు కర్త ఎవరో తెలియదు. ఇందులో వైదిక భాషలోని పదాలు సమానార్థక సముదాయాలుగా ఇచ్చారు. యాస్కుడు ఈ పదాలు ఏ యే ధాతువుల నుంచి వచ్చాయో సూచించి వాటి అర్థాలను నిర్వచించారు. పదాల అర్థాన్ని నిర్వచించడానికి అవి వేద మంత్రాలలో ఏఏ సందర్భాలలో ఉప యుక్తమయ్యాయో పరిశీలించి ఈ పరిశీలన సహాయంతో పదాల అర్థ నిర్ణయం చేశారు. పదవ్యుత్పత్తి పరిశీలన యాస్కుడికి ముందు కాలంలోనే ప్రారంభమయినట్లు ఆయన పేర్కొన్న గార్గ్య, గాలవ, శాకటాయనాదుల వల్ల తెలుస్తోంది. యాస్కుడు ఒక పదం ఏ ధాతువు నుంచి వచ్చింది అని చర్చించారే కాని ఆయన పాణినిలా పదాలకి ప్రకృతి ప్రత్యయ విభాగం చేసి అందులో వచ్చే సంధి మార్పులు వివరించలేదు. అందువల్ల యాస్కుడు పాణినికి ప్రాచీనుడయి ఉంటాడని విమర్శకులు నిర్ణయించారు.

పదాలను నామం, ఆఖ్యాతం, ఉపసర్గ, నిపాతాలని విభజించింది యాస్కుడే. ఆయన కాలానికే కాల ప్రత్యయాలకీ, పురుష ప్రత్యయాలకీ మధ్య భేదమూ, తద్ధిత ప్రత్యయాలకీ, కృత్ ప్రత్యయాలకీ మధ్య ఉన్న భేదమూ పండితులకి తెలిసింది. శాకటాయనుడూ, నిరుక్త కారుతా అన్ని నామాలూ క్రియల నుంచి పుట్టాయని నమ్మారు. గార్గ్యాది వైయాకరణులు కొందరు ఇది సరి కాదన్నారని యాస్కుడే పేర్కొనడం విశేషించి చెప్పుకోదగింది.

**(డి)వ్యాకరణాలు:** ప్రకృతి ప్రత్యయ విభజన పరిజ్ఞానం కలిగించేది వ్యాకరణం వీటిలో ప్రధానమైనవి.

**అష్టాధ్యాయి:** దీని కర్త పాణిని. ఈయన క్రీ.పూ. 6,7 శ॥లకు చెందిన వాడు. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న లాహోర్ పట్టణానికి సమీపంలో ఉన్న 'శాలాతుర' అనే గ్రామానికి చెందినవాడుగా పండితులు పేర్కొంటున్నారు.

అష్టాధ్యాయి ప్రపంచంలో ఉన్న వ్యాకరణ గ్రంథాలన్నింటిలోనూ ప్రశస్తమయినదని ప్రాచ్య, పాశ్చాత్య విపశ్చితులందరూ అంగీకరించారు. ఈయన రాసిన అష్టాధ్యాయి వ్యాకరణానికి ఆ కాలంలో వ్యవహారంలో ఉన్న సంస్కృత భాష ముఖ్యాధారం. ఈ భాషకీ, వేదాలలో ఉన్న భాషకీ భేదం ఉన్న చోట్ల వైదిక భాషా రూపాలు కూడా ఈయన వ్యాకరణంలో సాధించారు.

అష్టాధ్యాయిలో
1. సంజ్ఞా పరిభాషలు
2. సమాన కారకాలు
3. ధాతు ప్రత్యయాలు
4. కృదంతరూపనిష్పాదనం
4,5. స్త్రీ ప్రత్యయాలు
6,7. స్వర విధులు
8. సంధులు

మొత్తం నాలుగు వేల సూత్రాలు నాలుగు పాదాలలో ఎనిమిది అధ్యాయాలుగా ఉన్నాయి.

అష్టాధ్యాయి ప్రపంచంలోనే ప్రప్రథమ సమగ్ర వర్ణనాత్మక వ్యాకరణముగా అందరూ అంగీకరిస్తారు. ఇది భాషా పరిశీలన ప్రాతిపదికగా సాగింది. ఇందులోని ప్రత్యాహార పద్ధతి, అల్పానల్ప సముచిత సంజ్ఞా పరిభాషా పరిక్పనం, షడ్విధ లక్షణోపేత సూత్ర రచన నియతానియత గుణ నిర్ణయం ప్రత్యయార్థ నిర్ణయాదులు పాణిని నిశితాఖండ ప్రజ్ఞా ప్రభావాలకు నిదర్శనం.

అష్టాధ్యాయని గురించి ప్రముఖ భాషా శాస్త్రవేత్త బ్లూమ్‌ఫీల్డ్ "This Grammar .......... is one of the greatest monuments of human intelligence. it describes, with the minutest detail, every inflexion, derivation and composition and every syntactic usage of its author's speech. No other language, to this day has been so perfectly described" - Language- P.11. (ఈ వ్యాకరణం మానవ మేధా సంపద కొక కీర్తి స్తంభం. ఇది తత్తర్త భాషలోని ప్రతి సూక్ష్మాంశాన్ని, ప్రతి ప్రత్యయాన్ని, నిష్పన్న రూపాన్ని కారకాన్ని అభివర్ణిస్తుంది. ఈ రోజు వరకు ఏ ఇతర భాష ఇంత సర్వ సమగ్రంగా వర్ణితం కాలేదు.)

ఇంకా ఎంతో మంది యూరోపియన్ దేశీయులు అష్టాధ్యాయిని గురించి ఎంతో ప్రశంసించారు. దీనికి ఇంతటి కీర్తి ప్రతిష్టలు రావటానికి, ఇంత ప్రాశస్త్యాన్ని పొందటానికి కారణం ఇందులోని

1. సమగ్రత
2. నిర్దుష్టత
3. సూత్రలాఘవం
4. శాస్త్రీయ వర్ణనం

మొదలయిన గుణాలు. అష్టాధ్యాయిలో ఉపయుక్తమయిన పద్ధతులకీ ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలకీ చాలా పోలికలున్నాయి.

**(ఇ) వార్తికాలు :** పాణిని తర్వాత ముఖ్యమయిన వైయాకరణుడు కాత్యాయనుడు (వరరుచి). ఈయన క్రీ.పూ. 500-350 మధ్యవాడనీ, దాక్షింగాత్యుడనీ విమర్శకుల అభిప్రాయం.

వార్తికాలనేవి పాణిని సూత్రాన్ని సరిదిద్దటానికి గాని, సవరించటానికి గాని పూరించటానికి గాని చేసిన రచనలు. వీటిని కాత్యాయనుడు పాణిని తర్వాత 200 సం॥కు రాశాడు. ఈ మధ్య కాలంలో సంస్కృత భాషా స్వరూపం ఈ వార్తికాలలో తెలుస్తుంది.

"ఉక్తానుక్త దురుక్తానాం చింతాయత్ర ప్రవర్తతే
తంగ్రంధం వార్తికం ప్రాహుః వార్తికజ్ఞా మనీషిణః "

వార్తికాలు మొత్తం నాలుగు వేలున్నాయి. ఇందులో మార్పులు, చేర్పులు చేసివ్రాసిన 1500 సూత్రాలు పతంజలి మహాభాషఅయం ద్వారా లభ్యమవుతున్నాయి. పాణిని కాలానికీ ఈయిన కాలానికీ మధ్య సంస్కృత భాషలో అనేక మార్పులు వచ్చాయి. ఈ మార్పులను వర్ణించడానికీ, పాణినిలో క్వాచిత్కంగా ఉన్న లోపాలను సవరించడానికీ ఈ వార్తికాలు ఉద్దిష్టమయ్యాయి. పాణిని మీద ఈయన విమర్శ పురోభాగిత్వంలో చేసినదనడం అసమంజసమనీ ఆదితత్వ నిర్ణయ దృష్టితో జరిగిందనీ పండితుల అభిప్రాయం. కాత్యాయనుడి వార్తికాలు చాలా వరకు అనావశ్యకమయినవని పతంజలి మహాభాష్యంలో నిర్ణయించాడు.

**(ఎఫ్) మహాభాష్యం:** క్రీ.పూ. 150 ప్రాంతంలో ముని త్రయం (పాణిని, కాత్యాయనుడు, పతంజలి)గా పేరుగాంచిన ముగ్గురిలో చివరివాడయిన పతంజలి రాసిన మహాభాష్యం అష్టాధ్యాయికి వచ్చిన వ్యాఖ్యానాలన్నింటి లోకీ శ్రేష్టమైనది. ఈ గ్రంథంలో పాణిని సూత్రాలు, కాత్యాయనుడి వార్తికాలు మొత్తం కలిపి చర్చించబడ్డాయి. ఈయన ముఖ్యోద్దేశం పాణిని సూత్రాలు సర్వ సమగ్రం కాబట్టి కాత్యాయనుడి వార్తికాలు అనావశ్యకమనీ, అవి చెప్పే విషయాలు పాణిని సూత్రాలలోనే అంతర్భూతమయి ఉన్నాయనీ వివరించారు. కొన్ని చోట్ల మాత్రం ఈయన కాత్యాయనుడి వార్తికాలను తోసి పుచ్చడం అసమంజసమని అనిపిస్తుంది. పతంజలి పాణిని అన్ని సూత్రాలను వ్యాఖ్యానించలేదు. వార్తికాలు ఉన్న వాటినీ, మరి కొన్ని ముఖ్యమయిన వాటినీ మాత్రమే ఈయన వ్యాఖ్యానించారు. అయితే పతంజలి చేసిన వ్యాఖ్య కూలంకషంగానూ, తర్కసమానంగానూ ఉంటుంది. కాబట్టి ఆయన తరువాతి వైయాకరణులకు పరమ ప్రామాణికుడు అయ్యారు.

అయితే ఇంత పేరు ప్రఖ్యాతులున్న మహాభాష్యం కాశ్మీరరాజయిన అభిమన్యుని కాలానికి పఠన పాఠనాలు లోపించి ఒకే ఒక తాళ పత్ర ప్రతిలోనే మిగిలిందనీ దాని ఆధారంతోనే తరువాత కాలంలో ప్రతులు రాయబడ్డాయనీ భర్తృహరి (క్రీ.శ. 6వ సతాబ్ది) తన వాక్య పదీయంలో చెప్పడం గమనార్హం.

**(జి) చాంద్ర వ్యాకరణం:** క్రీ.శ. 470-650ల మధ్య చంద్రగోమిన్ రచించిన వ్యాకరణం పేరు చాంద్ర వ్యాకరణం. ఈయన బౌద్ధుడు. ఇది బౌద్ధులు సంస్కృతం నేర్చుకోవడానికి ఉద్దేశించి రాశాడు. వ్యాకరణ రచనా పద్ధతి అష్టాధ్యాయి పద్ధతే అయినా 35 కొత్త సూత్రాలను చేర్చాడు. ఇందులో మొత్తం సూత్రాల సంఖ్య 3,100.

**(హెచ్) కాశిక (కాశికావృత్తి):** క్రీ.శ. 600-660ల మధ్య జయాదిత్య, వామనులు కాశిక అన్న పేరుతో అష్టాధ్యాయికి మొదటి సమగ్ర వ్యాఖ్యానాన్ని రాశారు. జయాదిత్యుడు మొదటి అయిదు అధ్యాయాలకీ, వామనుడు మిగిలిన మూడు అధ్యాయాలకీ వ్యాఖ్యా రాశారు. వీరు ఇందులో పతంజలి, చంద్రగోమిన్ మొదలయిన పూర్వాచార్యులమతాన్ని స్వీకరించి ఈ రచన చేశారు.

**(ఐ) వాక్యపదీయం:** భర్తృహరి (జయాదిత్యుని సమకాలికుడు) 17వ శ॥లో వాక్యపదీయం అనే గ్రంథం శ్లోక రూపంలో మూడు కాండలలో ఉంది. ఇందులో బ్రహ్మ లే ఆగమకాండ, వాక్య కాండ, పద లేక ప్రకీర్ణ కాండ అనే మూడు కాండలున్నాయి. ఈయన ప్రతిపాదించిన స్ఫోట సిద్ధాంతం ప్రసిద్ధమయినది.

**(జె) ప్రదీపం:** 11-13 శతాబ్దాల మధ్య కాలంలో కైయటుడు మహాభాష్యానికి ప్రదీపమనే మంచి వ్యాఖ్యానాన్నొకదాన్ని రాశాడు.

**(కె) ఉద్యోతం:** 18వ శతాబ్దికి చెందిన ప్రసిద్ధ వైయాకరణుడు నాగోజీ భట్టు ఉద్యోతమనే వ్యాఖ్యాన గ్రంథాన్ని రాశాడు. ఈయన సిద్ధాంత కౌముది రాసిన భట్టోజీ దీక్షితుడి మనవడయిన హరిదీక్షితుడి శిష్యుడు. ఈయన వ్యాకరణ శాస్త్రంలో 12 గ్రంథాలు రాశాడు. ప్రదీపానికి వ్యాఖ్యాన గ్రంథమయిన ఉద్యోతానికి మంచి పేరు ప్రతిష్టలున్నాయి.

పైన పేర్కొన్న వికాక అపాణినీయ వ్యాకరణాలు తొమ్మిది ముఖ్య శాఖలకు చెందుతాయి. అవి:

1. చాంద్ర శాఖ
2. జైనేంద్ర శాఖ
3. శాకటాయన శాఖ
4. హేమచంద్ర శాఖ
5. కాతంత్ర శాఖ
6. సారస్వత శాఖ
7. బోపదేవ శాఖ
8. జౌమర శాఖ
9. సౌపద్మ శాఖ

ఇవి గాక దక్షిణ భారత దేశంలోని ప్రధాన భాషలలో కూడా ముందస్తు వ్యాకరణ గ్రంథాలే వచ్చాయి. తమిళ భాషలో తొల్కాప్పియమ్ మొదటి వ్యాకరణ గ్రంథం. దీనిని క్రీ.పూ. 1వ శతాబ్దికి చెందిన తొల్కాప్పియనార్ రాశారు. 1150 ప్రాంతంలో కన్నడ భాషలో రెండో నాగవర్మ కర్ణాట భాషా భూషణాన్ని రాశాడు. తెలుగులో ఆంధ్ర శబ్దచింతామణి నన్నయ గారే (నన్నయరాయలేదనేది విమర్శకుల ఊహ) రాశారనుకుంటే 11వ శ॥ నాటికే తెలుగులో వ్యాకరణం ఉన్నట్లు. అలాకాకపోతే కేతన రాసిన ఆంధ్ర భూషణం మొదటి వ్యాకరణ గ్రంథం. ఇక మలయాళంలో 14వ శతాబ్దిలో వచ్చిన 'లీలా తిలకం' మొదటి వ్యాకరణ గ్రంథం. ఇవన్నీ ఆధునిక భాషా శాస్త్రానికి పునాదులు.

## 2.2 పాశ్చాత్య దేశాలలో భాషా వికాసం:

**(ఎ) గ్రీకు వ్యాకరణాలు:** యూరప్ ఖండ వాసుల సంస్కృతి మొదట గ్రీసు దేశంలో వృద్ధి చెందింది. గ్రీసు దేశపండితులు వేదాంత శాస్త్రం, న్యాయశాస్త్రం, రాజనీతి శాస్త్రం, అలంకార శాస్త్రం మొదలయిన అనేక విజ్ఞాన శాస్త్ర శాఖలలో పరిశ్రమ చేశారు.

భాషను గురించి మొట్ట మొదటి శాస్త్రీయంగా ఆలోచించిన వారు గ్రీకు దేశ పండితులు. వీరు కొన్ని భాషా సంబంధి ముఖ్య విషయాలను వెలుగులోకి తెచ్చారు. గ్రీకు దేశంలో భాషా శాస్త్ర కృషి అవిచ్ఛిన్నంగా కొనసాగింది. పాశ్చాత్య పండితులు తమ పూర్వుల కృషిని పూర్తిగా అధ్యయనం చేసి గమనించి తాము కొత్త విషయాలను కనిపెట్టి ప్రపంచానికి అందించేవారు. ఇతరులు పట్టించుకోని అనేక విషయాలను గురించి గ్రీకు పండితులు విమర్శనాత్మక దృష్టితో చూసేవారు.

బ్లూంఫీల్డ్ "The anicient greeks had the gift of wondering at things that other people take for granted. They speculate boldly and persistently about the origin, history and structure of language. Our additional love about language is due largely to them."(Language P.4 ) అంటూ గ్రీకు పండితుల భాషా పాటవాన్ని ప్రశంసించాడు. ఇతర భాషల ఉనికిని గ్రీకు భాషలోని మండలిక భేదాన్ని గ్రీకు విద్వాంసులు గుర్తించారు. హెరొడోటస్, ప్లేటోలు గ్రీకు భాషలోని కొన్ని పదాలు అన్య భాషల నుంచి వచ్చి ఉండవచ్చని భావించారు. ప్రాంత భేదాన్ని బట్టి గ్రీకు భాషలో భిన్న మండలికాలున్నా ఇవన్నీ ఒకే భాషకు మాండలికాలనే సత్యాన్ని హెరొడోటస్ క్రీ.పూ. 500 సంవత్సర ప్రాంతం లోనే గుర్తించాడు. హోమర్ గ్రీకు భాషలో రచించిన ఇలియడ్, ఒడిస్సీల లోని భాష నాటి వ్యావహారిక భాష కంటె భిన్నమయి ఉండటాన్ని గ్రీకు పంపి ఆ నాటి వారు కంఠస్థం చేసేవారు.

భాషోత్పత్తి, భాషా చరిత్ర, పదాల వ్యుత్పత్తుల పట్ల ధైర్యంగా కొన్ని ఊహలు చేసేవారు. పాశ్చాత్య సంప్రదాయ వ్యాకరణాల మీద వీరి ఊహ ప్రాబల్యం ఎక్కువ.

సమ్మతి కోస్ (PSammeticos) అనే ఈజిప్టు రాజు ప్రపంచ భాషలలో కెల్లా ప్రాచీన తమమయిన భాష ఏదో తెలుసుకోవాలనే ఉద్దేశంతో అప్పుడే పుట్టిన ఇద్దరు పిల్లలని మాటలు వచ్చే వరకూ వేరుగా ఉంచారట. కొంతకాలానికి వాళ్ళు చెకోస్ అనే మాటను ఉచ్చరించారట. ఈ మాటకు ఫ్రిజియన్ భాషలో 'రొట్టె' అని అర్థం. కాబట్టి మానవుల తొలి భాష ఫ్రిజియన్ భాష అని ఆ రాజు నిర్ణయించాడు.

గ్రీకు భాషకు లిపి ఏర్పడటం అరగీసు పండితుల మొదటి పరిశోధనా ఫలితం. క్రీ.పూ. వెయ్యి సంవత్సరాలకు ముందే వీరు ఫొనీషియన్ లిపి ఆధారంతో గ్రీకు లిపి ఏర్పరచుకొన్నారు. ఇప్పుడు మనకు లభ్యమయ్యే గ్రంథాలలో భాషను గురించిన చర్చ ప్లేటో

(క్రీ.పూ. 425-347) సంభాషణలో ఒకటయిన 'క్రటిలస్'లో ఉంది. ఇందులో ఈయన 'భాష ప్రకృతి సిద్ధమయిన'దనే పూర్వుల సిద్ధాంతాన్ని ప్రపంచించారు. భాషలో పదాలనే అర్థాలకి సహజ సంబంధం ఉందని ఈయన నమ్మాడు.

క్రీ.పూ. 354-321లో ప్లేటో శిష్యుడు అరిస్టాటిల్ భాషోత్పత్తి విషయంలో తన గురువుతో ఏకీభవించలేదు. ఈయన 'భాష సహజ సిద్ధమయినదని కాదు, సంప్రదాయ సిద్ధమయినదని' చెప్పాడు. ఈయన గ్రీకు భాషలో నామాలు, క్రియలు, సంయోజకాలు (Conjuctions) అనే మూడు భాషా భాగాలని గుర్తించాడు.

క్రీ.పూ. 308లో ఏథెన్స్‌లో జెనో స్థాపించిన స్టోయిన్ శాఖలో భాషా విషయాలకు సంబంధించిన ప్రత్యేక గ్రంథాలు వెలువడ్డాయి. పాశ్చాత్య వ్యాకరణ మూల పద్ధతులను ఈయన స్థాపించారు.

గ్రీకు పండితులలో కొంతమంది భాష క్రమబద్ధమయినదని వాదిస్తే మరి కొంత మంది క్రమరహితమని వాదించారు. క్రీ.పూ. 2వ శతాబ్దిలో అరిస్టార్కస్ హోమర్ మొదలయిన ప్రాచీనకవుల భాషను చర్చించి వాటికి వ్యాకరణాలు రాశాడు.

డయానా సియస్ థ్రేక్సు (క్రీ.పూ. 1వ శ॥) టెక్నే గ్రమాటికే అనే 25 భాగాలున్న 15 పేజీల గ్రంథాన్ని రాశాడు. ఇందులో 1. సరిగా ఉచ్చరించడం 2. పూర్వ కవుల భాషని వివరించడం 3. పూర్వ కవుల వ్యవహారం, వస్తువులపయినా వ్యాఖ్య 4. వ్యుత్పత్తులు కనుక్కోవడం 5. భాషలో ఉన్న నియమాలు నిర్దేశించడం 6. సాహిత్య విమర్శ అని ఆరు భాగాలుగా విభజించి రాశాడు. ఈయన భాషా భాగాలు నామం, క్రియ, అసమాపకక్రియ, నిపాతం, సర్వనామం, పూర్వసర్గ, క్రియా విశేషణం, సంయోజకం అని ఎనిమిందిని పేర్కొన్నాడు. 'పూర్తి భావాన్ని వ్యక్తీకరించేది వాక్యం' అని కూడా వాక్యాన్ని నిర్వచించాడు.

క్రీ.శ. 2వ శతాబ్దిలో అపోలోనియస్ డిస్కొలుస్ గ్రీకు వాక్య నిర్మాణాన్ని విపులంగా చర్చించాడు.

**(బి) లాటిన్ వ్యాకరణాలు:** క్రీ.పూ. 2,3 శతాబ్దాలలో రోమన్ సామ్రాజ్యం విస్తరించి గ్రీసు కూడా దాని ఆధిపత్యంలోకి వచ్చింది. వ్యాకరణ విషయంలో రోమన్లు గ్రీకులను అనుకరించి గ్రీకుల సిద్ధాంతాలను, మత భేదాలను, పద్ధతులను లాటిన్ భాషకు అన్వయించారు. వీరు గ్రీకు వైయాకరణులు లాగా వ్యాకరణంలో పదాన్నే మూలాంశంగా తీసుకొన్నారు. గ్రీకు పదాలకు లాటిన్ పదాలకు సామ్యాలు ఉన్న చోట అలాంటి పదాలన్నీ గ్రీకు భాష నుంచి వచ్చాయని అపోహ పడ్డారు. గ్రీకుకీ, లాటిన్‌కీ చాలా విషయాలలో సామ్యం ఉందని గ్రహించినా అవి సోదర భాషలనే విషయం వారికి తెలియదు.

లాటిన్ వ్యాకరణాలలో క్రీ.పూ. 116-27లకు చెందిన వారో మొదటి వ్యాకరణాన్ని రచించాడు. గ్రీకులో 5 విభక్తులే ఉండగా, లాటిన్‌లో 6 విభక్తులున్నాయని ఈయన చెప్పారు. ఈయన తర్వాత 1వ శతాబ్దికి చెందిన క్వింటిలియన్, 4వ శతాబ్దికి చెందిన డొనాటుస్, 5వ శతాబ్దికి చెందిన ప్రిస్కియన్ ప్రసిద్ధులు. ప్రిస్కియన్ రాసిన గ్రంథం ప్రమాణ గ్రంథంగా అందరూ అంగీకరిస్తారు. ఇందులో పెద్దనిమిది భాగాలు భాషా భాగాలకు సంబంధించినవి కాగా రెండు వాక్య నిర్మాణానికి సంబంధించినవి.

**(సి) మధ్యకాల గ్రంథాలు:** జర్మన్ యాత్రికుడయిన పల్లాస్ 18వ శతాబ్దిలో 200 భాషలకు తులనాత్మక పద పట్టికను తయారు చేశాడు. 1800-05లో పాండురో సుమారు 800 భాషలకు పద పట్టికలను తయారు చేశాడు. అదెలుంగ్ మిత్రిడేట్స్ అనే గ్రంథంలో క్రైస్తవుల ప్రార్థనని సుమారు 500 భాషలూ, మాండలికాలలో ఇచ్చాడు.

భాషా స్వభావాన్ని గురించి చర్చించిన గ్రంథాలలో ముఖ్యమయినది 1600లో వచ్చిన పోర్ట్ రాయల్ గ్రామర్. ఇందులో దీని కర్తలు సర్వ భాషా లక్షణాలకు వర్తించే వ్యాకరణం రాయడానికి ప్రయత్నం చేశారు. వీళ్ళు ఇతర ఖండాలలోని భాషలను తమ పరిధిలోకి తీసుకుపోగా మాతృభాషా భక్తితో ఫ్రెంచి భాష స్పష్టమయినది, సర్వాంగ సుందరమయినదని నిరూపించడానికి ప్రయత్నించారు.

18వ శతాబ్ది చివరి వరకూ అనేక భాషల పై వివరాలు తెలిశాయి. కాని వ్యాకరణ పద్ధతులు, అవగాహన పరం పరాయతంగానే ఉన్నాయి. అయితే 19వ శతాబ్దిలో ఏర్పడిన శాస్త్రీయ దృక్పథానికి మార్గ దర్శకులు అంతకు ముందు కాలంలో ముగ్గురున్నారు. వారు లైబ్నిజ్, హెర్డర్, సర్ విలియం జోన్స్.

**లైబ్నిజ్ (1646-1716):** ఈయన వేదాంత, గణిత శాస్త్రాలలో నిష్ణాతుడు. ఆకాలపు పండితులలో ప్రధానమయిన వాడు. కాబట్టి సమాజంలో ముఖ్య వ్యక్తులందరితో ఈయనకు పరిచయం ఉండేది. ఈయన అన్ని భాషలకు హిబ్రూ మూలమనే వాదనని ఖండించాడు. యూరప్, ఆసియాలలో భాషలు పరస్పర సంబంధం కలవి అనీ, వీటన్నింటికి మూలం ఒకటే ఉండేదని ఈయన మొదటిగా ప్రతాపాదించాడు. యూరప్, ఆసియా, ఈజిప్టులలో భాషల పరస్పర సంబంధాలపయి ఈయన రాసిన గ్రంథం 1710లో

ప్రచురితమయింది. ఈయన జర్మన్ భాషకు లాటిన్, ఫ్రెంచిలతో సమాన స్థానం కల్పించడానికి పాటుపడి స్వయంగా జర్మన్ భాషలో అనేక వ్యాసాలు రాసి ఆ భాషాభివృద్ధికి తోడ్పడ్డాడు.

**హెర్డర్ (1744-1803):** భాష దైవ దత్తమనే వాదాన్ని ఖండించాడు. భాష దైవదత్తమే అయితే అది తర్క సహం గానూ, అపవాద రహితంగానూ ఉండి ఉండేదని ఈయన వాదించాడు. మాట్లాడాలనే మానవుడి ప్రకృతి సిద్ధమయిన కాంక్ష గర్భస్థ శిశువుకి పుట్టాలనే కాంక్ష వంటిదని ఈయన అభిప్రాయం. అయిన మానవుడి తొలి భాష హిబ్రూ అనే వాదాన్ని మాత్రం ఈయన అంగీకరించాడు.

**సర్ విలియం జోన్స్ (1746-94):** జోన్స్ న్యాయశాస్త్రం చదివి 1793 నుంచి మరణించే వరకు కలకత్తా హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేశాడు. ఈయన జీవితంలోని చివరి తొమ్మిదేళ్ళు సంస్కృతాన్ని క్షుణ్ణంగా అభ్యసించి సంస్కృతానికీ, ప్రాచీన యూరోపియన్ భాషలకీ గల సంబంధాన్ని కనుగొని చారిత్రక భాషా శాస్త్రానికి అంకురార్పణ చేశాడు. ఈయన 1786, ఫిబ్రవరి 2న ఏషియాటిక్ సొసైటీలో ఇచ్చిన ఉపన్యాసంలో సంస్కృతం, గ్రీకు, లాటిన్, పర్షియన్, గాథిక్, కెల్టిక్ భాషలు ఆధారాలు మిగిలిన ఒకే మూల భాష నుంచి పుట్టాయని ప్రమాణ పూర్వకంగా నిర్ణయించాడు.

**2.3 పందొమ్మిదో శతాబ్దంలోని పరిణామాలు:** విలియం జోన్స్ పరిశోధనా ఫలితంగా తులనాత్మక పరిశోధనలు ఇండో యూరోపియన్ భాషలలోనూ ఇతర భాషా కుటుంబాలలోనూ చెయ్యడం ప్రారంభించారు.

**(ఏ) రాస్మస్ రాస్క్ (1787-1832):** డెన్మార్కు దేశీయుడయిన రాస్క్ డేనిష్ భాషలో 1814లో 'ప్రాచీన నోర్స్ లేక ఐస్లాండిక్ ఉత్పత్తి పై పరిశోధన' అనే వ్యాసం రాశాడు. ఇందులో ఈయన తులనాత్మక పద్ధతికి మౌలికమయిన కొన్ని సూత్రాలు ప్రతిపాదించటమే గాక జర్మానిక్ భాషల పరస్పర సంబంధం పయి శాస్త్రీయమయిన పరిశోధనకు మార్గం చూపారు. రెండు భాషలలో సర్వనామాలు, సంఖ్యా వాచకాలు మొ॥న నిత్యావసర పదజాలం సమానంగా ఉంటే, ముఖ్యంగా వాటి మధ్య ధ్వనులలో భేదాలు ధ్వని సూత్రాల రూపంలో వివరణకు సాధ్యమయితే వాటికి జన్మ సంబంధం ఉంటుందని చెప్పారు. అంతే గాక రాస్క్ జర్మానిక్ భాషలకు కొన్ని ధ్వని సూత్రాలు రాసారు. ఐస్లాండిక్, డేనిష్, స్పానిష్, ఇటాలియన్ మొదలయిన భాషలకి రచించిన వ్యాకరణాలు దోష రహితత్వానికి, విషయ సమగ్రతకీ, శాస్త్రీయ పరిశీలనకీ మచ్చు తునకలనవచ్చు. వ్యాకరణాంశాలకి చారిత్రకమయిన కారణాలను అన్వేషించడం అనే పద్ధతికి కూడా ఈయనే ప్రథముడు. జర్మన్, ఫ్రెంచి అంత విశేష వ్యాప్తిలో లేని డేనిష్ భాషలో రాయడం వల్లా, పరిశోధనాంశం పరిమితమయినదవడం వల్లా ఆధునిక భాషా శాస్త్ర స్థాపకుడిగా కీర్తి ఈయనకు కాక ఈయన సిద్ధాంతాలని అనుసరించి విపులీకరించిన యాకోబ్ గ్రిమ్మకు దక్కింది.

**(బి) యాకోబ్ గ్రిమ్ (1785-1863):** ఈయన జర్మనీ దేశస్థుడు. 1819లో 'జర్మన్ వ్యాకరణం' అనే గ్రంథం మొదటి భాగాన్ని ప్రచురించాడు. ఈయన 'జర్మన్' పదాన్ని జర్మానిక్ భాషా కుటుంబానికి చెందిన భాషలన్నింటికీ వర్తించేటట్లుగా ప్రయోగించాడు. కాబట్టి ఈ గ్రంథం జర్మానిక్ భాషలన్నీటికీ తులనాత్మక వ్యాకరణం.

గ్రిమ్ ఈ పుస్తకాన్ని రాసినప్పుడు రాస్మస్ రాస్క్ రాసిన గ్రంథాన్ని చూడలేదు. కాబట్టి సోదర భాషలలో సమాన పదాలలో ధ్వనులలో వ్యత్యాసం యథేచ్ఛగా కాక నియమబద్ధంగా ఉంటుందని రాస్క్ నిరూపించిన పరమ సత్యం ఈయన గ్రహించలేదు. కాబట్టే గ్రిమ్ రాసిన పుస్తకం మొదటి ప్రచురణలో ధ్వనులను గురించిన చర్చ లేకుండా పద నిర్మాణ చర్చ మాత్రమే ఉంది.

తదనంతరం రాస్క్ రాసిన పుస్తకాన్ని తెప్పించుకొని చదివాడు. రాస్క్ తన గ్రంథంలో ఇచ్చిన 'ధ్వని సూత్రాలు' వాటికి జర్మానిక్ భాషలలో కొన్ని మంచి ఉదాహరణలు చూసిన వెంటనే గ్రిమ్‌కి ధ్వనుల మార్పులలోని నియమబద్ధత తెలిసి ధ్వని పరిణామ పరిశోధన ప్రాధాన్యం తెలిసింది. కాబట్టి మొదటి ప్రచురణలో లేని ధ్వని పరిణామ చర్చ 1822లో వచ్చిన రెండో ప్రచురణలో 595 పేజీలు ఆక్రమించుకోవడం విశేషం.

ఈ గ్రంథంలో తన పరిశోధన జర్మానిక్‌భాషలకే పరిమితం చేసుకోవడం భాషా శాస్త్రాభివృద్ధికి రెండు విధాలుగా ఉపయోగపడింది. రాస్క్ అంతకు ముందు సూచన ప్రాయంగా తెలిపిన ధ్వని సూత్రాలకి ఈయన విరివిగా ఉదాహరణలనిచ్చి ధ్వని సూత్రాలు ఒక భాషలోని కొన్ని పదాలకి కాక ఆ ధ్వనులు గల అన్ని పదాలకీ వర్తిస్తాయనే సత్యాన్ని తరువాత వారు గ్రహించడానికి దోహదం చేశారు. అంతేగాకుండా సదృశమయిన ధ్వనులు సదృశమయిన మార్పులు చెందుతాయనే విషయాన్ని కూడా ఈయన నిరూపించారు.

ఈ గ్రంథంలో గ్రిమ్ జర్మానిక్ భాషలలో కనిపించే అనేకమయిన ధ్వని పరిణామాలు, వాటికి గల కారణాలను సమగ్రంగా పరిశోధించారు. ఈయన గ్రీకు భాషలోని ప త క లు గాథిక్‌లో ఫ(f)థ($\theta$)ఖ(h)

గ్రీకు భాషలోని బ ద గ లు గాథిక్‌లో ప త క

గ్రీకు భాషలోని ఫ ధ ఖ లు గాథిక్‌లో బ ద గ

లుగాను మార్పు చెందాయి. వాస్తవానికి ఈ పరిణామాలన్నీ రాస్మస్ రాస్క్ చెప్పినవే. కాని గ్రిమ్ వీటన్నిటినీ ఒక చోట చేర్చి వీటిలో అంతర్లీనమయి ఉన్న సమానత్వాన్ని గ్రహించి వెలిబుచ్చడం వల్ల ఈ సూత్రానికి 'గిమ్స్‌లా' అని పేరు వచ్చింది.

అయితే రాస్క్ గానీ, గ్రిమ్ గానీ తాము గుర్తించిన ధ్వని సూత్రాలకి అపవాదాలు (exceptions) ఉండవని అనలేదు. ధ్వని సూత్రాలు చాలా పదాలకి వర్తించినా వాటికి కొన్ని అపవాదాలుండటం సహజమనే వీళ్ళు అనుకొని అలాంటి అపవాదాలని కూడా ఎత్తి చూపారు.

**(సి) ఫ్రాంజ్ బోప్ (1791-1867):** సంస్కృత భాషను అభ్యసించి ఇండో యూరోపియన్ భాషలకి తులనాత్మక వ్యాకరణం రాశాడు. ఈయన ప్రత్యయాలన్నీ మూల పదాల నుంచి పుట్టాయని నిరూపించడానికి వ్యర్థ ప్రయత్నం చేశాడు. సకారం ఉన్న ప్రత్యయాలన్నీ లాటిన్ ఎస్ (సంస్కృతం అస్ -) నించీ, బకారం ఉన్న ప్రత్యయాలన్నీ సంస్కృతం భూ ధాతువు నుంచీ వచ్చాయని ఈయన చెప్పాడు. ఇటువంటి పరిశోధన ఊహ మూలకమయినా ఈయన ఇండో యూరోపియన్ తులనాత్మక వ్యాకరణ రచనలో సంస్కృత భాష ప్రాధాన్యాన్ని ఎత్తి చూపాడు. కాబట్టి ఈయన చిరస్మరణీయుడే.

**(డి) అగస్ట్ ఫ్రెడ్‌రిక్ పాట్:** 1833-36లలో ఈయన కూడా ఇండో యూరోపియన్ తులనాత్మక వ్యాకరణం పయి ఒక పుస్తకాన్ని రాశాడు. ఇందులో 375 ధాతువులకి ఇండో యూరోపియన్ భాషలలో సమాన పదాలనిచ్చాడు.

**(ఇ) అగస్ట్ ష్లెషర్ (1821-68):** ఈయన డార్విన్ పరిణామ వాదం వల్ల ప్రభావితుడై భాషకు కూడా వృద్ధక్షీణతలుంటాయని నమ్మాడు. ఈయన

1. భాషల పరస్పర సంబంధం
2. మూల భాషను పునర్నిర్మించే తులనాత్మక పద్ధతి
3. భాషల నిర్మాణాన్ని బట్టి విభజన

అనే మూడింటిలో కృషి చేశాడు. ఈయన భాషల జన్మ, పరిణామం, వినాశనం అనేవి ప్రాణుల జన్మ, పరిణామం, వినాశం లాగానే ఉంటాయని నమ్మాడు. ష్లెషర్ వాడిన సోదర భాషలు, పితృభాష లేదా మూల భాష అనే పదాలు సాంకేతిక పదాలుగా ఇప్పటికీ అందరూ వాడుతున్నారు. ఈయన 'ఇండో యూరోపియన్ భాషల తులనాత్మక వ్యాకరణం' (1861-62)లో భాషల ఉప కుటుంబ విభజనను మొదటిసారిగా భాషా కుటుంబ వృక్ష పటం ద్వారా సూచించాడు. మూల పదాలను పునర్నిర్మించడం కూడా ఈయనే ప్రారంభించాడు. ఈయన ప్రపంచ భాషల్ని ప్రత్యయ రహితాలు, సంయోజనాత్మకాలు, సంశ్లేషణాత్మకాలని మూడు విధాలుగా విభజించారు.

**(ఎఫ్) అగస్ట్‌ఫిక్ (1833-1916):** మూల భాషలో పదాల్ని పునర్నిర్మించటానికి ప్రయత్నించాడు. 'ఇండో-యూరోపియన్ భాషల తులనాత్మక నిఘంటువు'ను 1868లో ముద్రించాడు.

**(జి) ఆల్వ్యావల్డ్, జూలియస్ పొకర్నీ:** ఈ ఇద్దరూ కలసి 1927-32లలో ఇండో-యూరోపియన్ భాషల తులనాత్మక నిఘంటువును తయారు చేసి ప్రచురించారు. ఇది అగస్ట్‌ఫిక్ నిఘంటువు కంటే ఉత్తమమయినది. 1947-60లలో జూలియస్ పొకర్నీ ఒక్కడే ఆ తరువాత వచ్చిన పరిశోధన ఫలితాలను ఆధారంగా చేసుకొని కొన్ని మార్పులు చేర్పులు చేసి మళ్ళీ ప్రచురించాడు.

1870 తర్వాత భాషా శాస్త్రంలో నవీన యుగం ప్రారంభమయిందని చెప్పవచ్చు. అంతవరకు నియమం లేకుండా ఉన్నట్లు కనబడే ధ్వని పరిణామాలలో అంతర్లీనమై ఉన్న నియమాలని ఈ కాలంలో పండితులు క్రమక్రమంగా కనిపెట్టడం ప్రారంభించారు. అంతేగాకుండా అంత వరకూ తెలిసిన ధ్వని సూత్రాలకి అపవాదాలుగా కనబడే పదాలలో మరొక ధ్వని సూత్రం అంతర్లీనమై ఉన్నట్టుగా కూడా వారు కనిపెట్టారు. వీరిలో డెన్మార్క్‌కు చెందిన విల్‌హెల్మ్ థాంసన్, కారల్ వెర్నర్, ఫర్డినాండ్ దెగుసూర్, కారల్ బ్రుగ్మన్, అగస్ట్ లెస్కిన్ మొ॥ ప్రసిద్ధులు. 1876లో లెస్కిన్ 'ధ్వని సూత్రాలకు అపవాదులుండవు' అనే నినాదాన్ని సృష్టించాడు.

కుర్తియన్ మొదలయిన పండితులు పయి నినాదాన్ని వ్యతిరేకించారు. కుర్తియన్‌కి వ్యతిరేకులయిన ఈ యువ పండితుల్ని హేళనగా 'యువ కర్తలు' (Neo-Grammarians) అని పిలిచేవారు. బ్రుగ్మన్ ఈ పదమే తమ అందరికీ గౌరవదాయకమని భావించి దీనినే వాడటం మొదలుపెట్టాడు. ధ్వని సూత్రాలకి అపవాదాలుండవని భావించే వాళ్ళందర్నీ ఈ పదంతో పిలవటం పరిపాటయిపోయింది.

ఆ కాలంలో కొందరు వృద్ధ పండితులు ఈ సిద్ధాంతాన్ని వ్యతిరేకించినా ఇది భాషా పరిణామం నియమ రహితమయినది కాక కొన్ని సూత్రాలకు కట్టుబడి ఉంటుందని చెప్పడం వల్ల దీనిని అనుసరించి సాగిన పరిశోధనలు శాస్త్రీయమూ, ఫలవంతమూ అయ్యాయి. ఈ సిద్ధాంతాలని ఆధారంగా చేసుకోవడం వల్లనే భాషా శాస్త్రజ్ఞులు ఒక ధ్వని సూత్రానికి లొబడని పదాలలో వేరొక ధ్వని సూత్రం ప్రవర్తిస్తూ ఉందనో లేక అవి వేరొక భాష నుంచి ఎరవు తెచ్చుకున్నవనో లేక అవిసామ్యం, ధ్వన్యనుకరణ లాంటి కారణాల వల్ల అపవాదాలయ్యాయనో కనిపెట్టగలిగారు. కాబట్టి ఈ సిద్ధాంతం శాస్త్రీయమయిన భాషా పరిశోధనకు ప్రాతిపదిక అని చెప్పవచ్చు. ఈ సిద్ధాంతాన్ని అనుసరించకపోతే భాషా శాస్త్రజ్ఞులకు భాషల నిర్మాణంలోనూ, పరిణామంలోనూ ఉన్న నియతి, క్రమబద్ధత తెలియక పోయేది. వాళ్ళ పరిశోధన శాస్త్రీయంగా కాక యథేచ్ఛగా సాగి ఉండేది.

మొత్తం మీద పందొమ్మిదో శతాబ్దిలో తులనాత్మక వ్యాకరణ పద్ధతులు శాస్త్రీయమయినవిగా రూపొందాయని, ఈ పరిశోధన వల్ల భాష క్రమబద్ధమయినదనే సత్యం తెలిసి వచ్చిందనీ సంగ్రహంగా చెప్పుకోవచ్చు. ఈ శతాబ్దిలో తులనాత్మక పద్ధతిలో సాధించిన శాస్త్రీయత 20వ శతాబ్దిలో వర్ణనాత్మక వ్యాకరణ వృద్ధికి దోహదపడింది.

## 2.4 ఇరవయ్యో శతాబ్దిలో పరిణామాలు:

ఈ శతాబ్దిలో భాషా శాస్త్రాధ్యయనం అన్ని దేశాలకీ వ్యాపించింది. అందుచేత పండితులు వివిధ దేశాలలో ఉన్న భాషలకి వ్యాకరణాలూ, నిఘంటువులూ రాయడం మొదలు పెట్టారు. దీని వల్ల అంత వరకు పేరు కూడా తెలియని ఎన్నో గిరిజనాది భాషలు వెలుగులోకి వచ్చాయి. అంతేగాక పాణిని అష్టాధ్యాయి లాంటి ప్రాచీన వ్యాకరణాలలో ఉపయోగించిన పద్ధతుల అనుశీలన తద్వారా వాటి వైశిష్ట్యం గ్రహించటం మొదలయింది. అందువల్ల భాషా శాస్త్రంలో పాత కొత్తల మేలు కలయిక ఏర్పడి పూర్వ కాలంలో ఉన్న 'మంచి' ఆధారంగా భాషా శాస్త్రం శాఖోపశాఖలుగా విస్తరిల్లింది.

ఈ కాలంలో భాషా శాస్త్రజ్ఞులు వివిధ దేశాలలో అసంఖ్యాకంగా ఉండటం చేత ఒక్క వర్ణనాత్మక శాఖే కాకా తులనాత్మక శాఖ మొదలయిన ఇతర శాఖలలో కూడా పరిశోధన వివిధ భాషా కుటుంబాలలో శర వేగంగా జరిగింది. ఈ శాఖలన్నీ వేరువేరుగా కాక ఒక శాఖలో జరిగే పరిశోధనలు ఇతర శాఖలలో జరిగే పరిశోధనలకు ఉపబలకంగా ఉండి మొత్తం భాషా శాస్త్ర సిద్ధాంతానికి శాస్త్రీయత, సమగ్రత చేకూర్చడానికి తోడ్పడుతున్నాయి.

**(ఏ) ఫెర్దినాండ్ ససూర్ :** వర్ణనాత్మక వ్యాకరణ వృద్ధికి బీజం వేశారు. ఈయన ఇండో యూరోపియన్ తులనాత్మక వ్యాకరణంలో మొదట కృషి చేసి తరువాత తన దృష్టి భాషా నిర్మాణం పయి కేంద్రీకరించాడు. ఈయన ఉపన్యాసాలను ఆయన విద్యార్థులు ఒక చోట చేర్చి 1916లో 'Cours delinguistique generale' అనే గ్రంథంగా ప్రచురించారు. ఈయన వ్యక్తీకరించిన అభిప్రాయాలలో ప్రధానమయినవి మూడు.

1. భాషా నిర్మాణాన్ని వివరించే వర్ణనాత్మక వ్యాకరణం, భాషా చరిత్రను వివరించే చారిత్రక వ్యాకరణం - రెండూ వేరు వేరు విభాగాలనీ ఈయన స్పష్టం చేశాడు.

2. భాషకి Langue, Parole అనే రెండు స్థాయిలున్నాయని చెప్పాడు. సమగ్రమయిన భాష Langue. వ్యక్తుల వ్యవహారంలో ఒక్కొక్కప్పుడు భాష అసమగ్రంగానూ, అస్పష్టంగానూ ఉండి అసాధురూపాలు ఉచ్చరించబడవచ్చు. అటువంటిది parole. భాషలో వర్ణాలు, ప్రత్యయాలు, పదాలు - వీటిలో ఒక్కొక్కదానికి చెందిన అంశాలు పరస్పర సాపేక్షంగా ఉంటాయి.

ఇంతేగాక ససూర్ భాషా శాస్త్రం అరపత్యేక శాస్త్రమనీ దీనిలోని పరిశోధనని ఇతర శాస్త్రాలతో ముడి పెట్టనవసరంలేదని కూడా చెప్పాడు.

**(బి) హిమస్‌లేవ్ (Hjelmslev):** ఈయన gleassematics అనే శాఖను స్థాపించాడు. ఈయన భాషకు అర్థస్థాయి (అర్థం, వ్యాకరణం), ఉచ్చారణ స్థాయి (వర్ణ నిర్మాణం) అని రెండు స్థాయిలున్నాయనీ మొదటి దానిలో అర్థ లక్షణాలు రెండో దానిలో వర్ణాలు మూలకాంశలనీ చెప్పాడు.

**(సి) హెన్రీ స్వీట్, డేనియల్ జోన్స్:** సర్ విలియం జోన్స్‌తో ప్రారంభమయిన ధ్వని శాస్త్ర చర్చను హెన్రీస్వీట్, డేనియల్ జోన్స్ ముందుకు తీసుకెళ్ళారు.

**(డి) నికొలాయ్ ట్రుబెజ్‌కోయ్:** జెకొస్లొవేకియాలో ఈయన ప్రాగ్ శాఖను స్థాపించి వర్ణ నిర్మాణ సిద్ధాంతం పయి కృషి చేశాడు. పరివర్తన వ్యాకరణకారులు దీనిని వృద్ధి పరచారు.

**(ఇ) యెస్పర్సన్ (Jespersen):** ఈయన 'Language, Its Nature and Development' అనే గ్రంథమేకాక ఇంగ్లీషు భాషకి ఒక పెద్ద ప్రామాణికమయిన వ్యాకరణాన్ని కూడా రాశాడు.

**(ఎఫ్) జె.ఆర్.ఫర్త్ (J.R. Firth):** 1944-1956ల మధ్య లండన్ విశ్వవిద్యాలయంలో మొదటి ఆచార్యుడిగా పని చేశాడు. ఈయన వర్ణ నిర్మాణం మీద ఎక్కువ పరిశోధన చేశాడు. ఒక వర్ణ లక్షణం కొంత వరకు వాక్యంలో లేదా పదంలో దాని పక్క వర్ణాలకు కూడా వ్యాపిస్తుందనే విషయానికి ఈయన ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు.

ఇక అమెరికాలో 1920 ప్రాంతం నుంచి భాషా శాస్త్రం మిగిలిన అన్ని దేశాలలో కంటే ఎక్కువగా అభివృద్ధి చెందింది. వందల కొద్దీ అమెరికన్, ఇండియన్ భాషల మీద పరిశోధనలు జరిగాయి. అమెరికాలో విస్తరిల్లిన భాషాశాస్త్ర పద్ధతులే మిగిలిన అన్ని దేశాలకూ వ్యాపించాయి. అమెరికాలో భాషా శాస్త్రానికి మూలపురుషులు ముగ్గురు.

1. **ఫ్రాంజ్ బొయస్ (Franz Boas):** బొయస్ అమెరికన్ - ఇండియన్ భాషలపై పరిశోధన చేసి వర్ణనాత్మక భాషా శాస్త్ర పద్ధతులు ఏర్పరచాడు.

2. **ఎడ్వర్డ్ సపీర్ :** ఈయన కూడా ఇండియన్ - అమెరికన్ భాషల మీదే పరిశోధన చేశాడు. ఈయన 1921లో రాసిన 'Language' ముఖ్యంగా పేర్కొనదగింది.

3. **లియోనార్డ్ బ్లూంఫీల్డ్ :** 1933లో ఈయన రాసిన 'Language' అనే గ్రంథం ఈనాటికి కూడా భాషా శాస్త్రంలో ప్రామాణికమయిన పుస్తకం. ఈయన భాషా శాస్త్ర పద్ధతులు విపులంగా మనోహరమయిన శైలిలో విభిన్న భాషల నుంచి తీసుకున్న అనేక ఉదాహరణలతో వివరించాడు.

**(జి) నోమ్‌చోమ్ స్కీ:** ఈయన రాసిన 'Syntactic Structures' (1957)తో పరివర్తన వ్యాకరణ శాఖ ప్రారంభమయింది. వాక్యనిర్మాణం ఈ శాఖలో ప్రధాన స్థానం ఆక్రమించుకొంది. వాక్య నిర్మాణమే కాక మొత్తం భాషా నిర్మాణమంతా సూత్ర రూపంలో వ్యాకరణం వర్ణించాలని పరివర్తన వ్యాకరణకారుల ఆశయం. దీని తర్వాత చామ్స్కీ 'Aspects of the theory of syntax' (1965) అనే మరో గ్రంథంలో ఈ సిద్ధాంతాన్ని నూతన రూపంలో ప్రతిపాదించాడు.

అర్థ నిర్మాణానికీ, దానికి సంబంధించిన వర్ణ నిర్మాణానికీ సంబంధం ఏర్పరచేదిగా వ్యాకరణం ఉండాలని పరివర్తన వైయాకరణుల మూల సిద్ధాంతం. అర్థ నిర్మాణం నుంచి వర్ణ నిర్మాణాన్ని సూత్రాల ద్వారా వీళ్ళు సాధిస్తారు. చామ్స్కీకి ముందు అమెరికాలో భాషా శాస్త్రజ్ఞులు అర్థ నిర్మాణ చర్చకు ప్రాధాన్యం ఇవ్వలేదు. అంతేగాక వాళ్ళు భాషలో ఒక నిర్మాణానికీ, మరొక నిర్మాణానికీ పరస్పర సంబంధం లేదనీ, వ్యాకరణంలో ఉండకూడదనీ అనేవారు. ఈ రెండు లోపాలనీ పరివర్తన వ్యాకరణం సవరించింది. పరివర్తన వ్యాకరణ శాఖ, ఇంతకు ముందు అనేక శాఖలలో జరిగిన పరిశోధనలలో మంచిని తనలో ఇముడ్చుకోగలిగిన శక్తి కలది.

ఆ తర్వాత గంపర్జ్, హైమ్స్, పీటర్ ట్రడ్గిల్ మొదలయిన వాళ్ళు సామాజిక భాషా శాస్త్రం గురించి విశేష కృషి చేశారు. ఫిల్మోర్ అనే మరో ఆయన 'కేస్ గ్రామర్' మీద పరిశోధనలు చేశారు. ఇటీవల కాలంలో పిల్లలు భాషను నేర్చుకొనే విధానం మీద, మనస్తత్వ భాషా శాస్త్రం, బయోలింగ్విష్టిక్స్, మాథ మాటికల్ లింగ్విష్టిక్స్ మొదలయిన అనేక శాఖల మీద పరిశోధనలు జరుగుతున్నాయి.

**2.5 భాషా శాస్త్రంలో విభిన్న శాఖలు (Schools of linguistics):** భాషా శాస్త్రం నూతనంగా ఏర్పడ్డ ప్రాంతీయ భేదాన్ని అనుసరించి ఆశయ భేదాల్ని బట్టి, అవసరాన్ని బట్టి కొన్ని శాఖలేర్పడ్డాయి. అవి ప్రధానంగా ముడు శాఖలు.

1. అమెరికన్ శాఖ (The American School of Lingaistics)
2. లండన్ శాఖ (London School of Linguistics)
3. ప్రాగ్ శాఖ (Prague School of Linguistics)

**1. అమెరికన్ శాఖ:** ఇందులో వర్ణనాత్మక పద్ధతి ప్రధానమయినది. ఈ ఖండంలో ఆదివాసులు అసంఖ్యాకంగా ఉన్నారు. ఆ భాషలకు లిపి లేకపోవటం చేత ప్రాచీన సాహిత్యం కూడా లేదు. వాగ్వ్యవహారమే ఆధారం కావడం చేత వర్ణనాత్మక పద్ధతి తప్ప అన్య విధానం ఇక్కడ ఎక్కువ ప్రాధాన్యమివ్వవలసి వచ్చింది.

అమెరికన్ భాషా శాస్త్రవేత్తలు రెండు విధాలుగా విడిపోయారు.

1. ఎడ్వర్డు సపీరు ఆయన అనుయాయులు
2. లియొనార్డో బ్లూంఫీల్డు అనుయాయులు

**1. ఎడ్వర్డు సపీరు - అనుయాయులు:** వీళ్ళు ముఖ్యంగా మానవ శాస్త్రజ్ఞులు (Anthropologists)

**2. బ్లూంఫీల్డు - అనుయాయులు:** కె.ఎల్.పైక్, నైడా, ఎమెనో, హారిసన్ మొదలయిన వాళ్ళు బ్లూంఫీల్డు అనుయాయులు. వీరిలో సూక్ష్మ భేదాలున్నా వీళ్ళంతా భాష సంపాదితమంటారు. అర్థం కంటె శతాబ్దానికి ప్రాధాన్యం ఇచ్చారు. వర్ణ విజ్ఞానం, వర్ణ సమ్మేళనం (Structure) పదాంశ విజ్ఞానం (Morphemics) - వీటికి అత్యంత ప్రాముఖ్యం ఇస్తారు. నూత్న పరిభాషా కల్పనలో వీళ్ళకు మక్కువ ఎక్కువ.

**2. లండన్ శాఖ:** ఈ శాఖ వారి మీద భారతీయ భాషా శాస్త్ర ప్రభావం ఎక్కువ. ఇందులో అక్షరానికి (Syllable) అత్యధిక ప్రామాణ్యామిచ్చారు. వీళ్ళది ఎక్కువ చారిత్రక దృష్టి. ఆర్.ఎల్.టర్నర్, ఎమ్.ఎమ్.విల్సన్, మోనియర్ విలియమ్స్, జె.ఆర్.ఫర్త్, థామస్ బరో, పామర్ మొదలయిన వాళ్ళు ఈ శాఖలో ప్రధానంగా పేర్కొనదగిన వాళ్ళు. వీళ్ళకు నిఘంటు రచన, వ్యాకరణ రచన మీద ప్రత్యేక ఆసక్తి.

**3. ప్రాగ్ శాఖ:** ఈ శాఖలోని వాళ్ళు నిర్మాణానికి (Structurs)కి అధిక ప్రాధాన్యమిచ్చారు. అంతేగాక సాహిత్యానికి కూడా సరి సమానమయిన ప్రాధాన్యమిచ్చారు.

ఇంకా పయినపేర్కొన్నవి కాక రష్యన్ శాఖ అనీ, కోపెన్ హాగన్ శాఖ అనీ అత్యంత సూక్ష్మ భేదాలతో ఉన్నాయి.

**సమీక్ష:-** ప్రాచ్య-పాశ్చాత్య దేశాలలో జరిగిన విశేష భాషా శాస్త్ర కృషిని, భాషాశాస్త్ర పండితుల విశేషాలను తెలుసుకున్నారు.

## ప్రశ్నలు

1. భాషా శాస్త్రం పై ప్రాచ్య ప్డితుల కృషిని వివరించండి.
2. పాశ్చాత్య శాస్త్రవేత్తల భాషా శాస్త్ర పరిశోధనను తెలియజేయండి.
3. 19-20 శతాబ్దాలలోని భాషా శాస్త్ర పరిణామాలను పేర్కొనండి.

## ఆధారగ్రంథ పట్టిక

Bloomfield, Leonard, 1933 Language. New York : Holt

Lchmann, Winbred P. 1962. Historical Linguistics . An Introduction, NEwYork : Holt

సుబ్రహ్మణ్యం పి.ఎస్. 1984, ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్-4.

సుబ్రహ్మణ్యం, పి.ఎస్. 1984, పాణినీయం - భాషాశాస్త్ర లక్షణాలు -2001. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్-4.

# పాఠం - 3 భాషా శాస్త్ర విభాగాలు

పాఠ్యాంశ నిర్మాణ క్రమం

3.1 వర్ణనాత్మక భాషా శాస్త్రం

3.2 చారిత్రాత్మక భాషా శాస్త్రం

3.3 తులనాత్మక భాషా శాస్త్రం

**లక్ష్యం:-** భాషాశాస్త్ర విభాగాలు వాటిలోని పద, సంధి వాక్య నిర్మాణ విషయాలు తెలుసుకుంటారు.

భాషా శాస్త్రాధ్యయనం ప్రధానంగా మూడు విధాలు. అవి

1. వర్ణనాత్మక భాషా శాస్త్రం (Descriptive Linguistics)
2. చారిత్రక భాషా శాస్త్రం (Historical Linguistics)
3. తులనాత్మక భాషా శాస్త్రం (Comparative Linguistics)

**3.1 వర్ణనాత్మక భాషా శాస్త్రం :** ఒక కాలానికి చెందిన భాషలను అధ్యయనం చేయటాన్ని వర్ణనాత్మక భాషాశాస్త్రం లేదా ఏక కాలిక భాషా శాస్త్ర మంటారు. ఇందులో ధ్వని నిర్మాణం, సంధి, సంపద నిర్మాణం, వాక్య నిర్మాణం ప్రధానమయినవి.

"The study of how a language words at a given time, regardless of its past history or future destiny is called descriptive or synchronic linguistics" ( 'A course in Modern Linguistics' - C.F. Hockett P.303 ) వ్యవహారంలో ఉన్న భాషను విశ్లేషించి పరిశోధించి కొన్ని నియమాలను వర్ణనాత్మక వ్యాకరణం ద్వారా వర్ణనాత్మక వ్యాకర్త పరికల్పిస్తాడు. భాషలోని మాండలిక భేదాలను పట్టించుకోకుండా ఒక వ్యక్తి ఉచ్చరించే అసంఖ్యాక వాక్యాల ఆధారంగా తద్భాషా వ్యాకరణాన్ని వర్ణనాత్మక వ్యాకర్త రచించాలి. వర్ణనాత్మక భాష శాస్త్ర రచయిత భాషలోని ధ్వనులను శాస్త్రీయంగా మొదట గుర్తించాలి. దీనికి ధ్వని శాస్త్ర (Phonetics) పరిజ్ఞానం అత్యంతావశ్యకం. ధ్వని శాస్త్రాలైె ఉచ్చారణాత్మక ధ్వని శాస్త్రం (Articulatery Photics), ధ్వని తరంగాత్మక ధ్వని శాస్త్రం (Auditory Phonetics) అనే వాటిలో ఉచ్చారణాత్మక ధ్వని శాస్త్ర పరిజ్ఞానం క్రీస్తు పూర్వమే మన ప్రాచీనులకుంది. ప్రాతిశాఖ్యలలోను, శిక్షల లోను స్థాన, కరణ, ప్రయత్నాలు విపులంగా వివరించారు. అచ్చులు, హల్లుల భేదం మన వాళ్ళకు తెలుసు. ప్రాతిశాఖ్యలలో స్వరాలు, వ్యంజనాలని వీటిని పేర్కొన్నారు.

**(ఎ). ధ్వని నిర్మాణం (Phonology):** అచ్చుల ఉచ్చారణలో వాయు నిరోధం ఉండదు. అచ్చులు సర్వ సాధారణంగా నాదాలు. ఉచ్చారణలో నాలుక ఎత్తును బట్టి పెదవుల ఆకారాన్ని బట్టి అచ్చుల్ని విభజిస్తారు. తెలుగు భాషలోని అచ్చుల్ని ఉన్నతాలని, మధ్యమాలని, నిమ్నాలని మూడు విధాలుగా విభజించారు. తెలుగులో ఇ,ఈ,ఉ,ఊలు ఉన్నతాలు కాగా, ఎ,ఏ,ఒ,ఓ,లు మధ్యమాలు. అ,ఆలు నిమ్నాలు. ఇ,ఈ,ఎ,ఏల ఉచ్చారణలో నాలుక అగ్రభాగం పైకి లేచి ఉంటుంది. కాబట్టి వీటిని అగ్రాచ్చులు (Front Vowels) అంటారు. ఉ,ఊ,ఒ,ఓల ఉచ్చారణలో నాలుక వెనక్కులాగబడి ఉంటుంది. కాబట్టి వీటిని పశ్చిమాలు (back vowels) అంటారు. అ,ఆలను ఉచ్చరించేటప్పుడు నాలుక ముందుకు కాని, వెనక్కుకాని లాగబడక తటస్థంగా ఉంటుంది. కాబట్టి వీటిని కేంద్రాచ్చులు (Central vowels) అంటారు.

తెలుగులో అచ్చులు

| | అగ్రాచ్చులు (Front Vowels) అనోష్ఠ్యాలు | కేంద్రాచ్చులు (Central Vowels) | పశ్చిమాచ్చులు (Back Vowels) ఓష్ఠ్యాలు |
|---|---|---|---|
| ఉన్నతం (High) | ఇ,ఈ | | ఉ,ఊ |
| మధ్యమం (Mid) | ఎ,ఏ | | ఒ,ఓ |
| నిమ్నం (Low) | | అ,ఆ | |

అచ్చులలో హ్రస్వ, దీర్ఘ భేదం తెలుగులో ఉంది. ఇదే విధమైన భేదం అనేక ప్రపంచ భాషలలో ఉంది. సంస్కృతంలో చాలా స్వరాలలో ఒక్కో స్వరానికి 18 భేదాలున్నాయి. హ్రస్వాలు, దీర్ఘాలు, ప్లుతాలు, ఉదాత్తాను దాత్త స్వరిత స్వరాలు, అనునాసిక,

నిరనునాసిక స్వరాలు - అని సంస్కృత వైయాకరణులు సూక్ష్మాతి సూక్ష్మంగా వివరించారు. జపనీస్ భా,లో శ్వాసాచ్చులు శ్వాస హల్లు మధ్యలో ఉంటాయి.

స్థానకరణ ప్రయత్న భేదం వల్ల హల్లులలో అనేక భేదాలు కలుగుతాయి.

హల్లులు 1. స్పర్శాలు (Stops or Plosives)
2. ఈషత్ స్పృష్టాలు (Fricatives)
3. పార్శ్వికాలు (Laterals)
4. కంపితాలు (Trills)
5. తాడితాలు (Flaps)
6. అనునాసికాలు (NAsals)
7. అంతస్థాలు (Semi-Vowels)

అని విభజించారు. జ, ఞ, ణ, న, మ లు తప్ప మిగిలిన వర్ణాలను సంస్కృతంలో స్పర్శాలుగా పేర్కొంటారు. జ, ఞ, ణ, న, మ లను అనునాసిక స్పర్శకాలుగా పేర్కొంటారు. వీటికి స్పర్శ ప్రయత్నంతో పాటు అను నాసిక్య ప్రయత్నం కూడా ఉంది. ల, ళ అనే అక్షరాలు పార్శ్వికాలు. వీటిలో ల దంతమూలీయం కాగా ళ మూర్ధన్యం. రేఫ తాడితం కాగా ఱ కంపితం. ఫ (f) ఈషత్ స్పృష్టం. య ర ల వ లలో భేదం కలగటం కూడా సంస్కృతంలో ఉంది.

| | | |
|---|---|---|
| సంస్కృత భాషలో | కరః (చేయి) | ఖరః (గాడిద) |
| | చలమ్ (కదిలేది) | ఛలమ్ (కపటం) |
| | షష్ఠి (ఆరు) | షష్టి (అరవై) |

పదం లేకుండా పద సంపుటులోని వ్యవధానం వల్ల అర్థ భేదం కలుగుతుంది. అప్పుడు పద సంహిత (Word Juncture) వర్ణ భేదక కారణమవుతుంది. పద సంపుటిలో పద సంహిత వల్ల ఈ కింది అర్థ భేదాన్ని గమనించండి.

| | | |
|---|---|---|
| ఆకలి కాలం | -- | ఆ ...... కలికాలం |
| ఏ కాకి | -- | ఏ ...... కాకి |
| ఆస్థానం | -- | ఆ ...... స్థానం |
| ఆకారం | -- | ఆన...... కారం |

శ్రుతి (intonation) వల్ల కూడా అర్థ భేదం కలుగుతుంది. అవరోహ స్థాయిలో రారా ↓ అని ఉచ్చరించినప్పుడు మిత్రుణ్ణి పిలవటం అవుతుంది. ఆరోహ స్థాయిలో రారా↑ అని అన్నప్పుడు గౌరవ పూర్వకంగా మీరు వస్తారా? రారా? అని ప్రశ్నించటం అవుతుంది. కాబట్టి శ్రుతి వల్ల కూడా అర్థ భేదం కలుగుతుంది.

భాషను వర్ణనాత్మకంగా వివరించేటప్పుడు భాషా ధ్వనులను గుర్తించి వర్ణ వ్యవస్థను ఏర్పరచుకోవాలి. మాటి మాటికి కనిపించే సామ్య భేదాల వల్ల విశ్లేషణ శాస్త్రీయంగా జరగాలి. ఇలాంటి వింగడింపు ఏమంత కష్టమయిందేమీ కాదు.

| | | | | |
|---|---|---|---|---|
| పదు | - | పాడు | ।అ। | ।ఆ। |
| ఇల | - | ఈల | ।ఇ। | ।ఈ। |
| మెడ | - | మేడ | ।ఎ। | ।ఏ। |
| కాలం | - | గాలం | ।క। | ।గ। |
| తగ్గు | - | దగ్గు | ।త। | ।ద। |
| పాట | - | బాట | ।ప। | ।బ। |

కనిష్ట భేదక యుగ్మాల (minimal pairs) ద్వారా వర్ణ నిర్ణయం చేయవచ్చు. ఇలాంటి భేదక యుగ్మాల వల్ల లభించే వర్ణాలు ప్రపంచ భాషలలో దేనిలో అయినా 15కు తగ్గకుండానూ 60కి మించకుండానూ ఉంటాయి. వీటిలో అచ్చులు హల్లులు ఉంటాయి. సాధారణంగా అచ్చుల కంటే హల్లుల సంఖ్య అధికంగా ఉంటుంది.

**(బి) పదనిర్మాణం (Morphology):**

పెద్ద ఇల్లు పెద్దబావి పెద్దమొక్క

చిన్నఇల్లు చిన్నబావి చిన్నమొక్క

మంచిఇల్లు మంచిబావి మంచి మొక్క

పైన ఇచ్చిన తొమ్మిది పద సంపుటుల్ని విశ్లేషిస్తే 1. పెద్ద 2. చిన్న 3. మంచి 4. ఇల్లు 5. బావి 6. మొక్క అనే 6 భిన్న శబ్దాలు మనకు లభిస్తాయి. వీటిలో మొదటి 3 విశేషణాల తెగకు చెందినవి కాగా మిగిలిన 3 విశేష్యాల తెగకు చెందినవి. ఇలాంటి పదాల్ని మనం గుర్తించాలి. అర్థ బోధక సామర్థ్యం కల భాషా కనిష్ఠాంశాన్ని పదాంశం (morpheme) అంటారు.

'boy' బాలుడు 'boys' బాలురు

'book' పుస్తకం 'books' పుస్తకాలు

పై పదాల్ని పరిశీలిస్తే boy, book అనేవి రెండు అని బద్ధ పదాంశాలు (unbound morphemes) గాను, ' -S' అనే బహువచన ప్రత్యయం నిబద్ధ పదాంశం గాను మనం భావించవచ్చు. పదాంశాలను గుర్తించిన తర్వాత కొన్ని పదాంశాలు కలసి పదంగా ఏర్పడేటప్పుడు కొన్ని పదాలు కలసి వాక్యంగా ఏర్పడేటప్పుడు ధ్వనులు పరస్పర ప్రభావం వల్ల మార్పు లేదా మార్పుల్ని పొందుతూ ఉంటాయి. ఈ విధమైన ధ్వనులు చెందే మార్పు లేదా మార్పుల్ని సంధి అంటారు.

**(సి) సంధి (Morpho - Phonemics):**

'పరః సన్నికర్షః సంహితా' (అష్టాధ్యాయీ 1-4-109) అని పాణిని మహర్షి పేర్కొన్నాడు. వర్ణాలు తక్కువ వ్యవధానంలో ఉచ్చరించబడేటప్పుడు ఉచ్చారణావయవాలు పరిసర వర్ణాల ప్రభావానికి లోనవుతాయి. కాబట్టి ఒక వర్ణ ప్రభావం తత్పరిసర వర్ణాల పై పడుతుందనేది స్పష్టం. శ్వాస స్పర్శం వంటి భిన్న భిన్న వర్ణాలు పక్క పక్కగా ఉంచి ఉచ్చరించటం సాధ్యం కాదు. కాబట్టి ఇటు వంటి విభిన్న వర్ణాలు కలసినప్పుడు రెండు వర్ణాలు కలిపి ఒక వర్ణంగా మారటం జరుగుతంది. ప్రపంచ భాషలలో ఈ వర్ణాలు అనేక రకాలుగా ఉన్నప్పటికీ సంధుల్ని స్థూలంగా నాలుగు రకాలుగా విభజించవచ్చు.

అ. వర్ణ సమీకరణం (Assimilation)

ఆ. అక్షర నిర్మితి (Syllable Structure)

ఇ. శ్లథీకరణ దృఢీరణాలు (Weakening & Strengthening)

ఈ. భేదకత్వ నివృత్తి (Neutralization)

**(అ). వర్ణ సమీకరణం:** ఒక వర్ణం దాని పక్క నున్న వర్ణ లక్షణాల్ని గ్రహించటాన్ని వర్ణ సమీకరణం అంటారు.

(అ) ఒక అచ్చు పక్కనే ఉన్న అచ్చు లేదా హల్లు లక్షణం గ్రహించటం జరుగుతుంది.

నది + లు → నదులు

గది + లు → గదులు

కాకి + లు → కాకులు

కత్తి + లు → కత్తులు

నడుచు + ఇ → నడిచి

మీది ఉదాహరణలలో పదాలలోని రెండో అచ్చు మూడో అచ్చు వల్ల మార్పు చెందింది.

పరుగు + కావాలి → పరుక్కావాలి

పది + తప్పులు → పత్తప్పులు

మొదటి మాటలలోని అచ్చులు తర్వాత మాటలోని మొదటి హల్లులతో సమీకరణం చెందాయి.

(ఆ) ఒక హల్లు పక్క ఉన్న అచ్చు లేదా హల్లు లక్షణాన్ని గ్రహించటం జరుగుతుంది.

కూర + గాయలు → కూరగాయలు

తల్లి + తండ్రులు → తల్లిదండ్రులు

ఇక్కడ పదాదిన ఉన్న పరుషాలు సరళాలుగా మారాయి.

**(ఆ). అక్షర నిర్మితి:** అక్షర నిర్మతిలో అచ్చు లేదా హల్లు లోపిస్తుంది.

పని + లు → పన్లు

చెట్టు + లు → చెట్లు

కూర + లు → కూర్లు

పయి ఉదాహరణలలో అచ్చు లోపించింది.

రత్నం + లు → రత్నాలు

పగడం + లు → పగడాలు

మంచం + లు → మంచాలు

పుస్తకం + లు → పుస్తకాలు

పయి పేర్కొన్న ఉదాహరణలలో 'మ్ (0)' లోపించింది.

**(ఇ). (1)శ్లథీకరణం:** దీర్ఘాచ్చు హ్రస్వాచ్చుగా మారటాన్ని శ్లథీకరణ అంటారు.

తాను →తన

తాము →తమ

**(2) దృఢీకరణం:** హ్రస్వాచ్చు దీర్ఘాచ్చుగా మారటాన్ని ధృడీకరణం అంటారు.

పడు →పాటు

చెడు →చేటు

**(ఈ). భేదకత్వ నివృత్తి:** భేదకత్వం ఉన్న రెండు వర్ణాల మధ్య భేదకత్వం ఒక స్థానంలో మాత్రం నశించటాన్ని భేదకత్వ నివృత్తి అంటారు.

| | | | |
|---|---|---|---|
| ప్రథమా | ద్వితీయా | | |
| ఏకవచనం | ద్వివచనం | | |
| తకారాంత శబ్దం | | మరుత్ | మరుతౌ |
| దకారాంత శబ్దం | | శరత్ | శరదౌ |
| ధకారాంత శబ్దం | | క్షుత్ | క్షుధౌ |

తకారాంత మరుత్, దకారాంత శరద్, ధకారాంత క్షుధ్ అనే శబ్దాలు మూడూ ప్రథమ ఏకవచనంలో తకారాంతంగా మారి భేదకత్వనివృత్తిని కలిగి ఉన్నాయి. వ్యవహార భాషలోని సంధుల్ని గమనించి విశ్లేషించి వర్ణనాత్మక వ్యాకర్త నిరూపించాలి. భాషా స్వభావాన్ని బట్టి అవసరమయితే నూతన వ్యాకరణ సూత్రాల్ని ఆవిష్కరించాలి.

పదాంశ నిర్మాణ (Morphology) విభాగంలో లింగ వచన విభక్తులను గురించి విపుల చర్చ గావించాలి. 'సుప్తి జన్తం పదమ్' (1-6-15) అని పాణిని అష్టాధ్యాయిలో పదాన్ని నిర్వచించి నిరూపించాడు. పాణినీయులు పాణిని రాసిన 'అవ్యయాదాస్ సుపః' (2-4-82) అనే అష్టాధ్యాయి సూత్రాన్ని బట్టి పదత్వ సిద్ధికై అవ్యయాలకు విభక్తిని చేర్చి లోపింపజేస్తారు. సంస్కృతత భాషకు ఈ పద నిర్వచనం ఉపయుక్తమవుతుంది. కాని విభక్తి ప్రత్యయాలూ, క్రియా విభక్తి ప్రత్యయాలూ లేని ప్రపంచంలోని ఇతర భాషలకు ఈ నిర్వచనం వర్తించదు.

లింగ వచన విభక్తుల్ని గురించి ఈ పద నిర్మాణ ప్రకరణం లోనే విపులంగా చర్చించాలి.

**(ఉ) లింగం:** స్త్రీ లింగం, పుం లింగం, నపుంసక లింగం అని లింగం (Gender) ముఖ్యంగా మూడు విధాలుగా ఉంటుంది.

సంస్కృతంలోని లింగ శబ్దానికి సంబంధించి ఉంటుంది గాని అర్థానికి సంబంధించి ఉండదు. లింగం భాషలో శబ్ద గతంగా ఉందా లేదా అర్థ గతంగా ఉందా అనే విషయాన్ని మొదట వ్యాకర్త గుర్తించాలి.

భార్యా (స్త్రీ లింగం)

దారాః (పుం లింగం)

కళత్రమ్ (నపుంసక లింగం)

భార్య, దార, కళత్ర శబ్దాలు మూడూ సంస్కృత పదాలు. మూడు మూడు లింగాలలో ఉన్నాయి.

ఆంగ్ల భాషలో లింగం అర్థగతంగా ఉంటుంది. ఆడ జాతిని గురించి చెప్పేవి స్త్రీ లింగాలు కాగా మగ జాతిని గురించి చెప్పేది పులింగాలు. ఈ రెండూ కానివి నపుంసక లింగాలు.

| Male | Female |
|---|---|
| Boy | Girl |
| Father | Mother |
| Brother | Sister |
| Horse | Mare |

book, tree, bus మొదలైన అనేక శబ్దాలు నపుంసక లింగాలు. Child, student, teacher, nurse వంటి పదాలు ఉభయ లింగాలుగా ఉన్నాయి.

ద్రావిడ భాషలలో పదాలు మహత్, అమహత్ భేదంతో కూడి ఉంటాయి. పులింగాలన్నీ (అర్థ పరంగా మగ జాతిని గురించి చెప్పేవి) మహద్వాచక శబ్దాలు, తద్భిన్నాలు అమహద్వాచకాలు. భాషను విశ్లేషించేటప్పుడు ఆ భాషలో లింగ విభజన ఏవిధంగా ఉందో గ్రహించి తమ వ్యాకరణంలో పేర్కొనాలి.

**(ఇ) వచనం (Number) :** ప్రపంచంలో చాలా భాషలలో ఏకవచనం, బహువచనం అని రెండు వచనాలు మాత్రమే ఉన్నాయి. కాని సంస్కృతం వంటి భాషలలో ద్వివచన శబ్దాలు కూడా ఉన్నాయి. ఏక వచనం మాత్రమే ఉన్న కొన్ని శబ్ద రూపాలు కొన్ని భాషలలో ఉన్నాయి. ఆయా వచన విధానాన్ని ఆయా వచన ద్యోతక ప్రత్యయాల్ని పేర్కోవాలి.

**(ఎఫ్) విభక్తి (Case) :** ప్రత్యయాలు భాషలో ఉన్నా లేకున్నా విభక్తి ప్రత్యయ విధానం మాత్రం అన్ని భాషలలోనూ ఉంది. కొన్ని భాషలలో మాటల క్రమాన్ని బట్టి విభక్తుల్ని గుర్తించవచ్చు. సంస్కృతం, గ్రీకు, లాటిన్ మొదలయిన భాషలలో విభక్తి విధానం అతి స్పష్టంగా ఉంది. తెలుగు మొదలైన ద్రావిడ భాషలలో సంస్కృతం వలె విభక్తి విధానం విపులంగా లేకపోయినా ఎంతో కొంత ఉంది. భాషా స్వరూపాన్ని స్వభావాన్ని గుర్తించి విభక్తులను గురించి వ్యాకర్త విశ్లేషించి తన వర్ణనాత్మక వ్యాకరణంలో పొందుపరచ వలసి ఉంటుంది.

**(జి) వాక్య నిర్మాణం(Syntax):** పదాలు ఏ విధంగా పరస్పరం కలసి సంపూర్ణ భావాన్ని వ్యక్తం చేస్తాయో తెలిపేది వాక్య నిర్మాణ వాభాగం. వాక్యాలలో అనేక విధానాలున్నాయి. నిర్దేశిక వాక్యాలు, ప్రశ్న వాక్యాలు, విధి వాక్యాలు అని వాక్యాలు ఏ భాషలో అయినా ప్రధానంగా మూడు రకాలుగా ఉంటాయి.

ఇక వాక్యాలకు సంబంధించినంత వరకు పదాల కలయికలో ప్రతి భాషలోనూ కొన్ని నియమాలుంటాయి. వాక్యంలో పదాల సంబంధం స్థాన సంబంధం, యోగ్యతా సంబంధం, ఆదేశ సంబంధం అని వాక్య నిర్మాణ సంబంధాలు మూడు విధాలుగా ఉంటాయి.

ఇవి గాక భాషలో వాక్యాలు 1. సామాన్య వాక్యాలు 2. సంశ్లిష్ట వాక్యాలు 3. సంయుక్త వాక్యాలు అని మళ్ళీ మూడు రకాలుగా ఉంటాయి. భాషా శాస్త్రవేత్త వీటన్నింటినీ పరిశీలించవలసిన అవసరం ఉంది.

ఒకే కాలంలో వ్యవహారంలో ఉన్న భాషను గ్రహించి భాషా విశ్లేషణ పయి పద్ధతుల ద్వారా చేసి వర్ణనాత్మక వ్యాకరణాన్ని రాయవచ్చు. వర్ణనాత్మక భాషా శాస్త్ర విజ్ఞానం వర్ణనాత్మక వ్యాకరణ రచనకు సహాయ పడుతుంది.

**3.2 చారిత్రక భాషా శాస్త్రం:** భిన్న కాలాల్లో ఒకే భాషలో కలిగిన మార్పుల్ని వివరించే శాస్త్రాన్ని చారిత్రక భాషా శాస్త్రం

అంటారు. మార్పు సమాజానికే కాక భాషకు కూడా సహజమే.

ససూర్ "There is really no such thing as absolute immobility. Every part of language is subjected to change" (A course in general linguistics P.1) అని భాషా పరిణామాన్ని గురించి తెలిపాడు. ప్రాచీన సాహిత్యం ఉన్న భాషలను పరిశీలించినప్పుడు ఈ విషయం స్పష్టంగా తెలుస్తోంది. షేక్స్పియర్ సాట్ (Sonnet XI)ను గమనించండి.

As fast as thou shalt wane,
So fast thou grow'st in on of thine,
From that which thou departest;
And that fresh blood which youngly thou bestowest.
Thou mayst call thine when thou youth convertest.

మీద పేర్కొన్న మూడు, అయిదు పంక్తుల చివరి రైమ్ (rhyme) నేటి ఉచ్చారణను బట్టి కుదరటం లేదు. కాని షేక్స్పియర్ కాలంలో రైమ్ సరిపోయినట్లుగా భావించవచ్చు. Departest, Convertest అనేవి ఆ కాలంలో రైమ్‌తో కూడి ఉన్నాయి. తర్వాత departest ఉచ్చారణ మారింది. ప్రాచీనాంగ్లంలో "thou, thine" అనే పదాలు వ్యవహారంలో ఉండేవి. కాని నేడు ఈ పదాలు లేవు. ఈ పై పంక్తుల్లో చివరనున్న (-st)కు అర్థం ఉంది.

ఈ అర్థం వ్యాకరణానికి సంబంధించింది. మధ్యమ పురుషలో క్రియలకు thou కర్తగా ఉన్నప్పుడు ఇది (-st) వస్తుంది. కాల క్రమేణ ఈ (-st) లోపించింది. కొన్ని పదాల అర్థం కూడా కాల గమనంలో మారుతుంటుంది. షేక్స్పియర్ సానెట్‌లో 'Convest' అనే పదానికి మార్పు చెందటం (undergoing a change) అని అర్థం. ఈనాడు ఆ పదానికి మార్పు కలిగించటం (Produce Change) అని అర్థం. 'Wane' అనే పద ప్రయోగం దాదాపుగా ఈనాడు లేనట్లే.

చారిత్రక భాషాశాస్త్రంలో భాషా స్థితిని రెండు భిన్న కాలాలను తీసికొని అధ్యయనం చేయటం జరుగుతుంది. 'depart' అనే పదం దెపర్ట్ అని ప్రాచీన కాలంలో ఉచ్చరించబడి తదనంతరం 'r ' లోపించి తత్పూర్వ స్వరం దీర్ఘతను పొంది 'దెపార్ట్' అని ఉచ్చరించబడుతుంది. భాషకు సంబంధించిన అలవాట్లు కాల క్రమేణ మారుతూ ఉంటాయి. ఈ మార్పుల్ని అధ్యయనం చేయటమే చారిత్ర భాషా శాస్త్రాధ్యయన లక్ష్యం.

హాకెట్ "The study of how speech habits change as time goes by is called historical or diachronic linguistics" (A course in Modern Linguistics P-303) అని నిర్వచించాడు. భాషా వికాసాన్ని చారిత్రకాధ్యయనం వల్ల చక్కగా శాస్త్రీయంగా నిరూపించవచ్చు. భాషా స్వరూపాన్ని సరిగా అవగాహన చేసుకోవచ్చు.

ఏ భాషకైనా లిఖిత పూర్వక సాహిత్యమున్నప్పుడే ఆ భాషలోని మార్పుల్ని తెలిపే చారిత్రక వ్యాకరణ రచన సాధ్యమవుతుంది. భాషలోని శాసనాలను, సారస్వతాన్ని ఆధారంగా తీసుకొని చేసే ఈ రచన శాస్త్రీయమైనదని వేరే చెప్పనక్కర లేదు. ప్రపంచంలో అనేక వాఙ్మయ రహిత భాషలున్నాయి. వీటికి చారిత్రక వ్యాకరణ రచన సాధ్యం కాదు. చారిత్రక వ్యాకరణ రచన వల్ల భాషా స్వరూప నిరూపణ శాస్త్రీయంగా జరగటమే కాకుండా భాషా వ్యవహర్తల సంస్కృతి ఆచార వ్యవహారాలు కూడా అవగతమవుతాయి.

వర్ణనాత్మక వ్యాకరణ రచనకు, చారిత్రక వ్యాకరణ రచనకు వైరుధ్యమున్నట్లుగా భావించనక్కర లేదు. వర్ణనాత్మక వ్యాకరణ రచనలో భాషలోని ఒక కాలాన్ని, ఒక ప్రాంతాన్ని తీసుకొని భాషా స్వరూపాన్ని వ్యాకర్త నిరూపిస్తాడు. చారిత్రక వ్యాకరణ రచనలో వ్యాకర్త భాషలోని రెండు లేదా అంతకంటే అధికమైన భిన్న భాషలు గ్రహించి భాషలోని మార్పుల్ని గుర్తించి భాషా పరిణామాన్ని విశ్లేషించి తన వ్యాకరణాన్ని శాస్త్రీయంగా రూపొందిస్తాడు. చారిత్రక వ్యాకర్త కాని, వర్ణ నాత్మక వ్యాకర్త కాని విషయాన్ని ఏక కాలానికి చెందినదిగా లేదా రెండు కాలాలకు చెందినదిగా పూర్తిగా గ్రహించలేడు. వర్ణనాత్మక వ్యాకర్త ఏక కాలానికి చెందిన భాషను గ్రహించాలని ప్రయత్నించినా అతడు సంగ్రహించే భాషలో అన్ని చారిత్రక లక్షణాలుండక పోవు. అదే విధంగా చారిత్రక వ్యాకర్తకు కూడా కొన్ని వర్ణనాత్మక లక్షణాలున్న భాష లభించకపోదు. వ్యవహారంలో ఉన్న భాష సుస్థిరంగా ఉందని కాని, ఉంటుందని కాని అనుకోరాదు.

వయసు మీద పడ్డ ముసలివారు మాట్లాడే భాషకు యువకులు మాట్లాడే భాషకు తేడా ఉంటుంది. భాషలో కొన్ని శబ్ద రూపాలు నశించి పోతుండగా కొన్ని నూతన శబ్దాల ప్రాచుర్యం ప్రబలుతుంది. కాబట్టి భాష నిత్య పరిణామ శీలమయింది.

"The speech of the old men differs from that of the young people. Both archaic elements and recent innovations are found by side. Some features are becoming rarer and rarer, while others are gaining in frequency. It is inevitable that speken language, for that very reason, can never be in a state of perfect stability" అంటాడు మిలెట్ (Historical linguistics and Indo-Aryan languages P-4).

భాషా చరిత్ర అవిఛ్చిన్నంగా ఉంటుందని చెప్పలేం. భాషలోని పరిణామాలన్నీ రికార్డులో ఉండవచ్చు, ఉండకపోవచ్చు. రెండు భిన్న కాలాలకు చెందిన సమగ్ర వర్ణనాత్మక వ్యాకరణ శాస్త్రాల అధ్యయనమే చారిత్ర భాషా శాస్త్రాధ్యయనమవుతుంది.

పూర్వ కాలానికి చెందిన భాషా వ్యవహర్తల దేశానికి ఆ భాషా వ్యవహర్తలకు చెందినదని భావించలేం. వ్యాకరణం చారిత్రకమూ అనేది ఆ వ్యాకరణాంశాల ప్రాధాన్యాన్ని బట్టి నిర్ణయించవచ్చు. చారిత్రక వ్యాకరణంలో వర్ణనాత్మక లక్షణాలుండవచ్చు. వర్ణనాత్మక వ్యాకరణంలో చారిత్రక లక్షణాలకు తావులేదు. ఒక భాషా స్వరూపాన్ని ఒక కాలానికి మాత్రం పరిమితం చేసి వర్ణిస్తే దాన్ని వర్ణనాత్మక వ్యాకరణ మంటారు. భిన్న కాలాలను గ్రహించి పోల్చి వర్ణిస్తే చారిత్రక వ్యాకరణశ్రీంటారు. ఈ రెండు వ్యాకరణాలు భాషా స్వరూపాన్ని నిరూపించేవే.

భాషలో మార్పులు అప్రయత్నంగానే జరుగుతాయి. భాషా వ్యవర్త శబ్దంలో కాని అర&థంలో కాని సంధిలో కాని జరిగే మార్పు గమనించడు. ఆభాషా వ్యవహర్త వేరే ప్రాంతానికి వెళ్ళి మాండలిక భాషను గమనించినప్పుడు మాత్రమే అతడా భాషలోని కొన్ని విశేషాలను గమనిస్తాడు. కాని ఇవి అతని అవగాహన క్షమతను నిశింపజేయలేవు. అన్య దేశ్యాలు తన భాషలోప్రవేశించి వ్యవహారంలో ఉన్నప్పుడు భాషా వ్యవహర్త ఈ అన్య దేశ్య పదజాలాన్ని గమనిస్తాడు. వేరే రాజ భాష తన భాషల పయి ప్రభావం చూపవచ్చు. ఇవన్నీ భాషా పరిణామానికి కొన్ని కారణాలు మాత్రమే. భాష స్వతహాగా మారే స్వభావం కలది కావటం భాషా పరిణామానికి అసలయిన ప్రధాన కారణం. భాషలోని ఈ మార్పుల్ని గమనించి చారిత్రక వ్యాకరణ రచన చెయ్యాలి.

చారిత్రక వ్యాకరణాలలో కూడా భాషలోని ధ్వనుల్ని గురించి, సంధుల్ని గురించి, పదాంశ విజ్ఞానాన్ని గురించి, వాక్యా నిర్మాణాన్ని గురించి వివరించవలసి ఉంటుంది.

**(ఎ) ధ్వని నిర్మాణం:** భాషలో ఉన్న ధ్వనులు కాల క్రమేణ మార్పులకు లోనవుతాయనేది చారిత్రక సత్యం. క్రీ.శ. 1400 సం॥ ప్రాంతానికి చెందిన చాసర్ ఇంగ్లీషు ఉచ్చారణకు, నేటి ఆంగ్లోచ్చారణకు అధిక భేదముంది. ధ్వనులలో మార్పు స్పష్టంగా కన్పిస్తుంది. ఆయన భాషను మాధ్యాంగ్లం (middle english) M.E. గా వ్యవహరించవచ్చు. నేటి ఆంగ్లాన్ని నవీనాంగ్లం (New English) N.E. అంటారు.

సే (M.E) > సీ (See) N.E. “చూచు”

హుస్ (M.E) > హౌస్ (House) N.E. “ఇల్లు”

ఆంగ్లంలోని Knee, Know, Talk, Walk, Depot, Psychology, Psalm మొదలైన పదాలలో సైలెంటు లెటర్సుగా భావించే వర్ణాలు ప్రాచీనాంగ్లంలో ఉచ్చరించిన ధ్వనులే అనీ, కాల క్రమేణ ఉచ్చారణ నుంచి భ్రష్టమయ్యాయని ఆంగ్ల పరిశోధకులంటున్నారు.

ప్రాఙ్నన్నయ యుగంలో ఉచ్చారణలో ఉన్న ‘తి’ కారం తర్వాత కాలంలో అచ్చుల మధ్య ‘డ’కారం గాను, పదాదికి వచ్చి సంయుక్తంగా ఉచ్చరించబడ్డప్పుడు రేఫగాను మారటం మన తెలుగు భాషలో వచ్చిన చారిత్రక పరిణామం.

| | |
|---|---|
| తాతి > తాడి | వచ్చు > వుచ్చు |
| కోతి > కోడి | పొతుదు > ప్రొద్దు |
| ఏతు > ఏడు | |

ప్రాచీన తెలుగులో పదాదిని సంయుక్తాక్షరంగా ఉన్న రేఫ తదనంతర కాలంలో లోపించింది.

క్రొత్త > కొత్త

ప్రాత > పాత

మ్రింగు > మింగు

క్రుంగు > కుంగు

ప్రొద్దు > పొద్దు

కొన్ని పదాది సంయుక్తాక్షరాలలో వకారం లోపించి రేఫ మిగులుతుంది.

వ్రాయు > రాయు

వ్రాలు > రాలు

వ్రాత > రాత

ప్రాచీనాంధ్రంలో అర్థానుస్వారం ఉండగా నేటి తెలుగులో లోపించింది.

తెలుఁగు > తెలుగు

ఏనుఁగు > ఏనుగు

వాఁడి > వాడి

నేఁడు > నేడు

వాఁడు > వాడు

వీఁడు > వీడు

వెలుఁగు > వెలుగు

ప్రాచీనాంధ్రంలో శకట రేఫ కొన్ని పదాలలో ఉండగా నేడది సాధు రేఫగా మారింది. శకట రేఫ నేడు ప్రత్యేక వర్ణం కాదు.

చఱచు > చరచు > చరుచు

తెఱచు > తెరచు > తెరుచు

నఱకు > వరకు > నరుకు

పాఱు > పారు

ప్రాచీనాంధ్రంలో లేని ఫ (f) తెలుగు వర్ణమాలలో నూతన వర్ణంగా పారసి, ఆంగ్లభాషల ప్రభావం వల్ల ఏర్పడింది.

ఫౌజ్ > ఫౌజు

కాఫిర్ > కాఫిర్

కాఫీ > కాఫీ

ఆఫీస్ > ఆఫీసు

ఫీజ్ > ఫీజు

ప్రాచీన తెలుగులో 'హ' వర్ణం లేదు. తెలుగులో ఉన్న 1236 క్రియా ధాతువుల లోనూ హత్తు, హెచ్చు అనే రెండు మాత్రమే హకారాది ధాతువువుగా కనిపిస్తున్నాయి. తెలుగులోని ఈ రెండు మాటలు కన్నడం నుంచి ఎరవు పదాలుగా వచ్చి చేరాయి.

నన్నయానంతర కాలంలో హత్తు, హాయి మొదలయిన కన్నడ పదాలు, హాజరు, సాహెబు, హుజూరు మొదలైన ఉర్దూ శబ్దాలు, హాలు, హాస్టలు, హాస్పటల్, హెడ్డు, హలో మొ॥ ఆంగ్ల పదాలు తెలుగులో ప్రవేశించాయి. ఇక హనుమంతుడు, హాలాహలం, హాస్యం మొ॥న అనేక హకారంతో ఉన్న పదాలు సంస్కృతం నుంచి వచ్చి చేరాయి.

## (బి) సంధులు:

తెలుగు భాష సంధి విధానం విషయంలో చారిత్రక పరిణామం విశేషంగా కనిపిస్తోంది.

'అత్తునకు సంధి బహుళంబుగానగు' (బాల వ్యా.సంధి. 4 సూ) అని చిన్నయసూరి సూత్రం చి

"సంస్కృతీయంబునకు సంధియగునని యథర్వణాచార్యులు చెప్పిరి గాని దానికింబూర్వ కావ్యములందు బ్రయోగంబు మృగ్యంబు. ఆధునిక కృతులందొకానొక చోట స్త్రీ వాక తత్సమంబులకు సంధి గానంబడియెడి. గంగను కాసె నెల తెచ్చెను" అని వృత్తిలో సంస్కృతీయాత్ సంధి విషయమై వికృతి వివేకకారుని "క్వచిత్ సంస్కృత యోపి ప్రాణో ప్రత్రచ్యుతో భవేత్" అనే వచనాన్ని దృష్టిలో ఉంచుకొని వివరించారు. 'గంగను కాసె' అనే ఆముక్తమాల్యదలోని ప్రయోగాన్ని మనసులో ఉంచుకొని వికృతి వివేకకారుడు పయి విధంగా సూత్రీకరించాడు. ప్రాచీనాంధ్రకవులు (కవిత్రయం, నాచన సోమన) సంస్కృతీయాదంత శబ్ద రూపాలకు సంధి చేయక

పోగా శ్రీ కృష్ణదేవరాయాది మధ్య యుగాంధ్ర కవులు సంధి చేశారు. 'క్త్వార్థేతో న భవేత్ సదా' అని వికృతి వివేక కర్త సూత్రించగా చిన్నయసూరి తన బాల వ్యాకరణంలో 'క్త్వార్థం బైన యిత్తునకు సంధి లేదు' (బాల వ్యా. సంధి. 8సూ) అని సూత్రీకరించాడు. భారత కవులు క్త్వార్థక సంధి చేయకపోయినా తదనంతర కవులు చాలా ఎక్కువ చేశారు. ఈ పరిణామాన్ని గ్రహించిన ప్రౌఢ వ్యాకర్త 'ఇ ప్రత్యయాంతావ్యయంబునకు సంధియుజూ పట్టెడి' (ప్రౌఢ వ్యా.సంధి. 2సూ) అని సూత్రించి 'భూత కాలికా సమాపక క్రియ యొక్క యుకారమునకు బ్రామాణిక ప్రయోగములందును గొన్ని యెడల సంధిగనబడుచున్నదని యర్థము' అని వృత్తిని రచించి కొన్ని ప్రయోగాలనిచ్చారు. తద్వ్యాతలు మరి కొన్ని ఉదాహరణలిచ్చారు.

ఒనరించెదరేగు దెరచిన (జైమిని భారతము 5.92)

ఎదిరించా కర్ణరుల్ (పైదే 5.180)

ఒదిగుండు (ఆముక్త మాల్యద 6.25)

చించిచ్చు (పై.దే.7.21)

## (సి) పదాంశ నిర్మాణం:

పదాంశ విభాగంలో కూడా భాషలలో అనేక మార్పులు జరుగుతుంటాయి. ప్రాచీన కాలంలోని భాషలలో పదాలకు కొన్ని అర్థాలుండగా కాల క్రమేణ ఆ పదాల అర్థాలలో కొన్ని మార్పులు రావచ్చు. అర్థ విపరిణామాన్ని గురించి కూడా చారిత్రక వ్యాకర్త వివరించాల్సిన అవసరం ఉంది.

భాషాశాస్త్ర రీత్యా పరిశీలిస్తే ఒక పదానికి ఒకే అర్థముంటుందనేది సత్యం. కాని ఈ పదానికి ఉన్న అర్థం ప్రకరణాన్ని బట్టి మారుతూంటుంది. ఆంగ్లంలోని House(నివాసస్థానం) అనే సాధారణ పదాన్ని ఉదాహరణగా తీసుకుంటే -

They live in the house there.

'house' అనే పదానికి, మానవ నివాస స్థానమయిన నిర్మాణ విశేషమని అర్థం. 'house' కు ప్రత్యామ్నాయ పదాలుగా home, cottage, cabin, hut, apartment, building మొ॥న అర్థాలున్నప్పటికి 'hut' మొ॥న వాటికి నిర్థిష్టార్థాలున్నాయి. Apartment, Building లను 'hut' అని వ్యవహరించలేం. House శబ్దం విపురార్థంలో వాడుతుండగా 'home' పదం పరిమితార్థంలో వాడుతున్నారు.

The house roared will laugher

ఈ వాక్యంలో house అంటే సభాసదులు అని అర్థం. ఇక్కడ house పదానికి మారుగా home అనే పదాన్ని కాని Cottage అనే పదాన్ని కాని వాడితే ఆ అర్థం రాదు.

ఈ క్రింది వృత్తాలను గమనించి house కు ఉన్న అర్థాల్ని మిగిలిన వాటికున్న పరిమితార్థాల్ని గుర్తించవచ్చు.




Hose పదానికి 'వాసస్థానం' (habitation) అనే అర్థం కుడి వైపు ఉన్న మూడు పదాలకు ఉండగా ఎడమ వైపు వున్న 'Dormitary' యూనివర్శిటీ భవనం, నిద్రపోవటానికున్న భవనం అనే అర్థం ఈ పదానికున్నాయి.

ప్రాచీనాంగ్లంలో 'Undertaker' అనే పదానికి ఉత్సాహవంతుడయిన కార్యనిర్వాహకుడని అర్థం. 'The lord is my undertaker' అని 23వ సామ్ (Psalm). కాని ఇప్పుడీ పదానికి శవవాహకుడని అర్థం.

నన్నయ తన భారత రచనలో 'కంపు' అనే పదానికి 'సుగంధం' అనే అర్థముంది. (భా.అరణ్య.2-19) తిక్కన కూడా 'ప్రియమగు కంపు' (భా. అనుశాసనిక 5.62) అని మంచి అర్థంలో ప్రయోగించగా నేడా పదానికి దుర్గంధం అనే అర్థం ఉంది. చీర శబ్దం వస్త్ర సమాన వాచకంగా నన్నయ 'ఆ ఋషి పుత్రుడు కట్టిన చీరలు' అని ప్రయోగించగా నేడు కేవలం స్త్రీలు ధరించే వస్త్రంగా పరిమితమయి పోయింది. కోక పదాన్ని కూడా వస్త్ర సామాన్య వాచకంగా శ్రీనాథుడు 'కుల్లా యుంచితి కోక చుట్టితి' అని ప్రయోగించగా ఈనాడది స్త్రీలు కట్టుకొనే వస్త్రమయింది. సంస్కృత భాషలో 'సభిక' శబ్దానికి ద్యూతకారకులనే అర్థం ఉండగా తిక్కన సభ్యులనే అర్థంలో 'ఈ సభికుల్ కనుగొనంగ' అని ప్రయోగించాడు. భాషలోని పదాల అర్థ పరిమాణాన్ని చారిత్రక వ్యాకరణంలో వివరంగా తెలియచెయ్యాలి.

## (డి) వాక్య నిర్మాణం:

ప్రాఙ్నన్నయ యుగాంధ్ర వాక్య నిర్మాణానికి, తదనంతర కాలంలోని వాక్య నిర్మాణానికి భేదమనంతంగా ఉంది. ప్రాఙ్నన్నయ యుగంలోని కర్మణి ప్రయోగాలున్న వాక్యాల సంఖ్య మూడు మాత్రమే. నన్నయ కాలంలోను, ఆ తర్వాత కర్మణి ప్రయోగాలు సంస్కృత భాషా ప్రభావం వల్ల తెలుగులో అసంఖ్యాకంగా ఏర్పడ్డాయి. యత్తదర్థక ప్రయోగాలతో కూడిన వాక్యాలు సంస్కృత భాషలో కోకొల్లలు. తెలుగులో ఇలాంటి వాక్యాల సంఖ్య చాలా పరిమితంగా ఉంది. అనేక సహస్ర పరిమితికల ఆంధ్ర శాసన వాఙ్మయంలో నన్నయ కాలానికి ఇలాంటి ప్రయోగాలు 4 మాత్రమే ఉన్నాయి. కాని నన్నయ కాలం లోనూ, ఆ తర్వాతా వీటి ప్రాచుర్యం ఎంతో పెరిగింది.

చారిత్రక భాషా శాస్త్ర పరిజ్ఞానం వల్ల సంస్కృతి, సంప్రదాయాలు ఇంకా అనేక చారిత్రక సత్యాలు మనకు తెలుస్తాయి. పారశీ భాషా పదమయిన 'తరాజూ' శబ్దం నుంచి వర్ణ లోపం వల్ల తెలుగులో 'త్రాసు' శబ్దం ఏర్పడింది. ఈ పదం ప్రజలలో విపుల ప్రచారంలో ఉండటం వల్లనే కలిబ్రహ్మ తన భారతంలో "త్రాసులంబోని చిత్తంబుల తోడుత బ్రజ వివాదములెడ భయములుడిగి" అని ప్రయోగించటమూ, క్రీ.శ. 1278కి చెందిన ఈవూరు శిలాశాసనంలో 'త్రాసు న్యాయమున' అని చెక్కబడటమూ ఉంది. ఈ త్రాసు పదాన్ని బట్టి 'కాగితము', గసగసాలు, జంబుకానాలు, సామ్రాణి, శాలువాలు మొదలైన పదాలను బట్టి మహమ్మదీయులకు, మనకు ఉన్న సంబధాలు తెలుస్తున్నాయి.

పైన పేర్కొన్న విధముగా చారిత్రక భాషా శాస్త్ర అధ్యయనం వల్ల చారిత్రకంగా ఆయా భాషలలోని ధ్వని సంధి, పదజాలం, వాక్య నిర్మాణాలలో వచ్చే మార్పులెన్నో మనకు అవగతమవుతాయి.

## 3.3 తులనాత్మక భాషా శాస్త్రం:

లిఖిత సాహిత్యం ఉన్న భాషలకు ఒకానొక నిర్ణీత కాలం నుంచి మాత్రమే తద్భాషా విశేషాలను తెలపటానికి శాసనాధారాలు లేదా సారస్వతాధారాలు లేదా శాసన సారస్వతాధారాలు లభిస్తుంటాయి. తెలుగు భాషకు శాసనాధారాలు క్రీ.శ. 6వ శ॥ నుంచి, సాహిత్యాధారాలు క్రీ.శ. 11వ శ॥ నుంచి లభిస్తున్నాయి. కన్నడ భాషకు క్రీ.శ. 5వ శ॥ నుంచి, తమిళ భాషకు క్రీ.పూ. నుంచే వాఙ్మయాధారాలున్నాయి. సంస్కృత భాషకు క్రీ.పూ. 15వ శ॥ నుంచి వైదిక వాఙ్మయం అనుస్యూతంగా లభిస్తోంది. ఆంగ్ల భాషకు కూడా క్రీ.శ. 7వ శ॥ నుంచి వాఙ్మయం లభిస్తోంది. ఈ విధంగా లభిస్తున్న భాషలను అధ్యయనం చేసి ఆయా భాషల చరిత్రలను నిర్మించవచ్చు. తెలిసిన చరిత్ర గల భాషలలోని మార్పులను గ్రహించి భాషా శాస్త్రవేత్తలు కొన్ని ధ్వని సూత్రాలను అర్థ పరిణామ విశేషాలను గ్రహించారు.

ప్రపంచంలో అనేక భాషలకు లిఖిత పూర్వక సాహిత్యం లేదు. అంతమాత్రం చేత ఆ భాషలకు పూర్వ చరిత్ర లేదని అనలేం. మన ద్రావిడ భాషలలోనే పర్జి, నాయకి, కురుఖ్, మాల్తో మొదలయిన భాషలు, అమెరికన్ ఇండియన్ భాషలు, కొన్ని ఆఫ్రికన్ భాషలు లిఖిత పూర్వక సాహిత్యం లేనివి. అంత మాత్రం చేత వాటికి పూర్వ చరిత్ర, సంస్కృతి లేదని అర్థం కాదు.

రెండు కాని అంతకంటే ఎక్కువ కాని భాషలను భాషా విషయకంగా పోల్చి చూసి ఆ భాషల సంబంధాన్ని లేదా సంబంధరాహిత్యాన్ని తెలిపే శాస్త్రాన్ని తులనాత్మక భాషా శాస్త్రం అంటారు. ఈ తులనాత్మకాధ్యయనం వల్ల భాషల జన్య జనక భావ సంబంధం, సోదర

భావ సంబంధం అవగతమవుతుంది. సర్. విలియం జోన్సు ఈ తులనాత్మకాధ్యయనానికి సంస్కృత భాషా ప్రాముఖ్యాన్ని పశ్చిమ దేశాల వారికి వెల్లడించటం ద్వారా శ్రీకారం చుట్టాడు. ఈ శాస్త్రం 19వ శ॥లో బాగా అభివృద్ధి సాధించింది.

రెండు లేదా అంతకంటే ఎక్కువ భాషలలో పదాల లోను, ప్రత్యయాలలోను, నిర్మాణం లోను సాదృశ్యముంటే ఆ భాషలకు జన్మ సంబంధముందనీ, ఆ భాషలు అప్పటికి ఆధారాఢ లేని ఒకానొక శాస్త్రీయ ఊహా సిద్ధ మూల భాష నుంచి పుట్టాయనీ నిర్ధారించవచ్చు. రెండు కాని అంతకంటే ఎక్కువ భాషలకు జన్మ సంబంధాన్ని నిర్ధారించేటప్పుడు ఆయా భాషలలోని పదాల సామ్యాన్ని గుర్తించాలి. ఈ విధంగా గుర్తించేటప్పుడు ధ్వని సామ్యాన్ని, అర్థ సామ్యాన్ని కూడా గమనించాలి. అయినా భాషా శాస్త్రజ్ఞులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. భాషలలో కొన్ని యాదృచ్ఛిక సామ్యాలు (accidental resemblences) ఉండవచ్చు. ఇలాంటి పదాలు పరిహరించాలి. ఆధునిక గ్రీకు భాషలోని 'మతి' పదానికి 'కన్ను' అని అర్థం. కన్ను అని అర్థానిచ్చే మలయ్ 'మత' శబ్దముంది. ఈ రెండు భాషలలోని ఈ పదాల పూర్వ చరిత్ర తెలియకపోతే వీటిని మనం సజాతీయ భాషా పదాలని భావించే వాళ్ళం. కాని గ్రీకు 'మతి' పద పూర్వ చరిత్ర మనకు తెలుసు. ప్రాచీన గ్రీకు 'ఒమ్మ' శబ్దానికి కన్ను అని అర్థం. 'ఒమ్మతిఒన్' శబ్దానికి చిన్న కన్ను అని అర్థం. 'ఒమ్మతి ఒన్' నుంచి ఆధునిక గ్రీకు 'మతి' పదం 'కన్ను' అనే అర్థంలో నిష్పన్నమయింది. మలమ్ 'మత' రూపంలో మార్పు లేదు. కాబట్టి దీన్ని యాదొచ్ఛికసామ్యంగా మనం భావించవచ్చు. కొన్ని తెలుగు, ఆంగ్ల పదాలను పరిశీలిస్తే ఈ యాదృచ్ఛిక సామ్య విషయం తెలుస్తుంది.

| ఆంగ్లం | | తెలుగు |
|---|---|---|
| neat | - | నీటు |
| prop | - | ప్రాపు |
| yean | - | ఈను |
| mud | - | మట్టి |
| thread | - | త్రాడు |

భాషలలోని ప్రతి దేయ పదాలను (loanwords) సరిగా గుర్తించక పోవటం మూలాన వీటిని సజాతీయ పదాలుగా భ్రమించే ప్రమాదముంది.

| లాటిన్ | ఆంగ్లం |
|---|---|
| dentalis | dental |

లాటిన్ భాష నుంచి ఆంగ్లంలోకి డెన్టల్ పదం గ్రహించబడింది. 'టూత్' అనేదే ఆంగ్ల నిసర్గ పదం. తులనాత్మక పరిశీలన జరిపేటప్పుడు భాషలలోని అన్య దేశ్య శబ్ద రాశిని పరిశీలించాలనటంలో సందేహం లేదు.

తులనాత్మక భాషా పరిశీలన జరిపేటపప్పుడు అవయవ వాచి శబ్దాలను, సంఖ్యా వాచకాలను, సర్వనామాలను, బంధుద్యోతక శబ్దరాశిని భాషా వ్యవహర్తలకు పరిచితాలయిన పక్షి పశు జీవ జాతి సూచిక శబ్దాలను గ్రహించాలి. భాషలలోని మౌలిక శబ్దరాశి (basic vocabulary)లో ఎరవుమాటలుండటం అరుదు కాబట్టి వీటి పరిశీలన భాషల సంబంధ నిరూపణకు దోహదం చేస్తుంది. పదాలు, వర్ణాలలోని భేదం ధ్వని సూత్రాలకు అనుగుణంగా ఉంటే అవి ఉన్న భాషలు సోదర భాషలని మనం చెప్పవచ్చు. ఒక మూల భాష నుంచి నిసర్గంగా రెండు కాని అంతకంటే ఎఉక్కువ భాషలలోకి పదాలు వస్తే అలాంటి నిసర్గ పదాలను సజాతీయ భాషా పదాలు (ognates) అంటారు.

సజాతి శబ్దాలను ఒక చోట చేర్చటం తులనాత్మక భాషా శాస్త్రవేత్త ప్రథమ కర్తవ్యం. తులనాత్మక వ్యాకరణ రచనలో కూడా వర్ణనాత్మక, చారిత్రక వ్యాకరణ రచనలో వలె ధ్వని నిర్మాణాన్ని, సంధి విధానాన్ని, పదాంశ నిర్మాణాన్ని, వాక్య నిర్మాణాన్ని పరిశీలించాలి.

## (ఎ) ధ్వని నిర్మాణం:

మూల భాషా వర్ణ నిర్మాణానికి సజాతీయ భాషా పదాలను తులనాత్మకంగా పరిశీలించాలి. వర్ణాలలో కొంచెం మాత్రమే భేదముండి అర్థం ఒకే విధంగా ఉన్న పదాలను ఒక చోట చేర్చి పరిశీలించటం సులభ సాధ్యం. భిన్న పదాలలో కొన్ని వర్ణాలలో భేదమున్నప్పటికి ఆ భేదానికి ఏదయినా అనుగమనమున్నదా అనే విషయాన్ని పరిశీలించాలి.

ఇండో యూరోపియన్ భాషా ఉపకుటుంబమయిన జర్మానిక్ భాషా పదాలను కొన్నింటిని పరిశీలించుదాం.

| | ఇంగ్లీషు | జర్మన్ | డేనిష్ | స్వీడిష్ |
|---|---|---|---|---|
| హౌస్ | house | haus | hu:?s | hu:s |
| మౌస్ | mouse | maws | mu:?s | mu:s |
| లౌస్ | louse | laws | lu:?s | lu:s |
| బ్రౌన్ | brown | brawn | bru:?n | bru:n |

పై పదాలలో ఇంగ్లీషు జర్మన్ 'ఔ' కారం ఉచ్చారణలో ఉండగా డేనిష్, స్వీడిష్ భాషలలో ఇది 'ఊ'గా ఉచ్చరించబడుతోంది. వీటిలో 'ఔ'కారం 'ఊ'కారంగా మారిందని, 'ఊ' 'ఔ'గా మారిందని కాని ఊహించడానికి అవకాశమున్నా, తద్భాషామాండలికాల్ని, పాతరికార్డుల్ని పరిశీలిస్తే 'ఊ'కారమే ఇంగ్లీషు, జర్మన్ భాషలలో 'ఔ'కారంగా మారిందని నిర్ధారించవచ్చు. ఆంగ్ల మాండలిక శబ్దాలు 'హూస్ మూస్' నేటికీ ఉన్నాయి. ఇదే విధమయిన ఉచ్చరణ కల జర్మన్ మాండలికాలు కూడా లభిస్తున్నాయి. ఇంతేగాక 8,9 శ॥కు చెందిన జర్మన్, ఇంగ్లీషు రికార్డులను బట్టి 'హూస్, మూస్' అని ఉచ్చరించేవారని తెలుస్తోంది. ఈ విధంగా ధ్వని పరిమాణంలో అనుగమనం ఉన్న ఇలాంటి పదాల్ని సజాతీయ భాషా పదాలుగా పరిగణించి ఈ భాషలన్నీ ఒకే కుటుంబానికి చెంది ఉంటాయనీ, ఈ భాషలన్నింటికి మూల జర్మానిక్ భాష అనేది మూలమని ఊహించటం ఏమంత కష్టమైన పనికాదు.

ఇదే విధంగా అనేక మూల ద్రావిడ భాషా గత లక్షణాలు సారస్వతరహిత భాషలైన పర్జీ మొదలైన భాషలలో ఉండగా సారస్వతం ఉన్న తమిళాది భాషలలో ఈ మూల ద్రావిడ లక్షణాలు లోపించాయి. కింది ఉదాహరణలను పరిశీలించండి.

| **పర్జీ** | **తమిళం** | **మలయాళం** | **కన్నడం** | **తెలుగు** |
|---|---|---|---|---|
| చీ | ఈ | ఈ | ఈ | ఈ(ఇచ్చు) |
| చుప్ | ఉప్పు | ఉప్పు | ఉప్పు | ఉప్పు |
| చిల | ఇల్లై | ఇల్ల | ఇల్ల | లేదు |
| చీన్డ్ | ఈన్తు | ఈన్తల్ | ఈచల్ | ఈడ |
| చేన్దు | ఐన్దు | అంజు | అయ్దు | ఏను (అయిదు) |

మూల ద్రావిడ పదాది * చకారం పర్జీలో ఉండగా సాహిత్య వంతాలయిన తమిళాది భాషలలో లోపించింది. సజాతీయ భాషా పదాలను గ్రహించి వాటి ఆధారంతో కొన్ని ధ్వని సూత్రాలను మనం ఏర్పరచుకోవచ్చు.

| **తమిళం** | **మలయాళం** | **కన్నడం** | **తెలుగు** |
|---|---|---|---|
| కణ్ | కణ్ | కణ్ / కణ్ణం | కన్ను |
| అణ్ణా | అణ్ణన్ | అణ్ణ | అన్న |
| పిణం | పిణం | పెణ / హెణ | పీనుగు |

పై ఉదాహరణల ఆధారంతో తమిళ, మలయాళ, కన్నడ భాషలలోని 'ణ్' మూల ద్రావిడంలనే ఉండగా తెలుగులో 'న్'గా మారిందని చెప్పవచ్చు.

| **తమిళం** | **మలయాళం** | **కన్నడం** | **తెలుగు** |
|---|---|---|---|
| ఇరంటు | రంటు | ఎరడు | రెండు |
| ఎతుపతు | ఎతుపతు | ఏళ్పత్తు | డెబ్బది |

మీది పదాల పరిశీలన వల్ల తెలుగులో పదాదిని వర్ణ వ్యత్యయం జరిగి డెబ్బది మొదలైన రూపాలు ఏర్పడ్డాయని చెప్పవచ్చు.

వర్ణాలలో భేదం ఎక్కువగా ఉన్నప్పుడు సజాతి శబ్దాల వల్ల నర్ణ నిర్ణయాన్ని చేయవచ్చు. ఈ కింది ద్రావిడ శబ్దాలను పరిశీలిద్దాం.

| **బ్రాహూఈ** | **తమిళం** | **మలయాళం** | **కన్నడం** | **తెలుగు** |
|---|---|---|---|---|
| ఖఫ్ | చెవి | చెవి | కివి | చెవి |

బ్రాహూఈ 'ఖఫ్' అనే మాటకు 'చెవి, కివి' అనే ఇతర పదాలకు శబ్దసాదృశ్యం లేకున్నా అర్థ సాదృశ్యముంది. కాని అనేక ఇతర

శబ్దాలను పరిశీలించిన తర్వాత బ్రాహూఈ 'ఖ'కారం మూల ద్రావిడ 'క'కారం నుంచి వచ్చిందనీ, బ్రాహూఈ 'ఆ' మూలద్రావిడ 'ఎ' నుంచి జనించిందనీ, బ్రాహూఈ 'ఫ(f)' మూలద్రావిడ 'వ' నుంచి వచ్చిందనీ తెలుస్తోంది. ఈ విధంగా మూలద్రావిడ * 'కెవ్' శబ్దం నుంచి బ్రాహూఈ 'ఖఫ్' రూపం నిష్పన్నమైందని నిరూపించవచ్చు.

పదాది మూలద్రావిడ 'క' వర్ణం తాలవ్యాచ్చులయిన ఇ, ఈ, ఎ, ఏ లను కూడినప్పుడు తెలుగు, తమిళ, మలయాళ భాషలలో చకారంగా మారుతుందనేది ద్రావిడ భాషలలో తాలవ్యీకరణ సూత్రం. కాగా కన్నడం మొదలయిన ఇతర ద్రావిడ భాషలలో క వర్ణం మార్పు చెందలేదు.

## (బి) సంధి నిర్మాణం:

ధ్వనుల నిర్మాణంలాగానే సంధి విధానంలో కూడా ఏమయినా మార్పులు వచ్చాయా, వస్తే ఎలాంటి మార్పులొచ్చాయి అనే విషయాన్ని కూడా సజాతీయ భాషా పదాలను తులనాత్మకంగా పరిశీలించటం ద్వారా తెలుసుకోవచ్చు. సర్వ సాధారణంగా మిగిలిన నిర్మాణాలలాగా సంధి నిర్మాణంలో పెద్దగా మార్పులుండవు.

## (సి) పదాంశ నిర్మాణం:

భాషలలో అర్థ పరిణామం సహజమే. Persona అనే లాటిన్ పదానికి ముసుగు (mask) అని అర్థం. రోమన్ నాటకాలలో పాత్రోచితంగా ముసుగుల్ని ధరించేవారు. రానురాను ఈ పదానికి ముసుగు ధరించిన పాత్ర అనే అర్థం కలిగింది. తర్వాత ముసుగు ధరించినా ధరించకపోయినా నాటక పాత్ర అనే అర్థం కలిగింది. తర్వాత ప్రతినిధి అనే అర్థం ఈ పదానికి వచ్చింది. జాతి ప్రతినిధి అని కేంద్రార్థం (Central meaning) "The three persons in the trinity" అనే వాక్యంలో ఈ అర్థం ఉంది. చర్చి ప్రతినిధి అనే అర్థంలో 'person' పదం ప్రయోగించబడుతోంది. వ్యక్తి అనే అర్థంలో Person పదం నేడు ఆంగ్లంలో ప్రయోగిస్తున్నారు. ఈ కింది వాక్యాలను పరిశీలించండి.

1. The three persons in the trinity
2. He is a person
3. Twenty persons are at the meeting.

లాటిన్ persona పదం అర్థంతో పోల్చి చూసినప్పుడు మనకు ఈ అర్థవిపరిణామం స్పష్టంగా తెలుస్తుంది.

ప్రాచీన ఆంగ్లంలో ghost అంటే ఆత్మ (spirit) అని అర్థం. కాని నేడు అర్థ విపరిణామం కలిగి దయ్యం అనే అర్థం వచ్చింది. Holy Ghost అంటే పవిత్రాత్మ అనే అర్థం ఈనాటికీ ఉంది.

జర్మన్‌లోని 'Geist' పదానికి 'ఆత్మ' అనే అర్థం. జర్మన్‌లోని 'Tier' పదానికి జంతువు అని అర్థం. దీని సజాతీయ పదమైన 'deer' పదం 'లేడి' అనే సంకుచితార్థంలో ఆంగ్లంలో వాడుతున్నారు.

## (డి) వాక్య నిర్మాణం:

వాక్య నిర్మాణం పరభాషా ప్రభావానికి తరచులోనవుతుంది. కాబట్టి మూలభాషా పునర్నిర్మాణం పూర్తిగా సాధ్యం కాదు. దుహితృ భాషలలో సమానంగా ఉన్న విశిష్ట వాక్య నిర్మాణాల్ని మూలభాషలో పునర్నిర్మించవచ్చు. ద్రావిడ భాషలకు కర్మణి ప్రయోగం సహజం. కాదని ద్రావిడ భాషా పరిశీలన వల్ల స్పష్టమైంది. కాబట్టి మూల ద్రావిడ భాషలో కర్మణి ప్రయోగం లేదని చెప్పవచ్చు.

చాలా ద్రావిడ భాషలలో క్రియారహిత వాక్యాలు అనేకం ఉన్నాయి. క్రియారహిత వాక్య నిర్మాణం మూలాల భాషా లక్షణమని మనం భావించవచ్చు.

అవన్ నల్లవన్ (తమిళం)

వాడు మంచివాడు (తెలుగు)

పైన పేర్కొన్న వాక్యాలాంటివి ద్రావిడ భాషలలో సర్వసామాన్యం.

వర్ణనిర్మాణ పునర్నిర్మాణమంత సమగ్రంగా ప్రత్యయని నిర్మాణ, సంధి, వాక్య నిర్మాణాల పునర్నిర్మాణం చేయటం సాధ్యం కాదు.

అయితే చారిత్రకాధారాలు లేని మూల భాషల్ని పునర్నిర్మించటానికి ఈ తులనాత్మకాధ్యయనం అత్యంతావశ్యకం.

**సమీక్ష:-** వర్ణనాత్మక, చారిత్రక, తులనాత్మక భాషా శాస్త్రాల్లోని విశేషాలను, ఆయా భాషా పద, వాక్య, సంధి, ధ్వని మొదలైన వాటి ద్వారా తెలుసుకొనే విధానం సమీక్షించబడింది.

## ప్రశ్నలు

1. భాషాశాస్త్ర విభాగాలను గూర్చి వ్రాయండి.
2. భాషా శాస్త్ర విభాగాలను తెల్పి, వర్ణనాత్మక భాషా శాస్త్రమును వివరించండి.
3. చారిత్రక భాషా శాస్త్రం అంటే ఏమిటి? వివరించండి.
4. తులనాత్మక భాషా శాస్త్రాన్ని సమీక్షించండి.

## ఆధారగ్రంథ పట్టిక


1. Bloomfield Leonard, 1933. Language NEwYork : Holt
2. Lchmann Winfred 1962. Historical Linguistics, An Introduction, NewYork : Holt
3. నాగభూషణరావు కె & పార్వతి ఎన్. సామాన్య భాషాశాస్త్రం పాఠ్యక్రమం 1978, మూలం - ఫర్దినాదిససూర్, తెలుగు అకాడమీ, హిమాయత్‌నగర్, హైదరాబాద్.
4. సుబ్రహ్మణ్యం పి.ఎస్. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు 1984. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 4.

# పాఠం - 4 ప్రపంచ భాషల వర్గీకరణ – భౌగోళిక వర్గీకరణ పదాంశాను గుణ వర్గీకరణ

**పాఠ్యాంశ నిర్మాణ క్రమం**

4.1 ప్రపంచ భాషలు - వర్గీకరణ
4.2 భౌగోళిక వర్గీకరణ
4.3 పదాంశ/రూపాశ్రిత/నిర్మాణాశ్రిత/లక్షణాత్మక విభజన
4.4 పదాంశ విభజనలోని లోపాలు

**లక్ష్యం:-** ప్రపంచ భాషా వర్గీకరణాన్ని, రకాలను, భౌగోళిక, పదాంశ వర్గీకరణలను గూర్చి తెలుసుకుంటారు.

## 4.1 ప్రపంచ భాషలు - వర్గీకరణ

ఇప్పుడు ప్రపంచంలో మొత్తం ఎన్ని భాషలున్నాయో ఖచ్చితంగా చెప్పలేం. చెప్పగలగడం అంత తేలికయిన పని కూడా కాదు. కొన్ని వేల సంవత్సరాల నుంచి అసంఖ్యాఆలయిన భాషలు వాడుకలో ఉన్నాయి. కొన్ని భాషలు ఉన్నట్లుగా వినికిడే గాని తద్భాషా వ్యవహర్తలు ఒక్కరు కూడా లేనివి ఉన్నాయి. ఆయా భాషలకు లిపి లేక పోవటం వల్ల కనీసం ప్రాచీన సాహిత్యాధారాలు కూడా లభ్యం కావు.

ఏ భాష అయినా అది స్వతంత్ర భాషా, లేక ఏ భాషకైనా మాండలికమా అనే విషయం చెప్పటం కూడా అంత తేలికయిన విషయం కాదు. ఉదాహరణకు సార్డినియన్ భాష స్వతంత్ర భాష అని కొందరూ, కాదు ఇటాలియన్ భాషా మాండలికమని కొందరూ వాదించారు. వాస్తవానికి అది స్వతంత్ర భాషా లేక మాండలికమా అనేది చెప్పగలగటం అంత సులభమయిన పని కాదు. అలా వేరు చేసి చెప్పడానికి వలసిన పద్ధతులను కూడా అన్వేషించవలసి ఉంది.

ఇలాంటి సమస్యలకు ఏదో రీతిగా సమాధానపడి పరిగణనం చేస్తే ప్రపంచంలో సుమారు స్వతంత్ర భాషలు కాని, మాండలికాలు కాని కలసి సుమారు 5 నుంచి 6 వేల వరకూ ఉన్నట్లుగా ఒక అంచనా. ఇవి ధ్వని, వర్ణ, పదాంశ, వాక్య నిర్మాణాదుల్లో కొన్ని భాషలతో పోలికలు మరికొన్ని భాషలతో పోలికలు లేకుండానూ ఉన్నాయి.

అయితే ఒక్కో భాషకు లక్షణాలు ఒక్కో విధంగా ఉంటాయి. ఏ రెండు భాషలూ ఒకే విధంగా ఉండవు. అన్ని వేల భాషల లక్షణాలు వేరు వేరుగా అధ్యయనం చేయటం అంత సులభమయిన పని కూడా కాదు. అందుచేత ఈ భాషలను ఏదో ఒక విధంగా శాస్త్రీయంగా విభజించు కొని భాషాధ్యయనం చేయవలసి ఉంటుంది. పలు భాషలు రూపొందే పద్ధతిని భాషా శాస్త్రవేత్తలు రెండు విధాలుగా విభజించారు.

(ఎ). వంశ వృక్షవాదం (Treestem Theory)

(బి). తరంగ వాదం (Wave Theory)

ఒక వృక్షానికి శాఖోపశాఖలు విస్తరించే విధంగా, వృక్ష కాండం వంటి మౌలిక భాషను ఆధారంగా చేసుకొని మరికొన్ని భాషలు శాఖల్లా పెరుగుతాయని వంశ వృక్షవాదం ప్రతిపాదిస్తోంది.

ప్రశాంతంగా ఉన్న చెఱువులో రాయి విసిరితే తరంగాలు ఏర్పడి ఒడ్డును తాకిన విధంగా మవులిక భాషలో అనేక కారణాల ప్రాబల్యం వల్ల కొన్ని భాషలు అలలు అలలుగా విజృంభిస్తాయని తరంగవాదం చెబుతోంది.

భాషల్ని ఒకే ఒక సామాన్య సూత్రం వల్ల భిన్న వర్గాలుగా ఖచ్చితంగా వేరు చేయడం కుదరని పని. దానికి చాలా కారణాలు ఉన్నాయి. ప్రతి భాషలో నిర్మాణ విషయంలో రెండు భాగాలు ఉంటాయి. అవి:

(ఎ). బాహ్య నిర్మాణం

(బి). అంతర నిర్మాణం

**(ఎ) బాహ్య నిర్మాణం :** భాషలో ఉండే వర్ణాలూ, పదాలూ బాహ్య నిర్మాణానికి చెందినవి. ఏ భాష అయినా మరో భాషా ప్రభావం చేత తనలో ఉన్న వర్ణాలలోనూ, పదాలలోనూ వేగంగా మార్పు తెచ్చుకొని ఆ మార్పుల్ని జీర్ణం చేసుకొంటుంది. అంటే ఇతర భాషా ప్రభావానికి త్వరగా లోనవుతాయన్నమాట.

**(బి) అంతర నిర్మాణం :** పదానికీ పదానికీ మధ్య గల సంబంధం, వాక్య రచన అంతర్నిర్మాణానికి చెందినవి. ఇందులో ఇతర భాషల ప్రభావం ఎంతో అరుదుగా తప్ప ఎక్కువ ఉండదు. అందుచేతనే ఒక భాషలో మరో భాషా ప్రభావితం వల్ల వర్ణాలూ,పదాలు ఎక్కువగా వచ్చి చేరతాయి కాని వాక్య నిక్మాణం, కారక ప్రక్రియ అంతగా ప్రభావం చూపినట్లు కనిపించదు. ఒక వేళ ప్రభావం ఉన్నా చాలా స్వల్పాతిస్వల్పంగా ఉంటుంది.

భాషలలో ఇతర భాషల ప్రభావం వల్ల బాహ్య నిర్మాణాన్ని మార్చుకునే లక్షణం ఉండటం చేత ఒక భాషను మరో భాషను వేరుచేసి చెప్పగలగడం కష్టసాధ్యమవుతుంది. ఇక్కడ ఒక భాష తనకంటే విరుద్ధ నిర్మాణ స్వభావం కలిగిన మరో భాషనుంచి కూడా బాహ్య నిర్మాణంలో పోలికల్ని తెచ్చుకుంటుంది. ఈ లక్షణం మూలంగానే భారతదేశంలో దేశీయభాషలన్నిటికి తల్లి సంస్కృత భాష

అని భావించారు.

వీటిని దృష్టిలో ఉంచుకొని భాషల్ని వేరు వేరు విభాగాలుగా చేసే ముందు వాటి అంతర నిర్మాణానికి ప్రాముఖ్యం ఇవ్వవలసి ఉంటుంది.

ఇప్పటికీ ప్రపంచ భాషలకు శాస్త్రీయమయిన విభజన జరిగిందని చెప్పలేం. కొన్ని అమెరికన్-ఇండియన్ భాషలు, ఆఫ్రికాలోని నీగ్రోల భాషలు, ఆస్ట్రేలియాలో ఉన్న కొన్ని గిరిజనాది భాషలు - ఇప్పటికీ శాస్త్రీయ విభజనకు నోచుకోలేదు. ఇప్పటికి యూరప్ లోని భాషలు, ఆసియా ఖండంలోని భాషలు, మధ్యధరా ప్రాంత భాషలు మాత్రమే శాస్త్రీయ విధానానికి పాల్పడి తృప్తికరమయిన పరిశోధనకు లొంగ గలిగాయి.

అయితే కొంత మంది భాషా శాస్త్రవేత్తలు ప్రపంచంలో ఉన్న భాషలన్నీ ఒకే మౌలిక రూపానికి చెందినట్లుగా నిరూపించడానికి ప్రయత్నం చేశారు. 'ఎస్ పెరాన్‌చో' అనే ఒక ప్రపంచ భాషను తయారు చేయడానికి ఒక ప్రయత్నం కూడా జరిగింది. కాని ఆ ప్రయత్నాలు ఫలవంతం కాలేదు. అంతే కాదు, ప్రపంచంలో ఉన్న అన్ని భాషలు ఒకే మూల భాష నుంచి ఉత్పన్నమయ్యాయని నిరూపించి చెప్పడం కుదరదు కూడా. మొదట్లో కొంత మంది భాషా శాస్త్రవేత్తలు అన్ని భాషలూ ఒకే మూల భాష నుంచి పుట్టాయని అభిప్రాయపడినా పరిశోధన వృద్ధి చెందిన కొద్దీ ఈ అభిప్రాయాన్ని ఉదాహరణలతో నిరూపించడం సాధ్యం కాదని స్పష్టమయింది.

అయిన భాషల విషయంలో ఈ పరిశోధనల వల్ల లాభమే జరిగింది. జరిగిన శాస్త్రీయ పరిశోధనల వల్ల ప్రపంచంలోని భాషలను భాషా శాస్త్రజ్ఞులు మూడు విధాలుగా విభజించారు.

1. భౌగోళిక వర్గీకరణ (genetic classification)
2. పదాంశ లేదా రూపాశ్రిత లేదా నిర్మాణాశ్రిత లేదా లక్షణాత్మక విభజన ( Morphological or typoligical classification)
3. జన్యాత్మక లేదా జన్మాత్మక లేదా జాత్యాశ్రిత లేదా వంశానుగుణ వర్గీకరణ (Geneological or genetic classification)

వీటి గురించి వివరంగా తెలుసుకుందాం.

## 4.2 భౌగోళిక వర్గీకరణ:

ప్రపంచ పటాన్ని దృష్టిలో ఉంచుకొని ఒక్కో ఖండంలో ఉన్న భాషల్ని ఒక్కో వర్గం కింద వేరు చేశారు. ఈ విభజనలో భాషలకు సంబంధించిన జాతికి గానీ, నిర్మాణానికి గానీ ప్రాధాన్యం ఉండదు. కేవలం ఆయా భాషల భౌగోళిక స్థితికి మాత్రమే ఇక్కడ ప్రాముఖ్యం ఉంటుంది. దీనిని బట్టి ప్రపంచంలో ఉన్న భాషలను అయిదు విభాగాలుగా విభజించారు.

(ఎ). అమెరికా ఖండభాషలు
(బి). ఆఫ్రికా ఖండభాషలు
(సి). యూరప్ ఖండభాషలు
(డి). ఆసియా ఖండభాషలు
(ఇ). ఆస్ట్రేలియా ఖండభాషలు

భాషల గురించి తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగిన తొలి రోజుల్లో జిజ్ఞాసువులయిన కొంత మంది చేసిన విభాగమిది. అయితే ఒక్క ఖండంలో జన్యాత్మక, లక్షణాత్మక విభాగాలకు చెందిన భాషలు ఉండటాన్ని తదనంతర పరిశోధకులు గ్రహించారు.

ఉదాహరణకు భారతదేశంలో ఉన్న భాషలన్నీ ఆసియా ఖండ విభాగానికి చెందుతాయి. అయితే ఇక్కడ ఇండో యూరోపియన్‌కు చెందిన భాషలూ, ద్రావిడ భాషలూ పరస్పరం విరుద్ధ భాషలయినా అధిక సంఖ్యాకులు మాట్లాడతారు. అంతేకాక చైనా-టిబెట్‌కు సంబంధించిన భాషలూ, ఆస్ట్రో-ఆసియాకు చెందిన భాషలు కూడా ఉన్నాయి.

ఇండో-యూరోపియన్ కుటుంబంలో ఉపకుటుంబానికి చెందిన హిందార్య భాషా వర్గానికి చెందిన భాషే సంస్కృతం. దాని నుంచి ప్రాకృతాలు, వాటి నుంచి ఉత్తర హిందూస్థానీ భాషలు ఉత్తర భారతదేశమంతా వాడుకలో ఉన్నాయి.

ఇక దక్షిణ భారతదేశమంతా ద్రావిడ భాషలున్నాయి. ఇవి మొత్తం 25కు పయిగా ఉండటమేగాక ఉత్తర ద్రావిడ భాషలు, దక్షిణ ద్రావిడ భాషలు, మధ్య ద్రావిడ భాషలని ప్రధానంగా మూడు ఉప కుటుంబాలుగా వాడుకలో ఉన్నాయి.

ఏది ఏమయినా భాషా కుటుంబ వర్గీకరణకు సంబంధించినంత వరకు భౌగోళిక వర్గీకరణం అంత శాస్త్రీయమయిన వర్గీకరణ అనిపించుకోదు.

## 4.3 పదాంశ/రూపాంశ్రిత/నిర్మాణాశ్రిత/లక్షణాత్మక విభజన (Morphological or Typological Classification):

పదాల పుట్టుకను బట్టి కాకుండా పద నిర్మితిని, వ్యాకరణాంశాల్ని, వివిధ పదాంశ స్వభావాన్ని బట్టి భాషల్ని విభజించే పద్ధతిని పదాంశ విభజన లేదా రూపాశ్రిత విభజన లేదా నిర్మాణాత్మక విభజన లేదా లక్షణాత్మక విభజన అంటారు.

భౌగోళిక విభజన కంటె ఇది శాస్త్రీయమయినదని భావిస్తారు. చారిత్రక భాషా శాస్త్రం అభివృద్ధి అయ్యే కొద్దీ ఈ విభజనకు అధిక ప్రాధాన్యం వచ్చింది.

ఆగస్ట్ వాన్ ష్లెగెల్ (August Von Schlegal) క్రీ.శ. 1818లో ఈ లక్షణాత్మక విభజనను ప్రతిపాదించాడు. ఈయన ప్రపంచంలో ఉన్న భాషలన్నింటిని వాటి లక్షణాలను ఆధారం చేసుకొని రెండు విధాలుగా వర్గీకరించాడు.

1. విశ్లేషణాత్మక లేదా ప్రత్యయరహిత భాషలు (Root languages)
2. సంశ్లేషణాత్మక భాషలు, ప్రత్యయాత్మక భాషలు (Inflectional languages)
3. సంయోజనాత్మక/వికరణాత్మక భాషలు (Agglutinative or affixing languages)

**(ఎ). విశ్లేషణాత్మక/ప్రత్యయరహిత భాషలు:** చైనీస్, అన్నమీస్ లాంటి ప్రత్యయరహిత భాషలు.

**(బి). సంశ్లేషణాత్మక భాషలు:** లాటిన్, సంస్కృతం లాంటి ధాతువులు మార్పు చెందే సంస్కృతం లాంటి భాషలు.

**(సి). సంయోజనాత్మక లేదా వికరణాత్మక భాషలు:** టర్కిష్, స్వాహిత్, ద్రావిడ భాషల వంటివి.

పైన పేర్కొన్న విభజన కూడా సరికాదని ఫ్రాంజ్ బాప్ ప్రపంచ భాషల్ని మరో మూడు విధాలుగా విభాగించాడు.

1. ధాతువులు మాత్రమే ఉండి, ధాతుప్రత్యయ సంయోగం లేని చైనీస్ వంటి భాషలు. ఈ భాషల్లో వాక్యంలోని పదాల సంబంధం వాటి ఉనికి పైనే ఆధారపడి ఉంటుంది.
2. ఏకాచ్క ధాతువులు కలిగి, వ్యాకరణ నిర్మాణం అంతా ధాతు ప్రత్యయ సంయోగం మీదనే ఆధారపడ్డ భాషలు.
3. ద్వ్యచ్క ధాతువులు కలిగి ప్రతిపదంలో మూడు హల్లులు కలిగి ఉన్న సెమెటిక్ భాషలు.

అయితే తరువాత కాలంలో లాటిన్, గ్రీకు, సంస్కృతాల కంటె ఇంకా క్లిష్టతరమయిన నిర్మాణం ఉన్న కొన్ని అమెరికన్-ఇండియన్ భాషలు వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి భాషల్ని అతి సంశ్లేషణాత్మక భాషలు (Polysynthetic Languages) అన్నారు. ఈ విభాగం ఒక భాష సాధారణ లక్షణాన్ని సూచించినా ఇది నిర్దుష్టం కాదు. ఒకే భాష కొన్ని సందర్భాలలో ప్రత్యయరహితంగానూ, మరి కొన్ని సందర్భాలలో ప్రత్యయ సహితంగానూ ఉండవచ్చు. చైనీస్‌లో తక్కువ సంఖ్యలోనే అయినా కొన్ని ప్రత్యయాలు లేకపోలేదు. అదే విధంగా వికరణాత్మక భాషలలో కొన్ని పద నిర్మాణాలు మిగిలిన వాటి కంటె క్లిష్టతరంగా ఉంటాయి. కొందరు పండితులు సంశ్లేషణాత్మక భాషలే మానవ భాష ఉచ్చ స్థితికి చెందినవని అపోహపడ్డారు. వీటన్నింటి గురించి క్రమంగా తెలుసుకుందాం.

### (ఎ). విశ్లేషణాత్మక/ప్రత్యయరహిత భాషలు:

1. విశ్లేషణాత్మక భాషల్లో భావ ప్రకటన అచ్చంగా వికారం పొందని శబ్దాలచేతనే జరుగుతుంది. ఆ శబ్దాలు ఏ విధమయిన వ్యాకరణ కార్యాలకూ లోనుగావు. అంటే ఈ భాషల్లో శబ్ద విభాగం (Parts of Speach) నామాలు, క్రియలు, ఇశేషణాలు అనేవి ఉండవు.

2. ఈ భాషలు అధికంగా ఏకాచ్కాలయిన ధాతువుల్ని కలిగి ఉంటాయి. ఇవి అపరివర్తనాలు. ఈ ధాతువులు భిన్న స్వరాలతో ఉచ్చరించబడతాయి.

3. సమస్వరంగా (level tone) ఉచ్చరిస్తే, ఒక అర్థం, ఉదాత్తంగా (Rising tone) ఉచ్చరిస్తే ఇంకో అర్థం, అనుదాత్తంగా అంటే ఆరోహణంగా (Eipping tone) ఉచ్చరిస్తే వేరొక అర్థం, నీచంగా (Falling tone) ఉచ్చరిస్తే అన్యార్థం వస్తుంది. ఎలాంటి స్వరం

లేకుండా పలికితే అన్నిటి కంటే భిన్నార్థం వస్తుంది.

ఉచ్చారణ స్వర సంఖ్యలో భేదం ఈ వర్గానికి చెందిన భాషల్లో వేరు వేరుగా ఉండవచ్చు. ఒక భాషలోని మాండలికాల్లోనూ భేదాలుండవచ్చు. కంటోనీస్, చైనీస్, సయామీస్ భాషలలో ఆరు రకాల స్వర భేదాలున్నాయి. బర్మీస్ భాషలో రెండు రకాల స్వర భేదాలున్నాయి.

సినో-టిబెటన్ భాషా కుటుంబంలోని భాషలు విశ్లేషణాత్మక భాషలు. ఇంచుమించుగా 500 నుంచి 700 వరకు అసంఖ్యాకంగా ఉన్న ఆఫ్రికన్ భాషలు ఈ వర్గంలోనివి.

పద క్రమమే ఈ భాషలకు వ్యాకరణం (Word order in the grammar)

ఉదా - వో చిన్ చిహ్

నేను చూడు ఆమె (నేను ఆమెను చూశాను)

చిహ్ చిన్ వో

ఆమె చూడు నేను (ఆమె నన్ను చూసింది)

వాంగ్ పో మిన్

రాజు రక్షించు ప్రజలు (రాజు ప్రజల్ని రక్షిస్తాడు)

మిన్ పో వాంగ్

ప్రజలు రక్షించు రాజు (ప్రజలు రాజును రక్షిస్తారు)

ప్రత్యయాత్మక భాష అయిన ఆంగ్లంలోనూ ఈ విశ్లేషణాత్మక భాషా లక్షణాలు అక్కడక్కడా కనిపిస్తాయి.

I Love Fish

Fish I Love

సంయోజనాత్మక భాష అయిన తెలుగులో కూడా ఇలాంటి లక్షణాన్ని చూడవచ్చు.

గాలి వీచెను చల్లగా

వీచెను చల్లగా గాలి

చల్లగా వీచెను గాలి

గాలి చల్లగా వీచెను

చల్లగా గాలి వీచెను

వీచెను గాలి చల్లగా

ఈ విధంగా ఒక వర్గానికి చెందిన భాషా లక్షణాలు అన్యవర్గానికి చెందిన భాషల్లోనూ కనిపిస్తుండటం చేత ఈ విభాగం పూర్తిగా నిర్దుష్టమయినది కాదంటారు.

## (బి). సంయోజనాత్మక భాషలు:

వేరు వేరు అర్థాలున్న వివిధ శబ్దాలు (ప్రకృతులు, అనుబంధాలు, ప్రత్యయాదులు) గొలుసు కొక్కాల వలె, రైలు పెట్టెల వలె ఒక దానికొకటి చేరి ప్రత్యేక అర్థాన్నిస్తాయి. వీటినే సంయోజనాత్మక భాషలంటారు.

ప్రకృతికి చేరే ప్రత్యయాల్ని బట్టి (Affixes) ఈ వర్గంలోని భాషల్ని మూడు విధాలుగా విభజించవచ్చు.

1. పరానుబంధ సంయోజనాత్మక భాషలు (Suffix Agglutinative languages)-

ద్రావిడ భాషలు: తెలుగు - పెర్

పెర్ + ఉ

పెరు + గు

పెరుగు + చు

పెరుగుచు + ఉన్న

పెరుగుచున్న + అది

పెరుగుచున్నది

టర్కిష్ - Oda (గది)

Odalar (గదులు)

Odadan (గది నుంచి)

Odalardan (గదుల నుంచి)

యూరప్ - ఆల్టాయిక్ భాషలు, జపనీస్ భాషలు, బాస్క్ భాషలు ఈ వర్గానికి చెందినవి.

2. పూర్వానుబంధ సంయోజనాత్మక భాషలు (nPrefix agglutinative languages) - ధాతువుకి పూర్వం ప్రత్యయాన్ని చేర్చటం. దక్షిణాఫ్రికాలోని బంటూ కుంటుంబానికి చెందిన భాషలో

గండ (ప్రజలు)

లుగండ (భాష)

బగండ (జాతి)

ఉగండ (దేశం)

సంస్కృతం- వి + హార - విహార

సం + హార - సంహార

పరి + హార - పరిహార

ఉప + హార - ఉపహార

3. అంతరానుబంధ సంయోజనాత్మక భాషలు (Infix agglutinative languages) - ధాతువుల మధ్యలో ప్రత్యయాలు చేరే భాషలు.

సంతాలి - దల్ (కొట్టు)

దపల్ (కొట్టించు)

అరబ్బీ - క్త్బ్ (రాయటం)

కితబ్ (పుస్తకం)

ల్స్న్ (వాలుక)

లిసన్ (భాష)

నేర్ (దర్శించు)

నజర్ (చూపు)

నజిర్ (పర్యవేక్షకుడు)

నజరానా (బహుమతి)

ప్రకృతి ప్రత్యయాల్ని వేరు చేయటానికి వీలుగా సంయోజనాత్మక భాషా రూపాలుంటాయి. ప్రత్యయాత్మక భాషలో ఆ రీతిగా సులభంగా విభజించలేం.

| ఉదా - | **టర్కిష్** | **లాటిన్** |
|---|---|---|
| ప్రథమావిభక్తి | సు | ఆక్వ |
| షష్ఠి | సు-నుమ్ | ఆక్వే |
| ద్వితీయ | సు-యు | ఆక్వమ్ |

పంచమి సు-దన్ ఆక్వా

లాటిన్ భాషలో పంచమి, షష్ఠీ విభక్తుల్లో ప్రత్యయాలు బాగా సంసక్తమయ్యాయి. ప్రకృతులతో, చారిత్రక పరిజ్ఞానంతో కాని వాటిని వేరు చేయటానికి వీలుపడదు. అందుచేతే 19వ శ॥ భాషావేత్తలు ప్రత్యయాత్మక దశ సంయోజనాత్మక దశ నుంచి పరిణమించిందని భావించారు. సంయోజనాత్మక భాషా గత వాక్యాలలోని పదాలు వ్యాకరణ కార్యాలకు లోనవుతాయి.

ఉదా - రాముడు ఇంటికి వెళ్ళాడు.

కృష్ణుడు రాముడింటికి వెళ్ళాడు.

రాముడు రావణుణ్ణి చంపాడు.

సంశ్లేష, విశ్లేషణాత్మక భాషల కంటే సంయోజనాత్మక భాషలే అధిక సంఖ్యలో ఉన్నాయి. ప్రస్తుతం నశించిన ప్రాచీన సుమేరియన్ సాహిత్య భాష, ఏలమయిట్ భాష, యూరల్ - ఆల్టాయిక్ భాష, కకేషియన్ భాష ద్రావిడ భాషలు- ఈ వర్గానికి చెందినవి.

ఫసిఫిక్ భాషలైన పాపస్ మొదలయినవి, ఆస్ట్రేలియన్ భాషలు, సుడనీస్, హెట్టన్‌టొ - బుష్‌మన్ మొదలయిన ఆఫ్రికన్ భాషలు, అమెరికన్ భాషలు, బాస్క్ భాషా కుటుంబానికి చెందిన భాషలు కూడా సంయోజనాత్మక భాషా విభాగానికి చెందినవే.

ఈ భాషలలోని ప్రత్యయాలు చాలా వరకు విజ్ఞాత చరిత్ర కలవే.

## (సి). సంశ్లేషణాత్మక లేదా ప్రత్యయాత్మక భాషలు:

ఈ భాషలలో పదాలు పని చేసే తీరును వ్యాకరణ శాస్త్రం వివరిస్తుంది. పదాలు పని చేసే తీరు వాటి మీద చేరే ప్రత్యాయాల పై ఆధారపడి ఉంటుంది. ప్రత్యయమంటే (affix), పూర్వ ప్రత్యయమంటే (Prefix), అంతర్ ప్రత్యయమంటే (Infix) అంత ప్రత్యయం అంటే (Suffix) అని అర్థం.

ప్రత్యయాలు చేరేటప్పుడు అంతరంగికమయిన సంధి మార్పులు (Internal Changes) జరగవచ్చు. నామాలకు విభక్తులు చేరేటప్పుడు కలిగే మార్పుల్ని నామ వికరణమని (declension), ధాతువులకు క్రియా విభక్తులు చేరేటప్పుడు కలిగే మార్పుల్ని ధాతు వికరణమని (Conjugation) అంటారు.

ఈ భాషలలోని ప్రత్యయాలు చాలా వరకు అవిజ్ఞాత చరిత్ర కలవి.

ఈ భాషలలోని ధాతువులు నిర్మాణాన్ని బట్టి రెండు విధాలు.

**1. ఉద్వర్తన క్షమాలు:** మార్పుకు లోనయ్యే ధాతువులున్న సంస్కృతాది భాషలు.

బుధ్ - బోధ్

గమ్ - గచ్ఛ మొ॥వి.

**2. అంతర్విపరిణామ ధాతు భాషలు (Intermutative languages):**

ఇవి హల్ ప్రధానమయిన భాషలు. ఉదాహరణకు అరబ్బీ, హిబ్రూ మొ॥న భాషలు.

ల్స్న్ - నాలుక

లిసన్ - భాష

లసన్ - అభిభాషకుడు

లిసనియత్ - భాషాశాస్త్రం

వ్యవహారంలో తెలుగు సంయోజనాత్మక దశ నుంచి ప్రత్యయాత్మక దశలోకి వచ్చినట్లుగా కనిపిస్తుంది.

వచ్చుచున్నవాడు - వచ్చుచున్నాడు - వస్తున్నాడు

చేయవలయును - చేయాలి

తిననిమ్ము - తిననీ మొ॥వి.

ప్రత్యయాత్మక భాషల సంఖ్య, సంయోజనాత్మక భాషల సంఖ్య కంటె చాలా తక్కువ. కాని ఇండో-యూరోపియన్ భాషలు, సెమెటిక్ భాషలు ఈ వర్గానికి చెందినవే.

కాని అనేక ప్రత్యయాత్మక భాషలలో విశ్లేష, సంయోజనాత్మక లక్షణాలు కనిపిస్తుండటం చేత ఈ విభజనలో కొంత అస్పష్టత చోటు చేసుకొంది.

## (డి) అతి సంశ్లేషణాత్మక భాషలు (Poly - Synthetic Languages):

వాక్యంలోని అనేక పదాలు ఒకే పదంగా కలిసిపోవటం లేదా కుదించుకుపోవటం. అమెరికాలో రెడ్ ఇండియన్లు మాట్లాడే భాషలు ఈ కోవలోకి వస్తాయి.

ఒనీదా (Oneida) = నేను గ్రామం కోసం చూస్తున్నాను.

మాంటిజూమా (Montezuma) = నాయకుడు ఆగ్రహిస్తే స్వర్గానికి పోయేటట్లు కాలుస్తాడు మొ॥వి.

ఫింక్ (Finck) అనే భాషావేత్త ప్రపంచంలోని భాషల్ని ఈ విభజనలో 8 వాధాలుగా విభాగించాడు. అయితే ఇది అంత ప్రాచుర్యం కాలేదు. అవి:

1. ధాతు విశ్లేషణాత్మకాలు (root-isolating) - చైనీస్
2. ప్రాతిపదిక విశ్లేషణాత్మకాలు (Stem-isolating) - సమోన్
3. ధాతు సంశ్లేషణాత్మకాలు (root-inflected) - అరబిక్
4. ప్రాతిపదిక సంశ్లేషణాత్మకాలు (stem-inflected) - గ్రీకు
5. సమూహ సంశ్లేషణాత్మకాలు (group-inflected) - జార్జియన్
6. పర్యా వర్తి సంయోగాత్మకాలు (juxtaposing agglutinative) - సుబియా
7. సంయోజనాత్మకాలు (agglutinative) - టర్కిష్
8. అతి సంషేశణాత్మకాలు (poly-synthetic) - ఎస్కిమో

మరి కొంత మంది భాషలలోని ధ్వనులను బట్టి భాషా విభజనను చేశారు. దీనిని 'ధ్వని సంబంధ విభజన' అన్నారు. (Phonological Classification) ఇవి:

1. త్రిస్వర భాషలు: అరబిక్ మొ॥వి

| | | |
|---|---|---|
| ఇ | ఉ | |
| | | అ |

2. పంచ స్వర భాషలు : తెలుగు మొ॥వి

| | | |
|---|---|---|
| ఇ | ఉ | |
| ఎ | ఒ | |
| | అ | |

3. సప్త స్వర భాషలు : ఆధునిక లాటిన్ మొ॥వి

| | | |
|---|---|---|
| ఇ | ఉ | |
| | ఎ | ఒ |
| | <u>ఎ</u> | <u>ఒ</u> |
| | అ | |

మొత్తం మీద భాషావిభజనని మూడు స్థాయిల్లో చేయవచ్చు.

(i) ధ్వని సంబంధి విభజనం ( ponological classification)

(ii) పదాంశ సంబంధి విభజనం (morphological classification)

(iii) వాక్యసంబంధి విభజనం (syntactical classification)

పై మూడు స్థానాలలోనూ పదాంశ సంబంధి విభజన మేలయినదనేది లేమన్ అనే భాషా శాస్త్రవేత్త అభిప్రాయము. (of the three linguistic levels, for which classification has been attempted, that for the morphological level is clearly the most successful -- " Lehmann" Historical linguistics - An introduction, P - 60)

## 4.4 పదాంశ విభజనలోని లోపాలు :

1. ఇది పాత విభజన. ఎందుకంటే ఇప్పుడు విశ్లేషణాత్మక భాషగా పరిగణించిన చైనీస్ భాష ఒకప్పుడు సంయోజనాత్మక భాషగా ఉన్నట్లు తెలుస్తుంది.
2. చైనీస్ భాష కేవలం ఏ కాచ్కం కాదు. ఇందులో ద్వ్యచ్క శబ్దాలతో కూడిన సమాసాలు ఉన్నాయి.
3. సినో-టిబెటన్ కుటుంబానికి సంబంధించిన అనేక భాషలు పాక్షికంగా సంయోజనాత్మక భాషలు, పాక్షికంగా విశ్లేషణాత్మకాలు కూడ.
4. ఇండో - యూరోపియన్ కుటుంబానికి చెందిన అనేక భాషలు ప్రత్యయాత్మక స్థితి లేక సంశ్లేషణాత్మక స్థితి నుంచి విశ్లేషణాత్మకతను అధిగమిస్తున్నాయి. ఆంగ్ల భాష ఈ విషయంలో ముందున్నది.
   ఉదా : , We love fish, drive slow.
5. ప్రత్యయాత్మకమయిన ఆంగ్ల భాషలో సంయోజనాత్మకత ఉండటం విశేషం.
6. ఒకే భాష సంయోజనాత్మకానికీ, ప్రత్యయాత్మకానికీ కూడా ఉదాహరణగా నిలబడుతుంది. లేదా ప్రత్యయాత్మకం అతి సంశ్లేషణాత్మకం అవుతోంది. లేదా అతి సంశ్లేషణాత్మకం విశ్లేషణాత్మకం అవుతోందని సఫిర్ అనే భాషవేత్త అభిప్రాయపడ్డాడు. అంటే కచ్చితమయిన నియతి లేదని స్పష్టమవుతుంది.
7. ప్రత్యయాత్మకమయిన సంస్కృత భాషలో వ్యతిరేకార్థం స్వతంత్ర పదం చేత అభివ్యక్తం అవుతుంది. అంటే సంయోజనస్థితి అన్నమాట. సంయోజనాత్మకాలయిన తెలుగు మొదలయిన ద్రావిడ భాషల్లో అంతఃప్రత్యయంతో ఈ అర్థం వస్తుంది. అంటే ప్రత్యయాత్మకతను అందుకొంటుందని అర్థం.

| ఉదా : | | | |
|---|---|---|---|
| | సంస్కృతం | నశోచతి, | నకాంక్షతో |
| | తెలుగు | శోకించడు | కాంక్షించడు |

8. విశ్లేషణ, సంశ్లేషణ, అతిసంశ్లేషణ - మొదలయిన పదాలు భాషల్లోని పరిణామ తరంగాల్ని (drifts) సూచించేవే కాని, ఒకానొక నిర్దిష్టస్థితిని తెలపవని సఫీర్ అభిప్రాయపడ్డాడు.
9. ఏదయినా భాష బాగా మార్పుచెంది చెంది విశ్లేషణ స్థితినయినా అందుకోవచ్చు. లేదా ఘనీభవించి విశ్లేషణాత్మక స్థితి నుంచి అతి సంశ్లేషణాత్మక స్థితిని అందుకోవచ్చునని సఫీర్ భావించాడు.
10. farmer, goodness, thicker - thickest, books - booking మొదలయిన ఆంగ్ల పదాలలో సంయోజనాత్మక లక్షణాన్నే చూడవచ్చు. -er, -ness, -est, -s, -ing మొదలయిన పదాంశాల్ని సులభంగా విడదీయవచ్చు. కాని man - men, deep - depth మొదలయిన వాటిలో పై రీతిగా పదాంశాల్ని విడగొట్టడం సాధ్యం కాదు. మొదట పేర్కొన్న వాటిలో ప్రత్యయాలు అంతాగమాలు. man - men మొదలయిన వాటిలో ప్రత్యయాలు సమవాక్యాన్ని పొందాయి. ఇలాంటి ఉదాహరణలలోనే సంశ్లేషణాత్మక ఆంగ్లభాష అంటే సరిపోతుంది.

ఈ రకంగా మొత్తం మీద కొన్ని దోషాలున్నా, భాషల్ని పరిశీలించటానికి భాషా శాస్త్రంలో ఈ పరిగణన అనివార్యమయింది.

**సమీక్ష:-** భాషా వర్గీకరణను, అందులోని భౌగోళిక, పదాంశా, గుణ వర్గీకరణ, దాని లోపాలను సమీక్షించారు.

## ప్రశ్నలు

1. ప్రపంచ భాషా వర్గీకరణను తెల్పి, అందు భౌగోళిక వర్గీకరణను గూర్చి రాయండి.
2. పదాంశాను గుణ వర్గీకరణను గూర్చి సవిస్తరంగా రాయండి.

## ఆధారగ్రంథ పట్టిక


1. Bloomfield, Leonard 1933, Language. NewYork : Holt
2. Lehmann Winfred P. 1962 Historical Linguistics : An Introduction NewYork : Holt
3. సుబ్రహ్మణ్యం పి.ఎస్. 1984, ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము, పబ్లిక్‌గార్డెన్స్, హైదరాబాద్ - 4.
4. సుబ్రహ్మణ్యం పి.ఎస్. 1984, ద్రావిడ భాషలు 1977 పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పబ్లిక్‌గార్డెన్స్, హైదరాబాద్-4.

# పాఠం - 5 వంశానుగుణ లేదా జన్మాత్మక వర్గీకరణ

## పాఠ్యాంశ నిర్మాణ క్రమం

5.1 నిర్వచనం - కుటుంబ విభజన

5.1 (ఎ) ఇండోయూరోపియన్ భాషా కుటుంబం

(బి) ఫిన్నో-ఉగ్రిక్ భాషాకుటుంబం

(సి) యూరల్- ఆల్టాయిక్ భాషాకుటుంబం

(డి) బాస్క్ భాషాకుటుంబం

(ఇ) ఆఫ్రో-ఏషియాటిక్ భాషాకుటుంబం

(ఎఫ్) జపనీస్ భాషాకుటుంబం

(జి) సినో-టిబెటిన్ భాషాకుటుంబం

(హెచ్) మలయో-పోలినేషియన్ భాషాకుటుంబం

(ఐ) ఆస్ట్రో-ఏషియాటికే భాషాకుటుంబం

(జె) ద్రావిడ భాషాకుటుంబం

**లక్ష్యం:-** వంశానుగుణ వర్గీకరణమంటే ఏమిటో, అందలి భాషా కుటుంబాలేమిటో, వివరంగా తెలుసుకుంటారు.

## 5.1 నిర్వచనం - కుటుంబ విభజన

రెండు లేదా అంతకంటే ఎక్కువ భాషలను పోల్చి చూసి వాటి జన్య జనక భావ సంబంధాన్ని కాని, సోదర భావ సంబంధాన్ని గాని నిర్ణయించవచ్చు. రెండు లేదా అంతకంటే ఎక్కువ భాషలను పోల్చినప్పుడు ఆ భాషలలో వర్ణ, అర్థ సాదృశ్యం ఉన్న శబ్దాలు ఎక్కువగా ఉంటే దానికి గల ముఖ్య కారణం జన్మ సంబంధమని చెప్పవచ్చు. ఇలా జన్మ సంబంధం ఉన్న భాషలను ఒక కుటుంబంగా వర్గీకరిస్తే దానిని జన్మాత్మక వర్గీకరణ అంటారు. ఇలా ఒకే విధంగా ఉండటానికి జన్యువులు (genes) కారణం కాబట్టి కొంత మంది దీనిని జన్యాత్మక వర్గీకరణ అన్నారు. ఒక వంశం నుంచి ఉద్భవిస్తాయి కాబట్టి కొంత మంది వంశానుగుణ వర్గీకరణ అన్నారు.

రెండు లేదా అంత కంటె ఎక్కువ భా,లను తులనాత్మకంగా పరిశీలించినప్పుడు ఆ భాషలలోని సర్వనామాలను, సంఖ్యా వాచకాలను, సంబంధ బోధక పదాలను, ధాతు రూపాలను, వ్యాకరణాంశాలను తులనాత్మకంగా పరిశీలించాలి.

ఈ విషయాన్నే లేమన్ "The evidence may be found at all levels of these languages. Most apparentis similarity of basic vocabulary; words for lower numerals, kinship, domestic animals, everyday activities. But even more convincing are the similarities one can find in various systems of the grammar" (Historical linguisticsP.17)

| సంస్కృతం | లాటిన్ | గ్రీకు | స్లొవిక్ | తెలుగు |
|---|---|---|---|---|
| ద్వి (ద్వా) | దుఒ | దుఒ | దువ | రెండు |
| దశ | దెసెమ్ | దెశ | దెశెతి | పది |

పయిన పేర్కొన్న పదాల పరిశీలన వల్ల సంస్కృతం, లాటిన్, స్లొవిక్, గ్రీకు పదాలన్నీ ఒకే భాషా కుటుంబానికి చెందినవనీ, ఈ భాషలతో తెలుగుకు సంబంధం లేదనీ తెలుస్తోంది.

యుష్మ దర్థక ఏకవచనం

| తమిళం | తెలుగు | కువి | బ్రాహూఈ | హిందీ |
|---|---|---|---|---|
| నీ | నీవు/ఈవు | నీను | నీ | తుమ్ |

ఈ యుష్మదర్థక ఏకవచన పరిశీలన చెయ్యడం వల్ల తమిళం, తెలుగు, కువి, బ్రాహూఈ భాషలు ఒకే భాషా కుటుంబానికి చెందినవీ హిందీకి ఈ భాషలతో సంబంధం లేదనీ స్పష్టమవుతుంది.

ఇంతకు ముందు భాషలలో వర్ణాలలోనూ, అర్థంలోనూ సాదృశ్యం ఉన్న శబ్దాలు ఎక్కువగా ఉంటే దానికి జన్మ సంబంధం ఉందని భావించవచ్చని చెప్పుకొన్నాం. అయితే ఇలాంటి సాదృశ్యం ఒక్కొక్కప్పుడు జన్య సంబంధం లేకపోయినా ఎరవు తెచ్చుకోవడం, ధ్వన్యనుకరణ, యాదృచ్ఛికత మొదలయిన వాటి వల్ల కూడా కలగవచ్చు. అయితే ఇలాంటివి ఎప్పుడూ చాలా తక్కువగా ఉంటాయి. సాదృశ్యం వందల వేల పదాలలో గనక కనిపిస్తే ఆ భాషలకు జన్మ సంబంధముందని నిర్ధారించవచ్చు.

వాస్తవానికి ఇలాంటి భాషలు ప్రాచీనకాలంలో ఏక భాషగా ఉండేదని నిర్ణయించవచ్చు. కాలక్రమంలో ఆ భాష అనేక కారణాల వల్ల విస్తరించిన కొద్దీ మాండలికాలుగా చీలి తదనంతరం ప్రత్యేక భాషలుగా రూపుదిద్దుకొంటాయి. ఇలా రూపు దిద్దుకున్న వాటిని సోదర భాషలు (Sister Languages), దుహితృ భాషలు (Daughter Languages) అని అంటారు. ఇలాంటి సోదర భాషలన్నింటిని కలిపి భాషా కుటుంబం అంటారు.

18వ శతాబ్ది ఉత్తరార్థం వరకు బైబిల్‌కు మూల భాష అయిన హిబ్రూ భాషే ప్రపంచ భాష లన్నింటికి మూలమయినదిగా పరిగణించబడింది. క్రీ.శ. 1767లో ఫ్రెంచి (Pere Gaston Laurent Coeurdonx) సంస్కృతానికీ, యూరోపియన్ భాషలకి కొన్ని పోలికలున్నట్లుగా గుర్తించాడు. ఆ తరువాత రెండు దశాబ్దాలకు అంటే 1786లో సర్ విలియం జోన్స్ జాతి విభజన పద్ధతికి పునాది వేశాడు. దీనితో 19వ శతాబ్దిలో తులనాత్మక లిఖిత భాషా పరిశీలనం (Philology) అభివృద్ధిగాంచటం మొదలుపెట్టింది. ఈ తులనాత్మక పద్ధతి వల్ల భాషా కుటుంబాల మౌలిక భాషల్ని (Original or primirtive languages) పునర్నిర్మాణం (reconstruction) గావించే ప్రయత్నాలు ఎక్కువయ్యాయి.

ఒకే కుటుంబాలలో భాషల కంటే, ఉప కుటుంబాలలోని భాషలకు అత్యంత సన్నిహితత్వం ఉంటుంది. అంతకంటే ఒక శాఖకు, అంత కన్నా ఉప శాఖకు చెందిన భాషల్లో అత్యంతాతిశయ సన్నిహితత్వం ఉంటుందని శాస్త్రజ్ఞులు నిర్ణయిస్తూ వచ్చారు. అయితే ఈ కృషి అనుకున్నంత సులువుగా నెరవేర లేదు. అనేక తీవ్ర వాదోపవాదాలు చెలరేగాయి. పరిష్కృతమయినట్లును కొన్ని కొన్ని సమస్యలు తిరిగి తలెత్తాయి. ఉదాహరణకు ద్రావిడ భాషలు సిథియన్ భాషా కుటుంబానికి చెందినట్లు కాల్డ్వెల్ చేసిన ప్రతిపాదనని కొందరు ఖండించారు. స్టెన్‌కొనో దానిని పునరుద్ధరించాడు.

జన్మాత్మక వర్గీకరణలో పరిగణించవలసిన అంశాలు:

1. భౌగోళిక సన్నిహితత్వం (Geographical Affinity) చాలా వరకు సజాతీయ భాషలు భౌగోళికంగా సన్నిహితంగానే ఉంటాయి. అయితే అలా సన్నిహితం కానంత మాత్రాన, సజాతీయ భాషలు కావనటం పొరపాటు. ఇందుకు పాకిస్తాన్‌లో ఉన్న బ్రాహూఈ, ఉత్తర భారతావనిలో ఉన్న కురుఖ్, మాల్తో భాషల్ని తీసుకోవచ్చు.

2. నిత్య వ్యవహారోపయోగ పదజాలం, శబ్దార్థ సామ్యాన్ని కలిగి ఉండాలి. ఈ సామ్యం యాదృచ్ఛం కాగూడదు. ఆంగ్లంలోని 'మవుత్' తెలుగులోని మూతి, 'నీట్' - నీటు, 'ప్రావ్'-పాపు వంటి కొన్ని పదాల యాదృచ్ఛికత్వాన్ని బట్టి ఆంగ్లం, తెలుగు భాషలు సజాతీయాలనటం హాస్యాస్పదమవుతుంది. అలాగాక అసంఖ్యాక శబ్ద జాలంలో సామ్యం గోచరించాలి. శరీరావయవ వాచకాల్లో సంబంధ బోధక పదాల్లో, గృహోపకరణ సామాగ్రి పదాల్లో, రంగుల్లో, రుచుల్లో, సర్వనామాల్లో, సంఖ్యా వాచకాదుల్లో శబ్దార్థ సామీప్యం స్పష్టంగా ఉండాలి.

అంతే కాకుండా వర్ణయోజనంలో ధాతు నిర్మాణంలో క్రియా రూపాల్లోనూ, విభక్తి ప్రణాళికలోనూ, లింగ వచనాల్లోనూ, సమాసాల్లోనూ, కృత్తద్ధిత రూపాలలోనూ, వాక్య రచనలోనూ సమానత్వం ఉండాలి.

సమస్త పదాలయిన కొన్ని సమాసాలు సంస్కృతాది ఇతర భాషలలో కనిపిస్తూ వీటి ఏక కుటుంబకతను చాటుతున్నాయి. తులనాత్మక భాషా శాస్త్ర పరిజ్ఞానం వల్ల 19వ శతాబ్దిలో కొన్ని భాషలు ఒక కుటుంబానికి చెంది ఉంటాయని భాషా శాస్త్రజ్ఞులు భావించి భాషల ఏక కుటుంబకతను స్థాపించారు. వీటిలో ప్రధానమయినది ఇండో-యూరోపియన్ భాషా కుటుంబం. ఈ భాషా కుటుంబ స్థాపనకు అవలంబించిన పద్ధతులు మిగిలిన ద్రావిడాది భాషా కుటుంబాల స్థాపనకు విరివిగా దోహదపడ్డాయి. నేటి ఆధునిక ప్రపంచంలో అమెరికా, ఇండియా, రష్యా, ఇంగ్లాండు, ఫ్రాన్స్ దేశాల ప్రాముఖ్యం అందరికీ తెలిసిందే. ఈ దేశాల ప్రధాన భాషలు ఇండో-యూరోపియన్ భాషా కుటుంబానకి చెందినవే. సంస్కృతం, గ్రీకు, లాటిన్ వంటి ప్రాచీన భాషలు కూడా ఈ భాషా కుటుంబానికి చెందినవే. ప్రపంచ భాషలలో ప్రాచీన కాలం నుంచి రికార్డులు అధికంగా ఉన్న భాషా కుటుంబమిదే. భారతదేశంలోనూ, యూరప్ దేశాలలోనూ మాట్లాడే భాషల్ని ఇండో- యూరోపియన్ భాషలని వ్యవహరిస్తున్నారు. భాషా కుటుంబాల్ని మొదట ఏర్పరచినవారు జర్మనీ దేశీయులు. వీళ్ళు మాత్ర్య దేశాభిమానంతో ఇండో-జర్మానిక్ భాషలని పేరు పెట్టారు. ఇండియాలోనూ, జర్మనీలోనూ వ్యవహరించే భాషలని ఈ పద సంపుటికి అర్థం. ఇండో-జర్మానిక్ అనేది అ వ్యాప్తి దోష భూయిష్టమయినది. రాస్మన్ రాస్క్ తులనాత్మక భాషాధ్యయనం చేసి దీనిని జఫెటిక్ భాషా కుటుంబమని వ్యవహరించాడు.

మతాలను నమ్మిన వారు ప్రపంచ భాషల్ని సెమెటిక్, హెమెటిక్, జెఫెటిక్ అని మూడు కుటుంబాలుగా విభజించారు. అయితే ఈ విభజన మత గ్రంథ ఆధారాలను బట్టి చేసింది. కాబట్టి భాషా శాస్త్రజ్ఞులు ఈ లింగ డింపుని అంగీకరించలేదు. లేమన్ "Others, using a teem which the early India and Celtic authors applied to their own people, called the family Aryan. His name is now dispute because of a misuse of it for devious political purpose" - Historical linguistics: An Introduction. P.19 అని అంటాడు.

ప్రపంచంలోని భాషల్ని జన్మాత్మక వర్గీకరణను ఆధారంగా చేసుకొని చేసిన విభజనలో భాషా శాస్త్రవేత్తలలో ఏకాభిప్రాయం లేదు. వీరి అభిప్రాయం అరపకారం 3 నుంచి 40 భాషా కుటుంబాలున్నాయి. అయితే వీటిలో ఒక పది భషా కుటుంబాలు అధిక సంఖ్యాకులు ఆమోదాన్ని పొందాయి. అవి:

ఎ. ఇండో-యూరోపియన్ భాషా కుటుంబం.

బి. ఫిన్నో-ఉగ్రిక్ భాషా కుటుంబం.

సి. యూరల్-ఆల్టాయిక్ భాషా కుటుంబం.

డి. బాస్క్ భాషా కుటుంబం.

ఇ. ఆఫ్రో-ఏషియాటిక్ భాషా కుటుంబం.

ఎఫ్. జపనీస్ భాషా కుటుంబం.

జి. సినో-టిబెటన్ భాషా కుటుంబం.

హెచ్. మలయో-పోలినీషియన్ భాషా కుటుంబం.

ఐ. ఆస్ట్రో-ఏసియాటిక్ భాషా కుటుంబం.

జె. ద్రావిడ భాషా కుటుంబం.

ఈ పది భాషా కుటుంబాలలో వాటి వాటి విశిష్ట లక్షణాలను బట్టి ఎన్నో ఉప కుటుంబాలుంటాయి. ఉపకుటుంబాలలో శాఖలు, శాఖలకు ఉప శాఖలు ఉంటాయి. ఉప శాఖలకు వర్గాలు, వర్గాలకు ఉప వర్గాలు ఉంటాయి. అవి ఈ విధంగా ఉంటాయి.

భాషా కుటుంబం

(Language Family)

1 ఉపకుటుంబం — 2 ఉపకుటుంబం (Sub-Families) — 3 ఉపకుటుంబం

1 శాఖ — 2 శాఖ — 3 శాఖ(Branches)

1 ఉపశాఖ — 2 ఉపశాఖ — 3 ఉపశాఖ (Sub-BRanches)

1 ఉప వర్గం — 2 ఉప వర్గం — 3 ఉప వర్గం (Sub-Groups)

1 భాష — 2 భాష (Languages)

1 మాండలికం — 2 మాండలికం — 3 మాండలికం (Dialects)

ఈ విధంగానే తక్కువ ఉపకుంటుంబాలకు శాఖోపశాఖలుండవు. పయి నుండి కిందకి దిగే కొద్దీ భాషాధఅయయనం సూక్ష్మాతి సూక్ష్మంగా (microscopic) ఉంటుంది. కింది నుంచి పైకి పోయే కొద్దీ స్థూలంగా (macroscopic)గా ఉంటుంది.

ప్రపంచంలోని భాషా కుటుంబాలను గురించి సంగ్రహంగా చర్చిద్దాం.

## ఎ. ఇండో-యూరోపియన్ భాషా కుటుంబం:

ఇందులో ప్రధానంగా 10 ఉపకుటుంబాలున్నాయి. అవి :

1. జర్మానిక్ భాషా ఉపకుటుంబం
2. కెల్టిక్ భాషా ఉపకుటుంబం
3. రొమాన్స్ భాషా ఉపకుటుంబం
4. స్లావిక్ భాషా ఉపకుటుంబం
5. బాల్టిక్ భాషా ఉపకుటుంబం
6. ఆల్బేనియన్ భాషా ఉపకుటుంబం
7. దక్షిణ కాకసస్/ఆర్మేనియన్ భాషా ఉపకుటుంబం
8. గ్రీకు భాషా ఉపకుటుంబం
9. ఇరేనియన్ భాషా ఉపకుటుంబం
10. ఇండో-ఆర్యన్ భాషా ఉపకుటుంబం

**(అ). జర్మానిక్ భాషా ఉపకుటుంబం:** ఇందులో మళ్ళీ మూడు విభాగాలున్నాయి.

1. ఇంగ్లీష్-ఫ్రిజియన్ శాఖ
2. డచ్-జర్మన్ శాఖ
3. స్కాండినేవియన్ శాఖ

జర్మానిక్ భాషా ఉపకుంటుంబానికి ట్యుటానిక్ శాఖ అని కూడా వ్యవహరిస్తారు. జర్మానిక్ శాఖ భాషా వ్యవహర్తలు అమెరికా, ఆఫ్రికా, ఆసియా, ఆస్ట్రేలియా ఖండాలకు వ్యాపించటమే కాక యూరప్‌లో కూడా కెల్టిక్ భాషా వ్యవహార ప్రాంతాలను కూడా ఆక్రమించి తమ భాషలను ఆయా ప్రాంతాలలో వ్యాప్తి జేశారు. ఈ భాషా వ్యవహర్తలు ప్రధానంగా స్కాండినేవియన్ దేశాలలోను ఇంగ్లండు, ఉత్తర అమెరికా, కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా, దక్షిణ ఆఅరఫికా, న్యూజిలాండ్, నెదర్‌లాండ్సు, బెల్జియం దేశాలలో ఉన్నారు. మరి కొంత మంది జర్మానిక్ భాషా ఉపకుటుంబాన్ని మూడు శాఖలు (Subdivisions)గా విభజించారు. అవి :

1. ఉత్తర శాఖ
2. తూర్పు శాఖ
3. పశ్చిమ శాఖ

నార్వే, డెన్మార్క్ దేశాలలో క్రీ.శ. 4వ శతాబ్ది నుంచి లభిస్తున్న రూనిక్ శాసనాల వల్ల ఈ భాషల ఉనికి తెలుస్తోంది.

**1. ఉత్తర శాఖ**(North Branch) : ఈ శాఖకు చెందిన భాషలలో ప్రధానమయినవి మూడు. ఈ శాఖా వ్యవహర్తలు స్కాండినేవియన్ దేశాలలో ఉండటం చేత దీనిని స్కాండినేవియన్ శాఖ అని కూడా అంటారు.

**1. డేనిష్** : డెన్మార్కు దేశంలో ఈ భాష వ్యవహారంలో ఉంది. ఈ భాషా వ్యవహర్తలను తెలుగు వారు దిన మార్గులనీ, ఈ దేశాన్ని 'దినమార్గ' అని వ్యవహరించారు. 2 కోట్ల మందికి పయిగా ఈ భాషను వ్యవహరిస్తున్నారు. సంస్కృత పాళీ భాషల్ని క్షుణ్ణంగా చదివిన పండితులు ఈ దేశంలో ఉన్నారు. బౌద్ధ సాహిత్యాన్నీ, పాళీ భాషనూ వీళ్ళు చదివి అనేక గ్రంథాలు రాశారు. వీరిలో యెస్పర్సన్ (Jesperson) ప్రసిద్ధుడు.

**2. నార్వేజియన్** : 'నోర్' జాతికి చెందిన 50 లక్షల మంది నార్వే దేశంలో ఈ భాషను మాట్లాడుతున్నారు. నార్వేజియన్ సాహిత్యానికి, నాటక రచనకు ప్రాముఖ్యముంది. నాటక ప్రదర్శనలన్నా వీళ్ళకు మక్కువ ఎక్కువ. ప్రాచీన నోర్స్‌లో క్రీ.శ. 12వ శతాబ్ది నుంచి గ్రంథాలు లభ్యమవుతున్నాయి.

**3. స్వీడిష్** : స్వీడన్ దేశంలో ఒక కోటి మంది ఈ భాష మాట్లాడుతున్నారు. ఆల్ఫ్రెడ్ నోబుల్ ఈ జాతికి చెందినవాడు.

డేనిష్, నార్వేజియన్ భాషలు అత్యంత సన్నిహితమయినవి. పరస్పర అవగాహనా క్షమత ఈ భాషా వ్యవహర్తలకు ఉంది.

అలాంటప్పుడు వీటిని మాండలికాలుగా భావించవచ్చు. కాని విభిన్న దేశాలకు చెందటం చేత వీటిని మాండలికాలుగా భావించటంలేదు.

**2. తూర్పు శాఖ :**

గాథిక్ భాష (Gothic Language) ఈ శాఖలో ప్రసిద్ధమయినది. విసిగోథ్ వుల్ఫిలా (Visigoth Wulfila 311-83 A.D.) మొట్ట మొదటిగా ఈ భాషలో బైబుల్‌ని అనువాదం చేశాడు. ఈయన రచనలలోని కొన్ని సువార్తలు (gospels) మాత్రం లభిస్తున్నాయి. విసిగోథ్‌లు, ఆస్ట్రోగోథ్‌లు తదనంతర కాలంలో ఇతర భాషా వ్యవహర్తలలో కలసిపోయిన కారణంగా వీళ్ళ భాషలు నశించిపోయాయి.

**3. పశ్చిమ శాఖ:**

ఇది మళ్ళీ 5 ఉపశాఖలుగా చీలిపోయింది. ఈ శాఖలన్నింటినీ ప్రాచీన మధ్య, ఆధునిక యుగాలుగా విభజించవచ్చు. క్రీ.శ. 12వ శతాబ్దికి పూర్వమున్న భాషలకు ప్రాచీనమనీ, 12-15 శ॥లకు మధ్య ఉన్న ?భాషలను మధ్యమనీ, ఆ తర్వాత వాటిని ఆధునికమనీ అంటున్నారు.

**1. హైజర్మన్ (High German):** క్రీ.శ. 7వ శతాబ్ది నుంచి వ్యక్తి నామాలు, 8వ శతాబ్ది నుంచి పదాలు, 9వ శతాబ్ది నుంచి మత గ్రంథాలు ఈ భాషలో లభిస్తున్నాయి. పశ్చిమాన ఉన్న ఆలెమినిక్ (Alemannic) తూర్పున ఉన్న బవేరియన్ భాషలు ఉన్నత జర్మన్ (upper german) భాషలుగా ఉటంకంచబడ్డాయి. మధ్య యుగంలో ఉన్నత జర్మన్‌లోనే రచనలు వెలువడ్డాయి. 16వ శ॥నికి చెందిన మార్టిన్ లూథర్ వంటి సంస్కర్తలు మధ్య యుగ జర్మన్ భాషనే ఉపయోగించారు. ఆధునిక జర్మన్ భాషకు ఇది మూలం. ఇద్దిష్ లేదా జ్యూయిష్ (Yiddish or Jewish) భాష జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ మొదలయిన దేశాలలో వ్యవహారంలో ఉంది. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రజ్ఞులు, పండితులు గేటే, మాక్సుముల్లర్, ఐన్‌స్టీన్ లాంటి వారు జర్మనీ దేశానికి చెందిన వాళ్ళు. తులనాత్మక భాషా శాస్త్రంలో కృషి చేసి దానిని అభివృద్ధిపరచిన వాళ్ళలో ప్రముఖులు చాలా మంది ఈ దేసానికి చెందినవారే. సంస్కృతం లాంటి ప్రాచ్య భాషల పునరుద్ధరణకు, అభివృద్ధికి వీళ్ళు ఎంతో కృషి& చేశారు.

**2. ఫ్రాంకోనియన్ (Franconian):** ప్రాచీనయుగంలో దీనిలోని సాహిత్యం లభించలేదు. దీనికి మాండలిక భాష ఫ్లెమిష్. వ్యవహార ప్రాంతం నెదర్లాండ్సు. వ్యవహర్తలు 8 కోట్లు. 15వ శ॥ నుంచి ఈ భాషల ఉనికికి ఆధారాలు లభిస్తున్నాయి. డచ్చి రూపాంతరమయిన ఆఫ్రికాన్స్ దక్షిణ ఆఫ్రికాలో వ్యవహారంలోఉంది.

**3. లోజర్మన్ (LowGerman):** ఓల్ట్‌సాక్జన్, ప్రాచీన హైజర్మన్ లాగా క్రీ.శ. 7వ శ॥ నుంచి వ్యవహారంలో ఉన్నట్లుగా ఆధారాలున్నాయి. మిడిల్‌లో జర్మన్, మోడరన్‌లో జర్మన్ భాషలు హై జర్మన్ భాషా ప్రభావం వల్ల క్రమంగా నశిస్తున్నాయి.

**4. ఫ్రిజియన్ :** క్రీ.శ. 13వ శతాబ్ది నుంచి నెదర్లాండ్స్ దగ్గర దీవులలోను, పశ్చిమ జర్మనీలోను వ్యవహారంలో ఉంది. ఇది జాతీయ భాష కూడా కాదు. చాలా కొద్ది మాట్లాడతారు.

**5. ఇంగ్లీషు :** క్రీ.శ. 7వ శతాబ్ది నుంచి ఈ భాష ఉన్నట్లు ఆధారాలున్నాయి. క్రీ.శ. 750లో ఆంగ్లపద్యాలు (Caedmon;s Hymn and the Beowulf Saxon) భాష నుంచి సాహిత్యం లభిస్తోంది. కెంటిష్ (Kentish), సాక్జన్ (Saxon), ఆంగ్లియన్ (Anglian) అనేవి ప్రాచీనాంగ్ల మాండలికాలు. ప్రాచీనాంగ్లాన్ని ఆంగ్లో-సాక్జన్ అని వ్యవహరించటం ఉంది.

క్రీ.శ. 1400 సంవత్సరానికి చెందిన చాసర్ భాష మధ్య యుగ ఆంగ్ల భాషకు ప్రతీక. మధ్య యుగంలో ఆంగ్ల భాషకు 4 మాండలికాలున్నాయి. (Northern, West midland, East midland, Southern dialects) లండన్‌లో వ్యవహారంలో ఉన్న ఆంగ్లభాష ప్రామాణిక భాషగా భావించబడుతోంది. 16వ శతాబ్దికి చెందిన విలియం షేక్స్పియర్ మహాకవి. ఈయన నాటకాలు విశ్వ విఖ్యాతి పొందాయి. ప్రపంచ భాషలలో ఆంగ్ల భాష మాట్లాడే వారి సంఖ్య రెండో స్థానాన్ని ఆక్రమిస్తోంది. ప్రపంచంలో 2/3వ వంతు విస్తీర్ణంలో ఆంగ్ల భాష మాట్లాడేవారు లేదా అర్థం చేసుకోగలిగిన వారు ఉన్నారు. అంతర్జాతీయ వార్తా ప్రసారాలలో ఆంగ్ల భాషది ప్రథమస్థానం.

**ఆ. కెల్టిక్ భాషా ఉపకుటుంబం:** ఈ శాఖకు సంబంధించిన చాలా భాషలు వ్యవహార భ్రష్టాలయ్యాయి. కొన్ని ఊళ్ళ పేర్ల వల్ల కెల్టులు మధ్య యూరప్‌లో నివసించారని అర్థమవుతోంది.

**1. గాలిష్ భాష :** గాల్ జాతీయులు ఒకప్పుడు మాట్లాడిన భాష. శాసనాల వల్ల ఈ భాష ఉనికి తెలిసింది. ఇది ఇప్పుడు వ్యవహార భ్రష్టమయింది.

**2. వెల్ష్ భాష :** క్రీ.శ. 800 సంవత్సరానికి చెందిన భాషా పదాలు లభిస్తున్నాయి. నేడు ఈ భాష వేల్స్‌లో వ్యవహారంలో ఉంది. ఈ భాషను 20 లక్షల మందికి పయిగా మాట్లాడుతున్నారు.

**3. బ్రెటన్ భాష (Breton Language) :** క్రీ.శ. 800 సంవత్సరానికి చెందిన ఈ భాషా పదాలు లభిస్తున్నాయి. క్రీ.శ. 5,6 శతాబ్దాలలో వ్యవహర్తలు యూరప్ ఖండమంతా విస్తరించారు. ఆ నాటి జర్మన్ దండయాత్రలు దీనికి కారణం కావచ్చు. బ్రిటానీ (Britany)లో 10 లక్షల మంది ఈ భాషను మాట్లాడుతున్నారు.

**4. కార్నిష్ భాష (Cornish) :** ఈ భాష 18వ శతాబ్దిలోనే వ్యవహార భ్రష్టమయింది.

**5. ఐరిష్ భాష (Irish) :** క్రీ.శ. 5వ శతాబ్ది నుంచి ఐరిష్ భాషా శాసనాలు లభిస్తున్నాయి. క్రీ.శ. 11వ శ॥ నుంచి సాహిత్యం లభిస్తోంది. ప్రస్తుతం ఈ భాష ఐర్లాండులో వ్యవహారంలో ఉంది. సుమారు 30 లక్షలకు పయిగా ఈ భాషను మాట్లాడుతున్నారు.

**6. మాంక్ భాష (Manx) :** ఒకానొకప్పుడు మాన్ (Man) దీవులలో ఈ భాషను మాట్లాడేవారు. నేడు ఈ భాష వ్యవహారంలో లేదు.

## ఇ. రొమాన్స్ భాషా ఉపకుటుంబం:

రొమాన్ సామ్రాజ్యంలో వ్యవహరించే భాషలు కాబట్టి వీటిని రొమాన్స్ భాషలు అంటారు. మరి కొంత మంది ఇటాలియన్ భాషా ఉపకుంటుంబం అని కూడా అంటారు. లాటిన్ భాషా మాండలికాలే ఈ ఉపకుంటుంబానికి చెందిన భాషలని కొందరంటారు. ఇటలీలో భాషా స్థితి క్రీ.పూ. 600 సంవత్సరావకు పూర్వం ఏ విధంగా ఉందో తెలుసుకోవడానికి ఆధారాలు లేవు. క్రీ.పూ. 250 నుంచి ఇటలీ భాషల స్థితి స్పష్టంగా ఉన్నట్ల ఆధారాలున్నాయి.

మూల ఇటాలియన్ (Proto Italian) భాష ఓస్కాన్-ఉంబ్రియన్ (Ocan-umbrian), లాటిన్-ఫాలిస్కన్ (Latin-Faliscan)లుగా విడిపోయింది.

**1. ఒస్కాన్:** క్రీ.పూ. 200 సం॥ల నుంచి సుమారు 200 శాసనాలు ఈ భాషలో లభించాయి

**2. ఉంబ్రియన్:** క్రీ.పూ. మొదటి శతాబ్దిలో ఈ భాషా శాసనాలు లభిస్తున్నాయి.

**3. లాటిన్:** క్రీ.పూ. 600 సంవత్సరం నుంచి ఈ లాటిన్ భాషా శాసనాలు లభిస్తున్నాయి. ఈ భాషా ప్రభావం వల్ల ఈ భాషా కుటుంబానికి చెందిన అనేక ఇతర భాషలు వ్యవహార విదూరాలయ్యాయి. తులనాత్మక భాషా శాస్త్రాధ్యయనానికి లాటిన్ భాష ఎంతో దోహదం చేసింది. ఈ భాషకు చెందిన అనేక శాసనాలు, మహా గ్రంథాలుప్రాచీన కాలం నుంచి లభించాయి. వ్యవహార లాటిన్ భాష యూరప్ ఖండం లోని వివిధ దేశాలలోకి ప్రవేశంచి నేటి రొమాన్స్ భాషల ఆవిర్భావినికి వివరణమయింది. లాటిన్ భాష కేవలం లిఖిత భాషగా చాలా కాలం వెలుగొందింది. సంస్కృత భాష వలె లాటిన్ భాష కూడా జన వ్యవహార దూరమయింది. ఈ లాటిన్ నుంచి ఉద్భవించిన అనేక భాషలు నేడు వ్యవహారంలో ఉన్నాయి. అవి:

**అ. ఇటాలియన్ భాష:** 12వ శతాబ్ది నుంచి పోర్చుగీసు భాష వ్యవహారంలో ఉంది. ఈ భాషనే పుర్తకీసు, బుడతకీచు, పురతాకాలు అని కూడా వ్యవహరిస్తారు. ఈ భాషా వ్యవహర్తలు రమారమి 10 కోట్లున్నారు. ఈ భాష పోర్చుగల్ దేశంలో ప్రధానంగానూ, బ్రెజిల్, గోవా, అంగోలా, మొంజాబిక్ దేశాలలో అప్రధానంగానూ వ్యవహారంలో ఉంది. పోర్చుగీసు వారు దాదాపు 100 సంవత్సరాల పాటు ఆస్ట్రేలియాను పరిపాలించారు. ఈ భాషా వ్యవహర్తలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారు. ప్రపంచ భాషలన్నింటిలోనూ వృక్ష, ఫల సంబంధి పోర్చుగీసు పదాలు వారి వలసల కారణంగా ఎన్నో చోటు చేసుకున్నాయి. తెలుగులో కూడా అనాస, బొప్పాయి, గోయా మొదలయిన అనేక పదాలు వచ్చి చేరాయి.

**ఆ. స్పానిష్:** 12వ శ॥ నుంచి వ్యవహారంలో ఉంది. స్పెయిన్ దేశంలో ఈ భాష ప్రధానంగా వ్యవహారంలో ఉంది. దక్షిణ అమెరికాలో బ్రెజిల్ తప్ప మిగిలిన రాజ్యాలలోను, ఉత్తర అమెరికాలోని మెక్సికోలోనూ ఇది వ్యవహారంలో ఉంది.

**ఇ. ఫ్రెంచి:** క్రీ.శ. 842 నుంచి ఈ భాష వ్యవహారంలో ఉంది. దీని వ్యవహార ప్రాంతం ప్రధానంగా ఫ్రాన్స్. భారతదేశంలో పుదుచ్చేరి, యానాంలను ఫ్రెంచివారు పాలించారు. ఆఫ్రికా ఖండంలో కూడా ఫ్రెంచి వ్యవహర్తలున్నారు. ఫ్రెంచి సాహిత్యం ప్రపంచ ప్రసిద్ధం. ఆంగ్ల సాహిత్యం పై ఫ్రెంచి సాహిత్య ప్రభావం, భాషా ప్రభావం అధికంగాపడింది.

**ఈ. రుమేనియన్:** 16వ శ॥ నుంచి ఇది వ్యవహారంలోకి వచ్చింది. రుమేనియాలో 3 కోట్ల మందికి పయిగా ఈ భాషను మాట్లాడుతున్నారు. వీళ్ళు తమ ప్రార్థనల్ని లాటిన్ లోనూ, పోర్చుగీసు భాషలోనూ చేస్తారు.

## ఈ. స్లావిక్ భాషా ఉపకుటుంబం:

స్లావిక్ జాతీయుల వ్యవహార భాషకు సంబంధించిన వాటిని స్లావిక్ భాషలంటారు. రోమనుల కాలంలో ఈ భాషా వ్యవహర్తలు పోలండులోనూ, పశ్చిమ రష్యాలోనూ ఉండేవారు. క్రీ.శ. 6,7 శతాబ్దాలలో ఈ భాషలు బల్గేరియా వరకు వ్యాపించాయి. క్రీ.శ. 850లో సిరిల్, మెథొడియస్ అనే క్రైస్తవ మెషనరీలు బైబిల్‌ను స్లావిక్ భాషలోకి అనువదించారు. అనూదితమయిన భాషను రష్యన్ చర్చ అధికారిక భాషగా అంగీకరించింది. ఈ స్లావిక్ భాషలు అనేకం దక్షిణ స్లావిక్‌కు చెందినవే.

**1. బల్గేరియన్:** ఈ భాష క్రీ.శ. 850 నుంచి బల్గేరియాలో వ్యవహారంలో ఉంది. సుమారు ఒక కోటి మందికి పయిగా ఈ భాషను మాట్లాడతారు.

**2. స్లొవేనియన్:** ఈ భాషకున్న మరో పేరు సెర్బో-క్రొయేషన్. ఈ భాషా వ్యవహార ప్రాంతం గురించి తెలియదు.

ఈ క్రింది పేర్కొన్న భాషలు పశ్చిమ స్లావిక్‌కు చెందినవి.

**1. జెక్:** జెకోస్లొవేకియాలో 2 కోట్ల మందికి పయిగా ఈ భాషను మాట్లాడతారు.

**2. స్లొవిక్:** ఈ భాష కూడా జెకోస్లొవేకియాలో 2 కోట్ల మందిచే వ్యవహరింపబడుతోంది. జెక్ భాషను, స్లావిక్ భాషను జనం మాట్లాడటం చేత ఈ దేశానికి జెకొస్లొవేకియా అనే పేరు వచ్చింది. ఈ దేశానికి Prague రాజధాని. రోమన్ యాకొబ్సన్ అనే భాషా శాస్త్రవేత్త ఈ దేశానికి చెందిన వ్యక్తి. కెమిల్ జ్వలిబిల్ కూడా ఈ దేశానికి చెందినవాడే.

**3. పోలిష్:** పోలెండులో వ్యవహారంలో ఉంది. 3 కోట్ల మందికి పయిగా ఈ భాషను మాట్లాడతారు. పోల్ జాతి ప్రజలు మాట్లాడే భాష కాబట్టి దీనికి పోలిష్ అనే పేరు వచ్చింది.

చూర్పు స్లావిక్‌లో ప్రధానమయిన భాష రష్యన్.

**గ్రేట్ రష్యన్:** వైట్ లేదా బైలో రష్యన్, ఉక్రేనియన్ అనే భాషలు ఒకప్పటి USSR లో ఉన్నాయి. ఇందులో గ్రేటు రష్యన్ భాష 25 కోట్ల మందికి పయిగా మాట్లాడతారు. ప్రపంచ భాషలలో ఇది ప్రముఖమయినది. టాల్‌స్టాయ్, కోర్కీ, చెకోవ్ లాంటి రచయితలు ఈ భాషలో ఎన్నో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గ్రంథాలు రాశారు.

## ఉ. బాల్టిక్ భాషా ఉపకుటుంబం:

బాల్టిక్ తీర వాసులు మాట్లాడే భాషలు. ఇందులో ప్రధానంగా రెండు భాషలు వ్యవహారంలో ఉన్నాయి.

**1. లిథూనియన్:** ఈ భాషలో అనేక మూల ఇండో-యూరోపియన్ లక్షణాలున్నాయి. క్రీ.శ. 16వ శ॥ నుంచి లిఖిత పూర్వక ఆధారాలున్నాయి. సుమారు 20 లక్షల మందికి పయిగా ఈ భాషను మాట్లాడుతున్నారు.

**2. లత్తిష్:** లత్వియా ప్రాంతంలో ఈ భాష వ్యవహారంలో ఉండటం చేత ఈ భాషకు లత్విక్ అని కూడా పేరుంది. క్రీ.శ. 16 నుంచి ఆధారాలున్నాయి. ఈ భాషకు అనేక మాండలికాలున్నాయి. సుమారు 20 లక్షలకు పయిగా ఈ భాషను మాట్లాడతారు.

## ఊ. అల్బేనియన్ భాషా ఉపకుటుంబం:

క్రీ.శ. 14వ శతాబ్దిలో మాధ్యాగ్రంథాను వాదం ఈ భాషలో లభిస్తోంది. క్రీ.శ. 1685లో లాటిన్-అల్బేనియన్ నిఘంటువు వచ్చింది. ఈ భాషలో మత పరమయిన అనేక అనువాద గ్రంథాలు మత పరమయినవి లభించాయి. 19వ శ॥లో ఈ భాషా జానపద సంపదను సేకరించటం జరిగింది. ఈ భాషకు గెగ్, తొస్క్ అనే రెండు మాండలికాలున్నాయి. అల్బేనియాలో ప్రధానంగానూ, గ్రీసు ఇటలీలలో కొంత వరకు ఈ భాష వ్యవహారంలో ఉంది. లాటిన్, గ్రీకు, స్లావిక్, తుర్కీ భాషల ప్రభావం ఈ అల్బేనియన్ భాష పై పడి అనేకాలయిన మార్పులకు లోనయింది. ఈ భాషా వ్యవహర్తలు ఒక కోటి మందికి పయిగా ఉన్నారు.

## ఋ. ఆర్మేనియన్ భాషా ఉపకుటుంబం:

కాకసస్ పర్వత శ్రేణుల దక్షిణ అరపాంతంలోనూ, పశ్చిమ టర్కీ ప్రాంతంలోనూ 50 లక్షల మందికి పయిగా ఈ భాషను మాట్లాడుతున్నారు. దీని గురించి క్రీ.శ. 5వ శ॥ వరకు ఎవరికీ తెలియదు. అక్కాడియన్ గ్రీకు రచనల్ని బట్టి ఆర్మేనియన్ల

ఆర్మేనియన్ లోకి వచ్చిమట్లు తెలుస్తోంది. క్రైస్తవ రచనలనేకం క్రీ.శ. 5వ శ॥లో ఆర్మేనియన్‌లోకి అనువాదం పొందాయి. 19వ శ॥ వరకు ఈ భాషలో పెద్దగా మార్పులు లేవు.

## ఋ. గ్రీకు భాషా ఉపకుటుంబం:

క్రీ.పూ. 200 సంవత్సరం ప్రాంతంలో గ్రీకులు ఇప్పుడున్న గ్రీకు దేశాన్ని, మధ్యధరా సముద్ర దీవులను, మధ్యధరా సముద్ర ప్రాంతాలను ఆసియా మైనరు పశ్చిమ తీరప్రాంతాన్ని ఆక్రమించారు. ప్రాచీన గ్రీకు సాహిత్యాధ్యయనం వల్ల గ్రీకుల అపూర్వ విజ్ఞానం మనకు అవగతమవుతోంది. ప్రాచీన గ్రీకు శిలా శాసనాల కాలాన్ని క్రీ.పూ. 1450-1200 అని నిర్ణయించారు. క్రీ.పూ. 1200 ప్రాంతంలో ట్రాయ్ యుద్ధం జరిగింది. హోమర్ రచనలలో ట్రాయ్ యుద్ధం గురించి ఉంది. ఇలియడ్, ఒడిస్సీలను రచించిన హోమర్ కాల నిర్ణయాన్ని చరిత్రకారులు సరిగా నిర్ణయించలేదు.

గ్రీకు భాషకు రెండు మాండలికాలున్నాయి. 1. పశ్చిమ గ్రీకు 2. తూర్పు గ్రీకు. పశ్చిమ గ్రీకు భాషలో 1. ఈశాన్య గ్రీకు 2. డోరిక్ అనే మాండలికాలున్నాయి. అట్టిక్ అయోనిక్ తూర్పు గ్రీకుకు చెందినది. ఏథేన్స్‌లో ఈ మాండలికమే వ్యవహారంలో ఉంది. హోమర్ కూడా ఏథేన్స్ మాండలికంలోనే రాశాడు. దీనినే హెలెనిస్టిక్ గ్రీకు అనే వాళ్ళు. కొత్త నిబంధన (New Testament) ఈ మాండలికంలోనే ఉంది. నేడు గ్రీకు భాష గ్రీసు దేశానికే ప్రధానంగా పరిమితం అయినా సైప్రస్, టర్కీ, అమెరికా దేశాలలో కూడా పరిమితంగా వ్యవహారంలో ఉంది. సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ మొదలయిన తత్వవేత్తలు, పైథాగరస్ లాంటి గణిత వేత్తలు, అలెగ్జాండర్ లాంటి యోధుడు ఈ భాషా వ్యవహర్తలే.

## ఎ. ఇరేనియన్ భాషా ఉపకుటుంబం:

ఇరేనియన్ భాష 'పరిషియన్' పేరుతో ప్రస్తుతం ఇరాన్ దేశంలో వ్యవహారంలో ఉంది. క్రీ.పూ. 300 సంవత్సరాల నాటి నుంచి ఈ భాష విడిపోయినట్లు ఆధారాలున్నాయి. ఇది ముఖ్యంగా రెండు మాండలికాలుగా ఉన్నట్లు గ్రహించవచ్చు. ఇందులో ఒకటి అవెస్తకాగా రెండోది ప్రాచీన పర్షియన్. జొరాష్ట్రియన్ మత గ్రంథం అవెస్త. అవెస్తలోని కొన్ని పద్యాలు, గాథలు క్రీ.పూ. 600 సంవత్సరానికి చెందినవి. డరయస్ శాసనం (క్రీ.పూ. 521-486)వల్ల మూల ఇండో - యూరోపియన్ పునర్నిర్మాణం సులభతరమయింది.

క్రీ.పూ. 300 నుంచి క్రీ.పూ. 900 వరకు మధ్య ఇరేనియన్‌గా భావించవచ్చు. క్రీ.శ. 300-900 పహ్లవిభాష పారశీక సామ్రాజ్య భాష ఇదే మధ్య పారశీకం. నేటికీ ఇరేనియన్ భాషలు వ్యవహారంలో ఉన్నాయి.

1. **బలూచి**: దీనిని పశ్చిమ పాకిస్థాన్‌లో 50 లక్షల మందికి పయిగా మాట్లాడతారు.
2. **పస్తు/పస్తో**: ఆఫ్ఘనిస్థాన్‌లో అధికార భాష. సుమారు 2 కోట్ల మంది ఈ భాషలు మాట్లాడుతున్నారు.
3. **కుర్దిష్**: పశ్చిమ ఇరాన్, టర్కీలలో 2 కోట్ల మంది ఈ భాషను మాట్లాడతారు.

## ఏ. ఇండో-ఆర్యన్ భాషా ఉపకుటుంబం:

హింద్వార్య భాషలలో మొదటిది సంస్కృత భాష. ఈ భాష నుంచి అనేక భాషలు జనించాయి. వేదాలలో ఋగ్వేదం అత్యంత ప్రాచీనమయినది. ఇది క్రీ.పూ. 1500 నాటిది. సామవేదం, యజుర్వేదం, అధర్వణ వేదం - తర్వాత కాలంలో వచ్చాయి. వేదాలను వినికిడి జ్ఞానంతో నేర్చుకొనే వారు కాబట్టి వీటిని శ్రుతులనేవారు. 'విద్' అనే ధాతువుకి తెలుసుకోవటం అని అర్థం. వేద పదానికి విజ్ఞానమని అర్థం. వేద భాష స్వర ప్రధానమయినది. నేటికీ ఈ వైదిక స్వరం సురక్షితం. ఈ స్వరం వల్ల ఇండో-యూరోపియన్ భాషల అధ్యయనం సులభమయింది. వైదిక భాష రక్షణార్థం ప్రాతిశాఖ్యలు, వ్యాకరణాలు, శిక్షలు వచ్చాయి. బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు ముఖ్యమయిన రచనలు. పాణిని మహర్షి రచితమయిన అష్టాధ్యాయి ప్రపంచ వ్యాకరణాలలో ప్రముఖమయినది. ఇలాంటి వ్యాకరణం మరే ఇతర భాషలకు లేదు.

వైదిక సంస్కృతం కొన్ని మార్పులతో లౌకిక సంస్కృతంగా మారింది. రామాయణ, భారత గ్రంథాలు, పురాణాలు ఋషులచే ఆర్ష సంస్కృతంలో రచించగా, ప్రతిమా, స్వప్న వాసవదత్తాది నాటకాలను భాసుడు, అభిజ్ఞాన శాకుంతల, మాళవికాగ్నిమిత్ర, విక్రమోర్వశీయ నాటకాలు, రఘువంశ, కుమార సంభవం, మేఘసందేశాది కావ్యాలను కాళిదాసు లౌకిక సంస్కృతంలో రాశారు.

లౌకిక సంస్కృతంలో స్వరం లోపించటం ప్రధానమయిన భాషా విశేషం. శుభకార్యాలు, కర్మకాండలలో ఈ నాటికీ సంస్కృతాన్నే భారతదేశంలో వాడుతున్నారు.

**ప్రాకృతాలు:** క్రీ.పూ. 600 నుంచి క్రీ.శ. 1000 వరకు జైన, బౌద్ధ గ్రంథాలలోనూ, సంస్కృత నాటకాలలోనూ, శాసనాలలోనూ ప్రాకృతాలు వ్యవహారంలో ఉండేవి. శౌరసేని, మాగధి అమాగది, పైశాచీ, చూళికా పైశాచి, మహారాష్ట్ర ప్రాంతం అని ఆరు రకాల ప్రాకృతాలుండేవి.

**పాలీ:** ప్రాకృత భేదమే 'పాలీ' అని కొంతమంది భావిస్తున్నారు. క్రీ.పూ.307 ప్రాంతంలో సింహళదేశానికి వెళ్ళిన మాగధీ ప్రాకృతమే పాలీ అని జాన్ బోమ్స్ అభిప్రాయం. బుద్ధుని బోధలు పాలీ భాషలో ఉన్నాయి.

**అపభ్రంశం:** అపభ్రంశ శబ్దాల్ని పతంజలి తన మహాభాష్యంలో పేర్కొన్నాడు. క్రీ.శ. 6వ శతాబ్దిలో అపభ్రంశ శబ్దాన్ని భామహుడు కావ్యాలంకారంలో పేర్కొన్నాడు. ఈ అపభ్రంశాల నుంచే నవీన ఔత్తరాహిక భాషలయిన హిందీ, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ, ఒడియా, అస్సామి మొ॥న భాషలు ఉత్పన్నమయ్యాయి.

ఉత్తర హిందుస్థానంలో హిందీ, మరాఠీ, గుజరాతీ, సింధీ, రాజస్థానీ, బీహారీ, బెంగాలి, కాశ్మీరీ, ఒడియా, అస్సామిస్, నేపాలీ, సింహళీ, కొంకణీ మొఒఒ హిందార్య భాషా ఉపకుంటుబానికి చెందిన భాషల్ని సుమారు 70 కోట్ల మందికి పయిగా మాట్లాడుతున్నారు. ఇది ఇండో-యూరోపియన్ భాషా కుటుంబంలో అత్యంత ప్రధానమయిన భాష.

ప్రాచీనకాలంలో వ్యవహారంలో ఉండి ఉప్పుడు నశించిన ఇండో-యూరోపియన్ భాషలు చాలా ఉన్నాయి. వీటిలో కొన్నింటికి గ్రంథాలున్నాయి కాని మరికొన్నింటికి శాసనాల వంటి స్వల్ప ఆధారాలు మాత్రమే ఉన్నాయి. మధ్య ఆసియాలో క్రీ.పూ. 7-10 శతాబ్దాల మధ్య కాలంలో టొకారియన్ శాఖకు చెందిన రెండు భాషలు ప్రసిద్ధమయినవి. మధ్యధరాప్రాంతంలో ఉండేవని తెలిసిన ఇలిరియన్, ఫ్రిజియన్ భాషలు ఇండో-యూరోపియన్ ఏ శాఖకు చెందినవో నిర్ణయించటం సాధ్యం కాలేదు.

క్రీ.పూ. 15వ శతాబ్ది నుంచి హిటైటీ భాషకు శాసనాధారాలున్నాయి. దీన్ని మరికొన్ని భాషలనీ కలిపి అనటోలియన్ శాఖగా పండితులు పేర్కొన్నారు. అనటోలియన్ శాఖ ఇండో యూరోపియన్‌లో భాగమని కొందరి అభిప్రాయం. కాని, ఎక్కువ మంది ఇది మూల ఇండో-యూరోపియన్ భాష శాఖలుగా చీలక ముందు దాన్నుంచి విడిపోయి ఉంటుందని నమ్ముతున్నారు. అందువల్ల వీళ్ళు ఇండో-యూరోపియన్‌ని ఇండో-హిటైటీ అని వ్యవహరిస్తారు.

## (బి). ఫిన్నో-ఉగ్రిక్ భాషా కుటుంబం:

ఇందులో యూరప్‌లో ఉన్న మూడు భాషలు ప్రధానమయినవి.

1. ఫిన్నిష్
2. ఎస్తోనియన్
3. హంగేరియన్

ఇవిగాక యూరప్, ఆసియాలలో ఉన్న లప్పిష్, మొర్ద్విన్, చెరెమిస్, వొత్సక్ మొదలయిన భాషలు కూడా ఈ భాషా కుటుంబానికి చెందినవే.

సమొయెద్ భాషలు కూడా ఈ భాషా కుటుంబంతో సంబంధం ఉన్న భాషలే అంటారు.

## (సి). యూరల్-ఆల్టాయిక్ భాషా కుటుంబం:

ఈ భాషా కుటుంబాన్ని సిథియన్, తురేనియన్, అని కూడా వ్యవహరిస్తారు. ఈ కుటుంబం రెండుగా చీలింది.

1. యూరాలిక్ భాషా ఉపకుటుంబం
2. ఆల్టాయిక్ భాషా ఉపకుటుంబం

టర్కీ, మంగోలియన్, కొరియన్, మంచు మొ॥వి ఈ కుటుంబానికి చెందిన భాషలు.

జనాభాను బట్టి చూస్తే ఈ భాషా కుటుంబానికి తృతీయ స్థానముందటారు. ఈ భాషా వ్యవహర్తలు ఎక్కువగా రష్యా

సరిహద్దుల్లో నివసిస్తున్నారు. రష్యాలో ఉన్న ఆరు రిపబ్లిక్కులలో ఈ భాషల్ని మాట్లాడతారు. చైనా, రష్యాల మధ్య గల ఔటర్ మంగోలియాలో ఈ భాషలు మాట్లాడతారు. ఇరాన్, అరేబియా, యురేషియాలలో కూడా మాట్లాడతారు.

ఈ భాషా వ్యవహర్తలు అమెరికాలో ఎక్కువగా ఉన్నారు. ఫిన్లండ్, ఎస్తోనియన్లు, హంగేరియన్లు, టర్కీ ప్రజలు, మంగోలియన్లు అమెరికా వెళ్ళి స్థిరపడ్డారు.

ఇందులో మూడు శాఖలున్నాయి. టర్కిక్ శాఖ టర్కిస్, అజర్ బైజని, కిర్గిస్, ఉజ్‌బెగ్, టర్కోయన్, కజక్ ముఖ్యమయినవి. మంగోక్ శాఖలో కూడా చాలా భాషలున్నాయి. మూడోశాఖలో మంచు, తుంగుస్ ప్రధానమయినవి.

## (డి). బాస్క్ భాషా కుటుంబం:

ఫ్రాన్సు పశ్చిమ పిరనేస్‌లోనూ, స్పెయిన్ లోనూ కొంతమంది ఈ భాషను మాట్లాడతారు. బాస్క్ భాషా లక్షణాలు విలక్షణంగా ఉండి ఏ ఒక్క భాషా కుటుంబానికి చెంది ఉండలేదు. అందుచేత ఈ భాషను ప్రత్యేక భాషా కుటుంబమన్నారు.

## (ఇ). ఆఫ్రో-ఏషియాటిక్ భాషా కుటుంబం:

ఈ భాషా కుటుంబానికి చెందిన భాషలు ఉత్తరఆఫ్రికాలోనూ, నైఋతి ఆసియాలోనూ ఉన్నాయి. ఇందులో సెమెటిక్, ఈజిప్షియన్, కుషిటిక్, చడ్ అనే అయిదు శాఖలున్నాయి. చివరి నాలుగింటినీ కలిపి కొంత మంది హెమిటిక్ అని కూడా వ్యవహరిస్తారు.

**1. సెమెటిక్:** ప్రస్తుతం హిబ్రూ, అరబిక్, ఇథియోపియాలో కొన్ని భాషలు ఉన్నాయి. అరబిక్‌లో అతి మాత్ర భేదాలున్న అనేక మాండలికాలున్నాయి. పూర్వకాలంలో మాత్రమే ఉన్న కొన్ని సెమెటిక్ భాషలలో పుష్కలమయిన సాహిత్యం ఉంది. మెసపటోమియాలో అక్కాడియన్, సుమేరియన్ భాషలుండేవని అనేక శాసనాల వల్ల తెలుస్తోంది. ఈ శాసనాలే ప్రపంచంలో ప్రాచీనతమమైనవని అంటారు. అరమైక్, సిరియక్ పరస్పర సంబంధం ఉన్న మాండలికాలు. వీటిలో మత గ్రంథాలు ఇప్పటికీ ఉపయోగంలో ఉన్నాయి. ప్రాచీన హిబ్రూతో స్వల్ప భేదం మాత్రమే ఉన్న ఫొనీషియన్ మధ్యధరా ప్రాంతంలో వ్యాపారం కోసం వాడేవారు. లేఖన పద్ధతి ఈ భాషలోనే మొదట ప్రారంభమయిందంటారు.

బైబిల్‌లో Old testament అధిక భాగం హిబ్రూలోనే ఉంది. దీనినిప్పుడు ఇజ్రాయిల్ వ్యవహారిక భాషగా పునరుద్ధరించారు. గెవెజే అనే వీటికి సంబంధించిన ప్రాచీన భాషను చర్చిలలో వాడుతున్నారు.

**2. ఈజిప్షియన్ శాఖ:** ప్రాచీన ఈజిప్షియన్, దాని తరువాత రూపం కాప్టిక్ (ఇది కేవలం చర్చిలోనే వాడుతున్నారు.)

**3. బెర్బెర్ శాఖ:** కబిల్, షిల్, జెనగ, తుఅరెగ్ ప్రధానమయినవి. ఇవి ఉత్తర ఆఫ్రికా, సహారాలలో ఉన్నాయి.

**4. కుషిటిక్ శాఖ:** సోమాలీ, గల్లా, బెజా భాషలు ఆఫ్రికా తూర్పు ప్రాంతంలో ఉన్నాయి.

**5. చడ్ శాఖ:** నైజీరియామధ్యోత్తర ప్రాంతాలలోనూ, చెడ్ చెరువు చుట్టుపక్కలా ఈ శాఖకు సంబంధించిన భాషలున్నాయి. వీటిలో ముఖ్యమయినది హౌసా. మిగిలినవి అల్ప సంఖ్యాకుల భాషలు.

**(ఎఫ్). జపనీస్ భాషా కుటుంబం:** ఈ భాషా కుటుంబంలో జపనీస్, ర్యుక్యు ప్రధానమయినవి. కొరియన్ భాషకూ, జపనీస్ భాషా కుటుంబానికి చెందిన ఈ భాషలకు కొంత సంబంధముందని ఈ మధ్య కనుగొన్నారు.

**(జి). సినో-టిబెటిన్ భాషా కుటుంబం:** తూర్పు ఆసియాలో అన్నింటి కంటే పెద్ద భాషా కుటుంబం. ఇందులో

1. టిబెటో బర్మన్
2. చైనీస్

అనే రెండు శాఖలున్నాయి. టిబెట్‌లోనూ, చుట్టుపక్కలా మాట్లాడేది టిబెటన్. బర్మాలోని బర్మీస్, టిబెటో-బర్మన్ శాఖలో పెద్ద భాషలు. ఈ దేశాల మధ్య పర్వత ప్రాంతాలలో గారో, బోడో, నాగా, కుకి-చిన్ మొదలయిన అనేక భాషలు ఈ శాఖకు చెందినవి. దక్షిణ బర్మాలోని కరెన్ భాషలు ఏ కుటుంబానికి చెందుతాయో సరిగా తెలియదు.

చైనీస్ శాఖలో ప్రధాన భాష ఉత్తరచైనా అంతటా ఉన్న మండారిన్. ఆగ్నేయ చైనాలో చాలా భాషలున్నాయి. యంగ్‌త్సె నది ముఖ ద్వారంలో వూ మాండలికాలున్నాయి. వీటిలో ప్రసిద్ధమయినది సుచోవ్. దక్షిణ తీర ప్రాంతంలో ఫుకియెన్ మాండలికాలు అనేకం

ఉన్నాయి. అమొయ్, ఫూచోల్ మొదలయిన పేర్లు అవి వ్యవహారంలో ఉన్న పట్టణాల పేర్ల మీద ఏర్పడ్డాయి. లోపలి భాగంలో హక్కా ఉంది. దీనికి దక్షిణాన భాగంలో కంటోనీస్ మాండలికాలున్నాయి. నైరుతి చైనాలో స్థానిక భాషలు చాలా ఉన్నాయి. వీటిలో ప్రసిద్ధమయినవి మియావో, యావో.

## (హెచ్). మలయో-పోలినీషియన్ భాషా కుటుంబం:

ఈ భాషా కుటుంబం విస్తీర్ణంలో ఇండో-యూరోపియన్ తరువాత చెప్పుకో దగింది. ఇందులో పసిఫిక్ ద్వీపాలు, పశ్చిమాన మడ్గాస్కర్ దాకా ఉంది. ఇవి

1. పశ్చిమ శాఖ
2. తూర్పు శాఖ అని రెండు విధాలు.

**1. పశ్చిమ శాఖ:** ఇండోనీషియన్ శాఖ అని కూడా అంటారు. ఇందులో ఈస్ట్ ఇండీస్ లోని భాషలు పేర్కోదగ్గవి. వీటిలో ముఖ్యమయినవి మలే (సుమత్రా, మలయా, బోర్నియా) ఇంజానీషియన్ (ఇండొనీషియా), జావనీస్, సుండానీస్,మదురస్, బతక్, బలినీస్, డయాక్, మకస్సర్, తగలాగ్, బిసయన్, ఇలొకనొ, చముర్రో, మలగసీ మొ॥వి.

**2. తూర్పు శాఖ:** మైక్రొనిషియన్, పోలినీషియన్, మెలనీషియన్ అని ఇందులో మళ్ళీ మూడు భాగాలున్నాయి. పోలినీషియన్ భాషలు పరస్పరం చాలా సన్నిహిత సంబంధం కలవి. ఇవి బవాయి నుంచి న్యూజిలాండ్, ఈస్టర్ ద్వీపం, ఇంకా పశ్చిమ ద్వీపాల దాకా ఉన్నాయి. వీటిలో ప్రసిద్ధమయినవి హవాయియన్, టహిటియన్, సమొవన్, మయొరీ, ఫిజియన్. ఇంకా అనేక భాషలూ, పరస్పర దూర సంబంధం ఉన్నవీ మెలనీషియన్ విభాగంలో ఉన్నాయి.

## (ఐ). ఆస్ట్రో - ఏషియాటిక్ భాషా కుటుంబం:

ఈ కుటుంబానికి చెందిన భాషలు ఆగ్నేయ ఆసియా అంతటా ఉన్నాయి. దీనికి సంబంధించిన ముండా శాఖలోని భాషలు మధ్య భారతదేశ్‌లో ఉన్నాయి. వీటిలో ప్రసిద్ధమయినవి సవర, సంతాలీ, ఖడియా, గదబ, ఖాసీ (అస్సాం), నికోబార్ ద్వీపాలలో నికోబరీస్ ఉంది. ఉత్తర బర్మాలో పలుంగ్, వా, దక్షిణ బర్మాలో మొన్ ఉన్నాయి. ఇండో చైనాలో ఖ్మేర్, అధిక జనాభా ఉన్న వియత్నమీస్ ఉన్నాయి.

అమెరికాలో యూరోపియన్లు వలస వెళ్ళక పూర్వం నుంచీ అనేక భాషలు ఉన్నాయి. వీటిలో కొన్ని యూరోపియన్ భాషా ప్రవాహంలో మునిగిపోయినా ఇప్పటికీ చాలా భాషలు మారుమూల ప్రాంతాలలో గృహ భాషలుగా మిగిలి ఉన్నాయి. వీటిని (అమెరికన్) ఇండియన్ భాషలంటారు. వలస వెళ్ళడం వలన అమెరికాలో స్థిరపడిపోయిన యూరోపియన్ భాషలు ఇంగ్లీషు, స్పానిష్, పోర్చుగీసు, ఫ్రెంచి, ఇటాలియన్, జర్మన్. ఈ ప్రవాహానికి తట్టుకొని వేల కొలది జనుల వ్యవహారంలో మిగిలి ఉన్న (అమెరికన్) ఇండియన్ భాషలు దక్షిణ అమెరికాలో నాలుగు - పెరగయ్, నెరుతి, బ్రెజిల్ లలో గ్వరాని గృహ భాషగా మిగిలింది. వీళ్ళు ఇంటి బయట స్పానిష్ గాని, పోర్చుగీసు గాని వాడతారు. పెరూ, ఎక్వడోర్, బొలీవియాలలో లక్షలాది జనం క్వెచువా మాట్లాడతారు. దక్షిణ పెరూ, బొలీవియాలలో అయ్‌మరా ఉంది. తుపి గ్వరానీ మీద ఆధారపడిన లింగ్వా జెరాల్ విభిన్న భాషల వారి మధ్య పరస్పర వ్యవహారానికి ఉపయోగించే భాషగా అమజోనియన్ బ్రెజిల్‌లో కొంత కాలం క్రితం దాకా బాగా వ్యవహారంలో ఉండేది. ఇప్పుడు దీని స్థానాన్ని క్రమక్రమంగా పోర్చుగీసు ఆక్రమిస్తోంది.

మధ్య అమెరికాలో లక్షల కొలది జనం వ్యవహారంలో స్థానిక భాషలు ఉన్నాయి. ఇవి స్పానిష్ ప్రభావానికి లోనవుతున్నాయి. మెక్సికో, గౌతమేలా లలో నహోహత్ల్ (10 లక్షలు), క్విచె, బక్, చిక్వెల్, మాం, యుకాటెక్ మొ॥ భాషలున్నాయి.

తూర్పు తీరంలో కెరోలినా నించి ఉత్తరాన లబ్రాజర్ వరకు ఆల్గాంక్వియన్ భా,లుండేవి. యూరోపియన్లు మొదట ఈ ప్రాంతానికే వలస వచ్చారు. కాబట్టి ఇంగ్లీషు, ఫ్రెంచిలలో ఈ భాషల నుంచి వచ్చ చేరిన మాటలు చాలా ఉన్నాయి.

ఆగ్నేయ అమెరికాలో అనేక భాషలున్నాయి. వీటిలో ముఖ్యమయినదీ, పెద్దదీ అయినది నట్‌షెజ్ - మస్కోజియాకు సంబంధించిన భాషలనేకం ఉన్నాయి.

## (జె) ద్రావిడ భాషా కుటుంబం:

ఈ భాషా కుటుంబంలోని ముఖ్య భాషలు ప్రధానంగా దక్షిణ భారతదేశంలో వ్యవహారంలో ఉన్నాయి. సుమారు 30 కోట్ల మంది జనాభా ఈ భాషలను మాట్లాడతారు.

ఇవి ప్రధానంగా మూడు ఉప భాషా కుటుంబాలుగా విభజించారు.

### దక్షిణ ద్రావిడ భాషలు:

1. తమిళం
2. మలయాళం
3. కన్నడం
4. తుళు
5. కొడగు
6. తొద
7. కోత
8. బడగ

### మధ్య ద్రావిడ భాషలు:

1. తెలుగు
2. గోండి
3. కొండ
4. కుఇ
5. కువి
6. పెంగొ
7. మండ
8. అవూత్
9. ఆవె
10. కోలామీ
11. నాయకీ
12. పర్జీ
13. గదబ
14. ఒల్లారీ

### ఉత్తర ద్రావిడ భాషలు:

1. కురుఖ్
2. మాల్తో
3. బ్రాహూఈ
4. థంగర్

ఇవిగాక 70 వేల మంది వ్యవహర్తలు గల ఎరుకల, 75 వేల మంది వ్యవహర్తలు గల యెరువ, కురుట, కైకాడి, కొరవ, ఇరుళ, బుర్గండి మొదలయిన భాషలున్నాయని ఆంద్రనోవ్ తెలిపాడు.

పరిశోధితం కాని కొన్ని దక్షిణ ద్రావిడ భాషలను గురించి అణ్ణామలై విశ్వ విద్యాలయంలో పరిశోధనలు జరుగుతున్నాయి. కొన్ని మధ్య ద్రావిడ భాషల గురించి భారతీయ భాషల కేంద్ర అధ్యయన శాఖ పరిశోధన సాగిస్తున్నట్లు తెలుస్తోంది. గోండీ భాష పై పరిశోధన తెలుగు అకాడమీ చేసింది.

చిన్న చిన్న భాషా కుటుంబాలు కొన్నిటిని కలపటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాగే పెద్ద భాషా కుటుంబాలు కొన్నింటి మధ్య పరస్పర సంబంధం నిరూపించటానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి సంబంధాలు చరిత్రలో అనేక సహస్రాబ్దాలు వెనక ఉన్న పరిస్థితికి సంబంధించినవి కాబట్టి వీటిని నిరూపించటానికి నిశిత పరిశ్రమ అవసరం. పయిగా ప్రతి రెండు మానవ భాషలకీ ఎంతో కొంత సంబంధముందని ఊహించటం తేలిక. నిరూపించటం కష్టం కాబట్టి ఇంతవరకూ ఈ విషయంలో వచ్చిన సూచనలు పరిశోధన ప్రారంభ దశలో ఉన్నట్టు గ్రహించాలి. వీటిని సిద్ధాంతాలని నమ్మడం గాని, పూర్తిగా నిరాకరించడం గాని సాధ్యం కాదు. ఉదాహరణకి ఫిన్నో ఉగ్రిక్, అల్టాయిక్ కుటుంబాలు బృహత్కుటుంబమనీ ఒక వాదం. ఇందులో కొందరు జపనీస్, కొరియన్, ఎస్కిమోలని కూడా చేర్చారు. ఇవి కాక ఫిన్నో-ఉగ్రిక్, ఇండో-యూరోపియన్‌కి సంబంధం కలదని కొందరూ, ద్రవిడియన్‌కి సంబంధం కలదని మరికొందరూ, ఆస్ట్రో-ఏషియాటిక్ సంబంధం కలదని మరికొందరూ వాదిస్తున్నారు. ఇండో-యూరోపియన్‌కి సెమెటిక్‌కీ సెనెగల్

లో వొలఫ్, సెరెర్, ఫులార్ భాషలకీ పరస్పర సంబంధం నిరూపించటానికి ఇటీవల ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి సంబంధాలని నిరూపించటానికి ఇతోధికంగా శ్రమ అవసరమవుతుంది.

**సమీక్ష:-** వంశానుగుణ వర్గీకరణ అంటే ఏమిటో, అందలి భాషా కుటుంబాలేమిటో, వివరంగా తెలుసుకుంటారు.

## ప్రశ్నలు

1. వంశానుగుణ లేక జన్యత్మాక వర్గీకరణను గూర్చి వివరించండి.
2. భాషా కుటుంబాలను గూర్చి వివరించండి.
3. ద్రావిడ భాషా కుటుంబాన్ని గూర్చి తెల్పుము.

## ఆధారగ్రంథ పట్టిక


1. Hockett. Charles F. 1958 A Course in Modern Linguistics. NewYork Macmillan.
2. Lehmann Winfred 1962 Historical Linguistics, An Introduction NewYork : Holt
3. సుబ్రహ్మణ్యం పి.ఎస్. 1984 ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, పబ్లిక్‌గార్డెన్స్, హైదరాబాద్ - 4

# పాఠం 6 ధ్వని శాస్త్రం - ఉచ్చారణాత్మక ధ్వని శాస్త్రం - ధ్వని తరంగాత్మక ధ్వని శాస్త్రం - శ్రవణాత్మక ధ్వని శాస్త్రం ముఖ యంత్రం - ఉచ్చారణావయవాలు

పాఠ్యాంశ నిర్మాణ క్రమం


**6.1** ధ్వని శాస్త్రం - నిర్వచనం
**6.2** ధ్వని విజ్ఞానం - ప్రయోజనం
**6.3** భాషా ధ్వనుల ఉత్పత్తి
**6.4** భాషా ధ్వని అవస్థలు
**6.5** ఉచ్చారణాత్మక ధ్వని శాస్త్రం
**6.6** ధ్వని తరంగాత్మక ధ్వని శాస్త్రం
**6.7** శ్రవణాత్మక ధ్వని శాస్త్రం
**6.8** ఉత్పత్తిని బట్టి భాషా ధ్వనుల వర్గీకరణ
**6.9** వాగింద్రియాల అనువర్ణనం


**లక్ష్యం:-** ధ్వని శాస్త్ర నిర్వచనాన్ని - భేదాలను - ముఖయంత్ర - ఉచ్చారణ అవయవాలను గురించి తెలుసుకుంటారు.

## 6.1 ధ్వని శాస్త్రం - నిర్వచనం

ధ్వనుల ఉచ్చారణాన్ని అభివర్ణించి, అవి ఏ వర్గానికి చెందుతాయో, అలాంటి ఉచ్చారణకు ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ తోడ్పడే మానవ శరీరావయవాలు ఎలాంటివో నిరూపించేది ధ్వని శాస్త్రం లేదా ధ్వని విజ్ఞాన శాస్త్రం (Phonetics). ఒకానొక భాషలోని ధ్వనుల్ని, వాటితో ఏర్పడ్డ వర్ణాల్ని, వర్ణక్రమాన్ని వివరించే దానిని ధ్వని విజ్ఞాన శాస్త్రం (Phonology) అంటారు.

మానవుడి సంపూర్ణాభిప్రాయం వాక్యం మూలంగా ప్రకటితమవుతుంది. శాబ్దికులీ వాక్యం నుంచి పదాల్ని ఉద్ధరిస్తారు. పదాల నుంచి వర్ణాలను ఉద్ధరిస్తారు. వర్ణంలో ఒకటి గాని, అంతకంటె ఎక్కువగాని ధ్వనులుంటాయి. కాబట్టి భాషలో ఉన్న అతి కనిష్ఠాంశాన్ని ధ్వని (Sound) అని అనవచ్చు. అయితే మానవుల ఏడ్పులు, నవ్వులు, ఈలలు మొదలయినవి భాషా ధ్వనులు కావు. వాటి వల్ల కొంత భావ ప్రకటన జరగవచ్చు. అయినా అవి ఈ పరిధిలోకి రావు.

భాషా శాస్త్రాధ్యయనం చేసే వాళ్ళకు ఈ ధ్వని పరిజ్ఞానం చాలా అవసరం. ధ్వని పరిజ్ఞాన ప్రాతిపదిక పైనే వారి భాషా శాస్త్ర పాటవం ఆధారపడి ఉంటుంది. అందుచేత ధ్వని పరిజ్ఞానానికి శిక్షణ అత్యంతావశ్యకం.

ప్రాచీనకాలంలో సాహిత్యానికే ప్రాధాన్యం ఉండేది. అందుకోసం వ్యాకరణాలు విరివిరిగా వచ్చేవి. ఇప్పుడు వ్యవహారంలో ఉన్న భాష, దాని మాండలిక భేదాలు, అందులోని ఉచ్చారణా భేదాలు, ధ్వనుల్లో నియతంగా కలిగే మార్పులు, భాషా వ్యవస్థ అవగాహనానికి బాగా తోడ్పడతాయి.

## 6.2 ధ్వని విజ్ఞానం - ప్రయోజనాలు:

ధ్వని విజ్ఞానం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. అవి

1. పరిశోధనలు చేసి ఇంతకు పూర్వం గుర్తించని అనేక ధ్వని భేదాల్ని గుర్తించవచ్చు. అవి ప్రధాన ధ్వనులో, అప్రధాన ధ్వనులో నిర్ణయించవచ్చు.
2. భాషా ధ్వనుల పరివర్తనాన్ని బట్టి వర్ణ నిర్ణయం చేయవచ్చు.
3. భాషా ధ్వనుల వర్గీకరణం మీదనే లిపి నిర్ణయం ఆధారపడి ఉంటుంది. ప్రధాన ధ్వనులకే ప్రత్యేక లిపి చిహ్నాలు అవసరం. అప్రధాన ధ్వనులకు లిపి చిహ్నాల అవసరం ఉండదు.
4. భాషా బోధనకు, భాషా వ్యాప్తికి తోడ్పడుతుంది.
5. వర్ణనాత్మక వ్యాకరణరచనకే కాక చారిత్రక, తులనాత్మక వ్యాకరణాలకు కూడా ఈ విజ్ఞానం తోడ్పడుతుంది.
6. సాంకేతిక శాస్త్రజ్ఞులకు ధ్వని విజ్ఞాన మెంతగానో సహకరిస్తుంది. షార్టుహ్యాండు, టైపు రైటింగు, కంప్యూటర్లు, నిస్తంత్రీ సంకేతాలు నిర్ణయించటంలో ఈ విజ్ఞాన అవసరం ఎంతయినా ఉంది.

## 6.3 భాషా ధ్వనుల ఉత్పత్తి:

మానవ శరీరంలోని వాగింద్రియాల తోడ్పాటు వల్ల భాషా ధ్వనులు ఉత్పన్నమవుతాయి. వీటినే ధ్వని లేక వాక్ లేక ఉచ్చారణోత్పత్తి అవయవాలంటారు.

ఊపిరితిత్తుల నుంచి పెదవుల వరకు ఉన్న ఈ విభాగాన్ని ధ్వన్యుత్పత్తి అవయవ విభాగమంటారు.

వాగింద్రియాల ప్రధాన వ్యాపారం వాగుత్పత్తి కాదు. ఊపిరి పీల్చటం, ఆహార స్వీకారాదులు వీటి ముఖ్య వ్యాపారం. ఇది జంతు కోటికంతకూ వర్తించే లక్షణం. ఈ వ్యాపారాన్ని నిర్వహిస్తూనే మానవుడి విశిష్ట లక్షణాన్ని కూడా నిర్వహిస్తున్నాడు.

వాగుత్పత్తి లేకుండా కూడా మానవుడు మనగలుగుతాడు. మూగవాళ్ళను మనం చూస్తూనే ఉంటాం. అత్యంత ప్రాచీన కాలంలో మానవులంతా జంతువుల లాగానే ధ్వనులు చేస్తూ ఆహార సముపార్జనాదులు కావిస్తూ చెట్ల తొర్రలలో, కొండగుహలలో జీవిస్తుండే వాళ్ళనీ, క్రమంగా భాష ఆ తర్వాత నాగరికతా అలవడ్డాయని అంటారు. భాష సంక్రమిత వ్యాపారమని, శ్వసనాదులు సహజ వ్యాపారాలని కొందరు భావిస్తారు.

గాలిని లోపలికి పీల్చిన తరువాత అది బయటికి నిర్గమించేటప్పుడు ఆ ప్రవాహగతిలో ఆ స్వభాగ అవయవాలు కదలించటం లేక మార్పు చేయటం వల్ల ధ్వనులు ఉత్పన్నమవుతాయి. కాబట్టి శ్వాస ప్రవాహం గట్టిగా ఉంటేనే భాషా ధ్వన్యుత్పత్తి సంభవం.

ధ్వని అమూర్త పదార్థం. వినగలగటమే గాని చూడగలగటం కష్టం. దీని ఉత్పత్తికి ఆధారమయిన కొన్ని అవయవాలు మాత్రమే కనిపిస్తాయి.

## 6.4 భాషా ధ్వని అవస్థలు:

భాషా ధ్వనికి ప్రధానంగా మూడు అవస్థలున్నాయి.

1. ఉత్పత్తి
2. తరంగ రూపం
3. శ్రవణం

**(ఎ). ఉత్పత్తి:** వక్త వాగుత్పత్తి అవయవ చలనం వల్ల ధ్వని ఉత్పన్నమవుతుంది. ఈ ఉత్పాదన క్రమం దృశ్యా దృశ్యం.

**(బి). తరంగ రూపం:** ఉచ్చరితమయిన ధ్వనులు పెదవుల్ని దాటి గాలిలో కలసిపోతాయి. అవి శ్రోత చెవికి చేరే లోపల శబ్దం తరంగరూపంలో ఉంటుంది.

**(సి). శ్రవణం:** చెవికి సోకిన ఈ వాయు తరంగాలు శ్రోత కర్ణేంద్రియాల్లో ఉన్న కర్ణభేరి లోపలి భాగం చేత స్వీకరించబడి, అందులోని సందేశ వాహకాలయిన నరాల ద్వారా మెదడుకు చేరతాయి. ఈ శ్రవణావస్థ అగోచరం.

పై మూడు అవస్థలలో ఏ అవస్థనయినా ఆధారంగా స్వీకరించి భాషా ధ్వనుల్ని వర్గీకరించవచ్చు.

## 6.5. ఉచ్చారణాత్మక ధ్వని శాస్త్రం (Articulatory Phonetics):

ఒక ధ్వనిని ఉచ్చరించేటప్పుడు ముఖ యంత్రంలోని అవయవాలు ఏ విధంగా ప్రవర్తిస్తున్నాయని చెప్పేది ఉచ్చారణాత్మక ధ్వని శాస్త్రం. ధ్వన్యోచ్చారణ జరిగేటప్పుడు ముఖ యంత్రంలో జరిగే మార్పుల్ని గురించి పరిశీలించే ధ్వని శాస్త్ర శాఖని ఉచ్చారణాత్మక ధ్వని శాస్త్రమంటారు.

## 6.6. ధ్వని తరంగాత్మక ధ్వని శాస్త్రం (Acoustic Phonetics):

మనం ధ్వనులని ఉచ్చరించేటప్పుడు అవి గాలిలో కలిగించే విభిన్న ధ్వనులని ఉచ్చరించేటప్పుడు అవి గాలిలో కలిగించే విభిన్న ధ్వని తరంగాలని యంత్రాల ద్వారా నమోదు చేసి వాటిలో ఉన్న భేదాలని పరిశీలించవచ్చు. ఈ విధంగా పరిశీలించి, పరిశోధన చేసే శాఖని ధ్వని తరంగాత్మక ధ్వని శాస్త్రం అంటారు. దీనికి ప్రయోగ ధ్వని శాస్త్రం (Laboratory Phonetics) అనీ, యాంత్రిక ధ్వని శాస్త్రం (Instrumental Phonetics) అనీ, ప్రయోగాత్మక ధ్వని శాస్త్రం (Experimental phonetics) అనీ భిన్న వ్యవహారాలున్నాయి. అయితే పయిన పేర్కొన్న ఈ పరిశోధనకి యంత్రాలతోనూ అవి పని చేసే తీరుతోనూ భౌతిక శాస్త్రం తోనూ పరిచయం అవసరం. కాబట్టి ఇది ఈ శాఖలో ఈ పరిశోధన చేసే వారికే సాధ్యం. దీని వల్ల మన చెవులకి వినపడని సూక్ష్మభేదాలు తెలుస్తాయి. అయినా ధ్వని శాస్త్రాన్ని గురించిన సామాన్య జ్ఞానానికి ఉచ్చారణాత్మక శాఖతో పరిచయం సరిపోతుంది. ఉచ్చారణాత్మక శాఖలో ముఖ యంత్రంలోని అవయవాల కదలికని మనం చూడటానికీ, అనుకరించి పరిశీలించడానికీ అవకాశం ఉంది. కాబట్టి ఉచ్చారణాత్మక శాఖని గూర్చి ముందు క్షుణ్ణంగా తెలుసుకోవటం అవసరం.

## 6.7. శ్రవణాత్మక ధ్వని శాస్త్రం (Auditory Phonetics):

ఉచ్చరితాలయిన ధ్వనుల వాయు తరంగాలు చెవిలోకి ప్రవేశించి అవి కర్ణభేరి, దానికి సంబంధించిన ఎముకల మీద ఎలాంటి మార్పులు కలిగిస్తాయనే దాన్ని పరిశీలించవచ్చు. అంటే వినికిడిని బట్టి ధ్వనుల్ని వర్గీకరించే విధానాన్ని శ్రవణాత్మక ధ్వని శాస్త్రమంటారు. అయితే ఇది కష్ట సాధ్యం. భాషా శాస్త్రాత్మ్నికి మిగిలిన రెండు శాఖల వల్ల తెలిసే జ్ఞానమే సరిపోతుంది. కాబట్టి భాషా శాస్త్రజ్ఞులు ఈ శాఖలో అంత ఎక్కువ పరిశోధణ చెయ్యలేదు.

## 6.8. ఉత్పత్తిని బట్టి భాషా ధ్వనుల వర్గీకరణ:

ఊపిరితిత్తుల నుంచి పెదవుల వరకు గల మానవ శరీరం లోని వాగుత్పత్తి అవయవాలను రెండు రకాలుగా విభజించారు.

అవి 1. ప్రత్యక్ష భాగస్వాములు

2. పరోక్ష భాగస్వాములు

**ఎ. ప్రత్యక్ష భాగస్వాములు** (Direct Participants):

ఇవి పెదవుల నుంచి కృకాగ్రం వరకు శరీర భాగమందు విస్తరించి ఉన్న అవయవాలు.

1. కృకాగ్రం లేక కాకలకం
2. స్వరపేటిక
3. నాదతంత్రులు లేక స్వర తంత్రులు
4. సప్తపథ
5. సప్తపథ కుడ్యం
6. లంబిక
7. మృదుతాలువు లేక స్నిగ్ధతాలువు
8. మూర్థం
9. కఠిన తాలువు
10. దంతమూలం
11. పై ముందు పళ్ళ వరుస
12. పై పెదవి
13. కింది పెదవి
14. కింది పండ్ల వరుస
15. నాలుక కొన
16. జిహ్వాగ్రం
17. జిహ్వా మధ్యం
18. జిహ్వా మూలం
19. జిహ్వా బర్సం
20. జిహ్వా పృష్ఠం
21. నాసికాంతర్భాగం

**బి. పరోక్ష భాగస్వాములు** (Indirect Participants):

ఊపిరితిత్తులు, శ్వాసకోశాలు, మెదడు, మెదడు నుంచి జ్ఞానేంద్రియాల వరకు ఉన్న నాడీమండల నిర్మాణం.

ధ్వనికి అత్యంత ప్రధానమైనది శ్వాస ప్రవాహం. ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు సరిగా లేకపోతే ధ్వన్యుచ్చారణమే సరిగా ఉండదు. దీనికి సంబంధించని ధ్వనులు ప్రపంచంలో ఏ భాషలోనూ లేవు.

మెదడు ఆదేశం లేనిది వాగింద్రియాలు గాని, ఇతర అవయవాలు గాని పనిచేయవు. నరాలు కూడా పని చేయవు. సందేశ వాహకాలయిన నరాలు ధ్వన్యుచ్చారణకు సంబంధించినవి కాకపోయినా ఇవి లేనిదే ఉచ్చారణ లేదు.

పరోక్ష భాగస్వాములు కేవలం నేపథ్యంలో ఉండి వాగుత్పత్తికి ఉపయోగపడతాయి.

పై పేర్కొన్న ఈ అవయవాల్ని శాస్త్రకారులు స్థానం, కరణం అని రెండు విధాలుగా వింగడించారు. స్థానాలంటే ఉచ్చారణా స్థానాలు (Points of articultaion) కరణాలంటే ఉచ్చారణ కావించేవి (Articulators). స్థానాలు ప్రాయికంగా కదలనివి. కరణాలు కదలిక కలవి. నోటిలో పై భాగంలో ఉన్నవి స్థానాలు. కింది భాగంలో ఉన్నవి కరణాలు. సప్తపథ, నాసికారంధ్రాలు కూడా స్థానాలే.

స్వరపేటికలో ఉన్న నాదతంత్రులు మాత్రం స్థాన, కరణాలు రెండూ అవుతాయి.

ఏ అవయవాలకు, ఏ అవయవాంతర స్పర్శ వల్ల ధ్వన్యుత్పత్తి కలుగుతుందో చెప్పాలి. శ్వాస ప్రవాహగతిలో మార్పు కలిగించినపుడే ఉచ్చారణ ఏర్పడుతుంది. స్థాన కరణాలకు సంపూర్ణం గానో, అసంపూర్ణం గానో స్పర్శ ఉంటేనే ధ్వన్యుచ్చారణ సంభవమవుతుంది. ప్రాచీన భారతీయులు స్థానానికే ప్రాధాన్యమివ్వగా, ఆధునిక భాషా శాస్త్రం మాత్రం స్థాన, కరణ, ప్రయత్నాదులకు అన్నింటికీ తుల్య ప్రాధాన్యాన్ని ఇస్తుంది.

## 6.9 వాగింద్రియాల అనువర్ణనం(Descriptim of Organs of Speech):

**ఎ. పెదవులు:** వాగుత్పత్తికి కింది పెదవి, పై పెదవి అత్యవసరాలు. శిశువు మొట్టమొదట వాగుత్పత్తికి ఈ అవయవాలనే ఉపయోగిస్తుంది. పాలు పీల్చటం (Milk Sucking) చేత పెదవులు గట్టిపడి అప్ప, అమ్మ లాంటి శబ్దాల ఉచ్చారణలో ఇవి తోడ్పడతాయి. పెదవుల నిర్మాణంలో లోపముంటే ఉచ్చారణ స్పష్టంగా ఉండదు.

**బి. ఉచ్ఛరితమయ్యే ధ్వనులు:** పెదవులు సంపూర్ణ స్పర్శమున్నప్పుడు 'పఫబభమ' అనేధ్వనులు ఉచ్ఛరితమవుతాయి. వీటిని 'ఓష్ఠ్యాలు' అంటారు. ప్రాచీన వైయాకరణులు 'ఓష్ఠజా'లన్నారు.

పెదవుల్ని గుండ్రంగా చేయటం వల్ల 'ఉఊ ఒఓ'లు ఉచ్చరితమవుతాయి. ఆధునికులు వీటిని ఓష్ఠజాలంటారు. ఇవి ఆస్య పృష్ఠ భాగంలో ఉచ్చరితాలు కాబట్టి వీటిని పశ్చాదచ్చులు (back vowels) అంటారు.

సంస్కృతంలో 'వ' దంత్యోష్ఠ్యం (labio-dental), అంతస్థం. ఆంగ్లంలో 'ఫ్' దంత్యోష్ఠమే. పై దంతాల వెనుక భాగం స్థానం కాగా కింది పెదవి కరణం. ఆంగ్లంలో ఫ, వలు దంత్యోష్ఠ్యాలే కాక ఊష్మాలు కూడా.

**మకారం:** ఉభయోష్ఠ్యాను నాసికం (Bilabial-nasal). కొన్ని భాషల్లో దంత్యోష్ఠ్యాను నాసిక 'మ' ఉంది.

ఇ, ఈ, ఎ, ఏలను ఉచ్చరించేటప్పుడు పెదవులు చెవుల వైపు విస్తరిస్తాయి. కాబట్టి వీటిని విస్తారిత స్వరాలంటారు.

## సి. ఉభయ దంత శ్రేణి:

ఇవి మొత్తం 32. వీటిలో ముందు పళ్ళు మాత్రమే ఉచ్చారణకు ప్రధానం. వీటినే భేదక దంతాలు లేక కొరకుడు పళ్ళు అంటారు. వీటిలో అగ్రచ్ఛేదక దంతాలు నాలుగు (పైవి 2+కిందివి 2) వీటి పక్కల కింది, పైన, కుడి, ఎడమల నాలుగు పార్శ్వచ్ఛేదక దంతాలున్నాయి. వీటి పక్కనున్న వాటిని కోర పళ్ళంటారు. ఇవి కింద, పైన, కుడి, ఎడమల్లో ఉంటాయి. మిగిలినవి తిరుగలిపళ్ళు (molar teeth) ఇవి మూడు. మూడోదాన్ని జ్ఞాన దంతం (wisdom tooth) అంటారు.

దంతాలు స్థానంగా ఉచ్చరితమయ్యే ధ్వనులు దంత్యాలు (dentals). ఉ. తెలుగులోని ప, ఫలు దంత్యోష్ఠ్యాలు. ఉభయదంత శ్రేణిలో నిమిత్తం ఉన్న ధ్వనుల్ని (Inter dental frications) అంతర్దం త్యోష్మాలంటారు. ఆంగ్లంలోని 'think, thank' వంటి పదాలలోని ఆది ధ్వనిని తీటా అని, though, this, that వంటి పదాలలోని ఆది ధ్వనిని 'డెల్టా' అనీ అంటారు.

## డి. దంత మూలం/వర్ష్యం (teeth ridge or alveolar ridge):

ఇది కఠినతాలు భాగానికి, పై దంతాలకు మధ్య నుండే భాగం. అంటే పై దంతాల వెనుక ఉబ్బెత్తుగా ఉండే భాగం. దంత మూలం స్థానంగా ఉచ్చరితమయ్యే ధ్వనుల్ని దంతమూలీయాలు లేక వర్త్స్యజాలు (alveolar sounds) అంటారు. తెలుగులో ర, ఱ, ల, చే, నలు ఈ కోవలోకి వస్తాయి.

తెలుగులో ఉన్న దంత్య నకారం దంత్య స్పర్శాలకు ముందు వచ్చినప్పుడు దంత్యాను నాసికం అవుతుంది. సంస్కృతంలో ల, సలు దంత్యాలు ఆంగ్లంలో t, d, n, r, l, s లు దంత మూలీయాలు.

## ఇ. కఠినతాలువు (hard palate):

మూర్ధానికి, దంత మూలీయానికి మధ్య గల ఉబ్బెత్తు భాగం. కఠిన తాలువు స్థానంగా ఉచ్చరితమయ్యే ధ్వనులు తాలవ్యాలు. సంస్కృతంలో చ వర్గం, ఇ, ఈ, ఏ, య, శలు తాలవ్యాలు. తెలుగులోని చ, జ లు తాలవ్య స్పృష్టోష్మాలు (Palatal affricates).

### ఎఫ్. మూర్ధం (dome region):

వక్ర వివరోపరి భాగంలో అత్యున్నత స్థానం. ఇది స్థానంగా ఉచ్చరితమయ్యే ధ్వనులను మూర్ధన్యం లేదా మూర్ధజాలంటారు. సంస్కృతంలో ఋ, ౠ, ట, ఠ, డ, ఢ, ణ, ర, ష, లు మొ॥న వాటిలోని 'ష'లు మూర్ధన్యాలు మూర్ధన్య స్పర్శాలయిన ట ఠ డ ఢ ణ లు భారతీయ భాషల్లో తప్ప మిగిలన ప్రపంచ భాషల్లో లేవు.

### జి. స్నిగ్ధ తాలువు లేక హనుమూలం (Velar):

మూర్ధన్యానికి, లంబికకు మధ్య గల తాయి భాగం ఇక్కడ ఉత్పన్నమయ్యే ధ్వనుల్ని హనుమూలీయా (Velar) లంటారు. తెలుగులో క, గ, జ - ఆంగ్లంలో k, g, సంస్కృతంలో క, ఖ, గ, ఘ, ఙలను కంఠ్యాలంటారు.

### హెచ్. లంబిక / కొండ నాలుక (uvula):

దీనిని 'అధిజిహ్వ' అని కూడా అంటారు. ఇది మృదు తాలువు విస్తృత భాగం (extension of velum). లంబిక సరిగా పని చేయకపోతే అనునాసిక, నిరనునాసిక భేదం తెలియదు. కంఠం నుంచి వచ్చే గాలి నాసిక ద్వారా వెళ్తే అనునాసికాలు ఉచ్చరితాలవుతాయి. కొండనాలుక నాసికా ద్వారాన్ని మూస్తే నిరనునాసికాలుచ్చిరిత మవుతాయి. అనునాసిక, నిరనునాసిక భేదాన్ని కలిగించేది కొండ నాలుక.

అరబిక్ భాషలో క, గలు హనుమూలీయాలే కాక (Velar sounds) జిహ్వామూల కారణంగా కొండ నాలుక స్థానంగా ఉచ్చరితాలు. వీటినే పరహనుమూలీయ ధ్వనులు (uvular or postvelar sounds) అని అంటారు.

### ఐ. జిహ్వ (Tongue):

ధ్వన్యుత్పత్తిలో అన్ని అవయవాల కంటె అత్యంత ప్రధానమైనది. కొన్ని భాషల్లో 'Tongue' అంటే కేవలం నాలుక అని అర్థమే గాక 'భాష' అనే అర్థంకూడా ఉండటాన్ని బట్టి నాలుకకు ఎంతటి ప్రాముఖ్యముందో ఊహించవచ్చు. ఉదాహరణకు

| | | | | |
|---|---|---|---|---|
| ఆంగ్లం | - | tongue | = | language |
| ఫ్రెంచి | - | lingua | = | tongue, language |
| అరబిక్ | - | LSN | = | tongue |
| | | Lasan | = | language |

జిహ్వను కరణం (articulator) అంటారు. అంటే చలించే స్వభావం కలది. పెదవుల నుంచి సప్తపథ వరకూ ఉన్న ధ్వన్యుత్పత్తి అవయవాలతో దీనికి సంబంధం ఉంది. ఇది ఆస్య భాగమంతా వ్యాపించి ఉంది. జిహ్వాబర్సం (కొన) పెదవుల వరకు వస్తుంది. ఇది అయిదు భాగాలు. అవి.

1. జిహ్వాగ్రం (blade of the tongue)
2. జిహ్వా బర్సం (tip of the tongue)
3. జిహ్వామధ్యం (middle of the tongue)
4. జిహ్వా మూలం (back of the tongue)
5. జిహ్వా పృష్ఠం (root of the tongue)

నాలుక కొనను 'apex' అని కూడా అంటారు. దీని తోడ్పాటుతో ఉత్పన్నమయ్యే ధ్వనులు apecal sounds. స్థాన కరణాల రెంటిని కలిపి వర్ణిస్తే దంత్యాలను apeco-dentals అంటారు.

జిహ్వను 'dorsum' అని కూడా అంటారు. ఇది కరణంగా గల ధ్వనుల్ని 'dorsal sounds' అంటారు. జిహ్వామూలం కరణం, హనుమూలం స్థానం గా గల ధ్వనుల్ని 'dorso-velar sounds' అంటారు.

నాలుక ప్రమేయం అత్యధికంగా ఉన్న ధ్వనులు ల, ళలు. 'ల' దంతమూలీయం, 'ళ' మూర్ధవ్యం. వీటిని ఉచ్చరించేటప్పుడు నాలుకకు ఇరుపక్కల నుంచి గాలి నిర్గమిస్తుంది. అందుచేత వీటిని పార్శ్వికాలు (laterals) అంటారు.

అచ్చులను ఉచ్ఛరించటంలో నాలుక ఎత్తును బట్టి అమెరికన్ భాషా శాస్త్రజ్ఞులు ఈ విధంగా వర్గీకరించారు.

| | FRONT | | CENTRAL | | BACK | |
|---|---|---|---|---|---|---|
| | un-rounded | Rounded | Un-rounded | Rounded | Un-rounded | Rounded |
| HIGH | i | ü | ṫ | u̇ | ï | u |
| LOWER-HIGH | I | ü | ɨ | u̇ | Ï | u |
| HIGHER-MID | e | ö | ė | ȯ | ë | o |
| MEAN-MID | E | Ω̈ | ∂ | Ω̇ | Ë | Ω |
| LOWER-MID | ε | Œ̈ | ε̇ | ∂̇ | ^ | ɜ |
| HIGHER-LOW | x | ω̈ | ẋ | ω̇ | ẍ | ω |
| LOW | Æ | p̈ | a | ṗ | a | p |

ఉన్నత స్వరాలు (high vowels) ఇ, ఈ, ఉ, ఊ , నిమ్న స్వరాలు (low vowels) అ, ఆ మొత్తం ఏడు ఎత్తుల్ని వారు చూపించారు.

నాలుకతో సంబంధం లేని ధ్వనులు - ఓష్ఠ్యాలు. నాదతంత్రులలో ఉత్పన్నమైన ధ్వనులకు నాలుకతో పని లేదు.

## జె. నాసికాంతర్భాగం (Nasal Cavity):

అనునాసిక ధ్వన్యుచ్చారణలో తొంబయి శాతం గాలి నాసిక నుంచి వెళ్ళుతుంది. నాసిక ద్వారా శ్వాస నిర్గమనం ఉన్న ధ్వనుల్ని అనునాసికాలంటారు. వర్గ ధ్వనుల లాగా స్థాన, కరణ సంయోగానంతరం వర్గ పంచమాక్షరాలైన ఙ, ఞ, ణ, న, మ లను అనునాసికాలంటారు.

## కె. కంఠమూలం:

ఇక్కడ ఉచ్చరితమయ్యే ధ్వని - హ. ఇది కంఠమూలీయోష్మం.

## ఎల్. సప్తపథ:

జిహ్వా పృష్ఠానికి, గళ వివర కుడ్య భాగానికి మధ్య ఉన్న దానిని సప్తపథ అంటారు. ఇది ఉచ్చారణావయవం కాకపోయినా ఉచ్చారణకు తోడ్పడుతుంది.

## ఎమ్. గళబిలం(glottis)-కృకాగ్రం లేక స్వరపేటిక(sound box):

ఇది కృకాగ్రంలోని అవయవం. ఇందులో నాద తంత్రులతో కూడిన రెండు పెదవుల వంటి కండరాలుంటాయి. ఈ నాద తంత్రులు ఒక దానికొకటి దగ్గరగా వచ్చి ద్వారాన్ని మూయటం, లేక కొంత మూయటం, లేక పూర్తిగా దూరంగా ఉండటం సంభవిస్తుంది.

నాద తంత్రులు రెండూ స్థాన కరణాలే. వాయు స్తంభనానంతరం స్ఫోటనం చేస్తే ఒక విధమైన ధ్వని పుడుతుంది. దీనిని glottal stop (?) అని అంటారు. ఈ ధ్వని తెలుగులో అచ్చుల్ని చదివేటపుడు హ్రస్వ దీర్ఘాల మధ్య వస్తుంది.

ఉదా. అ?ఆ, ఇ?ఈ. కొన్ని మధ్య ద్రావిడ భాషలలో ఈ ధ్వని ప్రత్యేక వర్ణం.

## ఎన్. ప్రయత్నం(manner or method of articulation):

ధ్వన్యుత్పత్తికి స్థాన కరణాలతో పాటు ప్రయత్నం కూడా ఎంతో ముఖ్యం. స్థాన, కరణ సంయోగం ఎలా జరుగుతుందో వివరించటమే ప్రయత్నం.

ప్రాచీనులు ప్రయత్నాన్ని అభ్యంతర ప్రయత్నం, బాహ్య ప్రయత్నం అని రెండు విధాలని చెప్పారు.

**1. అభ్యంతర ప్రయత్నం:** పెదవుల నుంచి జిహ్వా మూలం వరకు ఉన్న అస్యభాగంలో జరిగే ప్రయత్నం. ఇది నాలుగు విధాలు.

1. స్పృష్టం 2. ఈషత్ స్పృష్టం 3. సంవృతం 4. వివృతం

**2. బాహ్య ప్రయత్నం:** ఆస్య బహిర్భాగంలో జరిగే ప్రయత్నం. జిహ్వా మూలం నుంచి కృకాగ్రం వరకు ఉన్న భాగాన్ని ఆస్య బహిర్భాగమంటారు. ఇవి 11 విధాలు.

1. శ్వాసం
2. నాదం
3. అల్పప్రాణం
4. మహాప్రాణం
5. సంవారం
6. వివారం
7. ఘోషం
8. అఘోషం
9. ఉదాత్తం
10. అనుదాత్తం
11. స్వరితం.

కాగా ఆధునికులు ప్రాచీనులు పేర్కొన్న బాహ్య, అభఅయంతర ప్రయత్నాలకు సంబంధించని కొన్ని ప్రయత్న భేదాల్ని చెప్పారు. అవి ఆరు.

1. అనునాసిక ప్రయత్నం
2. పార్శ్విక ప్రయత్నం
3. తాడిత ప్రయత్నం
4. కంపిత ప్రయత్నం
5. ఊష్మ ప్రయత్నం
6. అంతస్థ ప్రయత్నం

## ముఖ యంత్రం:




## ఉచ్చారణావయవాలు:

1. నాసికా ద్వారం
2. నాసికాంతర్భాగం
3. పెదవులు
4. పళ్ళు
5. వర్త్స్యం
6. కఠినతాలువు
7. మృదుతాలువు
8. కొండనాలుక
9. జిహ్వాగ్రం
10. జిహ్వామధ్యం
11. జిహ్వామూలం
12. స్వరపథ
13. కంఠ బిలం
14. నాదతంత్రులు
15. జిహ్వాగ్రం

## ఉచ్చారణావయవాలు:

ఉచ్చారణాత్మక ధ్వని శాస్త్రానికి పునాది వేసిన వారు మన ప్రాచీన సంస్కృత వైయాకరణులు. పాణినికి ముందు కాలంలోనే వారు శిక్షా, ప్రాతిశాఖ్యలలో సంస్కృత భాషలోని ధ్వనులు ఎలా ఉత్పత్తి అవుతాయో శాస్త్రీయంగా వివరించారు. వాటి ఆధారంగా ఇటీవలి కాలంలో పాశ్చాత్య పండితులు అన్ని భాషలకి వర్తించేటట్లు ధ్వని శాస్త్రాన్ని విస్తృత పరచి పరిపుష్టం చేశారు.

మనం ధ్వనుల్ని ఉత్పత్తి చేసేందుకు ఉపయోగించే అవయవాలు నోటిలో భాగాలూ, గొంతుకి, ముక్కు కాని ఈ అవయవాల ముఖ్య విధి ధ్వనులని ఉత్పత్తి చెయ్యడం కాదు. నోరు తినడానికి, ముక్కు గాలి పీల్చడానికి, గొంతుక ఆహారమూ, గాలీ లోపలికి పోవడానికి ఉద్దిష్టమయినవి. ఇతర జంతువులలో ఈ అవయవాలు మాట్లాడటానికి గాక, పైన చెప్పిన వ్యాపారాలకి మాత్రమే ఉపయోగించటం వల్ల ఈ విషయం స్పష్టమవుతుంది. మానవుడు మాత్రం ఈ అవయవాలని భాషా ధ్వనుల్ని ఉత్పత్తి చెయ్యడానికి కూడా ఉపయోగించుకొనే నేర్పు సంపాదించుకొన్నాడు.

సాధారణంగా ధ్వనులు ఊపిరితిత్తులలో నుంచి బయటకు వచ్చే గాలి గొంతుకలోనూ, నోటిలోనూ పీడనకు లోనవడం వల్ల పుడతాయి. ఒక్కొక్క ధ్వని పుట్టడానికి ఈ గాలి ఒక్కొక్క రకంగా మార్పుకు లోనవుతుంది. కాబట్టి ప్రతి ఒక్క ధ్వని ఏ విధంగా పుడుతుంది అనేది మనం గమనించవచ్చు. మనం విభిన్న ధ్వనులని ఉచ్చరించగలగటం ముఖ్యంగా మూడు విషయాల మీద ఆధారపడి ఉంది. అవి -

1. స్వరపేటిక (larynx) లో కలిగే మార్పు.
2. గొంతుకలో గాని, నోటిలో గాని గాలి నిరోధించబడే సాఅథనం దీనిని ఉచ్చారణ స్థానం (Point of articulation) అంటారు.
3. గొంతుకలో గాని, నోటిలో గాని గాలిని నిరోధించే వ్యాపారంలో భేదం. దీనిని ఉచ్చారణ ప్రయత్నం (Manner of articulation) అంటారు.

ధ్వనుల విభజనకి ఈ మూడు మూల ఆధారాలు అయినా కొన్ని ధ్వనుల విషయంలో ఆనుషంగికోచ్చారణ (Secondary articulation) కూడా ఉంటుంది.

స్వరపేటికలో నాదతంత్రులు (Vocal cords) ఉంటాయి. ఇవి వేళ్ళాడే పొరలు లేక తెరలుగా గాలిపోయే మార్గానికి చెరొక వైపునా ఉంటాయి. వీటికి సాగే స్వభావం ఉంది. కాబట్టి ఇవి వాయు మార్గాన్ని పూర్తిగా కాని, కొంచెంగా కాని నిరోధించ గలవు. ఇవి కొంచెంగా వాయు మార్గాన్ని నిరోధించినప్పుడు కంపించడం వల్ల ధ్వనికి నాదత (Voicing) అనే గుణం వస్తుంది. నాదత ఉన్న ధ్వనుల్ని నాద ధ్వనులు (Voicad sounds) అంటారు. ఇవి కంపించకుండా వాయు మార్గాన్ని పూర్తిగా తెరచి ఉంచినప్పుడు పుట్టే ధ్వనుల్ని శ్వాస ధ్వనులు (Voicaless sounds) అంటారు. కచటతపలు శ్వాస ధ్వనులు. గజడదబలు నాద ధ్వనులు. నాద ధ్వనుల్ని ఉచ్చరించేటప్పుడు నాదతంత్రుల కంపనం మనం గొంతు మీద చెయ్యి పెట్టుకుని చూస్తే తెలుస్తుంది. మాద తంత్రులు వాయు మార్గాన్ని కొంత సేపు పూర్తిగా నిరోధించి, తరువాత వదిలితే అట్టే ధ్వనిని కంఠమూలీయ స్పర్శం (Glottal stop) అంటారు. దీనిని ఉచ్చరించేటప్పుడు వాయు మార్గ నిరోధం ఎక్కడా ఉండదు.

నాద తంత్రులు వాయు మార్గాన్ని అసమగ్రంగా నిరోధించినప్పుడు 'హ' అనే ధ్వని పుడుుతంది. గుసగుస ధ్వనులు (whisper sounds) కూడా నాద తంత్రులు వాయు మార్గాన్ని అసమగ్రంగా నిరోధిస్తాయి. గట్టిగా అరవడం, వేరొకరి గొంతుకతో మాట్లాడటం మొదలయిన వాటిలో కూడా నాద తంత్రుల చలనం ప్రధానపాత్ర వహిస్తుంది.

ఊపిరితిత్తులలో నుంచి నోటిలోకి వచ్చిన గాలి సాధారణంగా ఏదో ఒక చోట నిరోధించబడుతుంది. ఈ నిరోధం పై భాగంలోని స్థానాన్ని, కింది భాగంలోని ఏదో ఒక కదిలే అవయవం (నాలుక లేదా కిందిపెదవి) తాకటం వల్ల గాని, సమీపించటం వల్ల గాని ఏర్పడుతుంది. ఈ నిరోధం ఏర్పడినస్థానాన్ని స్థానం అనీ, దాన్ని తాకిన లేక సమీపించిన అవయవాన్ని కరణం అనీ అంటారు. ఈ నిరోధం హల్లుల ఉచ్చారణలోనే ఉంటుంది. కాని అచ్చుల ఉచ్చారణలో ఉండదు. ఈ నిరోధంలో వైవిధ్యం వేరువేరు రకాల హల్లుల ఉచ్చారణను కలిగిస్తుంది. కాబట్టి హల్లులలో అంతర్విభజనకి స్థాన కరణ ప్రయత్నాలు మూడూ ఉపయోగిస్తాయి.

హల్లుల ఉచ్చరితాలయ్యే సాఅథనాలలో ముఖ్యమయినవి పై పెదవి, దంతాలు, దంతమూలం, తాలువు అగ్రభాగం, తాలువు మధ్య భాగం. తాలువు మధ్య భాగం (Centre of the hard palate) స్థానంగా ఉచ్చరితాలయ్యే ధ్వనుల్ని మూర్థన్యాలు (Retroflexes) అనీ వ్యవహరిస్తారు. మృదుతాలువు స్థానంగా ఉచ్చరితాలయ్యే ధ్వనుల్ని కంఠ్యాలు (Velars) అంటారు. మృదు తాలువు చివరి భాగం స్థానంగా ఉచ్చరితాలయ్యే ధ్వనుల్ని పశ్చాత్ కంఠ్యాలు (uvulars) అంటారు. కంఠమూలం స్థానంగా ఉచ్చరితాలయ్యే ధ్వనుల్ని కంఠమూలీయాలు (Glottals) అంటారు.

కరణాలు కింది పెదవి, నాలుక భాగాలయిన జిహ్వాగ్రం, జిహ్వాపాగ్రం, జిహ్వా మధ్యం, జిహ్వామూలం.

కింది పెదవి, పై పెదవి కలియటం వల్ల కలిగే ధ్వనులు ఓష్ఠ్యాలు. కింది పెదవీ, దంతాలూ కలియటం వల్ల కలిగే ధ్వనులు దంత్యోష్ఠ్యాలు. జిహ్వాగ్రమూ, దంతాలూ కలియటం వల్ల తలిగే ధ్వనులు దంత్యాలు. జిహ్వాగ్రమూ, దంతమూలం కలయడం వల్ల కలిగే ధ్వనులు దంతమూలీయాలు. నాలుక మడతబడి తాలువు మధ్య భాగంలో కలియటం వల్ల కలిగే ధ్వనులు మూర్థన్యాలు. జిహ్వాపాగ్రం, తాలువు అగ్రభాగంలో కలియడం వల్ల కలిగే ధ్వనులు తాలవ్యాలు. జిహ్వామధ్యం మృదు తాలువుతో కలియడం వల్ల కలిగే ధ్వనులు కంఠ్యాలు. జిహ్వా మధ్యం మృదు తాలువు చివరి భాగంతో కలియడం వల్ల కలిగే ధ్వనులు పశ్చాత్కంఠ్యాలు.

పైన పేర్కొన్న స్థానాలు కాక కొన్ని భాషలలో మరికొన్ని భాగాలు కూడా ఉపయోగంలో ఉన్నాయి. ఉదాహరణకి ఇంగ్లీషులో పై పళ్ళ చివరలకీ, నాలుకకీ మధ్య నుంచి గాలి పయనించటం వల్ల ఏర్పడే ధ్వనులు (Q,F) ఉన్నాయి. వీటిని అంతర్దంత్యాలు (Inter-dentals) అంటారు. అలాగే అరబిక్ భాషలో సప్తపథ దగ్గర పుట్టే ధ్వనులు కూడా కొన్ని ఉన్నాయి.

**సమీక్ష** - ధ్వని నిర్మాణం - శాస్త్ర విషయం - భాషా ధ్వన్యుత్పత్తి వేశేషాలు - ముఖయంత్రం - వర్గీకరణాదులను పరిశీలించారు.

## ప్రశ్నలు

1. ధ్వని శాస్త్రం అంటే ఏమిటి? భేదాలను వర్గీకరించి వివరించండి.
2. ముఖయంత్ర పటాన్ని గీసి, భాగములను గుర్తించి వివరించండి.
3. భాషా ధ్వనులను వర్గీకరించి వివరించండి.

## ఆధారగ్రంథ పట్టిక


1. Gleason (Jr.) H.A. 1961 An Introduction to Descriftive Linguistics, NewYork : Holt
2. సుబ్రహ్మణ్యం, పి.ఎస్. 1984 ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పబ్లిక్‌గార్డెన్స్, హైదరాబాద్ - 4.
3. సోమయాజి జి.జె. 1947 ఆంధ్ర భాషా వికాసము ఆంధ్రాయూనివర్సిటీ, విశాఖపట్నం - 3

పాఠం 7

# ధ్వని విజ్ఞాన శాస్త్రానికి, వర్ణ విజ్ఞాన శాస్త్రానికి కల భేదం - ధ్వని - వర్ణం, వర్ణాలలోని రకాలు - ధ్వన్యాత్మక లిపిలో ధ్వనుల్ని ప్రయోగాత్మకంగా గుర్తించటం

పాఠ్యాంశ నిర్మాణ క్రమం

7.1 ధ్వని విజ్ఞాన శాస్త్రానికి వర్ణ విజ్ఞాన శాస్త్రానికి గల భేదం
7.2 ధ్వని విజ్ఞాన శాస్త్ర ప్రయోజనాలు
7.3 ధ్వని - వర్ణం
7.4 వర్ణం - సవర్ణం
7.5 వర్ణ నిర్ణయ విధానం - ధ్వనుల గుర్తింపు

**లక్ష్యం:-** ధ్వని విజ్ఞాన - వర్ణ విజ్ఞాన శాస్త్రములను గురించి వివరంగా తెలుసుకుంటారు.

## 7.1 ధ్వని విజ్ఞాన శాస్త్రానికీ, వర్ణ విజ్ఞాన శాస్త్రానికి గల భేదం:

ఏ భాషకయినా దాని ముఖ్య రూపం ధ్వన్యాత్మకంగానే ఉంటుందనీ, ఈ ధ్వనులకి అసంపూర్ణంగా మాత్రమే సూచించే లిపి ముఖ్యమనీ మనకు తెలుసు. ఇతరులు మనకు తెలియని భాష మాట్లాడేటప్పుడు మనం వినేది కొన్ని ధ్వనుల సముదాయం మాత్రమే. వాటి అర్థం మనకు తెలియదు. దీనిని బట్టి భాష ముఖ్య రూపం ధ్వనుల సముదాయమని స్పష్టమవుతుంది. కాబట్టి భాషల స్వరూప స్వభావాలను గురించి తెలుసుకోవాలంటే ధ్వనుల స్వభావాన్ని, వాటి ఉత్పత్తిని తెలుసుకోవడం ఎంతయినా అవసరం.

ధ్వనుల ఉచ్చారణాన్ని అభివర్ణించి, అవి ఏ వర్గానికి చెందుతాయో, అలాంటి ఉచ్చారణకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ తోడ్పడే మానవ శరీరవయవాలు ఎలాంటివో నిరూపించే దానిని ధ్వని విజ్ఞాన శాస్త్రం (Phonetics) అంటారు.

మనం మాట్లాడే భాష ధ్వనులమయం. అయితే ఈ ధ్వనులలో కొన్ని ముఖ్యమయినవి, మరికొన్ని అముఖ్యమయినవి. ముఖ్యమయిన ధ్వనుల్నే వర్ణాలంటారు. అలాంటి వర్ణాలను, వర్ణాల క్రమాన్నీ వివరించే దానిని వర్ణ విజ్ఞాన శాస్త్రం (Phonology) అంటారు.

వర్ణంలో ఒకటి గాని, అంతకన్నా ఎక్కువ గాని ధ్వనులుంటాయి. కాబట్టి భాషలోని అతి కనిష్ఠాంశం ధ్వని అవుతుంది. అయితే మానవుల ఏడ్పులు, నవ్వులు, ఈలలు మొదలయిన వాటిని భాషా ధ్వనులనరు. వాటి వల్ల కొంత భావ ప్రకటన జరిగినా అవి భాషా ధ్వనుల పరిధిలోకి రావు.

భాషా శాస్త్ర విద్యార్థికి ధ్వని విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞనం, వర్ణ విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం ఎంతో అవసరం. ఈ విజ్ఞానాల ప్రాతిపదికపయినే భాషా శాస్త్ర విద్యార్థి ప్రజ్ఞ పాటవాలు ఆధారపడి ఉంటాయి.

## 7.2 ధ్వని విజ్ఞాన శాస్త్ర ప్రయోజనాలు:

1. పూర్వం గుర్తించని అనేక ధ్వని భేదాల్ని గుర్తించి అవి ప్రధాన ధ్వనులో, అప్రధాన ధ్వనులో గుర్తించవచ్చు.
2. భాషా ధ్వనుల పరివర్తనాన్ని బట్టి వర్ణ నిర్ణయం చేయవచ్చు.
3. భాషా ధ్వనుల వర్గీకరణ మీదనే లిపి నిర్ణయం ఆధారపడి ఉంటుంది. ప్రధాన ధ్వనులకే ప్రత్యేక లిపి చిహ్నాలవసరం. అప్రధాన ధ్వనులకు లిపి చిహ్నాలవసరం ఉండదు.
4. భాషా బోధనకు , భాషా వ్యాప్తికి తోడ్పడుతుంది.
5. వర్ణనాత్మక వ్యాకరణ రచననే కాక మిగిలిన చారిత్రక తులనాత్మక వ్యాకరణాలకు కూడా విజ్ఞానం తోడ్పడుతుంది.
6. సాంకేతిక శాస్త్రాలకు కూడా ఇది ఎంతగానో సహకరిస్తుంది.

ఇక అక్షరమంటే రెండు గాని అంతకు ఎక్కువ గాని వర్ణాల సమ్మేళనం. ఇందులో ఒక్క వర్ణమయినా స్వరం కావాలి. కేవలం స్వరం కూడా వర్ణం కావచ్చు. స్వతంత్రోచ్చారణ కలిగిన స్వరాన్ని మాత్రం వర్ణమని గాని, అక్షరమని గాని అనవచ్చు. కేవలం హల్లులు వర్ణాలే గాని అక్షరాలు (Syllable) కావు. అంటే వర్ణాలన్నీ అక్షరాలు కావు. అక్షరాలన్నీ వర్ణాలే.

సమాన హల్లుల కలయికకు ద్విత్వమని, భిన్న హల్లుల కలయికను సంయుక్తమని అంటారు. తెలుగు మొదలయిన భాషలలో ద్విత్వాలు, సంస్కృతాది భాషలలో సంయుక్తాక్షరాలు అధికం.

ప్రాతిశాఖ్యలలో ధ్వనికీ, ధ్వనికీ మధ్య భేదం ఏర్పడటానికి అయిదు కారణాలు చెప్పారు.

"అనుప్రదానాత్ సంసర్గాత్ స్థానాత్ కరణ విన్యయాత్
జాయతే వర్ణ వైశేష్యం పరిమాణాచ్చ పంచమాత్"

- తైత్తరీయ ప్రాతిశాఖ్య 13.2

ధ్వనుల మధ్య భేదం 1. అము ప్రధానం (శ్వాసం, నాదం)
2. సంసర్గం (మహాప్రాణం, అనునాసిక్యం)
3. స్థానం
4. కరణ విన్యయం (స్పృష్టం, వివృతం లాంటివి)
5. పరిమాణం (హ్రస్వ, దీర్ఘ, ప్లుత భేదం)

అని అయిదు రకాలని వివరంగా చెప్పారు.

నిశ్వాస వాయువు శ్వాసకోశం నుంచి వాయు నాళం ద్వారా అభిప్రాయ వేదిక శబ్ద ప్రయోగేచ్ఛా సహకృతమై వచ్చేటప్పుడు కలిగే బాహ్యాంభ్యంతర ప్రయత్నాదుల చేత ధ్వని వైవిధ్యం సంభవిస్తుంది. క, ఖ లు రెండూ కంఠ్యాలే, శ్వాసాలే. కాని ఒకటి అల్ప ప్రాణం, రెండోది మహాప్రాణం. ఈ భేదం వల్ల రెండూ వేరు వేరు వర్ణాలు. ఇలాగే తక్కినవి కూడా. అయితే ఇందులో వర్ణ నిర్ణయం లేదు. ఏది ప్రధాన ధ్వనో, ఏది అప్రధానమో కూడా నిర్ణయించే సూచనలు లేవు.

ప్రాకృత వైయాకరణులు, వరరుచి మొదలయిన వారు సంస్కృత, ప్రాకృత వర్ణ నిర్ణయంచేయగా, చింతామణి కర్త వాళ్ళననుసరించి సంస్కృత ప్రాకృతాంధ్ర భాషలకు వర్ణ నిర్ణయం చేసాడు. అంతేగాని వర్ణనిర్ణయాన్ని ఎలా చెయ్యాలో మన వ్యాకరణాలు సూచించలేదు.

## 7.3 ధ్వని (Sound) - వర్ణం (Phonome):

ప్రతి భాషలోనూ కొన్ని మాటలలో ఒకే ఒక చోటులో స్వల్పమయిన భేదం ఉన్న రెండు విభిన్న ధ్వనులను వాడడం వల్ల ఆ మాటల అర్థం మారి పోతుందని మనకు తెలుసు. ఉదాహరణకు కింది జంటలను పిరశీలించండి.

కంప - గంప
చుట్టు - జుట్టు
టోకు - డోకు
తగ్గు - దగ్గు
పాట - బాట
కల - కళ

పయిన పేర్కొన్న ఉదాహరణలలో కచటతపలు శ్వాస స్పర్శాలు. గజడదబలు నాద స్పర్శలు. ఒక్కొక్క జంటలో ఈ ధ్వనులలో శ్వాస, నాద భేదమే తప్ప వేరే భేదం లేదు. అలాగే కల - కళ అన్న దానిలో ల దంతమూలీయ పార్శ్వికం, ళ మూర్ధవ్య పార్శ్వికం. క - గ మొదలయిన జంటల మధ్య భేదం అతి స్వల్పమే అయినా ఈ భేదం వల్ల అవి ఉన్న మాటలలో అర్థ భేదం కలుగుతోంది. కాని ఒక భాషలో ఉన్న అన్ని ధ్వనులకీ అవి ఉన్న మాటలలో ఇలా అర్థ భేదాన్ని కలిగించే శక్తి ఉండదు. దీనికి ఉదాహరణగా తెలుగులో దంతమూలీయ చ కారాన్నీ, తాలవ్య చకారాన్నీ తీసుకోవచ్చు. తత్సమేతారాలయిన తెలుగు పదాలలో చకారం అగ్రాచ్చుల ముందూ, చకారం అనగ్రాచ్చుల ముందూ ఉంటాయి.

ఉదా-

చ్చెల్లు - చిల్లు
చాలు - చీర
చుట్టం - చెట్టు
చూడే - చేమ
చ్చొప్ప +
చోటు

కాబట్టి చే, చ ల మధ్య భేదం తెలుగులో అర్థ భేదన సమర్థం కాదు. జ, జే ల మధ్య భేదం కూడా ఇలాంటిదే. కాబట్టి ప్రతి భాషలోనూ కొన్ని ధ్వనుల మధ్య భేదం అర్థ భేదన సమర్థమనీ, మరికొన్ని ధ్వనుల మధ్య భేదం అర్థ భేదన సమర్థం కాదనీ మనం గ్రహించాలి. కాని ఒక భాషలో ఏయే ధ్వనుల మధ్య భేదం అర్థ భేదన సమర్థం, ఏయే ధ్వనుల మధ్య భేదం అర్థ భేదన సమర్థం

కాదనే విషయం ఆ భాష మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి ఈ విషయం ఆ భాషతో పరిచయం లేకుండా ముందుగా నిర్ణయించటం సాధ్యం కాదు. ఉదాహరణకి క - గ మొదలయిన స్పర్శాలలో శ్వాస, నాద భేదం తెలుగు, కన్నడం, హిందీ, ఆంగ్లాది అనేక భాషలలో అర్థ భేదన సమర్థం. అయితే తమిళ భాషలో ఈ భేదంఅర్థ భేదన సమర్థం కాదు.

హిందీలో అనునాసికాచ్చులకీ, అనునాసికాలు కాని అచ్చులకీ మధ్య భేదం అర్థ భేదన సమర్థం. కాని తెలుగులో ఇది అర్థ భేదన సమర్థం కాదు. హిందీ, తెలుగు మొదలయిన భాషలలో మహాప్రాణ స్పర్శం, అల్ప ప్రాణ స్పర్శం - వీటి మధ్య భేదం అర్థ భేదం కలిగిస్తుంది.

ఉదా - కరం - ఖరం

షష్ఠి - షష్టి

అయితే ఆంగ్ల భాషలో ఈ భేదం అర్థ భేదం కలిగించదు. ఆంగ్లంలో k, t, p లను పదాదిన మహాప్రాణాలుగా ($k^h$, $t^h$, $p^h$) ఉచ్చరిస్తారు. కాని s తర్వాత పది మధ్యంలో గాని, పదాంతంలో గాని అల్ప ప్రాణం గానే ఉచ్చరిస్తారు. (Skin, Spin, Steal).

అరబిక్ భాషలో కంఠ్య కకారం, పశ్చాత్ కంఠ్య కకారం (9) అర్థ భేదన సమర్థాలు. ఆంగ్లంలో కూడా పశ్చిమాచ్చు ముందు k పశ్చాత్ కంఠ్యంగానే ఉచ్చరించబడుతుంది. కాని పశ్చిమాచ్చుముందు K కి కంఠ్యోచ్చారణ లేదు. కాబట్టి ఈ రెండూ ఆంగ్లంలో అర్థ భేదన సమర్థాలు కావు. పయిఉదాహరణల వల్ల ఏయే ధ్వనులు అర్థ భేదన సమర్థాలు అనే విషయంలో భాషకీ, భాషకీ మధ్య భేదం ఉంది అనే విషయం స్పష్టమవుతుంది. ఒక భాషలో అర్థ భేదన సమర్థాలయిన ధ్వనులు ప్రత్యేక వర్ణాలు (Phonemes). అర్థ భేదన సమర్థాలు కాని సన్నిహిత ధ్వనులు ప్రత్యేక వర్ణాలు కావు. రెండో రకపు ధ్వనులని ఒకే వర్ణానికి చెందినవిగా పరిగణించవచ్చు. అర్థ భేదన సామర్థ్యాన్ని భేదకత్వం (contrast) అని కూడా అంటారు.

కంప - గంప లాంటి ఒకే స్థానంలో సన్నిహితాలయిన భిన్న ధ్వనులు ఉండటం వల్ల అర్థ భేదం కలిగి ఉన్న జంట మాటలని కనిష్ట భేదక యుగ్మం (minimal pair) అంటారు.

కనిష్ఠ భేదక యుగ్మాలు ఒక భాషలో వర్ణాలని నిర్ణయించడానికి ఉపయోగపడతాయి. కాని ప్రతి రెండు వర్ణాలకీ కనిష్ట భేదక యుగ్మాలు ఉండాలనే నియమం లేదు. కనిష్ట భేదక యుగ్మాలు దొరకనప్పుడు రెండు స్థానాలలో స్వల్ప భేదమున్న యుగ్మాలను (కోట-గోడ) కూడా వర్ణ నిర్ణయానికి ఉపయోగించవచ్చు. ఇటువంటి వాటిలో ఒక ధ్వని వల్ల దాని పక్క ధ్వని ప్రభావితం కాకుండా ఉండటం ముఖ్యం.

ఒక వర్ణానికే చెందిన సన్నిహిత ధ్వనులను సవర్ణాలు (allophones) అంటారు. సవర్ణాల మధ్య భేదకత్వం ఉండదు. కాబట్టి ఇవి సాధారణంగా భిన్న పరిసరాల (diffrent environments)లో ఉంటాయి.

## 7.4 వర్ణం - సవర్ణం:

ఒక భాషలో అర్థ భేదన సమర్థాలయిన ధ్వనుల్ని వర్ణాలనీ, అర్థ భేదన సమర్థాలు కాని సన్నిహిత ధ్వనుల్ని ఒకే వర్ణంగా పరిగణించవచ్చనీ ఇప్పటి వరకు చూశాం. పయిన చెప్పిన నిర్వచనం అరపకారం తెలుగులో క - గ, చ - జ, ట - డ, త - ద, ప - బ, ల - ళ లు ప్రత్యేక వర్ణాలు.

చ, చ̄లకి భేదకత్వం లేదు కాబట్టి అవి ప్రత్యేక వర్ణాలు కావు. వీటిని ఒకే వర్ణానికి సంబంధించిన సవర్ణాలుగా గ్రహించాలి. వీటిలో చ̄ అనగ్రాచ్చుల ముందూ, చ అగ్రాచ్చుల ముందూ మాత్రమే వస్తాయని ముందు చూశాం. కాబట్టి ।చ। అనే వర్ణానికి ।చ।, ।చ। అనే రెండు సవర్ణాలున్నాయని చెప్పవచ్చు. అలాగే ।జ।.

।చ। — (చ), (చ)    ।జ। — (జ), (జ)

(వర్ణాలను ఏటవాలు గీతల ।। మధ్యా, సవర్ణాలను () బ్రాకెట్టు లాంటి గీతల మధ్య రాయటం భాషా శాస్త్రంలో సంప్రదాయం)

ఒక వర్ణాన్ని రాతలో సూచించడానికి దాని కున్న సవర్ణాలలో ఏ ఒక దాని గుర్తునయినా వాడవచ్చు. సాధారణంగా రాయడానికి లేదా అచ్చులో ఏ గుర్తు సులభమో దానిని వాడతారు. వర్ణం అనేది భాషా నిర్మాణంలో అంశం. ఒక వర్ణం ఒక ధ్వని చేతనే

సూచించబడాలనే నియమం లేదు కాబట్టి అది ధ్వని నిర్మాణంలో అంశంకాదు. అని వేరే చెప్పనక్కర లేదు. లిపి భాషని రాయడానికి ఉపయోగించే సాధనం మాత్రమే. ఈ సాధనం ఏ బాషకీ సమగ్రమయినది కాదు. వర్ణం రూపరహితం. ఒక భాషలో ప్రతి వర్ణమూ ఆ భాషలో మిగిలిన అన్ని వర్ణాల కన్నా భిన్నమయినదిగా ఉంటుంది. ఒక వర్ణానికి ధ్వని నిర్మాణంలో ప్రతీకగా ఒక ధ్వని ఉండవచ్చు లేక ఒకటి కన్నా ఎక్కువ ధ్వనులుండవచ్చు. ఉదాహరణకి తెలుగులో క వర్ణానికి ప్రతీకగా ఒకే ధ్వని ఉంది. అంటే దానికి ఒకే సవర్ణం ఉందన్నమాట. కాని చ వర్ణానికి రెండు సవర్ణాలు ఉన్నాయి. కాని ధ్వని శాస్త్రజ్ఞులు ఒకే మాటని మనం ఒకటి కంటే ఎక్కువ సార్లు ఉచ్చరించినప్పుడు ఆ మాటలో ధ్వనులు ఒకే రీతిగా ఉచ్చరించబడక సూక్ష్మమయిన భేదాలతో ఉచ్చరించబడతాయని అంటారు. ఈ భేదాలు యంత్రాలకే గోచరిస్తాయి. కాని మన చెవులకు వినపడవు. కాబట్టి ఒకే సవర్ణం ఉంది అని మనం అనుకొంటున్న వర్ణానికి కూడా ఉచ్చారణలో భిన్న కాల పరిస్థితులలో సూక్ష్మ భేదాలు ఉన్న సవర్ణాలు ఉండవచ్చు. కాని ఈ భేదాలు మనకు వినపడవు. కాబట్టి వీటిని మనం పరిగణనలోకి తీసుకోం.

వర్ణ నిర్ణయం అన్ని భాషలలోను ఒకే రీతిగా ఉండదు. ఒక్కొక్క భాషలో ధ్వనుల మధ్య భేదకత్వం ఒక్కొక్క విధంగా ఉండటమే దీనికి కారణం. ఉదాహరణకి తెలుగులో క చ ట త ప లకీ గ జ డ ద బ లకీ మధ్య భేదకత్వం ఉంది. కాబట్టి తెలుగులో ఇవి ప్రత్యేక వర్ణాలు. కాని తమిళంలో వీటి మధ్య భేదకత్వం లేదు. రెండు అచ్చుల మధ్య క చ ట త ప లు గ జ డ ద బ లుగా ఉచ్చరిస్తారు. కాబట్టి తమిళంలో (క) (గ) ఒకే వర్ణానికి సవర్ణాలు. వాటిని ఇలా చూపించవచ్చు.

।క। — (క)
　　 — (గ)

।చ। — (చ)
　　 — (జ)

।ట। — (ట)
　　 — (డ)

।త। — (త)
　　 — (ద)

।ప। — (ప)
　　 — (బ)

పయి జంటలలో శ్వాస ధ్వని పదాదినీ, ద్విరుక్తంలోనూ ఉంటుంది. నాద ధ్వని అచ్చుల మధ్య అద్విరుక్తంగానూ, అనునాసికానికి తరువాతా ఉంటుంది.

అదే విధంగా ఆంగ్లంలో కూడా అల్పప్రాణ మహాప్రాణాలకు భేదకత్వం లేదు. కాబట్టి ఆ భాషలో అవి సవర్ణాలు కావు. అంటే [p] [$p^h$] లు ఒకే వర్ణానికి సవర్ణాలు. వాటిని ఈ విధంగా చూపించవచ్చు.

/p/ — [p]
　　— [$p^h$]

/t/ — [t]
　　— [$t^h$]

/k/ — [k]
　　— [$k^h$]

సాధారణంగా ఒక భాషని వ్యవహరించే వారు ఆ భాష లోని వర్ణానుసారంగా ధ్వని భేదాలని విభజించి మనస్సులో గ్రహిస్తూ ఉంటారు. అంటే రెండు ధ్వనుల మధ్య భేదకత్వం ఉంటే వాటి భేదాన్ని ప్రయత్నరహితంగానే గుర్తించగలుగుతారు. రెండు ధ్వనుల మధ్య భేదకత్వం లేకపోతే వాటి మధ్య భేదం చెవులకు వినపడుతున్నా గుర్తించలేరు. అటువంటి రెండు ధ్వనులనీ ఒకటిగానే పరిగణిస్తారు. భేదకత్వం లేని ధ్వనుల మధ్య ఉచ్చారణ భేదాన్ని గుర్తించడం ఆ భాషా వ్యవహర్తకి ధ్వని శాస్త్రంలో ప్రావీణ్యముంటేనే సాధ్యమవుతుంది. కాబట్టి ఆంగ్ల భాషా వ్యవహర్త అల్పప్రాణ, మహాప్రాణ భేదాన్ని తాను ఆ ధ్వనులని ఉచ్చరిస్తున్నప్పటికీ గుర్తించడు.

కాని హిందీ వ్యవహర్త ఈ భేదాన్ని అతి సులభంగా గుర్తించగలడు.

తెలుగు వాళ్ళు చ చల మధ్య ఉచ్చారణ భేదం గుర్తించటం కష్టం. భాషా వ్యవహర్తలు ఈ రెంటిలో భేదాన్ని గుర్తించలేరు. కాబట్టి ప్రతి భాషా వ్యవహర్త ఇతర భాషని నేర్చుకునేటప్పుడు తన భాషలో ఉన్న వర్ణ విభజన సంప్రదాయం ప్రకారం ఆ కొత్త భాషలో మాటల్ని ఉచ్చరిస్తాడు. ఇది ఆ కొత్త భాష మాట్లాడే వారికి వింతగా ఉండి అంగీకార యోగ్యం కాదు. తమిళ భాషా వ్యవహర్త తన అలవాటు ప్రకారం తెలుగులో 'పంతులు' అనే మాటను 'పందులు' అని ఉచ్చరిస్తాడు. అలా ఉచ్చరించటం వల్ల అర్థం మారిపోయి హాస్యపాత్రుడవుతాడు. ఇలా స్వభాషా ప్రభావాన్ని అన్య భాష మీద పడకుండా చేసుకోవడం సుశిక్షుతులయిన వారికి మాత్రమే సాధ్యమవుతుంది.

ఇప్పటి వరకు పరిశీలించిన వాటిలో భేదకత్వం లేని సన్నిహిత ధ్వనులు ఒకే వర్గానికి సవర్ణాలని చూశాం. ఒకే వర్ణానికి చెందిన వర్ణాల మధ్య రెండు రకాల సంబంధం మాత్రమే ఉంటుంది. అలాంటివి -

1. భిన్న పరిసరాలలో ఉంటాయి.
2. స్వేచ్ఛగా ఉంటాయి.

భిన్న పరిసరాలలో ఉన్న స్థితిని పరిపూరక ప్రవృత్తి అనీ, స్వేచ్ఛగా ఉంటే స్వేచ్ఛా ప్రవృత్తి అనీ అంటారు. వీటిని ఇలా చెప్పుకోవచ్చు.

## 7.5 వర్ణ నిర్ణయ విధానం - ధ్వనుల గుర్తింపు

**1. భేదకప్రవృత్తి (Contrastive Distribution):** అర్థ భేదక సామర్థ్యం కలిగి ఉండటాన్ని భేదక ప్రవృత్తి అంటారు. అంటే

కంప [Kampa]

గంప [gampa]

క - గ గా మారడం వల్ల అర్థంలో భేదం వచ్చింది. కాబట్టి /క/ /గ/ లు రెండు భిన్న వర్ణాలని చెప్పవచ్చు.

**2. పరిపూరక ప్రవృత్తి (Complimentary Distribytion):**

భిన్న పరిసరాలలో ఉండి అలా ఉండటానికి గల కారణాలు చెప్పటానికి వీలవుతాయి.

| | |
|---|---|
| చెట్టు | చలి |
| చేమ | చాప |

పయి ఉదాహరణలలో చ చలు ఎక్కడ వస్తాయో చెప్పవచ్చని ముందు పేజీలలో చూశాం. ఇ, ఈ, ఎ, ఏ ల ముందు చ తాలవ్యమనీ, అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ ల ముందు చకారం దంత్యమనీ చెప్పగలం. కాబట్టి ఇవి ఒకే వర్గానికి సవర్ణాలు. దీనిని పరిపూరక ప్రవృత్తి అంటారు. దీనిని ఇలా చూపించవచ్చు.

/చ/ —— (చ) - ఇ ఈ ఎ ఏ ల ముందు

 \\ (చ) - అ ఆ ఉ ఊ ఒ ఓ ల ముందు

**3. స్వేచ్ఛా ప్రవృత్తి (Free Variation):**

ధ్వని భిన్నంగా ఉండి, భిన్న పరిసరాలలో ఉన్నా ఆ మాటలలో అర్థ భేదాన్ని కలిగించే సామర్థ్యం ఉండదు. దక్షిణ ద్రావిడ భాష అయిన కోత (నీలగిరి కొండలలో ఉంది. ఇక్కడే తొద, ఇరుళ భాషలు కూడా మాట్లాడతారు.) భాషలో చసలు స్వేచ్ఛా ప్రవృత్తిలో ఉంటాయి. అంటే ఏ మాటలో అయినా వ్యవహర్తలు చ స లను స్వేచ్ఛగా ఉచ్చరిస్తారు. కాబట్టి ఆ భాషలో /చ/ /స/లు ఒకే వర్ణానికి సవర్ణాలు. అదే విధంగా ఇటాలియన్ భాషలో [s] [z] లు అచ్చుల మధ్య స్వేచ్ఛా ప్రవృత్తిలో ఉంటాయి.

సవర్ణాలు స్వేచాఅఛ ప్రవృత్తిలో కన్నా పరిపూరక ప్రవృత్తిలో ఉండడం సర్వ సాధారణం. ఒక సవర్ణం ఒక ప్రత్యేక స్థానంలోనూ, మరొక సవర్ణం వేరొక స్థానంలోను ఉండడాన్ని పరిపూరక ప్రవృత్తి అంటారు. తెలుగు చ అనగ్రాచ్చుల ముందూ, చ అగ్రాచ్చుల ముందూ ఉంటాయి. కాబట్టి ఇవి పరిపూరక ప్రవృత్తిలో ఉన్నాయని చెప్పవచ్చు. అలాగే తెలుగులో జ జల విషయం కూడా. సవర్ణాల పరిసర నిర్ణయ విధానం అనేక రాకలుగా ఉంటుంది. వాటిలో ముఖ్యమయినవి.

1. అవ్యవహితంగా ముందు గాని, వెనుక గాని లేక రెండు స్థానాలలోనూ వచ్చే ధ్వనులు.

2. వ్యవహితంగా (అంటే మధ్యన ఒకటి రెండు ధ్వనులుండి) ముందు గాని, వెనుక గాని ఉన్న ధ్వనులు. సాధారణంగా అచ్చులు ముందు అక్షరంలో గాని, వెనుక అక్షరంలో గాని ఉన్న అచ్చుల వల్ల ప్రభావితం అవుతాయి.
3. పదంలో గాని అక్షరంలో గాని ఒక సవర్ణం ఉన్న స్థానం. అంటే పదాది, పద మధ్యం, పదాంతం లాంటివి.
4. ఉదాత్తత, దీర్ఘత, శ్రుతి వంటి లక్షణాలలో భేదం.
5. పయిన చెప్పిన అంశాల మేళనం.

పరిసర నిర్ణయం ఒక ప్రత్యేక ధ్వని మీద గాని, ఒక ధ్వని సముదాయం మీద గాని ఆధారపడి ఉండవచ్చు. అంటే ఒక సవర్ణానికి పరిసరంగా ఏ అచ్చయినా, హల్లయినా కావచ్చు. లేక అగ్రఅచ్చులు అన్నీ కావచ్చు లేక స్పర్శాలు అన్నీ కావచ్చు లేక కేవలం ఒక ధ్వని మాత్రమే కావచ్చు. ఆంగ్లభాషలో మహాప్రాణ స్పర్శం పదాదినీ, అల్పప్రాణ స్పర్శం పదమధ్యంలోనూ పదాంతంలోనూ ఉంటుంది.

తెలుగు భాషలో కోస్తా మాండలికంలో మకారానికి ఉభయోష్ఠ్య స్పర్శానునాసికమూ (మ), ఉభయోష్ఠ్య ఈషత్ స్పృష్టానునాసికమూ (వఁ) అనే రెండు సవర్ణాలు ఉన్నాయి. వీటిలో మొదటిది పదాదినీ (మాట, మలుపు, మాను), ద్విరుక్తంలోనూ (అమ్మ, బొమ్మ, తుమ్ము), ఓష్ఠ్య స్వరాల ముందూ (గంప, చెంబు, తుంబుర), నకారం ముందూ (ఆమ్నాయం), యకారం ముందూ (రమ్యం), రే ఫ ముందూ (సామ్రాజ్యం, మ్రాను) వస్తుంది. రెండోది అచ్చుల మధ్యా (మాను, చమురు), వ, శ, స, హ ల ముందూ (సంవత్సరం, సంశయం, సంసారం, సింహం), పదాంతంలోనూ (మేం, మనం, పొలం) వస్తుంది.

తెలుగులో అచ్చుల తరువాత అక్షరంలో అకారం ఉన్నప్పుడు కొంచెం కిందగా ఉచ్చరించబడతాయని ఇంతకు ముందే చూశాం. చుట్టలో ఉన్న ఉకారం, చుటుటలో ఉన్న ఉకారం కంటే కొంచం కిందగా ఉచ్చరించబడుతుంది. ఇది రెండో అక్షరంలో అచ్చు మొదటి అచ్చును ప్రభావితం చేస్తుంది అనడానికి ఉదాహరణ. సంస్కృతంలో హ్రస్వ అకారం నిమ్నతర మధ్యమం లేక ఈష న్నిమ్నం (దీనిని ప్రాచీనులు సంవృతమన్నారు.) దీర్ఘ అకారం నిమ్నం (దీనిని ప్రాచీనులు వివృతమన్నారు). కాని సంస్కృతంలో హ్రస్వ దీర్ఘాచ్చులకి (ఏ, ఓలు తప్ప) భేదకత్వం ఉంది కాబట్టి ఇవి ప్రత్యేక వర్ణాలే కాని సవర్ణాలు కావు. కాని ఈ రెండూ మరొక భాషలో సవర్ణాలు కావచ్చు.

రెండు ధ్వనుల్ని సవర్ణాలుగా పరిగణించడానికి అవి పరిపూరక ప్రవృత్తిలో గాని, స్వేచ్ఛా ప్రవృత్తిలో గాని ఉండటమే గాక వాటి మధ్య సన్నిహితత్వం అంటే ఉచ్చారణలో సారూప్యం కూడా ఉండాలని పయిన చూశాం. ఉచ్చారణ సారూప్యం స్థానకరణ ప్రయత్నాల మీద ఆధారపడి ఉంటుంది. వీటిలో కొంత వరకు భేదం ఉండవచ్చు. కాని ఎక్కువ భేదం ఉండకూడదు. ఉదాహరణకి ఓష్ఠ్య ధ్వనినీ, కంఠ్య ధ్వనినీ అవి పరిపూరక ప్రవృత్తిలో ఉన్నా సరే ఒక వర్ణానికి సవర్ణాలుగా తీసుకోలేం కాని ఉభయోష్ఠ్య దంత్యోష్ఠ్యాలూ, దంత్య దంతమూ లీయాలూ, స్పర్శ ఈషత్ స్పృష్టాలూ, అల్పప్రాణ మహాప్రాణాలూ, శ్వాసనాదాలూ వంటి స్వల్ప భేదం గల ధ్వనులు ఒకే వర్ణానికి సవర్ణాలుగా ఉండే అవకాశం ఉంది. సాధారణంగా సవర్ణాల మధ్య భేదం పరిసరాల ప్రభావం వల్ల ఏర్పడేదిగా ఉంటుంది. ఉదాహరణకి అచ్చులు నాదాలు కాబట్టి రెండు అచ్చుల మధ్య మొదట్లో శ్వాసంగా ఉన్న కకారం తరువాత కాలంలో నాద గకారంగా మారడానికి అవకాశం ఉంది. కాబట్టి పదాది కకారమూ, అచుచల మధ్య గ కారమూ ఒక భాషలో సవర్ణాలు కావచ్చు (ఇటు వంటివి అన్ని భాషలకూ వర్తించాలని లేదు). తెలుగులో మ, వఁ భేదం ఇలా ఏర్పడిందే.

అచ్చుల మధ్యా వ, శ, స, హ ల మూందూ పూర్వకాలంలో ఉన్న మకారం శ్లథోచ్చారణ పొంది వఁగా తరువాత కాలంలో మారింది. మానవుడు ఉచ్చారణలో సౌలభ్యానికి ప్రయత్నిస్తాడు. కాబట్టి ఒక ధ్వని దాని పరిసర ధ్వనులకి సన్నిహితంగా మార్పు పొందుతూ ఉంటుంది. మకారోచ్చారణలో గాలి పూర్తిగా నిరోధించబడుతుంది. కాని అచ్చులు వ, శ, స, హ ల ఉచ్చారణలో గాలి పాక్షికంగానే నిరోధించబడుతుంది. కాబట్టి వీటి మధ్య లేక పక్కన ఉన్న మకారోచ్చారణలో కూడా గాలి పాక్షికంగా నిరోధించబడి అది వఁగా మారింది. అలాగే పదాంతంలో కూడా చాలా భాషలలో శ్లథోచ్చారణ ఉంటుంది. జర్మన్ భాషలో పదాంతంలో నాదాలు శ్వాసాలుగా ఉచ్చరించబడతాయి. తెలుగులో పదాంతంలో మకారం వఁ గా మారడం కూడా ఇలాంటిదే. తెలుగులో అకారం కిందగా ఉచ్చరించబడేది కాబట్టి దాని ముందున్న అచ్చులు కూడా కొంచెం కిందగా ఉచ్చరించబడతాయి. ఇలాంటి వివరణ చాలా రకాల సవర్ణాలకి ఇవ్వడం సులభమే గాని కొన్ని సందర్భాలలో సవర్ణాల మధ్య భేదానికి కారణం అంత స్పష్టంగా తెలియదు.

ఒక కొత్త భాషకు వర్ణ నిర్ణయం చేసేటప్పుడు ప్రతి భాషలోనూ ఉండే నియతి (Pattern) సహాయకారిగా ఉంటుంది. ఉదాహరణకి

ఒక భాషలో క - ఖ, త - థ జంటల మధ్య అల్పప్రాణ, మహాప్రాణ భేదానికి భేదకత్వం లేక అవి పరిపూరక ప్రవృత్తిలో ఉన్నాయని స్పష్టంగా తెలిసిందనుకోండి. కాని ప - ఫ లకి పరిపూరక ప్రవృత్తి ఉందా లేదా అనే విషయం ఇంకా స్పష్టంగా మనం సేకరించిన ఆధారం వల్ల తెలియలేదనుకోండి. కాని ప్రతి భాషకూ సాధారణంగా నియతి ఉంటుంది కాబట్టి ఆ భాషలో కంఠ్య దంత్యాలలో ఉన్న స్థితే ఓష్ఠ్యాలలో కూడా ఉంటుందని ముందుగా ఊహించవచ్చు. పరిశోధన ఇంకా ముందుకు వెళ్తే ప - ఫ లకు కూడా పరిపూరక ప్రవృత్తి ఉంది అని తెలిసి మన ఊహ నిర్ధారించబడుతుంది. సాధారణంగా ఒక భాషలో ఇలాంటి జంట ధ్వనులలో ఒక జంటలో ఉన్న స్థితే మిగిలిన జంటలలో కూడా ఉంటుంది.

## సంశ్లిష్ట వర్ణాలు (Supra-Segmental Phonemes):

కనిష్ఠ పద యుగళాల ఆధారంగా వర్ణ నిర్ణయించేయడం మనకు తెలుసు. ఇవి చాలా వరకు సంప్రదాయ వ్యాకరణాలలో వర్ణ సమామ్నాయంగా నిరూపితం. వీటికి లేఖన చిహ్నాలు కూడా ఉంటాయి. ఇవి అసంశ్లిష్టంగా ఉంటాయి. కాబట్టి వీటిని విభజించటంలో క్లేశం లేదు. వీటినే అసంశ్లిష్ట వర్ణాలు (Segmental Phonemes) అంటారు.

వీటి కంటె భిన్న స్వరూపం గల వర్ణాలు కూడా కొన్ని ఉంటాయి. ఒక్కోసారి ఒక పదంలో ఊనిక (stress) ఉదాత్త, అనుదాత్త, స్వరితాలు, వ్యవధాన భేదం ఇత్యాదులు కూడా అర్థ భేదాన్ని కలిగించ కలుగుతాయి. ఇలాంటి వాటిని సంశ్లిష్ట వర్ణాలు (Suprs-Segmental Phonomes) అంటారు. అవి -

## పద సంహిత లేక వ్యవధాన భేదం (Word Juncture):

సాధారణంగా మనం మాట్లాడేటప్పుడు ఒక మాటకీ వేరొక మాటకీ అర్థ భేదం ఆ మాటలతో ధ్వనుల వల్ల కలుగుతుంది. మనం ఒక వాక్యాన్ని ఉచ్చరించేటప్పుడు ఆ వాక్యంలో పదాలని వ్యవధానం లేకుండానే సాధారణంగా ఉచ్చరిస్తాం. కొన్ని కొన్ని సందర్భాలలో ఒకే ధ్వని సముదాయం మధ్యలో వ్యవధానం ఉంటే ఒక అర్థాన్ని, అది లేకపోతే వేరొక అర్థాన్ని ఇస్తుంది.

ఆకారం - ఆ స్థానం

ఆస్థానం - ఆ స్థానం

ఏకాకి - ఏ కాకి

రెండెడ్లబళ్ళు - రెండు ఎడ్లబళ్ళు

వీటిలో మొదటి పదంలో వ్యవధానం లేదు. రెండో దానిలో వ్యవధానం ఉంది. దాని వల్ల అర్థంలో భేదం వచ్చింది. ఇలాంటి వ్యవధాన్ని పద సంహిత అంటారు. కాబట్టి పద సంహిత కూడా అర్థ భేదాన్ని కలిగించగలదని చెప్పవచ్చు.

## శ్రుతి (Pitch):

పద సంహిత లాగానే శ్రుతి కూడా వాక్యంలో ధ్వనులలో మార్పు లేకపోయినా అర్థ భేదం కలిగించగలదు. ఇవి మూడు విధాలు.

1. ఆరోహస్థాయి (Rising Pitch) - శ్రుతి క్రమంగా ఎక్కువ కావడం
2. అవరోహ స్థాయి (Falling Pitch) - శ్రుతి క్రమంగా తక్కువ కావడం
3. సమస్థాయి (Level Pitch) - శ్రుతి సమస్థాయిలో ఉంచడం.

రారా↓ - ఒరేయ్ రాముా! ఇటు రారా↓

రారా↑ - రేపు మీరు వస్తారా? రారా↑ ?

## ఊనిక (Stress):

ఊది పలకటం, నొక్కి పలకటం, అధికంగా కంఠ స్వరాన్ని ఉపయోగించటం - ఊనిక లక్షణాలు. ఆంగ్లంలో కొన్ని పదాలు పదాది ఊనిక వల్ల నామాలవుతాయి. అపదాదిలో ఊనిక వల్ల క్రియలవుతాయి.

**నామం** **క్రియ**

కన్టెస్ట్ - కన్టెస్ట్

ప్రెసెన్ట్ - ప్రెసెన్ట్

పర్మిట్ - పర్మిట్

**కాకువు:**

కాకువంటె జిహ్వ అని అర్థం. జిహ్వ వ్యాపార సంపాద్యమయినందున కాకు వ్యవహారం.

ఇది శిరో నిష్పన్న తారనాదమని, కంఠస్థాన నిష్పన్న మధ్యమ స్వరమని, ఉరస్సముత్పన్న మంద్రనాదమని త్రివిధాలు.

దేవుని ఎదుట నిల్చి నిజం చెప్తాను.

దేవుని ఎదుట నిల్చి నిజం చెప్తాను.↑

మంద్ర స్థాయిలో కంఠస్వరాన్ని మార్చడం వల్ల అర్థంలో మార్పు వస్తుంది.

## ధ్వన్యాత్మక లిపిలో ధ్వనుల్ని ప్రయోగాత్మకంగా గుర్తించటం:

ఏదయినా ఒక భాషలోని పదాల్ని, వాక్యాన్ని రాసేటప్పుడు ప్రతి ధ్వనికి ఒక సంకేతాన్ని ఏర్పాటు చేసుకోవాలి. దీన్నే ధ్వన్యాత్మక లేఖనం (Phonetic transcription) అంటారు. ఈ లేఖనంలో సాధ్యమయినంత వరకు అంతర్జాతీయ ధ్వని పట్టిక గుర్తులే వాడటం మంచిది.

సేకరించిన పదజాలం నుంచి అర్థ భేదక సామర్థ్యం ఉన్న కనిష్ట పద యుగళాల్ని (Minimal Pairs) మార్చగలగాలి. వీటిని వర్ణ క్రమంలో ఏర్పాటు చేస్తే వర్ణ స్థాపన జరుగుతుంది. ఇవన్నీ అసంశ్లిష్ట వర్ణాలు / విభక్త వర్ణాలు (Segmental Phonemes). వివిధాలయిన వాక్యాలను రికార్డు చేసి వాటి ఆధారంతో ఆ భాషలో ఉన్న Prosodical Features నిర్ణయించి, సంశ్లిష్ట వర్ణాన్ని (Supra-Segmental Phonemes) ఏర్పరచాలి.

ప్రధాన భేదక ధ్వనులేవో (Distrinctive Features), అప్రధాన ధ్వనులేవో (Non-Distinctive Features) అందులో పరస్పరా భావ ప్రవర్తక ధ్వనుల్ని (Non-Dinstinctive Phones), స్వేచ్ఛా పవర్తిత ధ్వనుల్ని (Free Variation) నిర్ణయించటం చాలా కష్టం. అప్రధాన ధ్వనులకు ప్రత్యేక లేఖన చిహ్నాల్ని పరిహరించవచ్చు. వర్ణాలకే ప్రత్యేక లేఖన చిహ్నాలు ఏర్పాటు చేయాలి. అసంశ్లిష్ట వర్ణాలకు గుర్తులు ఏర్పాటు చేస్తే సరిపోతుంది. వీటన్నింటితో కూడిన దానిని వర్ణాత్మక లేఖనం (Phonemic Transcription) అంటారు. దీనిని రెండు ఏటవాలు గీతల // మధ్య గుర్తించాలి. ధ్వనుల్ని [ ] గుర్తుల మధ్య గుర్తించాలి.

## ధ్వన్యాత్మక లేఖనం (Phonetic Transcription):

| | |
|---|---|
| అ ఆ లు | [a?ālu] |
| గంట | [gaṇṭa] |
| పద్యం | [pajjãv] |
| గిన్నె | [ginnx] |
| గడప | [gaḍapa] |
| మామయ్య | [māṽayya] |
| సత్యన్నారాయణ | [saζζannārāyana] |
| మధ్యాహ్నం | [majjhx̄nnaṽ] |
| గూడు | [gūḍu] |

| | |
|---|---|
| గూడ | [gūḍa] |
| మంచం | [manζãv] |
| గోళ్ళు | [gōḷḷu] |
| మాంసం | [māṽsaṽ] |
| మెట్టు | [meṭṭu] |
| ఇక్కడ | [yikkaḍa] |
| వాడు | [wāḍu] |
| వేళ | [vāḷa] |
| మేక | [ma͞eka] |
| కాయ | [kāya] |
| అయ్య | [ayya] |
| కళ | [kaḷa] |
| లాగు | [lāgu] |
| కల | [kala] |
| కంఠం | [kaṇṭaṽ] |
| సంగతి | [saŋgati] |
| రాజు | [rāzu] |
| దుఃఖం | [dukk$^h$aṽ] |
| మెట్ట | [maeṭṭa] |
| ఇల్లు | [illu] |
| ఊరు | [wūru] |
| వేడి | [vēḍi] |
| కవ్వం | [kaṽṽaṽ] |
| మల్లె | [mallae] |
| అంగడి | [aŋgaḍi] |

| | |
|---|---|
| క్రమం | [kramaṽ] |
| రోజు | [rōzu] |
| జేబు | [jēβu] |
| చిలుక | [ζ̄iluka] |
| చదువు | [ζ̄aduṽ] |
| రథము | [radʰaṽ] |
| మామిడి | [māṽiḍi] |
| బ్రహ్మ | [βramha] |
| బ్రాహ్మణుడు | [βrāmhaṇuḍu] |
| ఆఫీస్ | [āfīs] |
| కబురు | [kaβuru] |
| పగలు | [wagalu] |
| శిష్యుడు | [ʃiṣyuḍu] |
| విశ్వాసం | [visvāsam] |
| పరిష్కారం | [pariṣkāram] |
| నిశ్శబ్దం | [nissabadam] |
| మ్యాపు | [māpu] |
| కోడలు | [kōḍalu] |
| విశ్వస్థ | [visvasθa] |
| మధ్య | [majjʰa] |

**సమీక్ష:-** ధ్వని - వర్ణ విజ్ఞానాలను గురించి, వర్ణ - ధ్వని నిర్ణయ విధాలను గురించి పరిశీలించారు.

## ప్రశ్నలు

1. ధ్వని - వర్ణ విజ్ఞానాల భేదాన్ని వివరించండి.
2. ధ్వని - వర్ణం - సవర్ణంలను నిర్వచించి ఉదాహరణాత్మకంగా వివరించండి.
3. వర్ణ నిర్ణయ విధానాన్ని తెలుపండి.

## ఆధారగ్రంథ పట్టిక


1. Gleason Jr. H.A. 1961 An Introduction to Descriptive Linguistics, NewYork : Holt
2. Hockett, Charles F. 1958 A Course in Modern Linguistics NewYork, Macmillan
3. సుబ్రహ్మణ్యం, పి.ఎస్. 1984 ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పబ్లిక్‌గార్డెన్స్, హైదరాబాద్ - 4.

# పాఠం - 8 పదాంశ నిర్వచనం, సపదాంశ నిర్వచనం

# పదాంశాలను గుర్తించే విధానం

# పదాంశ భేదాలు

పాఠ్యాంశ నిర్మాణ క్రమం

**8.1** పదాంశ - సపదాంస నిర్వచనాలు

**8.2** పదాంశాలను గుర్తించటం

**8.3** పదాంస భేదాలు

**లక్ష్యం:-** పదాంశ - సపదాంశాలను వాటి భేదాలను ఉదాహరణాత్మకంగా తెలుసుకుంటారు.

## 8.1 పదాంశ - సపదాంశ నిర్వచనం

అర్థ భేదక సామర్థ్యం కల భాషా కనిష్ఠాంశం వర్ణం అని మనం ఇతః పూర్వమే తెలుసుకున్నాం. ఇటువంటి వర్ణాల సంఖ్య ఏ భాషలోనైనా పరిమితంగానే ఉంటుంది. ఈ సంఖ్య 100కు మించదు, 12కు తగ్గదు. ఇక పదాంశాల సంఖ్య వేలలో ఉంది. పదాంశం అనే మాటను ఇంగ్లీషులోని 'morfreme' అనే పదానికి అనువాదంగా వ్యవహరిస్తున్నాం. దీన్ని పదం అనీ అర్థకం అనీ కొందరు వ్యవహరించారు. పదాంశ నిర్వచనాన్ని తెలిపే ముందు పదాంశ నిర్మాణాన్ని కొంత పరిశీలించాలి.

తెలుగు భాషలో త్, అ, ల్, అ అనే వర్ణాలకు ప్రత్యేకంగా అర్థం లేదు. కాని వీటిని కలిపి అవ్యవధానంగా ఉచ్చరిస్తే 'తల' అనే మాట ఏర్పడి 'శిరస్సు' అనే అర్థం తెలుగు వారికి తెలుస్తుంది. ఇదే విధంగా మ్, ఎ, డ్, అ అనే వర్ణాలను విడిగా ఉచ్చరిస్తే ఏ అర్థమూ స్ఫురించదు. కాని కలిపి 'మెడ' అని ఎడం లేకుండా పలికితే 'కంఠం' అనే అర్థం దోతకమవుతుంది. పదాలన్నింటిలోను వర్ణక్రమం (order of ponermes) కూడా ముఖ్యం.

సంస్కృత భాషలో జ్, అ, ల్, అ అనే వ్యస్తాక్షరాలకు ఏ అర్థమూ లేకున్నా కలిపి సక్రమంగా అవ్యవధానంగా పలికినప్పుడు 'జల' అని ఉచ్చరించబడి 'నీరు' అనే అర్థం స్ఫురిస్తుంది. ఇదే విధంగా క్, ల్, త్, లా అనే శబ్దాలను విడిగా ఉచ్చరించినప్పుడు ఏ అర్థమూ స్ఫురించన్పటికీ 'కలా' శబ్దంగా ఉచ్చరించినప్పుడు, చతుష్షష్టి కళలూ స్ఫురిస్తాయి. (లేదా వాటిలో వారికి ఇష్టమయిన కళ స్ఫురిస్తుంది.)

హిందీలో బ్, ఐ, ల్ వర్ణాలు విడిగా ఉన్నప్పుడు ఏ అర్థాన్నీ ఈయవు, కాని కలిపి చదివినప్పుడు 'బైల్'గా ఉచ్చరితమై 'ఎద్దు' అనే అర్థాన్ని ఇస్తాయి. మ్, ఆ, ర్ అనే అక్షరాలకు హిందీలో విడివిడిగా ఉచ్చరించబడ్డప్పుడు ఏ అర్థమూ లేదు, కాని అవ్యవధానంగా ఉచ్చరించబడితే 'మార్' శబ్దం నిష్పన్నమై 'కొట్టు' అనే అర్థం హిందీ వచ్చిన వారికి తెలుస్తుంది.

ఇంగ్లీషులో p, e, n అనే విడి అక్షరాలకు అర్థం లేదు. కాని వాటిని క్రమంగా కలిపి చదివితే 'pen' శబ్దం ఏర్పడి 'కలం' అనే అర్థం స్ఫురిస్తుంది. ఇదే విధంగా g, u, n అనే అక్షరాలకు 'gun' అని చదివితే 'తుపాకి' అనే అర్థం వెంటనే స్ఫురిస్తుంది.

తెలుగు భాషలోని తల, మెడ పదాలు సంస్కృత భాషలోని "జల, కలా" శబ్దాలు, హిందీలోని "బైల్, మార్" మాటలు, ఇంగ్లీషులోని "pen, gun" పదాలు ఏ విధంగా విడగొట్టినా ఆయా అర్థాల్ని ఈయ లేవు. అంటే ఈ పదాలన్నీ ఆయా భాషలలో అర్థవంతాలయిన భాషానిష్ఠాంశాలని అర్థం.

"భాషా వచనాలలోని అర్థవంతమయిన ప్రత్యేకంగా ఉండే భాషా కనిష్ఠాలు పదాంశాలు"

C.F. హాకెట్ నిర్వచనం ఇదే:

"Morphemes are the smallest individually meanngful elements in the utterences of a language".

(A course in the modern linguinties ఈ నిర్వచనానికి వారిచ్చిన ఉదాహరణ 123)

"John treats his older sisters very ricely."

ఈ వాక్యం భాషా కనిష్ఠాంశం కాదు. నిర్మాణ భేదం లేకుండా ఈ క్రింది వాక్యాలను నిర్మించవచ్చు.

"He is older than I"
"The older of the two is a girl"
"I do declare, I'm getting older every dam!"

వాక్యం లో ఉన్న మాటలను ఇంకా లఘు పదాలుగా అర్థ భంగం లేకుండా విభజించాలి. "Order" అనే పదాన్ని ఆంగ్ల భాష తెలిసిన మనం "Old", "er" అనే రెండు పదాంశాలుగా విభజించగలం. ఇవి రెండూ రెండు భిన్నాలయిన పదాంశాలు అనటానికి అనేకోదాకరణలు ఆంగ్లంలో ఉన్నాయి.

"He is an old man" అనే వాక్యాన్ని బట్టి "old" ను ప్రత్యేక పదంగా గుర్తించవచ్చు.

"You should learn to enjoy the finer things of life" అనే వాక్యాన్ని బట్టి "-er" ను ప్రత్యేక పదాంశంగా గుర్తించవచ్చు.

ఈ విధంగా "John treats his older sisters very sinerly" వాక్యాన్ని

1. John
2. treat

3. -s
4. hi
5. -s
6. old
7. -er
8. sister
9. -s
10. very
11. nine
12. -ly
13. 

13 పదాంశాలుగా విభజించవచ్చు అని సి. ఎఫ్. హాకెట్ గారు నిరూపించారు.

తెలుగులోని "అమ్మలు పిల్లల్ని ప్రేమిస్తారు"

అనే వాక్యాన్ని తీసుకుంటే ఈ వాక్యంలో తొమ్మిది పదాంశాలున్నట్లు గుర్తించవచ్చు.

1. అమ్మ
2. -లు(బహువచనం)
3. పిల్ల
4. -ల్ (బహువచనం)
5. ని (ద్వితీయా విభక్తి కర్మాకార్థకం)
6. ప్రేమ
7. -న్ (-ఇంచు) (స కర్మకార్థకం)
8. -తా (తద్ధర్మార్థకం)
9. -రు (మనష్య బహువచన క్రియార్థకం)

స్థూల దృష్టికి మూడు పదాలుగా గోచరించిన "అమ్మలు పిల్లల్ని ప్రేమిస్తారు" అనే వాక్యంలో 9 పదాంశాల్మున్నట్లు గమనించాం.

హెచ్.ఏ. గ్లేసన్ గారు తమ వర్ణనాత్మక భాషాశాస్త్ర ఉపోద్ఘాత (An introduction to descriftive linguistics) గ్రంథంలో పదాంశాన్ని గురించి విపులంగా వివరించారు. భాషా నిర్మాణంలోని అర్థవంతమయిన కనిష్ఠాంశాలను పదాంశాలుగా నిర్వచించవచ్చు. (Some morphemes can be usefully described as the smallest meaningful units in the structure of the language - isid p.53) అని తెలిపారు.

## సపదాంశం

సపదాంశం ఎప్పుడూ ఒకే రూపంలో అంటే ఒకే రకం ధ్వని సముదాయంతో ఉండదు. సందర్భానుగుణంగా ఒక పదాంశం వేరు పదాంశాలతో కలిసినప్పుడు అందులో ఉన్నప్పుడు ధ్వనులు మారటం లేదా కొన్ని పూర్తిగా లోపించటం జరుగుతూంటుంది. ఒక్కోసారి పదాంశం పూర్తిగా మారిపోతుంది. "ఒక పదాంశానికి కొన్ని సందర్భాలలో వచ్చే రూప భేదాన్ని సపదాంశం" అని నిర్వచించవచ్చు.

తెలుగులో బహువచన ప్రత్యయంగా '-లు' ఉంది. దీనికి రూపాంతరాలున్నాయి.

| ఏ.వ. | బ.వ |
|---|---|
| గోడ | గోడ-లు |
| కాకి | కాకు-లు |
| గుడి | గు-ళ్ళు |
| రాత్రి | రాత్రి-ళ్ళు |

ఊరు ఊ-ళ్ళు
గోరు గో-ళ్ళు
కొడవలి కొడవ-ళ్ళు

పై ఉదాహరణలలో ఉన్న బహు వచన ప్రత్యయాలయిన '- లు, - ళ్ళు' ఒకే అర్థాన్ని (బహువచనాన్ని) సూచిస్తాయి. కాబట్టి వీటిని అన్నింటికి ఒకే పదాంశం యొక్క రూపాంతరాలుగా భావించాలి. ఈ రూపాంతరాల్ని సపదాంశాలు అని వ్యవహరిస్తారు.

గోడ, తల, మెడ, మేడ మొదలయిన శబ్దాలలో బహువచనం పదమయినప్పుడు ఏ మార్పూ ఉండదు. అప్పుడు పదాంశానికి సపదాంశానికి భేదం ఉండదు. కాకి, గుడి, రాత్రి, ఊరు, గోరు, కొడవలి శబ్దాలకు బహువచనం పదమయినప్పుడు రూప భేదం కల్గటం మనం గమనించాం. ఈ రూప భేదాలను సపదాంశాలుగా పేర్కొనవచ్చు.

ఇంగ్లీషులో Comming, Going, Walking, Talking మొదలయిన పదాల ఏక రూపతతో ఉచ్చరిస్తారు. ఇక్కడ పదాంశం ఒకటి& మాత్రమే ఉందని లేదా పదాంశానికి సపదాంశానికి ఏ విధమయిన భేదమూలేదనీ గుర్తించాలి.

ఇంగ్లీషులోని బహువచన ప్రత్యయమయిన '- s' భిన్న రూపాలలో మనకు గోచరిస్తుంది. cat, bat, mat పదాలకు బహువచనంలో '-s' చేరుతుంది. Rose మొదలయిన పదాలకు బహువచనంలో 'iz' చేరుతుంది. bag, dog మొదలయిన పదాలకు బహువచన ప్రత్యయంగా '-z' చేరుతుంది. వీటన్నింటిని సపదాంశాలుగా (బహువచన ప్రత్యయానికి) పేర్కొనవచ్చు. '-s', '-iz', '-z' అనేవి ఇంగ్లీషులోని బహువచన సపదాంశాలు.

| p, t, k, f, θ | వర్ణాంత పదాల తర్వాత |-s| బహువచనంతంగా వస్తుంది. $\left| s, z, \check{s}\,\check{z}\,\check{c} \right|$ వర్ణాంత పదాల తర్వాత | -z | బహువచనాంచంగా వస్తుంది. మిగిలిన హల్లులతో అచ్చులతో ముగిసిన పదాలకు బహువచనంతంగా | -z | వస్తుంది. ఈ బహువచనోదాహరణ ఆంగ్లంలో సపదాంశాలకు చక్కటి ఉదాహృతి.

## 8.2 పదాంశాలను గుర్తించటం:

సంబంధిత రచనా సమాచారాన్ని ఆధారంగా చేసుకొని వాక్యాలలోని పదాంశాలను గుర్తించటం అంత సులువయిన పని కాదు. ఇందుకు ఎంతో పరిశీలన అవసరం. భాషలోని అర్థవంతాలయిన కనిష్ఠాంశాలను ఎంచుకొని పరిశీలించాలి. తత్ క్షణమ్ అకస్మాత్తుగా ఆ విధంగా ఎంచుకునే పద్ధతి ఏదీ లేదు. మనం పదాంశాలు అనుకునే వాటిని యుగ్మాలు (pairs)గా ఏర్పరచుకొని భిన్న భిన్న సన్నివేశాలలో ఆ యుగ్మాల అర్థాల్ని పరిశోధించి చూచుకోవాలి. ఈ పరిశీలన తుట్టతుదకు పదాంశం ఒక వ్యవస్థ (System)లో ఇమిడిపోవాలి.

పాక్షిక విషయ భేదంతో ఉండి ప్రకటితమయ్యే కనిష్ట అర్థ భేదాల వల్ల పదాంశాలను గుర్తించవచ్చు.

1. | I saw her | 'నేను ఆమెను చూచాను'

2. | We saw her | 'మేము ఆమెను చూచాము'

ఈ రెండు ఆంగ్ల వాక్యాల్ని పరిశీలిస్తే సులభంగా మనకు |I| అంటే **నేను** అనీ |We| అంటే **మేము** అనీ అర్థాలు తెలుస్తాయి. అప్పుడు |I|, |We| లను రెండు పదాంశాలుగా మనం గుర్తించవచ్చు.

పరిచయం ఉన్న భాషలలోని పదాంశాలను గుర్తించటం తేలికే. ఏ మాత్రమూ పరిచయం లేని వచనాల (utterences) అర్థాలు పూర్తిగా అవగతమయినా గుర్తించటం కష్టం. ఇందుకు ఉదాహరణగా హిబ్రూ క్రియా రూపాలను పరిశీలిద్దాం.

1. |zzk2rtjihuu| 'I remembered him'

2. |z2k2ntjih22| ' I remembered her'

3. |z2k2rtjik22| ' I remembered tree'

1, 2 వాక్యాలను పరిశీలిస్తే |-uu|; |-22|ల భేదం కన్పిస్తోంది. అర్థంలోని భేదాన్ని బట్టి |-uu| = I

| - 22| = We

ఈ యుగ్మాన్ని తాత్కాలికంగా నిర్ణయించి పదాంశాలను ఊహించవచ్చు. కాని ఇది సరా? కాదా? అని ఇంకా పరిశీలించాలి. ఇందు మనకు 3వ ఉదాహరణ తోడ్పడుతుంది.

|- huu| 'him'

|- h22| 'her'

|- k22| 'tree'

'him' అనే అర్థాన్ని ఇవ్వటానికి కీబ్రూలో |huu| అనే పదం ప్రయోగించబడిందనీ 'her' అనే అర్థాన్ని తెలపటానికి కీబ్రూలో |h22| అనే పదం ప్రయోగించబడిందనీ, 'tree' అనే అర్థాన్నీ వ్యక్తం చేయటానికి కీబ్రూలో |k22| అనే శబ్దం వ్యవహరించబడిందనీ ధృఢ తరంగా మనం భావించవచ్చు. తుటి నిర్ణయం తీసుకోవటాన్ని ఇంకా పరిశీలించాలి.

4. | z2k2rnuuhuu| 'We remembered him'

5. |z2k2rnuuh22| 'We remembered her'

6. | z2k2rnuuk22| 'We remembered tree'

4, 5, 6 వాక్యాలను 1, 2, 3 వాక్యాలతో పోల్చి చూస్తే | - t ii - | ' I ' ; | - nuu - | ' We' అనే పదాంశాలకు అర్థాలుండవచ్చు. మిగిలన పదాంశాలకు ఏ అర్థాలున్నాయో తెలిస్తేనే కాని ఈ నిర్ణయం సరైనదో కాదో చెప్పలేము. వీటికి మారుగా | - rtii -| 'I' ; |-rnuu| 'we' పదాంశాలు కావచ్చు. ఈ విషయాన్ని నిర్ణయించటానికి మరిన్ని పదాంశ యుగ్మాల్ని పరిశీలించాలి.

7. | q2t2ltiihuu| ' I killed him'

8. | q2t2hnuuhuu| ' We killed him'

7, 8 వాక్యాలను పరిశీలిస్తే

| z2k2n - | 'remembered'

| q2t2l| 'killed'

అనే అర్థాలు స్పష్టమవుతాయి. ఇప్పుడు |- tii -| 'I' అనీ | - nuu - | 'we' అనీ అర్థాలు. ఇప్పుడు 8 వాక్యాలలోని పదాంశాలు అన్నిటికీ అర్థాలు స్పష్టమవుతున్నాయి.

**ఉదాహరణకు :**

1. | z2k2rtiihuu|
   |z2k2r -| 'remembered'
   | - tii -| 'I'
   | huu | 'him'

పద క్రమం (Word order) ఆయా భాషా నిర్మాణాన్ని బట్టి ఉంటుంది.

ఈ రీతిగా పదాంశాలను గుర్తించటం శ్రమతో కూడిన వ్యవహారం.

పదాంశానికి ఇంకో పదాంశం ధ్వని మార్పు లేకుండా చేరి తో గుర్తించటం తేలిక.

।తలకు। ' to a head '

।ముక్కుకు। ' to a nose'

ఈ జంటను పరిశీలిస్తే ।తల। అంటే 'head' అనీ ।ముక్కు। అంటే 'nose' అనీ ।-కు। కు 'to' అనీ అర్థాలు స్పష్టమవుతాయి.

పదాంశాలను గుర్తించటంలో నైడా సూచించిన ఆరు సూత్రాలను చూద్దాం.

1. ఒకే అర్థం అన్ని సందర్భాలలోను ఒకే విధంగా ఉండి ధ్వని రూపంలో ఏ విధమయిన మార్పులూ లేకుండా ఉన్న అంశాలు ఒకే పదాంశంగా పరిగణించబడతాయి. బల్ల - లు, సినిమా - లు, బెంచీ - లు, తల - లు మొదలయిన వాటిలోని ।-లు। ఒకే రూపంలో ఉండి బహువచన ద్యోతకంగా ఉంది.

ధ్వని రూపం ఒక విధంగా ఉన్నప్పటికి అర్థాలు భిన్నంగా ఉంటే ఆ భాన్నార్థాలు కలిగిన శబ్దాలను వేర్వేరు పదాంశాలుగా

పరిగణించాలి. ఉదా -

తమ్ముడు, అల్లుడు, మనుమడు, మగడు వంటి పదాలలోని । -డు । మనుష్య పుంలింగ వాచక (మహద్వాచక) పదాంశం. తాగుడు, వాగుడు, తిరుగుడు వంటి శబ్దాలలో ।ుడు। పదాంశ భావార్థ సూచక కృదంత రూపం. వీటిలోని । -డు । వర్ణానికి భిన్నార్థాలున్న కారణంగా వీటిని విభిన్న పదాంశాలుగా గుర్తించాలి. అప్పుడు వీటిని ।-డు। మహద్వాచక పదాంశం, ।-డు²। భావార్థ సూచక పదాంశం అని పేర్కొనాలి. నిఘంటువులలో కూడా వీటికి ప్రత్యేక (విడిగా) ఆరోపాలివ్వాలి. వీటిని ఉచ్చారణైకతా పదాంశాలు (homopronous morpfermes) అని వ్యవహరిస్తారు.

ఏక రూపతతో ఉండి భిన్నార్థాలు కల పదాంశాలను సి.ఎఫ్. హాకెట్ ప్రస్తావించి ఉదాహరించారు. "We have encountered several instances of morphemes which are identical in froremic shope, yet distinct because of difference in meaning. For example, |z| marking pluratity in boys, |z| marking possession in men's room, and |z| indicating third person singular sufseat in he runs fast are phonemically the same, but are three different meanings - (isid p. 130).

ఇంగ్లీషు భాషలోని |- s| |z| కు బహువచనార్థం, షష్ఠ్యర్థం ఉన్నాయి. ప్రథమ పురుషైకవచనం కర్తగా ఉన్నపుడు వర్తమానకాల క్రియకు (-s) చేరటం జరుగుతుంది. |-s| ను మూడు పదాంశాలుగా గుర్తించాలి.

బేర్ |bear| 'ఎలుగుబంటి'

బేర్ |bear| 'ప్రసవించు'

'బేర్' (bear) కు రెండు భిన్నార్థాలున్న కారణంగా ఇవి రెండు భిన్న పదాంశాలు

|meet| 'కలుసుకొను'

|meat| 'మాంసం'

మీట్ (meet, meat) అనే పదాంశం ఒకే రకమయిన ఉచ్చారణ కల పదం. కాబట్టి రెండు పదాంశాలు.

ఒకే అర్థం కలిగి ఉండి ధ్వని రూపం మాత్రం వేరుగా ఉన్న అంశాలు వర్ణాత్మక నియతి (phonological condition)లో ఉంటే అవి ఒకే పదాంశానికి చెందుతాయి. ఇవి ఒకే పదాంశానికి చెందిన సపదాంశాలవుతాయి. సపదాంశాల ధ్వనులలో ఉన్న భేదం వాటి సమీపంలోని పదాంశాల ధ్వనులను లేదా అక్షర నిర్మాణాన్ని (syllabic structure)ను ఆశ్రయించుకుని ఉంటే అటువంటి సపదాంశాలు వర్ణాత్మక నియతి (frorological condition)లో ఉన్నాయని అంటారు.

**ఉదా:** కాకి (ఏ.వ.) కాకు - లు (బ.వ.)

కత్తి (ఏ.వ.) కత్తు - లు (బ.వ.)

సుత్తి (ఏ.వ.) సుత్తు - లు (బ.వ.)

గుత్తి (ఏ.వ.) గుత్తు - లు (బ.వ.)

''కాకి - కాకు

కత్తి - కత్తు

సుత్తి - సుత్తు

గుత్తి - గుత్తు'' అనేవి సపదాంశాలు. కాకి మొదలయిన శబ్దాలలోని ఇకారం ఉత్వ విశిష్టమయిన బహువచన లకారం పరమయినందున ఉత్వంగా మారి కాకు మొదలయిన రూపాలు ఏర్పడ్డాయి. ఉదంత రూపాలు మిగిలిన చోట్ల ఉంటాయి. ఈ విధంగా కాకి మొదలయిన శబ్దాలలోని ఇత్వం బహువచన -లు వర్ణం పరమయినప్పుడు ఉత్వంగా మారి 'కాకు' మొదలయిన సపదాంశాలు ఏర్పడతాయి. ఇటువంటి మార్పు సమీకరణ '(assinilation)' (బాలవ్యాకరణము తత్సమ - 45 సూ.) అని సూత్రించారు.

సంస్కృత భాషలో తృతీయా బహువచన ప్రత్యయం '-భిః'. ఉదా- కవి - కవిభిః (కృతియా బహువచనం), విష్ణు -విష్ణుభిః (తృతియా బహువచనం), మహద్ - మహద్భిః (తృతియా బహువచనం), లతా - లతాభిః (తృతియా బహువచనం). అదంత శబ్దాల పై ఉన్న తృతీయా బహువచన ప్రత్యయం 'ఐః' అని ఉంటుందని ''దేవ - దేవైః (తృతియా బహువచన ప్రత్యయం), అశ్వ - అశ్వైః (తృతియా బహువచన ప్రత్యయం), వన - వనైః (తృతియా బహువచన ప్రత్యయం)'' మొదలయిన శబ్ద రూపాల వల్ల

తెలుస్తోంది.

''భిః - ఐః'' అనేవి తృతియా బహువచన సపదాంశాలని స్పష్టమవుతోంది.

అను, కను, కొను, తిను మొదలయిన ఏక హ్రస్వాచ్చు ఆది యందు కలిగి అత్విరుక్తమయిన నకారంతో అంతమయ్యే ధాతువులకు తకారంతో మొదలయ్యే పదాంశానికి టకారంతో మొదలయ్యే సార్థకం ఉంటుంది. ఉదా -

అను - అంటున్నాడు
అంటాడు
తిను - తింటున్నాడు
తింటాడు
కొను - కొంటున్నాడు
కొంటాడు
తిరుగు - తిరుగుతున్నాడు
తిరుగుతాడు
ఉరుకు - ఉరుకుతున్నాడు
ఉరుకుతాడు
మాను - మానుతున్నాడు
మానతాడు
దున్ను - దున్నుతున్నాడు
దున్నుతాడు

ఇక్కడ ఉన్న నియతి (Conditioning) అక్షర నిర్మాణం, చివరిహల్లు అనే రెండింటి మీద ఆధారపడి ఉంది.

3. ఒకే అర్థం కలిగి ధ్వని రూపం మాత్రం వేరుగా ఉన్న అంశాలు పదాత్మక నియతి (morprological conditioning)లో ఉంటే అవి ఒకే పదాంశానికి చెందుతాయి.

తెలుగులో బహువచన ప్రత్యయం '-లు' అని అందరికీ తెలుసు. కాని రాత్రి శబ్దానికి రాత్రిళ్ళు అనీ పెళ్ళి శబ్దానికి పెళ్ళిళ్లు అనీ బహువచన రూపాలున్నాయి. కాబట్టి -లు, -ళ్ళు అనేవి వర్ణాత్మక నియతి లేదని మంత్రి - మంత్రులు, నల్లి - నల్లులు, శాస్త్రి - శాస్త్రులు పదాంశాలను బట్టి తెలుస్తోంది.

ఇంగ్లీషులోని 'ox' పదానికి బహువచన ప్రత్యయంగా 'er' చేరి 'ox N' రూపం ఏర్పడుతుంది. బహువచన ప్రత్యయంగా '- ren' 'child' శబ్దానికి చేరి 'Children' పదాంశం ఏర్పడుతుంది. ఇవి బహువచన ప్రత్యయమయిన '-s' ప్రత్యయానికి 'ox' పదాంశానికి మాత్రమే చేరే '-e N' పదాంశం 'child' పదాంశానికి మాత్రమే చేరే 'ren' పదాంశమూ పదాత్మక నియతి వల్ల సపదాంశాలు అవుతాయి. వర్ణాత్మక నియతి వల్ల ఏర్పడే సపదాంశాలకు పూర్వం ~ గుర్తు, పదాత్మక నియతి వల్ల ఏర్పడే సపదాంశాలకు ముందు ∞ గుర్తు వాడటం ఆచారం.

–s∞ – er∞ – ren (పదాత్మక నియతి)

–s ~ –z ~ *hz (వర్ణాత్మక నియతి)

4. ఆధారభూతమయిన (base గా ఉన్న) ఒక పదం నుంచి ఇంకో పదం ఏర్పడినప్పుడు ఈ రెండింటిలోనూ వచ్చిన ధ్వని భేదాన్ని ఆర్థికంగా గుర్తించాలి. ఆంగ్లంలో ఇటువంటి రూపాలు బహువచన దోయతకాలుగా ఉన్నాయి. ఏకవచన శబ్ద రూపంలోని లోపలి అచ్చును మార్చటం ద్వారా బహువచన రూపాలు ఏర్పడతాయి.

| **Singular** | **Plural** |
|---|---|
| man | men |
| woman | women |
| foot | feet |

| | |
|---|---|
| tooth | teeth |
| goose | geese |
| mouse | mice |
| louse | lice |

పై పదాంశాలలో బహుత్వాన్ని 'ee' (iy) సూచిస్తుంది.

5. సమధ్వని రూపాలు లేదా ధ్వన్యేకతా రూపాలు (Homophonous forms) రెండు వేరు అర్థాలున్న పదాలకు ఒకే ఉచ్చారణ ఉండటం 'సమధ్వని' అని నిర్వచిస్తారు. ఇటువంటి శబ్ద రూపంతో ఉన్న పదాంశానికి ఉన్న అర్థాలు ఒకే అర్థం నుండి అర్థ పరిణామం కారణంగా ఏర్పడినవని భిన్నార్థాలా, (నానార్థాలా?) లేక వేరు వేరు పదాంశాలయి ఉండి తర్వాత ధ్వని పరిణామం వల్ల ఏకరూపతను పొంది భిన్న భిన్న అర్థాలను ఇస్తున్నాయా? అనే విషయాన్ని పరిశీలించి మనం నిర్ణయించుకోవాలి. వీటికి కొన్ని నియమ నిబంధనలున్నాయి. వాటిని గమనిద్దాం.

వాటి అర్థాలు ఏ విధంగా చూచినా ఏ మాత్రమూ సంబంధంలేనివి అయితే వాటిని వేర్వేరు పదాంశాలుగా గుర్తించాలి. ఉదా-'ఏడు' అనే తెలుగు పదానికి ఆరున్నొకటి అనే సంఖ్యావాచకార్థంతో పాటు 'ఏడ్చు'కు విధి రూపంగా కూడా ప్రయోగం (వ్యావహారికం)లో ఉంది. ఈ రెండు శబ్దాలూ వ్యుత్పత్తి పరంగా చూచినా విభిన్నమయినవి. తర్వాతే ధ్వని పరిణామాల వల్ల ఏక రూపతను కలిగి ఇప్పుడు రెండు అర్థాల్లోనూ వాడబడుతున్నాయి. 'దుఃఖించు' అనే అర్థం ఉన్న 'ఏడు' శబ్దం వల్లనే సప్తార్థకమయిన 'ఏడు' శబ్దానికి చెడ్డ అర్థంతో తెలుగులో వచ్చింది. ఇతర భాషా వ్యవహర్తలకు (ఇంగ్లీషులో seven, హిందీలో 'సాత్', తమిళంలోను తుళుమలయాలలో 'ఏళు', కన్నడంలో 'ఏళు') ఈ చెడ్డ అర్థం (అపవిత్రం, మంచిదికానిది) లేదు. తెలుగు వారు లెక్కించేటప్పుడు 'ఏడు' అనకుండా 'ఆరున్నొక్కటి' అంటారు.

తెలుగులోనే 'వేరు' పదానికి చెట్టు వేరు, భిన్నమయినది అనే రెండు అర్థాలున్నాయి. భిన్నమయినది అనే అర్థం కల వేరు పదం శకట రేఫఘటితమయిన 'వేఱు' పదం నుంచి నిష్పన్నమయింది. తర్వాత సాధురేఫగా మారి 'వేరు' పదమయి చెట్టు వేరు అనే అర్థంతో ఏకరూపతను పొంది రెండు అర్థాలను ఇచ్చింది. కాబట్టి ఇవి రెండూ రెండు విభిన్న పదాంశాలు. ఈ రెండింటికీ వ్యవహారంలో ప్రయోగాలున్నాయి.

ఆ వేరు (చెట్టు వేరు) కుళ్ళిపోయింది. వారు వేర్లు (భిన్నం)గా కాపరముంటున్నారు. వేరు[1], వేరు[2] అని నిఘంటువులలో వీటికి భిన్నమయిన ఆరోపాలను (entries) ఇవ్వాలి.

ఒక భాషలోని ఒక శబ్ద రూపానికి కాలక్రమంలో భిన్నార్థాలు అర్థ విపరిణామం (Semantic change) కారణంగా ఏర్పడతాయి. అటువంటప్పుడు వాటికి విభిన్న పదాంశాలుగా పరిగణించకుండా ఒకే పదాంశంగా పరిగణించాలి. మాతృభాషలో అయితే వీటిని మనం సులభంగా గుర్తించవచ్చు.

| **ఉదా -** | **శబ్దం** | | **అర్థం** |
|---|---|---|---|
| | 'బొంకు' | (నామ వాచకం) | అబద్ధం |
| | బొంకు' | (క్రియ) | అబద్ధమాడు |
| | ।బొంకు। | వి.అబద్ధం | క్రి.అబద్ధమాడు |
| | నవ్వు | (విశేషణం) | హాసం |
| | 'నవ్వు' | (క్రి.) | హాసించు |
| | ।నవ్వు। | వి.హాసం | క్రి.హాసించు |
| | 'తిట్టు' | (విశేషణం) | అధిక్షేపం |
| | 'తిట్టు' | (క్రియ) | అధిక్షేపించు |
| | ।తిట్టు। | వి.అధిక్షేపం | క్రి.అధిక్షేపించు |

పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు అనే పదాలలోని కొడుకు, కూతురు శబ్దాలకు 'పుత్ర', 'పుత్రి' అనే అర్థాలా? కావా? అనే సందేహం

మాతృభాషా వ్యవహర్తలకు కూడా కలుగుతుంది. కాని భాషా శాస్త్ర పరిశీలన వల్ల కొడుకు పదానికి యువకుడు అనీ, కూతురు పదానికి యువతి అనీ అర్థం తెలుసుకుంటే ఈ సమస్య పరిష్కారమవుతుంది. వీటిని బట్టి, కొడుకు, కూతురు పదాలను ఒకే పదాలుగా గుర్తించి ।కొడుకు।, ।కూతురు। అనే పదాంశాలుగా పేర్కొనవచ్చు.

గాడిద, కుక్క, పంది పదాలను మనుష్యులకు కూడా వాడితే అప్పుడు ఆపదాలకు అర్థ విపరిణామం జరిగినట్లుగా భావించవచ్చు. అవి భిన్న పదాంశాలుకానేరవు.

'మొక్కజొన్న' పదంలో మొక్క అనే మాటకు 'వృక్షకం' అనే అర్థం ఉన్న మొక్కకూ ఏ విధమయిన సంబంధమూ లేదు. మొక్కజొన్నలోని 'మొక్క' పదం మక్కా నుంచి తెలుగులో ప్రవేశించింది. మొక్క ని వృక్షకం, మొక్క ని మక్కా అని రెండు ఆరోపాలు మొక్క పదానికి ఇవ్వాలి. ఇవి రెండు పదాంశాలు ఇటువంటి పదాంశాల దగ్గర మనం జాగ్రత్త వహించాలి.

6. ఒక పదాంశాన్ని నిర్ధారించటానికి ఈ కింద ఇవ్వబడ్డ సూచనలు ఉపయోగపడతాయి.

అ. భాషలో స్వతంత్ర ప్రయోగార్హత ఉండాలి.

ఇంగ్లీషు: dog, book, head, leg, zoo, zebra, lofra

సంస్కృతం: అగ్ని -, కాల -, పాద -, శీర్ష -, హరి -, వృక్ష -

హిందీ: పుస్తక్, పైర్, హాథ్, ఆంఖ్, దో, పాంచ్

తెలుగు: ఆడు, పాడు, విను, కను, తల, కాలు, పంది, పాము, రెండు, పది, నూరు, వెయ్యి

ఆ. స్వతంత్ర ప్రయోగార్హత లేకపోయినప్పటికీ స్వతంత్ర ప్రయోగార్హత కల పదాంశాలతో కూడి ఉన్న వాటిని కూడా అవి అర్థ బోధకాలయితే వాటిని పదాంశాలుగా గుర్తించాలి.

ఇంగ్లీషులోని '-s' బహువచన ద్యోతక పదాంశం. కాని దీనికి ప్రత్యేక ప్రయోగార్హత లేదు. ఇది స్వతంత్ర పదాలతో కూడి వ్యవహరించబడుతుంది.

| **Singular** | **plural** (Suffix (-s)) |
|---|---|
| dog | dog - s |
| cat | cat - s |
| cow | cow - s |
| foot | foot -s |
| pen | pen - s |

తెలుగులోని '-లు' బహువచన ప్రత్యయం కూడా ఇటువంటిదే.

| **ఏకవచనం (ఏ.వ.)** | **బహువచనం (బ.వ.)** |
|---|---|
| గోడ | గోడ - లు |
| మేక | మేక - లు |
| ఆవు | ఆవు - లు |
| గొట్టె | గొట్టె - లు |
| మేడ | మేడ - లు |
| పాము | పాము - లు |

ఇ. స్వతంత్ర ప్రయోగార్హత లేకుండా ఉండి అవికూడిన వాటికి కూడా స్వతంత్ర ప్రయోగార్హత లేని ఇట్టు రెండూ కలసి విశిష్టార్థాన్ని సూచించినప్పుడు ఈ రెంటినీ ప్రత్యేక పదాంశాలుగా గుర్తించాలి.

ఉదా- Con-ceire, con-sume, con-tum, con-clude, con-dense మొదలయిన పదాలలోని Con -కు స్వతంత్ర ప్రయోగార్హత లేదు. -ceive, -sume, -tim, -clude, -dense మొదలయిన వాటిలోని -dense కు ప్రత్యేక ప్రయోగార్హత ఉన్న కారణంగా

పదాంశాలుగా గుర్తించవచ్చు.

ఈ. ఒక ప్రత్యేక సందర్భంలో మాత్రమే ప్రయుక్తమై దానితో కూడిన శబ్ద రూపాలకు స్వతంత్ర ప్రయోగార్హత ఉన్నప్పుడు లేదా బహుళ వ్యాప్తిలో వ్యవహారం ఉన్నపుడు అటువంటి శబ్దాలకు ప్రత్యేక ప్రయోగం లేనప్పటికీ పదాంశత్వం సిద్ధిస్తుంది.

ఉదా- పట్టపగలు (పట్ట -)
తుట్టతుద (తుట్ట -)
నట్టునడుమ (నట్ట -)
కట్టకడ (కట్ట -)

ఈ పై పదాలలోని పట్ట-, నట్ట- మొదలయిన వాటికి ప్రత్యేక ప్రయోగార్హత లేదు. ఇవి తర్వాతి పదాలతో మాత్రమే కలిసి ప్రయోగించబడతాయి. పట్ట మొదలైన వాటి తర్వాత ఉన్న పగలు మొదలయిన శబ్దాలకు ప్రత్యేక ప్రయోగార్హత ఉన్న కారణంగా పట్టు - మొదలయినవి ప్రత్యేక పదాంశాలుగా పరిగణించాలి.

ఇదే విధంగా పొలం పుర్రఆ, నగనట్రా, కూరానారా మొదలయిన వాటిలోని -పుట్రా, -నర్రఆ మొదలయిన అంశాలు కూడా పదాంశాలవుతాయి. మొదటి అంశం వంటిది అని వీటి అర్థం. పట్ట-పగలు మొదలయిన వాటిలోని మొదటి పదాంశానికి అతిశయం అని అర్థం.

ఇంగ్లీషులోని cranberry, resfferrs అనే రెండు పదాలలో ఉన్న berry కి మాత్రం స్వతంత్ర ప్రయోగార్హత ఉంది. ఈ కారణంగా cran, rasp అనే వాటికి ప్రత్యేక ప్రయోగార్హత లేకపోయినా విశిష్ట జాతి ఫలాలను సూచిస్తున్న cran -, rasp - లు పదాంశాలు అవుతాయి.

## 9.3 పదాంశ భేదాలు:

పదాంశాలను ధాతువులు (roots) ప్రత్యయాలు (affixes) అని రెండు రకాలుగా వి?భజించవచ్చు. ధాతువు ప్రాథమికమయినది, అర్థవంతమయిన అన్ని మాటలలోను సాధారణంగాను స్వతంత్రంగాను ప్రాయికంగా ఉండేది. ధాతువుకు అర్థ విశేషాలను సూచించటానికి గాను ప్రత్యయాలు చేరతాయి. **పాడుతున్నాడు** అనే వాక్యంలో **పాడు** అనేది ధాతువు -తు- అనేది వర్తమాన ప్రత్యయం. ఉన్న అనేది ప్రథమ పురుషద్యోతక పురుష ప్రత్యయం, చారిత్రికంగా వాడు శబ్దనిష్పన్నం. భాషలన్నింటిలోను ధాతువులు అధికంగాను ప్రత్యయాలు తక్కువగాను ఉంటాయి. నామవాచకాలయిన ఇల్లు, ఈల, ఉక్కు, కోక, గోడ, పాము, పెండ, మెడ, తల, వల మొదలయిన ప్రాథమికార్థద్యోతకాలే పదాంశాలు.

ఇంగ్లీషులోని ant, apple, bat, cat, book, dog, god, tree, man, serpent, hat వంటివి ప్రాతిపతికార్థద్యోతకాలయిన నామవాచకాలయిన పదాంశాలు.

సంస్కృతంలో స్త్రీ, మను -, వృక్ష-, హల -, తరు -, భూమి - మొదలయినవి నామవాచకాలయిన పదాంశాలు. హిందీలో పైర్ (పాదం), హాథ్ (హస్తం), సాంప్ (పాము), కాన్ (చెవి), చిడియా (పిట్ట) మొదలయినవి పై విధంగానే పదాంశలు.

భాషలలోని ప్రత్యయాలను 5 రకాలుగా విభజించారు.

**ఏ. పరప్రత్యయాలు**(suffixes) ఇవి ధాతువుకు పరంగా (తర్వాత) చేరతాయి. తెలుగు భాషలోని ప్రత్యయాలన్నీ పర ప్రత్యయాలే.

ఉదా- తద్ధితకృత్ ప్రత్యయాలు

| **పదాంశం** | **ప్రత్యయం** |
|---|---|
| గొప్పతనం | -తనం (త్వార్థం) |
| దొంగతనం | -తనం (త్వార్థం) |
| వినటం | -టం (భావార్థకం) |
| చెప్పటం | -టం (భావార్థకం) |
| చిన్న ఆకం । చిన్నరికం | - ఱికం - -రికం |

| | |
|---|---|
| కన్నెటికం / కన్నెరికం | - టికం - -రికం |
| ఆటకాడు | - కాడు |

ఇంగ్లీషులో కూడా పరప్రత్యయాలున్నాయి.

| **పదాంశం** | **పరప్రత్యయం** |
|---|---|
| childhood | -hood |
| kingdom | -dom |

**బి. పూర్వ ప్రత్యయాలు** (prefixes) పూర్వ ప్రత్యయాలు ధాతువుకు ముందు చేరతాయి. సంస్కృత భాషలో పూర్వ ప్రత్యయాలు అనేకం ఉన్నాయి.

| **పదాంశం** | **పూర్వప్రత్యయం** |
|---|---|
| పరాశక్తి | పరా- |
| పరాజయం | పరా- |
| ఆహారం | ఆ- |
| విహారం | వి- |
| ప్రహారం | ప్ర- |
| పరిహారం | పరి- |
| అపఖ్యాతి | అప- |

ఇంగ్లీషులో కూడా ఇటువంటివి ఉన్నాయి.

| **పదాంశం** | **పూర్వ ప్రత్యయం** |
|---|---|
| preface | pre- |
| surface | sur- |
| replace | re- |
| injustice | in- |
| unjist | un- |

**సి. అంతః ప్రత్యయాలు** (in fixes)

అంతః ప్రత్యయాలు ధాతువు మధ్యలో చేరతాయి.

సంస్కృత భాషలో ఇటువంటి అంతః ప్రత్యయాలున్నాయి.

| **ధాతురూపం** | **పదాంశం** | **అంతఃప్రత్యయం** | **అర్థం** |
|---|---|---|---|
| రుధ్ | రుణద్ధి | -ణ- | నిరోధిస్తున్నాడు |
| భిద్ | భినత్తి | -న- | బద్దలుకొడ్తున్నాడు |

అరబిక్ భాషలో

| **ధాతువు** | **పదాంశం** | **అంతఃప్రత్యయం** |
|---|---|---|
| క్త్బ్ (లిఖించు) | కితాబ్ (పుస్తకం) | -ఇ--ఆ- |
| నజ్ర్ (నడిపించు) | నజర్ (చూపు) | -అ--అ- |
| క్త్ల్ (చంపు) | కతల్ (హత్య) | -అ--అ- |

అంతః ప్రత్యయాలు ద్రావిడ భాషలలో లేవు.

### డి. సర్వాదేశాలు(suppletives):

పదాంశానికి ప్రాథమికమయిన సపదాంశానికి ధ్వనిలో ఏ మాత్రమూ సారూప్యం లేని సపదాంశం కొన్ని సందర్భాలలో వస్తుంటాయి. ఇటువంటి సపదాంశాన్ని సర్వాదేశం అంటారు. సంస్కృత భాషలో ఈ సర్వాదేశాన్ని పాణిని మహర్షి పేర్కొన్నారు.

''అతోభిసవిస్'' (అష్టా. 7-1-9)

అదంతాంతం కంటేపరమైన 'భిస్' తృతియా బహువచన ప్రత్యయానికి 'ఐస్' ఆదేశంగా వస్తుంది. ''అనేకాల్శిత్ సర్వస్య అష్టా 1-1-55'' అనే సూత్రం ప్రకారం ఇది సర్వాదేశం.

రామ - రామ-భిస్ రామ-ఐస్ రామైః

వృక్ష - వృక్ష-భిస్ వృక్ష-ఐస్ వృక్షైః

సర్వాదేశం ధాతువులలో (సంస్కృతం) కూడా వస్తుంది.

''బ్రూ'' (పలుకు) అనే సంస్కృత ధాతువుకు పరస్మైపద వర్తమానంలో ప్రథమ పురుషలోనూ మధ్యమ పురుష ఏకవచన ద్వివచనాలలోను ''ఆహ్-'' వైకల్పికంగా సర్వాదేశమవుతోంది. ఆహ్/- ఆహతుః / -ఆహుః / బ్రువన్తి

బ్రవీతి బ్రూతః

ఆత్థ / బ్రవీహి - ఆహథుః / బ్రూథః

''బ్రువః పంచానా మాదిత ఆహోబ్రువః'' (అష్టా. 3-4-88) అనే సూత్రం దీనికి ఆధారం.

ఇంగ్లీషులో 'go' అనే క్రియకు భూత కాలంలో 'wen-t' గా సర్వాదేశం వల్ల మారుతుంది.

### ఇ. రూపశూన్య పదాంశం(Zero morpheme):

ఒక అర్థాన్ని ఇచ్చే ప్రత్యయం కొన్ని పదాలలో కనబడకపోయినా ఆ ప్రత్యయం అర్థం మాత్రం వ్యక్తమవుతుంది.

ఇంగ్లీషులో బహువచన ప్రత్యయం చాలా నామవాచకాలలో '-s' గాను మరికొన్ని ధ్వని మార్పులతోను కన్పిస్తుంది. కాని sheep, deer, salmon, fish వంటి పదాలు ఏ ప్రత్యయమూ చేరకపోయినా బహువచన ద్యోతకాలవుతాయి. The sheep are grazing మొదలయిన వాక్యాలను బట్టి 'sheep' పదాంశం బహువచన ద్యోతకంగా భావించాలి. ఇక్కడ బహువచన ప్రత్యయం (-s) చేరి లోపించినట్లుగా భావించాలి.

ఈ శూన్య పదాంశాన్ని ప్రపంచంలో మొట్ట మొదటి పాణికి మహర్షి తన అష్టాధ్యాయిలో అదర్శనం లోపః (1-1-60) అని సూచించారు.

పదాంశాలను స్వతంత్ర పదాంశాలు (Free morphemes) అనీ వీటినే మరి కొందరు అని బద్ధ పదాంశాలు (unfound morphemes) అనీ వ్యవహరించగా మరికొన్ని పదాంశాలను అస్వతంత్ర పదాంశాలు లేదా నిబద్ధ పదాంశాలు (unfound morphemes)గా వ్యవకరించారు.

### ఎఫ్. స్వతంత్ర పదాంశాలు లేదా బద్ధ అని పదాంశాలు:

ఇంగ్లీషులో book, cat, dog, man వంటివి సంస్కృతంలో చీమ, దోమ, పంది, మేక వంటివి సంస్కృతంలో తరు-, హల-, నర-, వృక్ష వంటివి. అస్వతంత్ర పదాంశాలు లేదా నిబద్ధ పదాంశాలు. ఇంగ్లీషులో -hood, -ish, -ly, -man వంటివి. తెలుగులో -తనం, -లు, -డు వంటివి.

**సమీక్ష:-** పదాంశములు, సపదాంశములు అంటే ఏమిటో, ఉదాహరణాత్మకంగా వివరించి భేదాలను పరిశీలించారు.

## ప్రశ్నలు

1. పదాంశం - సపదాంశంను నిర్వచించి, భేదాలను తెల్పండి.
2. పదాంశ - సపదాంశ భేదాలను ఉదాహరణ పూర్వకంగా వివరించండి.
3. పదాంశ - సపదాంశ నిర్మాణక్రమాన్ని వివరించండి.

## ఆధారగ్రంథ పట్టిక


1. Gleason Jr. H.A. 1961 An Introduction to Descriptive Linguistics, NewYork : Holt
2. Bloomfield, Leonard. 1933 Language, NewYork : Holt
3. సుబ్రహ్మణ్యం, పి.ఎస్. 1984 ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పబ్లిక్‌గార్డెన్స్, హైదరాబాద్ - 4.

# పాఠం - 10 పదాంశ నిర్మాణ పరిమితులను నిర్దేశించటం సన్నిహిత సంబంధుల ఉదాహరణ పూర్వక పరిచయం

పాఠ్యాంశ నిర్మాణ క్రమం

**9.1** పదం - పదాంశ నిర్వచనాలు

**9.2** పదాంశ - వాక్య నిర్మాణ పరిధి

**9.3** సన్నిహిత సంబంధాలు

**లక్ష్యం:-** పదాంశం - పదం అంటే నిర్వచనాలను - పరిస్థితులను, సన్నిహితావయకాల సంబంధాలను తెలుసుకుంటారు.

## 9.1 పదం - పదాంశ నిర్వచనాలు

అర్థవంతమయిన భాషా కనిష్ఠాశాన్ని పదాంశం (minimum meaningful unit of a language)గా నిర్వచించాం. పదా(Word)న్ని సరిగా ఎవ్వరూ నిర్వచించలేదు. పద నిర్వచనం భాష భాషకూ మారుతూంటుంది. పదంలో భాగంగా పదాంశాన్ని ఎవ్వరూ నిర్వచించలేదు. పదం పదాంశం ఒకటి అయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇంగ్లీషులోని ape, apple, boy, girl, gum, dog, god, man, zoo మొదలయినవి పదాంశాలే కాక పదాలు కూడా. boys పదం కాగా Boy అనేది ఒక పదాంశంగాను (స్వేచ్ఛా పదాంశంగా) '-s' అనేది అనిబద్ధ పదాంశంగాను పేర్కొనబడి 'boy-s' రెండు పదాంశలా సమాహారమవుతుంది. ఈ విషయాన్ని పరిశీలిస్తే పదాంశానికి కొన్ని పరిమితులున్నాయని తెలుస్తుంది. ఏవో కొన్ని భాషలలో తప్ప పదాంశాలన్నిటికీ ఏవో కొన్ని పరిమితులున్నట్లు స్పష్టం.

'bad - horse - worst' అనే positive - comparetive - superlative అనే మూడు సాదృశ్య స్థాయిలను పరిశీలించి పదాంశాలను నిర్ణయించటానికి tall -taller - tallest లను స్వీకరించారు.

bad - worse - worst = tall : taller : tallest వీటిలో విశేషణాల తర తమ భేదం కన్పిస్తోంది. దీనికి సి.ఎఫ్. హాకెట్ గారు ఈ కింది ఉదాహరణను ఇచ్చారు.

"John is worse (taller etc.) than Michael" (పైది పుట 182) ఏమయినప్పటికి వాక్యాలలో విశేషణాల స్థానం ఒకే విధంగా ఉండదు.

ఒక్కో పదానికి ఒకో భిన్న వర్ణం చొప్పున మూడు పదాలకు మూడు భిన్న వర్ణాలు వాడి (ఇవి తర తమాది భావాలను తెలిపేవిగా ఉండాలి) మరో మూడింటిని కూడా గ్రహించి చూచి ప్రతి పదం రెండు అంశాలుగా విభజించి చూడగా ఈ కింది సమీకరణం (equation) లభిస్తుంది.

A : B : C = D : E . F.

ప్రతి పదాన్ని రెండు పదాంశాలుగా విభజించగా ఈ కింది సమీకరణమేర్పడుతుంది.

ax : bx : cx = ay : by : cy

ఈ సమీకరణం ఎడమ వైపు పదాల సమ్మేళనంలో x అంశం (భాగం)గా ఉంది. ఇదే విధంగా కుడి వైపు పదాల సమ్మేళనంలో ఉన్నది Y అంశం (భాగం). మొదటి సమీకరణంలోని a, b, c లు క్రమంగా రెండో సమీకరణంలోని a, b, c లతో సమానం. పదాల రెండు అంశాలు రెండు పదాంశాలు. ఈ విధంగా పదాల పంపిణీ ద్వారా పదాంశాల పంపిణీని గుర్తించవచ్చు. పదాల పంపిణీని పదాంశాల కూర్పు ద్వారా నిర్ణయించవచ్చు.

ఒక పదంలో పదాంశాలు ఏ విధంగా కలుస్తాయో వర్ణించి (వివరించి) చెప్పేది పదాంశ నిర్మిత పద నిర్మాణమనీ ఒక వాక్యంలో పదాలు ఏ విధంగా కలుస్తాయో వివరించేది వాక్య నిర్మాణమనీ విజ్ఞుల నిర్వచనం. కాని ఈ రెండింటి మధ్య ఉన్న తేడాను గుర్తించటం అంత తేలికయినది కాదు.

**ఉదా:-** 'Twenty Eighth' అనే రూపాన్ని గ్రహించండి. Twenty eight th (పూర్ణ, ప్రత్యయం) ఈ మూడు పదాంశాల కలయిక వల్ల 'Twenty Eighth' అనే వాక్య నిర్మాణమేర్పడింది. Twenty, eight అనేవి అనిబద్ధ పదాంశాలుకాగా -th అనేది నిబద్ధ పదాంశం.

ఇరవై ఎనిమిదో (< ఇరువది ఎనిమిదవ) అనే వాక్యంలో ఇరువది ఎనిమిది, -ఓ (< -అవ) అనేవి మూడు పదాంశాల కలయిక. ఇరువది, ఎనిమిది అనే అనిబద్ధ పదాంశాలు కాగా -ఓ అనే నిబద్ధ పదాంశం (పూరణార్థంలో వస్తుంది)తో వాక్యమేర్పడుతుంది. ఇటువంటివి పద నిర్మాణంలో భాగమవుతాయి. కాని "ఇరవది ఎనిమిది ఆవులు" లాగా ప్రత్యేక వాక్యం కాదని కొందరు పేర్కొన్నారు. 'ఇరవై ఎనిమిదో' అనేది 'ఆవు'తో కలిసి 'ఇరవై ఎనిమిదో ఆవు' అని ఇంకో వాక్యం ఏర్పడటానికి అవకాశం ఉందని పెక్కుమంది భాషా శాస్త్రజ్ఞులు భావించారు. 'తింటే గారెలు తినాలి' అనే వాక్యం కొన్ని పదాంశాల సమ్మేళనం. తిన్ - టు - ఏ, గారె - లు, తినా - ఏ అనేవి 7 పదాంశాలు. ఇందులో 'గారె' అనేది స్వతంత్ర పదాంశం కాగా మిగిలినవి అస్వతంత్ర పదాంశాలు కాని ఇది సంపూర్ణమయిన అర్థాన్ని ఇవ్వటం లేదు. "తింటే గారెలు తినాలి వింటే భారతం వినాలి" అని ఈ రెండు వాక్యాలు కలిస్తేనే మనకు సంపూర్ణార్థం

స్ఫురిస్తోంది.

ఇటువంటి సామెతల విషయంలో పదాంశాలకు వాక్యాలకు భేదం గుర్తించటం కష్టమవుతుంది. ఆంగ్లంలోని 'red - hair - ed' అనే పదాన్ని గ్రహించి చూస్తే red, hair అనే రెండు పదాలు కలిసి 'red hair' ఏర్పడి దీనికి '-ed' అనే ప్రత్యయం చేరగా 'red - haired' పదం ఏర్పడింది. '-ed' వంటి ప్రత్యయాలు అంగంగా కల వాటిని అన్నింటినీ పదాంశ నిర్మాణాలుగా భావించవచ్చు అని పెక్కుమంది భాషా శాస్త్రజ్ఞులు భావించారు.

ఇటువంటి వ్యాకరణము ప్రక్రియ ద్వారా కొంత సంక్లిష్టత ఏర్పడుతుంది. ఒకే విధమయిన వ్యాకరణ ప్రక్రియను తీసుకొని కొంత పదాంశ నిర్మాణంలోను మరికొంత వాక్య నిర్మాణంలోను వర్ణించవలసి వస్తుంది. ఉదాహరణకు తెలుగులోని ప్రేరణ క్రియలను గ్రహించి పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

"సర్వంబునకుం బ్రేరణంబు నందించుక్కగు"

(బాల వ్యా. క్రియా. 70)

అని ప్రేరణార్థంలో పండు, వండు మొదలయిన ధాతువులకు ఇంచుగా గమం (-ఇంచు) వ్యాకర్తలచే విధించబడింది. వండు + -ఇంచు > వండించు, పండు + -ఇంచు > పండించు వంటి ప్రేరణ క్రియలు తెలుగులో ఏర్పడ్డాయి. "చెడు, పడు, ఊడు" మొదలయిన ధాతువులకు '-కొట్టు' అనే వేరే క్రియ చేరటం ద్వారా ప్రేరణ క్రియలు ఏర్పడతాయి.

'చెడు' + -కొట్టు > చెడగొట్టు

ఇటువంటి సామెతల విషయంలో పదాంశాలకు వాక్యాలకు భేదం గుర్తించటం కష్టమవుతుంది. ఆంగ్లంలోని "red-haired" అనే పదాన్ని గ్రహించి చూస్తే red, hair అనే రెండు పదాలు కలిసి "red-haired" ఏర్పడి దీనికి '-ed' అనే ప్రత్యయం చేరగా "red-haired" పదం ఏర్పడింది. '-ed' వంటి ప్రత్యయాలు అంగంగా కల వాటిని అన్నింటినీ పదాంశ నిర్మాణాలుగా భావించవచ్చు అని పెక్కు మంది భాషా శాస్త్రజ్ఞులు భావించారు.

ఇటువంటి వ్యాకరణ ప్రక్రియ ద్వారా కొంత సంక్లిష్టత ఏర్పడుతుంది. ఒకే విధమయిన వ్యాకరణంలోను మరి కొంత వాక్య నిర్మాణంలోను వర్ణించవలసి వస్తుంది. ఉదాహరణకు తెలుగులోని ప్రేరణ క్రియలను గ్రహించి పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

| | | | | |
|---|---|---|---|---|
| 'చెడు' | + | -కొట్టు | - | చెడగొట్టు |
| 'పడు' | + | -కొట్టు | - | పడగొట్టు |
| 'ఊడు' | + | -కొట్టు | - | ఊడగొట్టు |

చెడు, పడు, ఊడు ధాతువులకు మున్నంత రూపాలకు '-కొట్టు' ప్రేరణార్థంలో చేరటం విశేషం. పండు, వండు ధాతువులకు '-ఇంచు' ప్రేరణ ప్రత్యయం చేరగా 'పడ, ఊడ' మొదలయిన ధాతువులకు అనంత రూపాలేర్పడి తర్వాత కొట్టు వంటి స్వతంత్ర పదాంశాలు ప్రేరణార్థంలో వ్యవహరించబడటం విశేషం. తీయు, తోము, పోయు వంటి స్వతంత్ర పదాంశాలు కూడా ప్రేరణ ప్రత్యయాలుగా ప్రయోగించబడుతున్నాయి. ఇవన్నీ తుమున్నంత ప్రక్రియల తర్వాత వాడబడటం విశేషం.

| | | |
|---|---|---|
| -తీయు | : | విడు + -అన + తీయు -విడదీయు |
| -తోము | : | పడు + -తోయు - పడు + -అన్ + తోయు - పడదోయు |
| -పోయు | : | పారు + పోయు - పారు + -అన్ + పోయు - పారబోయు |

పదాంశ వాక్య నిర్మాణాలు అని రెండు వేర్వేరు విభాగాలుగా కాకుండా (వండించు మొదలయినవి పదాంశ నిర్మాణంగాను పడగొట్టు మొదలయినవి వాక్య విభాగంగాను భావించటం) ప్రేరణ రూపాలన్నింటిని ఒకే చోట కూర్చి వ్యాకరణ నిర్మాణం కావించటం సమంజసం.

సంస్కృత భాషలో "విదాం చకార / వివేద" మొదలయిన పదాలలో రెండు పదాలున్న రూపాలలో ఒకటి స్వతంత్ర పదాంశంగాను మరొకటి కూడా స్వతంత్ర పదాంశంగాను ఉండి ఒకే అర్థంలో ప్రయుక్తమవుతున్నాయి. వీటిని వేర్వేరు చోట్ల వర్ణించటం అసమంజసమవుతుంది. వాక్య నిర్మాణం లేకుండా పదాంశ నిర్మాణం కావించటం సాధ్యం కాదు. భాషకు వాక్యమే ప్రమాణం (Unit) కదా. భాషలోని విభక్తి ప్రత్యయాలు పదాంశానికి లేదా పదానికి చేరి వాక్యంలో ఉన్న క్రియకు చేరి మిగిలిన పదాంశాలతో లేదా

పదాలతో అన్వయిస్తాయి. పదాంశ నిర్మాణవర్ణనకు వాక్య నిర్మాణ పరిజ్ఞానం అత్యవసరం అని దీన్ని బట్టి తెలుస్తోంది. కాబట్టి వ్యాకరణంలో పదాంశ నిర్మాణం వాక్య నిర్మాణం అని రెండు వేర్వేరు విభాగాలుగా పరిగణించి చూడటం తీరా చూడటం అనవసరమని పండితార్థం.

పదాంశాల నిర్మాణం క్లిష్టంగా లేని ద్రావిడ భాషలలో సైతం పదాల వరస (word order) మొదలయిన వాక్య నిర్మాణాల నియతి అంత క్లిష్టంగా లేకుండా సరళంగానే ఉంది. తెలుగులోని ఈ పదాల వరుసను గమనించండి.

గాలి చల్లగా వీచెను

వీచెను చల్లగా గాలి

చల్లగా గాలి వీచెను

వీచెను గాలి చల్లగా

గాలి వీచెను చల్లగా

చల్లగా వీచెను గాలి

'గాలి చల్లగా వీచెను' అనే మూడు భిన్న పదాలతో పదాల వరస (Word Order) మార్చటం ద్వారా అర్థం భంగం కలగకుండా ఆరు వాక్యాలు ఏర్పడ్డాయి. ఈ రహస్యాన్ని గ్రహించిన చిన్నయ సూరి గారు తన బాల వ్యాకరణంలోని కారక పరిచ్ఛేదంలో

"ఏక వాక్యంబునం దొకావొ కండు తక్క సర్వ పదంబులు క్రమ నిరపేక్షంబుగం బ్రయోగింపంజను (సూ. 37)"

అనే సూత్రాన్ని రచించారు. ఏని ప్రభృతి శబ్దములు కొన్ని నియసాను సాపేక్షంబులయి యుండు అని సూరి గారి వివరణ వల్ల "రాముండేని కృష్ణుండేని రావలయు" మొదలయిన వాక్యాలలోని క్రమాన్ని మార్చుకూడదు.

ప్రత్యయాలు అధికంగా కల సంస్కృతం, లాటిన్ మొదలయిన భాషలలో పదాల (పదాంశాల) వరస నియతంగా ఉండదు.

**ఉదా-** "అస్త్యుత్తర స్యాందిశిహిమాలయోనామనగాధి రాజః" అని కాళిదాసు కుమార సంభవ (1-1) ప్రయోగం. ఉత్తర స్యాందిశి హిమాలయోనామనగాధి రాజః అస్త అని అన్వయ వాక్యం.

"హిమాలయోనామన గాధిరాజః ఉత్తర స్యాందిశి అస్తి" అని ఇంకో అన్వయ వాక్యం.

ఉత్తర స్యాందిశి ఆస్తి హిమాలయోనామనగాధి రాజః అని కూడా ఇంకో వాక్యం ఉంటుంది.

ఈ విధంగా పదాల క్రమాన్ని మార్చి రాయటం సంస్కృతాది ప్రత్యయాత్మక భాషలలో సర్వ సాధారణం. ఈ మార్పు వల్ల అర్థ భేదం ఏ మాత్రము ఉండదు. **ఉత్తర స్యాందిశి** అనే పదాలను మాత్రం అటూ ఇటూ మార్చకూడదు. ఇటువంటి వాటి చోట పదాల మార్పిడి కూడదు. దిశి ఉత్తరస్యామ్ అని ఏ కవి ఐనా ప్రయోగిస్తే అది సుష్ఠు ప్రయోగం కాక సాధారణ కవి ప్రయోగమవుతుంది.

ఆంగ్లాది భాషలలో పదాల వరస మారిస్తే అర్థ భేదం అధికంగా కలుగుతుంది.

("Rama killed Ravana")

(రాముడు రావణుణ్ణి చంపాడు)

"Rama Ravana killed" అనే ఆంగ్ల వాక్యం అసంబద్ధమయి, తప్పు వాక్యమవుతుంది.

"Ravana Rama killed" అనేది మరో అసంబద్ధ వాక్యం.

"Ravana killed Rama"

(రావణుడు రాముణ్ణి చంపాడు)

అనే వాక్యం విపరీతార్థాన్నిస్తుంది.

వాక్య నిర్మాణంలో పదాలు (Words) సంక్లిష్ట పదాంశాలు (suprasegemental morphemes) ఒక దానితో మరొకటి సంబంధంగా ఉంటాయి.

ఇతః పూర్వం మనం ఉపయోగించిన వాక్యాన్నే మరో మారు పరిశీలిద్దాం.

"$^3$John $^2$treats his older sister very$^2$ nicely$^{2}$" అనే వాక్యంలో శ్రుతి పదాంశాలు 3, 2, 2, 2తో పాటు John, treats, his,

sister, very, nicely అనే 7 పదాలున్నాయి. వాక్య నిర్మాణం (syntax)లో వీటి స్థానాన్ని గుర్తించండి.




మొత్తంగా ఒక వాక్యంలో పదాంశ నిర్మాణముంటుందని అనుకోలేము. వాక్యంలోని పదాలలో మాత్రం పదాంశ నిర్మాణముంది. ఈ పై వాక్యంలో John, very అనే రెండు మాత్రం పదాంశ నిర్మాణం (morpro logical structure)తో ఉన్న స్వతంత్ర పదాంశాలు. treats లో treat, -s అనే రెండు పదాంశాలు (ఒకటి అనిబద్ధ పదాశంకాగా రెండోది నిబద్ధ పదాంశం) ఉన్నాయి. sisters అనే పదంలో treat అనేది అనిబద్ధ పదాంశం కాగా -s (బహువచనార్థకం) అనేది మరో బహువచనార్థక పదాంశం.

"$^{3}$John $^{2}$treats his older sisters very $^{2}$nicely$^{2}$ ↑" అనే వాక్యాన్ని

1. John
2. treat
3. -s
4. hi
5. -s
6. old
7. -er
8. sister
9. -s
10. very
11. nice
12. -ly
13. ↑

13 పదాంశాలుగా విభజించవచ్చు అని సి.ఎఫ్. హైకెట్ గారు నిరూపించారు.

వాక్య నిర్మాణ విశేషాలకు పదాంశ నిర్మాణ విశేషాలకు పరస్పర సమాంతర స్థితి ఉంది. ఆంగ్లంలోని ఈ రెండు రకాల క్రియలను పరిశీలించండి.

1. "go, come, run, ring" అనే క్రియలు ఒక రకమయినవి. ఇవి మొదటి రకానికి చెందినవి.
2. "goes, comes, runs, rings" అనేవి మరో రకానికి చెందినవి.

మొదటి రకం క్రియలు I, We, You, They, The men మొదలయిన బహువచన ద్యోతక పదాలతో కలిసి వ్యవహరించబడతాయి. ఇవి ఎప్పుడూ కూడా he, she, it, the man వంటి ఏక వచన పదాలతో కలిసి వ్యవహరించబడవు.

రెండో రకం క్రియలు he, she, it, the man వంటి ఏకవచన పదాలతో కలిసి వ్యవహరించబడతాయి. I, We, You, They, The man వంటి బహువచన పదాలతో కూడి వ్యవహరించబడవు.

మొదటి రకం క్రియలకు రెండో రకం క్రియలకు సంబంధం ఉంది.

| ఒకటో రకం క్రియ | రెండోరకం క్రియ | రెండోరకం క్రియలోని ప్రత్యయం |
|---|---|---|

| | | |
|---|---|---|
| go | goes | -es |
| come | comes | -ds |
| run | runs | -s |
| sing | sings | -s |

రెండో రకంలోని goes, comes, runs, sings మొదలయిన వాటి క్రియా రూపాలలోని పర ప్రత్యయ (suffix) వర్ణరూపం |Z|.

can, shall, will, may, must వంటి ఇంగ్లీషులోని మూడో రకానికి చెందిన క్రియా రూపాలు. ఇవి మొదటి రకానికి చెందిన క్రియా రూపాలకు చెందిన go, come, sing మొదలయిన వాటి వంటివి. can, must, may, shall, will అనేవి I, we, you, they, the man వంటి వాటితోనే కాకుండా he, she, it, the man వంటి వాటితోను కలిసి ఏ మార్పూ లేకుండా వ్యవహరించబడతాయి. ఉదా- I can, You can, they can, she can, He shall మొదలయినవి.

## 9.2 పదాంశ వాక్య నిర్మాణ పరిధి (The morphology syntax boundaris):

పదాంశ నిర్మాణం వాక్య నిర్మాణం మధ్య కల భేదం స్పష్టంగా గుర్తించకలిగేటట్లుగా లేదు.

ఉదా - ఇంగ్లీషులోని Twenty - eight అనే పదబందాన్ని తీసుకుంటే ఈ పద బంధంలోని పదాంశాలు మూడు.

1. Twenty - ఇరవై
2. eight - ఎనిమిది
3. -th - ఓ (పూరణార్థం)

ఈ 'twenty - eighth' పదబంధమే కాని పదం మాత్రం కాదు. దీన్ని ఈ కింది విధంగా చూపవచ్చు.




పై వాటి సన్నిహిత సంబంధుల్లో ఒకటి (-th) పదం కంటె తక్కువ అయిన నిబద్ధ పదాంశమయిన కారణంగా ఇది వాక్యం కూడా కాదు. ఇటువంటి పద బంధాలు ఇంగ్లీషులో అనేకం ఉన్నాయి. ఇటువంటి స్థితి ఇతర భాషలలోను నెలకొని ఉంది. ఇదివరకు మనం గమనించిన దానినే ఈ కింది విధంగా సన్నిహిత సంబంధుల రూపంలో చూపవచ్చు.




తెలుగులోని 'ఇరవై ఎనిమిదో' అనేది పదబంధం. దీనిలో ఇరవై ఎనిమిది అనేవి పదాలుకాగా '-ఓ' అనేది నిబద్ధ పదాంశం. ఇది పదం కంటే తక్కువయినది. ఇది వాక్యం కాదు (కారణం '-ఓ' అనేది పదం కంటే తక్కువయినది కావటమే).

సన్నిహిత సంబంధుల్లోని పదం కంటె తక్కువున్న ఇంగ్లీషులోని -th, తెలుగు లోని -ఓ (పూరణార్థకం)లను పదాంశ నిర్మాణంలో భాగంగా గుర్తించి చూచినప్పటికి అవి పద బంధాలవుతాయే తప్ప ప్రత్యేక పదాలు మాత్రం కాజాలవు. ఇంగ్లీషులోని -th, తెలుగు లోని -ఓ పూరణార్థాన్ని సంఖ్యా వాచక శబ్దాలయిన -twenty, thirty, forty........hundred మొదలయిన అనిబద్ధ (స్వతంత్ర) పదాంశాలకు (ఇంగ్లీషులోను) ముప్పై, నలభై, నూరు (వంద), వెయ్యి మొదలయిన మాటలకు (తెలుగులోను) చేరి ఇంగ్లీషులో twenty eidht, thirty eighth, three hundred twenty - four తెలుగులో ఇరవై ఎనిమిదో, మూడు వందల నలభై నాలుగు మొదలయిన పదబంధాలు ఏర్పడతాయి. ఇటువంటివి పదాలూ కావు, వాక్యాలు కావు.

ఇంగ్లీషు భాషలోని షష్ఠీ విభక్తి ప్రత్యయమయిన -s చేరిన John's, Kristma's దే. ఇంగ్లీషు భాషలో కొన్ని నామవాచకాల నుండి విశేషణాలు నామవాచకాలకు -ial చేర్చి ఊనిక (stress) మార్పు వల్ల ఏర్పడుతుంటాయి.

**ఉదా-** dictator (n) ' diactato'rial (adj)
reportor (n) 'reportorial' (adj)

manor (n) 'manor'ial' (adj)

పై వాటిలో ఊనిక (stress) ప్రాధాన్యం వహించటం విశేషం.

'He is fed' అనే పదాంశ నిర్మాణం నుండి 'I fed him' అనే వాక్య నిర్మాణం ఏర్పడుతుంది.

సంక్లిష్టత (complexixty) ఆంగ్లంలోని కొన్ని పదాంశాలలో ఎక్కువ సంక్లిష్టత ఉంది.

**ఉదా-** "Ungentlemanliners, impressionistically" అనే వాటి పదాంశ నిర్మాణం ఈ తెగకు చెందినదే.

|Ungentlemanliness| లో 6 పదాంశాలున్నాయి.




పై పటంలో '-man' పై '(stress)' ఊనిక ఉండవలసి ఉండగా ఆ ఊనికలో ఉంచింది. ఆ ఊనిక లోపాన్ని(absence of stress) ప్రత్యేక పదాంశం (separate morpheme)గా గుర్తించి "u" చిహ్నంతో గుర్తించాం.

Fox భాషలోని |e'how' k $c^v$ i | పదాంశాన్ని గ్రహించండి. దీనిలో కొంత సంక్లిష్టత ఉంది. ఇది Fox భాషలో సరాసరి సంక్లిష్టత, పరమ సంక్లిష్టత కాదు.




ఏ భాషనైనా నిష్పక్షపాత దృష్టితో చూడటం కష్టం. అయినప్పటికి ఒక విషయాన్ని మనం స్పష్టం చేయవచ్చు. పదాంశ వాక్య నిర్మాణాల విషయంలోని వ్యాకరణ సంక్లిష్టత అన్ని భాషలలోను దాదాపు ఒకే విధంగానే ఉంటుంది. భాషా విషయకంగా ఇదేమీ ఆశ్చర్యకర విషయం కాదు. వ్యాకరణం ద్వారా చేయవలసిన సంక్లిష్ట కార్యాలు అనేకం ఉన్నాయి. కొన్ని వ్యాకరణ కార్యాలు పదాంశ నిర్మాణం ద్వారా సాధ్యం కాకపోతే వ్యాకరణ నిర్మాణం ఆలోటును పూరిస్తుంది.

ఇంగ్లీషు కంటె అధిక సంక్లిష్ట పదాంశ నిర్మాణం కలది Fox భాష. కాని ఇది వాక్య నిర్మాణంలో తక్కువ సంక్లిష్టత కలది. పదాంశ వాక్య నిర్మాణాల సంక్లిష్టత ఆయా భాషల్ని పట్టి ఉంటుంది.

విభిన్న భాషలలోని వ్యాకరణ వ్యవస్థల పోలికకు ఆయా భాషలలోని సరాసరి పదాంశ సంక్లిష్టతను కొలబద్దగా తీసుకోవటం ఒక మంచి పద్ధతి. ఒక పదంలో ఉన్న సరాసరి పదాంశాల్ని ప్రాతినిధ్యం కొలవచ్చు (నిర్ణయించవచ్చు). మండేలియన్ చైనీస్ (Mandarian Chinese)లో ఈ సరాసరి పదాంశ సంక్లిష్టత ఒకటి కంటె ఎక్కువ లేదు. ఇంగ్లీషులో ఈ పదాంశ సంక్లిష్టత రెండుకు దగ్గరగా ఉంది. స్పానిష్ భాషలో ఈ పదాంశ సంక్లిష్టత 2 1/2 కాగా లాటిన్ 3 (మూడు)గాను Foxలో నాలుగు గాను ఉంది. తెలుగు మొదలయిన

భాషలలో దీని గురించి పరిశోధించి సరాసరి పదాంశ సంక్లిష్టతా సంఖ్యను నిర్ణయించాలి.

19వ శతాబ్దపు భాషా శాస్త్రవేత్తలు ఈ కొలబద్దను అనుసరించకుండా భాషల పరస్పర సంబంధాన్ని బట్టి విశ్లేషణాత్మక భాషలు (చైనీస్ మొదలయినవి)గాను (Analytic languages like Chinese), సంక్లిష్ట భాషలు (Synthetic Chinese) (సంస్కృతం, అరబ్బీ, హీబ్రూ, గ్రీకు, లాటిన్ మొదలయినవి), బహు సంశ్లిష్ట భాషలు (Polysynthetic languages) గాను (ఎస్కిమో మొదలయిన భాషలు), సంయోగాత్మక భాషలు (Agglutinative languages)గాను (తెలుగు, తమిళం వంటి ద్రావిడ భాషలు) విభజించారు. ఈ విధమయిన పద్ధతిని అనుసరించటం వల్ల దాదాపు ఒకే పదాంశం కల చైనీస్ భాషను విశ్లేషణాత్మక భాష గాను, ఒకటి కంటే ఎక్కువ పదాంశాలు కల గ్రీకు, లాటిన్, సంస్కృతం భాషలను సంశ్లిష్ట భాషలుగాను, Fox మొదలయిన భాషలు బహు పదాంశ సమ్మిశ్రిత పదాలతో కన్పించినప్పుడు బహు సంశ్లిష్ట పదాంశాలుగాను పదాంశ సంశ్లిష్టతను బట్టి భాషలను భాషా శాస్త్రజ్ఞులు విభజించారు. విశ్లేషణాత్మక (analytic) సంశ్లిష్ట (Synthetic) స్థితులను బట్టి భాషలను విశ్లేషించటం మంచిది. ఉదా- చైనీస్ భాష కంటె స్పానిష్ భాష ఎక్కువ సంశ్లిష్టమైనది. ఫాక్స్ భాష కంటె అధిక విశ్లేషనాత్మకమైనది. ఇటువంటి భాషా విశ్లషణ శాస్త్రీయంగా ఉంటుంది.

భాషల ఈ విధమయిన విశ్లేషణకు ఆ భాషా వ్యవహర్తల జీవన విధానానికి, సంస్కృతికి, మేధాశక్తికి ఏ విధమయిన సంబంధం లేదు. విశ్లేషణాత్మక భాషా వ్యవహర్తల కంటె సంక్లిష్ట భాషా వ్యవహర్తలు వీరిరువురి కంటె బహు సంశ్లిష్ట భాషా వ్యవహర్తలు శిష్టులు అనుకోవటం సరికాదు. చైనా వారు బహు సంశ్లిష్ట భాషా వ్యవహర్తలయిన ఎస్కిమో వారి కంటె తక్కువ వారు అని చెప్పగలమా? 19వ శతాబ్దానికి చెందిన భాషా శాస్త్రవేత్తలు విశ్లేషణాత్మక భాషా వ్యవహర్తల కంటె సంశ్లిష్ట భాషా వ్యవహర్తలు మేథా సంపన్నులు సంస్కృతి విరాజితులు అని చెప్పటానికి వివరించటం జరిగింది.

కాలక్రమేణ సంశ్లిష్ట భాషలు, బహు సంశ్లిష్ట భాషలు విశ్లేషణాత్మక భాషలుగా మారతాయని భావించటం సరికాదు. ఇదే విధంగా విశ్లేషణాత్మక భాషలు (anlalstic languages) కాలక్రమేణ సంశ్లిష్ట భాషలుగాను, సంశ్లిష్ట భాషలు బహు సంశ్లిష్ట భాషలుగా కాల క్రమేణ మారతాయని తలచటం సరికాదు.

నేటి ఇంగ్లీషు భాష చాలా అభివృద్ధి పొందిన భాష కావటానికి స్పానిష్, జర్మన్ భాషలవలె విశ్లేషణాత్మక దిశగా పయనించటమే అనుకోవటం సరికాదు. బహు సంశ్లిష్ట భాషా స్థితిని చేరుకుంటున్న టర్కీ భాషా వ్యవహర్తలు శాస్త్ర సాంకేతిక విషయాలలో బాగా రాణిస్తున్నారు.

వాక్యాలలో పదాల క్రమం ముఖ్యమనటానికి కొన్ని ఉదాహరణలను ఇది వరకు ఇచ్చాం. ఈ వరస క్రమం భాషకు భాషకు మారుతూంటుంది. కొన్ని భాషలలో క్రియ వాక్యం ఆదిలో (మొదట్లో) కన్పిస్తుంది. మరికొన్ని భాషలలో క్రియ వాక్యం మధ్యలో వస్తుంది. మరికొన్ని భాషలలో క్రియ వాక్యం చివర్లో వస్తుంది. వాక్యాంత విశేషాలు కొన్ని ఉంటాయి. ద్రావిడ భాషలు, టర్కిష్, జాపనీస్, జార్జియన్ భాషలు క్రియాంత భాషలు. మేఘాలయ రాష్ట్రంలో వ్యవహారంలో ఉన్న 'ఖాసే' క్రియా మధ్య భాష. గుప్త నిర్మాణం (deep structure)లో హిందీని క్రియా మధ్య భాషగా పరిగణించవచ్చు. తెలుగులో అముఖ్య కర్మ ముఖ్యకర్మకు పూర్వం ఉంటుంది. ఈ విషయాన్ని చిన్నయసూరి గారు ఈ విధంగా సూత్రీకరించారు.

"వచ్యర్థా ముఖ్య కర్మంబునకు ద్రోడకు వర్ణకంబులు ప్రాయికంబుగానగు"

(బాల.వ్యా. కారక పరిచ్ఛేదము 6 సూ.)

ఉదా- మైత్రుండు చైత్రుని తోడ నిట్లనియె

మైత్రుండు చైత్రున కిట్లనియె

ఈ పై రెండు వాక్యాలలో ఇట్లు 'ముఖ్య కర్మకాగా చైత్రుడు' అముఖ్యకర్మ. అముఖ్యకర్మ ఐన 'తోడ' ముఖ్యకర్మ ఐన 'ఇట్లు' కంటె ముందే ప్రయోగించబడింది.

తెలుగులో సంయుక్త వాక్యాలకు అసంయుక్త వాక్యాలకు భేదం స్వల్పం. సంకలనార్థంలో క్త్వార్థక వాక్యాలే సంయుక్త వాక్యంలో ఉంటాయి.

'రామారావు కృష్ణారావు కలిసి సినిమాకు వెళ్ళారు' వంటి వాక్యాలు దీనికి ఉదాహరణలు.

స్వామ్య అను భోక్త్రాద్యర్థాల్లో తెలుగులో '-కు' విభక్తి రావటం విశేషం.

సీతకు వంద పట్టుచీరలున్నాయి.

నాకు తలనొప్పి వచ్చింది

మొదటి వాక్యంలో స్వామ్య సంబంధం, రెండో వాక్యంలో అనుభోక్తృ సంబంధం ఉంది.

ఇక సన్నిహిత సంబంధుల్ని గూర్చి పరిశీలిద్దాం.

## 9.3 సన్నిహిత సంబంధులు:

వాక్యంలో పదాంశ నిర్మాణం వాక్య నిర్మాణం ముఖ్యమయినవి. వీటి మధ్య భేదం సూక్ష్మం. ఈ విషయాన్ని ఇది వరకే పరిశీలించాం.

అన్నంభట్ట కృత తర్క సంగ్రహంలో వాక్య నిర్వచనం "వాక్యంతు, పద సమూహః" (గావును తీసుకురా). పదాల సమూహం వాక్యం అనే నిర్వచనం నైయాయికుల నిర్వచనం. కాగా 'గామానయ' అనేది ఉదాహరణ. సంస్కృత భాషలో భర్తృహరి ప్రభృతులు వాక్యాన్ని నిర్వచించారు. ప్రౌఢ వ్యాకర్త అయిన శ్రీ బహుజన పల్లి సీతారామాచార్యులుగారు తమ వ్యాకరణంలో "వాక్యంబునా యోగ్యతాకాంక్షా సహితంబగు నర్థము గల యాసత్తి యుక్త సముదాయము" (వాక్య పరిచ్ఛేదము) అని సాహిత్యదర్పణము లోని "వాక్యం స్యాద్యోగితాకాంక్షా సత్తియుక్తః పదోచ్చయః" అనే వాక్య నిర్వచనాన్ని బట్టి నిర్వచించారు.

యోగ్యత అంటే పదార్థాలకు పరస్పర సంబంధం అని తెలిపి "నిప్పుచేఁదడుపుచున్నాడు" అని ఆచార్యుల వారు ఉదహరించారు. నిప్పుచే తడపటం అసంభవం కాబట్టి ఈ వాక్యం సరికాదు. 'నీటిచే తడుపుచున్నాడు' అనే వాక్యం ఒప్పవుతుంది. "ఆకాంక్ష యనఁగా నిలుపుదల లేక పయిపయింబోయెడి పదార్థముల మీఁది యాదరము" అని ప్రౌఢ వ్యాకర్త చెప్పి "నేఁడు దేవదత్తుఁడు" అనిపలికి మర్నాడు పోవుచున్నాఁడు అని పలికితే ఆ మాటల వ్యవధానం (gap) వల్ల అది వాక్యం కాదు. "ఆసుత్తియనఁగా ఁబదముల చేరిక" అని సీతారామాచార్యుల వారు తెలిపి అవి (పదములు) క్రమంలో ఉండాలని సూచించారు.

వాక్యంలోని పదాల క్రమ నిర్దేశాన్ని సన్నిహిత పద సంబంధుల ద్వారా సూచించవచ్చు. సన్నిహిత సంబంధుల (immediate constituents) వల్ల వాక్యార్థం స్పష్టమవుతుంది. 'పెద్దకుక్క' అనే పదక్రమం వల్లనే మనకు 'కుక్క పెద్దది'గా ఉంది అని స్పష్టమవుతుంది. 'కుక్కపెద్ద' అంటే అర్థం ఏ మాత్రమూ స్పష్టం కాదు. తెలుగు మృదలయిన భాషలలోపదాల వరుస క్రమం మారినా పరవాలేదు అని 'గాలి చల్లగా వీచెను' మొదలయిన వాక్యాల ద్వారా ఇది వరకే మనం గమనించాం. కాని అన్ని చోట్ల ఇది కుదరదని కూడా తెలియచేయబడింది. వాక్యంలో ఒక పదానికి మరో పదంతో దానికి మిగిలిన పదాలతో ఉన్న సంబంధం కంటే ఎక్కువ సంబంధం కలిగి ఉంటే ఆ సన్నిహిత సంబంధం కల పదాలను సన్నిహిత సంబంధులు అంటారు. వాక్యంలో ఈ సన్నిహిత సంబంధులు పక్క పక్కన ఉండవచ్చు లేదా వ్యవధానంతో ఉండవచ్చు.

'ఇల్లు పెద్దది' అనే వాక్యాన్ని విభజించటం తేలిక. పదాల్ని విభజించటాన్ని ఈ విధంగా సూచించవచ్చు.

ఇల్లు పెద్దది ( <పెద్ద + అది)



"మా ఇల్లు చాలా పెద్దది"

ఈ వాక్యంలో "ఇల్లు, చాలా" అనే మాటలు సన్నిహితంగా ఉన్నప్పటికి సన్నిహిత సంబంధులు కావు. 'చాలా' ఏది పెద్దది అనే దానితో సంబంధం కలిగి ఉంటుంది. ఈ దిగువ ఈ వాక్యంలోని సన్నిహిత సంబంధుల్ని ఈ విధంగా చూపవచ్చు.

మా ఇల్లు చాలా పెద్దది



"నేను మంచి సినిమాకు వెళ్ళాను" అనే మాటలో 'మంచి' మాటను తీసివేసి 'నేను సినిమాకు వెళ్ళాను' అని వేరే వాక్యాన్ని నిర్మించినా అర్థంలో పెద్ద తేడా లేదు. కాబట్టి 'మంచి'ని 'సినిమా'తో కలిపి 'మంచి సినిమా' అని వాక్య నిర్మాణం గావించటం ద్వారా 'మంచి, సినిమా' పదాలు సన్నిహిత సంబంధులని తెలపవచ్చు. ఈ కింద చూపబడ్డ సన్నిహిత సంబంధుల్ని పరిశీలించండి.




వాక్యంలో పదనిర్మాణాలు రెండు రకాలుగా ఉండవచ్చు. ఒకటి అంతః కేంద్రక నిర్మాణం (Ends-centric construction) కాగా, మరొకటి అనంతః కేంద్రక నిర్మాణం (exo-centric construction) అంతః కేంద్రక నిర్మాణంలో వాక్యంలో అనేక అనిబద్ధ పదాంశాలకు మారుగా ఒక అనిబద్ధ పదాంశాన్నే ఉపయోగించవచ్చు.

ఉదా-






ఈ సమానాధికరణం (Co-ordinate)లో రెండు లేదా అంతకంటే ఎక్కువ అవయవాలు ప్రాధాన్యం వహించి ఉండవచ్చు.

ఉదా-






వాక్యం వ్యధికరణ నిర్మాణం (suborlinto)లో ఉన్నప్పుడు ఒక అవయవమే ప్రధానమవుతుంది.




ఇటువంటి నిర్మాణాల్లో విశేషణాలు స్థిరస్థానంలో ఉంటాయి.

'కొత్త నా రెండు చొక్కాలు' వంటివి తప్పు.

అంతః కేంద్రక నిర్మాణం కానిది అనంతః కేంద్రక నిర్మాణం (exocentric construction) అని చెప్పవచ్చు. ఈ వాక్యాల్లో ప్రధానావయవం ఉండదు.

మీరు సినిమాకు వెళ్ళమంటే నేను వెళ్తాను

ఈ వాక్యంలో మీరు సినిమాకు వెళ్ళమంటే అనేది అనంతః కేంద్ర నిర్మాణం. నేను వెళ్తాను అనేది అంతః కేంద్రనం. పై వాక్యంలో అనంతః కేంద్రకం ముందు వచ్చి తర్వాత అంతః కేంద్రకం వచ్చింది. ఈ రెండూ కలిపి వాక్య నిర్మాణం జరిగింది.

కొన్ని ప్రదేశాలలో సన్నిహితావయవ పదాంశ నిరూపణ వల్ల (విభజన వల్ల) సంధిగ్ధత (embiguity) నివారించబడుతుంది.

'ఈ ఆవు పాలు' అనే వాక్యానికి రెండు అర్థాలు వస్తాయి.

1. ఈ ఆవు పాలు } ఇక్కడ చెంబులో ఉన్న ఆవుపాలు

2. ఈ ఆవు పాలు } ఇక్కడ ఉన్న ఆవు ఇచ్చిన (పిదకగా వచ్చిన) పాలు

ఈ రెండు అర్థాలు సన్నిహిత సంబంధి విభజన వల్ల స్పష్టమవుతాయి.

'కొత్త కుర్చీ గుడ్డ' అనే వాక్యానికి కూడా రెండు అర్థాలు వస్తాయి.

1. కొత్త కుర్చీ గుడ్డ } కొత్త కుర్చీకి సంబంధించిన గుడ్డ.

2. కొత్త కుర్చీ గుడ్డ } కొత్తగా ఉన్న కుర్చీ గుడ్డ అని అర్థం.

ఇక్కడ కూడా సన్నిహిత సంబంధులను గుర్తించటం ద్వారానే నిరూపణ సాధ్యమయింది.

సన్నిహితావయవ విభజనలో ఏ మార్పు లేకపోయినా ఒకే వాక్యానికి రెండు లేదా మూడు అర్థాలు వచ్చిన సందర్భాలున్నాయి.

వాక్యానికి రెండు అర్థాలు కలిగిన దానికి ఉదాహరణ.

ఆమె తిన లేదు

1. ఆమె ఇప్పటిదాకా ఏమీ తినలేదు.
2. ఆమెకు తినే శక్తి లేదు.

వాక్యనికి మూడు అర్థాలు కలిగి దానికి ఉదాహరణ.

రాముడు పాలు అమ్మే వాడు

1. రాముడు పాలు అమ్ముతూ జీవిస్తుంటాడు.
2. రాముడు ఇంతకు ముందు పాలు అమ్ముతూ జీవించేవాడు.
3. రాముడి దగ్గర పాలు ఉంటే రాము తప్పకుండా పాలు అమ్మి ఉండేవాడు.

ఇటువంటి చోట్ల సందర్భాన్ని బట్టి అర్థాన్ని గ్రహించాలి.

ఆంగ్లంలోని ఈ క్రింది వాక్యాన్ని గమనించండి.

The old man who live there has gone to his son's house

ఈ పై వాక్యంలో 12 పదాలున్నాయి. ఇప్పుడు మనం ఈ వాక్యంలోని సన్నిహితావయవాలను గుర్తించాలి. అప్పుడే మనం ఈ వాక్యార్థాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోగలం.

మొట్ట మొదట ఎక్కువ సన్నిహితంగా ఉన్న వాటిని గుర్తిద్దాం.

The old man who lives there has gone to his son's house



ఇందులో జంట పదాల స్థానంలో ఒక పదాన్ని నింపితే అర్థం వేరయినప్పటికి వాక్య నిర్మాణం దెబ్బ తినదు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| The | Old man | who | lives there | has gone | to | his son's | house |
| The | woman | who | sews | went | | mary's | house |

ఇదే పద్ధతిని అనుసరిస్తే ఈ వాక్యంలోని సన్నిహిత సంబంధులు ఈ క్రింది విధంగా ఉంటాయి.

The old man who lives there has gon to his son's house



రామో రావణం జఘాన



ఈ విధంగా ఏ భాషలో ఐనా సన్నిహిత సంబంధుల్ని విభజించి నిరూపించవచ్చు.

**సమీక్ష:-** పదం - పదాంశముల నిర్వచనాలను, వానిని నిర్దేశక పరిస్థితులను, సన్నిహితవయవ విశ్లేషణను పరిశీలించారు.

## ప్రశ్నలు

1. పదం - పదాంశాలను నిర్వచించి ఉదాహరణలతో వివరించండి.
2. పదాంశ నిర్మాణ విధానాన్ని ఉదాహరణాత్మకంగా విశ్లేషించండి.
3. సన్నిహితావయవ విశ్లేషణను గూర్చి విశ్లేషించండి.

## ఆధారగ్రంథ పట్టిక


1. Gleason Jr. H.A. 1961 An Introduction to Descriptive Linguistics, NewYork : Holt
2. Hockett, Charles F. 1958 A Course in Modern Linguistics NewYork, Macmillan
3. రామారావు చేకూరి 1999 తెలుగు వాక్యం చిరునవ్వు ప్రచురణలు నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ మందిరం ఎదురుగా, కాచిగూడ, హైదరాబాద్.
4. సుబ్రహ్మణ్యం, పి.ఎస్. 1984 ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పబ్లిక్‌గార్డెన్స్, హైదరాబాద్ - 4.

# పాఠం - 10 తెలుగు వాక్య నిర్మాణం

## పాఠ్యాంశ నిర్మాణ క్రమం

**10.1** వాక్యం - నిర్వచనం - ప్రాచీన వ్యాకర్తలు
**10.2** సామాన్య వాక్యాలు
**10.3** సంశ్లిష్ట వాక్యాలు
**10.4** అనుకరణ లేదా అనుకృతి వాక్యాలు
1**10.5** సంయుక్త వాక్యాలు
**10.6** తెలుగు వాక్య లక్షణాలు - వైశిష్ట్యం

**లక్ష్యం:-** తెలుగు వాక్య నిర్వచనాన్ని ప్రాచీన వ్యాకర్తల మాటల ద్వారా వాక్య భేదాలు ఉదాహరణలలో తెలుసుకుంటారు.

## 10.1 వాక్యం - నిర్వచనం - ప్రాచీన వ్యాకర్తలు

" ఛన్దః సాదౌతువేదస్యహస్తౌ కల్పోఽథ పఠ్యతే జ్యోతిషానయనం చక్షుః నిరుక్తం శ్రోత్రముచ్యతే శిక్షాఘ్రాణంతువేదస్యముఖం వ్యాకరణం స్మృతమ్" అని వ్యాకరణానికి ముఖ్య స్థానాన్ని ప్రాచీనులు ఇచ్చారు. " ప్రధానమ్ తేషు అంగేషు" అని వేదాంగాలలో "వ్యాకరణమ్" ప్రధానం అని ఆర్యులు పేర్కొన్నారు. ఆలంకారిక సార్మభౌములు ఆనంద వర్ధనుడు "ప్రథమేహివిద్వాంసోవైయుకరణా వ్యాకరణమూలత్వాత్ సర్వవిద్యానామ్" (ధ్వన్యలోకః ప్రథమోద్దోతః) అన్ని విద్యలకు వ్యాకరణమే మూలమని తెలిపి వ్యాకరణ ప్రాముఖ్యాన్ని మనకు అవగతం చేశారు. " వ్యాక్రియన్తే వివిచ్య ప్రదర్శ్యన్తే అనేన శబ్దా ఇతి వ్యాకరణమ్" (దీనిచే వ్యాకరణంచే) శబ్దాలు వ్యాకరించబడతాయి కాబట్టి వ్యాకరణం అని వ్యాకరణ శబ్దం నిర్వచించబడింది. ఇది వ్యాకృధాతు నిష్పన్నం.

"చత్వారిశృంగా త్రయోఅస్య పాదా
ద్వే శీర్షే సప్తహస్తాసౌఅస్య
త్రిధాబద్ధో వృషభోరోరవీతి
మహోదే'వో మర్త్యాం ఆవివేశ"

(ఋగ్వేద : 4-58-3)

అస్య = ఈ శబ్ద రూపుడయిన దేవుడికి
శృంగాః = కొమ్ములు
చత్వారి = నాలుగు
పాదాః = పాదాలు
త్రయః = మూడు
ద్వే = రెండు
శీర్షే = తలలు
హస్తాసః = చేతులు
అస్య = ఈ శబ్దరూపుడైన దేవుడికి
త్రిధా = మూడు చోట్ల
బద్ధః = కట్టుబడ్డ
వృషభం = ఎద్దు (కోరికలను నెరవేర్చే శబ్ద దేవుడు)
రోరవీతి = ధ్వని చేస్తుంటాడు
మహః = గొప్పవాడయిన
దేవః = శబ్దదేవుడు
మర్త్యాన్ = మనుషుల్ని
ఆవివేశ = ఆవేశించాడు

ఈ వైదిక మంత్రం ఆలంకారికమయినది. శబ్దబ్రహ్మవిచిత్ర వృషభంగా భావించబడింది. ఈ వృషభానికి నాల్గుకొమ్ములు, మూడు కాళ్ళు, రెండు తలలు, ఏడు చేతులు ఉన్నట్లుగా తెలుపబడింది. అది మానవుల్ని ఆవేశించి మూడు చోట్ల నుండి ధ్వని చేస్తుంటుంది. అది సకల వాంఛలను తీరుస్తుంటుంది. అగ్నిదేవతాపరమయిన ఈ మంత్రాన్ని వైయాకరణులు శబ్దపరంగా వ్యాఖ్యానించారు. లాక్షణికంగా ఇది సాధ్యపడుతుంది.

4 శృంగాలు (కొమ్ములు) : సుబంతం, తిఙంతం, ఉపసర్గ, నిపాతం అనే నాలుగు విధాలయిన పదాలు.

3 పాదాలు : భూత భవిష్యద్వర్తమాన కాలాలు

2 తలలు : శబ్దం యొక్క రెండు రూపాలు (నిత్యం = స్ఫోట; అనిత్యం = వైఖరి)

7 చేతులు : ఏడు విభక్తులు

3 స్థానాలు = వక్షఃస్థలం, కంఠం, శిరస్సు (శబ్దోత్పత్తి స్థానాలు)

వృషభం = కర్షించేది అనివృత్పత్తి. కోరికలను ఇచ్చేది (సుశబ్ద ప్రయోగం వ్లల మాత్రమే కోరికలు సిద్ధిస్తాయని సంప్రదాయం)

రోరవీతి = రంకెలు వేస్తుంది (ఎల్లప్పుడు నాద రూపంగా గోచరిస్తుంది).

శబ్దజ్ఞానం కలవ్యక్తి సాయుజ్యాన్ని పొందుతాడు.

భాషకు మూలయమయినది వాక్యమే అని 'Sentence in the unit of language' అనే వాక్యం ద్వారా పాశ్యత్యులు తెలిపారు. ఈ భావాన్ని స్ఫోటవాద రూపంలో సంస్కృతంలో భర్తృహరి చే 'వాక్యపదీయమ్' లో క్రీ.శ. 651 నాటికే నిరూపించబడింది. వాక్యపదీయనామం లో వాక్యపద శబ్దాలను (రెండింటిని) కలిపి సమాసం చేశారు. 'అల్పాచ్తరమ్' అనే సూత్రప్రకారం 'పద వాక్యీయమ్' అని సమాసం కావలసి ఉండగా 'అభ్యర్హితమ్ పూర్వమ్' అనే సూత్ర ప్రకారం "హరిశ్చంద్రనలోపాఖ్యానము" అన్నట్లుగా వాక్య ప్రాధాన్యాన్ని బట్టి "వాక్య పదియమ్" అని వైయాకరణ సార్వభౌములు భర్తృహరి పేరుపెట్టారు. వాక్య ప్రాధాన్యాన్ని గుర్తించి వాక్యం వల్లనే అఖండ స్ఫోటుమనకు ద్యోతకమవుతుంది అని తెలిపారు.

" అనాదినిధనం బ్రహ్మశబ్దతత్త్వం యదక్షరమ్ వివర్తతేఽర్థభావేన ప్రక్రియా జగతోయతః" అనే శ్లోకం ద్వారా శబ్ద బ్రహ్మస్వరూపం మనకు అర్థమవుతుంది. ఈ అక్షర జ్ఞానం అన్ని భాషలకు వర్తిస్తుంది.

అనాదినిధననమ్ = ఉత్పత్తి వినాశాలు లేనిది

(కాబట్టి) అక్షరమ్ = నిత్యమైనట్టిదీ

శబ్దతత్త్వమ్ = శబ్దస్వరూపమయిన

యత్ = ఏ

బ్రహ్మ = బ్రహ్మం

అర్థభావేన = ఘటపటాదుల అర్థరూపంలో

వివర్తతే = వివర్తమౌతోందో (తన స్వరూపాన్ని మార్చుకోకుండా రూపాంతరాన్ని పొందుతుందో)

జగతః = జగత్తు యొక్క

ప్రక్రియా = సృష్టిప్రక్రియ

యతః = దేని చేత జరుగుతోందో

తస్య = ఆ బ్రహ్మ యొక్క

ప్రాప్త్యుపాయం = పొందటానికి ఉపాయం

వేద = తెలుసుకో

ఈ శ్లోకంలోని అక్షర శబ్దానికి నశించనది బ్రహ్మం అనే అర్థంతోపాటు అర్థాన్ని గ్రహించేది అని వ్యుత్పత్త్యర్థాన్ని తెలిపి పదం లేదా వాక్యం అనే అర్థాన్ని కూడా వైయాకరణ బ్రహ్మలు తెలిపారు. పద వాక్యాలలో వాక్యం ముఖ్యమని వారు నిర్ధారించారు. కాబట్టి పూర్వనిపాత చేసి వాక్య పదీయనామాన్ని భర్తృహం పెట్టారు.

వాక్యానికి అనేక నిర్వచనాలను వ్యాకరణ పండితులు తెలిపారు.

1. ఆఖ్యాత శబ్దం వాక్యం : కారకంతో క్రియావాచకపదం అన్వయించి ప్రవృత్తి నివృత్తి రూపమయిన వాక్యార్థాన్ని ప్రతిపాదిస్తుంది.
2. పదసంహిత వాక్యం : పదాల పరస్పరాన్వయం వాక్యం చేత బోధపడుతుంది. ఈ విధంగా బోధించే పదసమూహమే వాక్యం.
3. పదసంఘాతవర్తి జాతి వాక్యం : "దేవదత్త ! దండేనగామానయ (దేవదత్తా ! కర్రతో ఆవును తీసుకురా)"అనే వాక్యాన్ని ఉచ్చరించేటప్పుడు (ధ్వని విశేషాలయిన) వర్ణాలు అని త్యాలు క్రమికాలు కాబట్టి ఏకకాలంలో వుండవు. అది జాతిరూపమైన స్ఫోట.
4. ఏకం, అనవయవమయిన శబ్దం వాక్యం : వర్ణాలు, పదాలు అనిత్యాలు ఆ ధ్వనులచే అభివ్యక్తమౌతున్న నిత్యం విభాగరహితం ఏకం అవుతున్న స్ఫోటరూపమయిన వాచకమే వాక్యం.
5. పదక్రమం వాక్యం : వర్ణాల క్రమం పదం. పదాల క్రమం వాక్యం. ఇదే వాచకం.

6. బుద్ధి యొక్క అనుప సంహారం వాక్యం : ఉచ్చరించేటప్పుడు ఉండే క్రమం స్థిరంగా ఉండదు. ప్రతి మనుష్యుడిలో ఉండే శబ్దతత్త్వం అక్షర బాహ్యాభివ్యక్తి ఉన్నా లేకున్నా బుద్ధిలో ఉన్నట్లుగానే, పద విభాగం లేకపోయినా బుద్ధిలో వున్నట్లుగానే తోస్తుంది. సంస్కారంతో కలిగిన స్మరణ వల్ల అర్థస్ఫురణ కలుగుతుంది.

7. ఆద్య పదం వాక్యం : ఏ పదం మొదట ప్రయోగించబడుతుందో అదే వాక్యానికి వాచకమవుతుంది.

8. ప్రత్యేకం సాకాంక్షమయిన ప్రతిపదం వాక్యం. అన్యోన్యం అన్వయాపేక్షకల అన్ని పదాలు ప్రత్యేకం వాచకాలు.

9. అవ్యయాలు, కారకాలు, క్రియావాచకాలతో కూడిన క్రియావాచకశబ్దం వాక్యం.

10. ఒక తిజంతంకలది వాక్యం.

11. ఒకే అర్థం కలది వాక్యం.

12. పదాంశాల పదాల నిర్మాణం సరిగా లేదా క్లిష్టంగా లేని ద్రావిడ భాషలలో సైతం పదాల వరస (word order) మొదలయిన వాక్య నిర్మాణాల నియతి అంత క్లిష్టంగా లేకుండా సరళంగానే వుంటుంది. తెలుగులోని ఈ పదాల వరుసను గమనించండి.

గాలి చల్లగా వీచెను
వీచెను చల్లగా గాలి
చల్లగా గాలి వీచెను
వీచెను గాలి చల్లగా
గాలి వీచెను చల్లగా
చల్లగా వీచెను గాలి

'గాలి చల్లగా వీచెను' అనే వాక్యంలోని "గాలి చల్లగా, వీచెను" అనే మూడు మాటలను పదాల వరస (word order) మార్చటం ద్వారా అర్థభంగం కలగకుండా 6 వాక్యాలు ఏర్పడ్డాయి. ఈ రహస్యాన్ని గ్రహించిన శ్రీపరవస్తు చిన్నయసూరి గారు తమ 'బాల వ్యాకరణము'లో కారకపరిచ్ఛేదంలో "ఏకవాక్యంబు నందొకానొకండు తక్క సర్వపదంబులు క్రమ నిరపేక్షంబుగం బ్రయోగింపంజను"(37 సం) అనే సూత్రాన్ని రచించారు. 'కాని ప్రభృతి శబ్దములు కొన్ని నియమ సాపేక్షంబులయి యుండు' అని సూరిగారి వృత్తి వివరణ వల్ల
"రాముఁడేని కృష్ణుఁడేని రావలయి" మొదలయిన వాక్యాలలోని క్రమాన్ని మార్చకూడదు. ప్రత్యయాలు అధికంగా వున్న సంస్కృతం, లాటిన్, గ్రీకు, హిబ్రూ, మొదలయిన భాషలలో పదాల వరస (word order) నియతంగా ఉండదు.
ఉదా :- "అస్త్యుత్త రస్యాంది శిహిమాలయోనామనగాధి రాజః" అనే కుమారసంభవ (కాళిదాసు) వాక్యాన్ని (కుమార సంభవమ్ 1-1)
"ఉత్త రస్యాందిశిహిమాలయోనామనగాధిరాజః అస్తి"
"హిమాలయోనామనగాధి రాజః ఉత్తరస్యాందిశి అస్తి"
"ఉత్తరస్యాంధిశి అస్తిహిమాలయోనామనగాధిరాజః"

అని అనేక విధాలుగా పదాలక్రమాన్ని మార్చి వేర్వేరు విధాలుగా భిన్న వాక్యాలను వ్రాయవచ్చు.

ఈ విధంగా పదక్రమాన్ని మార్చివ్రాయటం సంస్కృతాది భాషలలో సర్వసామాన్య విషయం. ఈ విధమయిన మార్పుల వల్ల వాక్యార్థానికి భంగం కలగదు. 'దిశి ఉత్తరస్యాం' అని మహాకవి ప్రయోగించాడు. ఏ కవి అయినా ఆ విధంగా ప్రయోగిస్తే అది సుష్ఠు ప్రయోగం కాదు.

ఆంగ్లాది భాషలలో వరసక్రమాన్ని ఇష్టం వచ్చినట్టు అటూ ఇటూ మారిస్తే అర్థభంగం కలిగి వాక్యాలు విపరతార్థాన్నిస్తాయి.
ఉదా :- Rama Killed Ravana

(రాముడు రావణుణ్ణి చంపాడు) అనే వాక్యాన్ని

Ravana Killed Rama

(రావణుడు రాముణ్ణి చంపాడు)

అని వరసక్రమాన్ని (word order)మారిస్తే వాక్యానికి విపరాతార్థం కల్గుతుంది.

"Rama Ravana Killed "అనే ఆంగ్ల వాక్యం పదాల వరస క్రమం తప్పి అసంబద్ధ వాక్యమవుతుంది.

తెలుగుతో పై పదాలతో వాక్యాన్ని నిర్మించి పదక్రమాన్ని మార్చినా పరవాలేదు.

రాముడు రావణుణ్ణి చంపాడు

రావణుణ్ణి రాముడు చంపాడు

చంపాడు రాముడు రావణుణ్ణి

ఈ విధంగా వివిధ భాషల్లో వివిధ రూపాల్లో ఉండటానికి ఆయా భాషల వాక్యనిర్మాణమే కారణం.

తెలుగు వ్యాకరణాలలో శ్రీ బహుజనపల్లి సీతారామాచార్యులు రచించిన ప్రౌఢ వ్యాకరణంలో వాక్య నిర్వచనానికి ప్రత్యేకంగా సూత్రాన్ని రచించారు. "వాక్యంబునా యోగ్యతాకాంక్షసహితంబగునర్థముగల యాసత్తియుక్త సముదాయము" 'ప్రౌఢవ్యా. వాక్యపరిచ్ఛేదము సూ.।) అని సాహిత్య దర్పణం లోని "వాక్యం స్యాద్యోగ్యతా కాంక్షా సత్తియుక్తః పదోచ్ఛయః" అనే విశ్వనాథకవిరాజు వాక్యనిర్వచనాన్ని బట్టి ప్రౌఢవ్యాకర్త సూత్రించారు. యోగ్యత అంటే పదార్థాలకు పరస్పర సంబంధం అని తెలిసి "నిప్పుచేఁదడుపుచున్నాడు" అని ఆచార్యుల వారు ఉదాహరించారు. నిప్పు చేతడపటం అసంభవం కాబట్టి ఈ వాక్యం యోగ్యతను కోల్లోపయి వాక్యం కాదు. "నీటి చేతడుపుతున్నాడు" అనే వాక్యం యోగ్యత కలిగి వాక్యం అవుతుంది. "అకాంక్ష మనఁగా నిలుపుదల లేకపయిపయింబోయెడి పదార్థము ల మీది యాదరము" అని పలికి మర్నాడు "పోవుచున్నాడు" అని పలికితే మాటల వ్యవధానం(gap) వల్ల అదది ఆకాంక్షారాహిత్యం వల్ల అది వాక్యం కాదు. "ఆ సత్తియనఁగాఁబదముల చేరిక" అని శ్రీ బహుజనపల్లి సీతారామాచార్యుల వారు తెలిపి పదాలు వరసక్రమం (word order)లో ఉండాలని నిర్ధారించారు. "పెద్ద కుక్క" అనే పదాల క్రమం వల్లనే 'కుక్క పెద్దదిగా వుంది అనే అర్థం మనకు స్పష్టమవుతుంది. "కుక్క పెద్ద" అంటే అర్థం మనకు తెలియదు.

"విషయబోధకము వాక్యము" (ప్రౌఢ్యా. వాక్య. పరి. సూ5) అని ప్రౌఢ వ్యాకర్త సూచించి విషయము తెలియఁదగిన యంశము" అని వివరించారు. ఉద్దేశ్యవిధేయ .................పైది సూ.6

" విషయం ఉద్దేశ్య విధేయములతోఁగూడినది. అనగా విషయమునందుద్దేశ్య విధేయములనని రెండు గలవని యర్థము. ఉద్దేశించి చెప్పఁదగినది యుద్దేశ్యము; మీదఁదెలియఁదగినది విధేయము ఉద్దేశ్యము । ; మీఁదఁదెలియఁదగినది విధేయము. ఉద్దేశ్యము వక్తృశ్రోతలకు భయాలకు ఁదెలియును. విధేయము వక్తకు మాత్రము తెలియును. విశేష్యాదిముద్దేశ్యము. క్రియాదికము విధేయము.... క్రియలుద్దేశ్యములు కానేరవు" అని వివరించారు.

ఉదా :- "ఈ హయంబులు సవనగతింబరచు"

(భార. ఆరణ్య. 3-167)

అనే నన్నయ భట్టారకుల భారత ప్రయోగంలో "కయంబులు" అనేది విశేష్యంకాగా అది ఉద్దేశ్యం అవుతుంది. "పఱచున్" అనేది క్రియ కాబట్టి విధేయమవుతుంది. ఉద్దేశ్యవిధేయాలతో కూడిన "ఈ హయంబులు పవనగతింబఱచు" అనేది వాక్యమవుతుంది.

"విశేష్యాదికముద్దేశ్యము క్రియాదికము విధేయము. విశేష్యాధికము - విశేష్యము - క్రియా విశేష్యము, విశేషణము, సర్వనామము. అని సీతారామాచార్యులవారు సూత్రవృత్తిలో వివరించారు. "ఆదిపదద్వయముచే అన్నంత క్రియలును, నేతాద్యవ్యయములును గ్రాహ్యములో విశేష్యాదుదులు ద్దేశ్యవిధేయములు రెండునగు" అని ఆచార్యుల వారు మరింత వివరించారు.

ఉదా:- "వాగ్భూషణమే సుభూషణము"

(భర్తృహరి విద్యత్పద్ధతి 15)

వాగ్భూషణము విశేష్యము, ఉద్దేశ్యము సుభూషణము. విశేష్యము, విధేయము ఉద్దేశ్యంతోను విధేయంతోను కూడిన "వాగ్భూషణమే సుభూషణము" అనే వాక్యం "ఉద్దేశ్యవిధేయ భిన్నంబు విషయము" అనే సూత్రాన్ని బట్టి విషయమై "విషయబోధకము వాక్యం" అనే సూత్రాన్ని బట్టి వాక్యమవుతుంది. 'భిన్నము' అనే మాటకు ఇక్కడ 'కూడినది' అని అర్థం.

ఆంగ్లభాషా ప్రభావం వల్ల సీతారామాచార్యుల వారు తమ ప్రౌఢవ్యాకరణంలో వాక్య పరిచ్ఛేదాన్ని చేర్చారు లేదా కూర్చారు అనటంలో సందేహం లేదు.

"సంపూర్ణమసంపూర్ణమని వాక్యంబు ద్వివిధంబు" (ప్రౌఢవ్యా. వాక్యపరి.సూ) అని ఆచార్యుల వారు సూత్రించి "సమాపక క్రియలు గల వాక్యము సంపూర్ణ వాక్యము, అసమాపక్రియలు గల వాక్యము అసంపూర్ణ వాక్యము" అని వివరించి

నలుఁడును ధరణీ రాజ్యము
దలఁగఁగ సర్వంబునసకృతంబైనఁగడుం
దలరిదమయంతిఁదొడ్కొని
వెలువడియెనశేషరాజ్యవిభవచ్యుతుఁడై"

(భా.ర. ఆరణ్యా. 2-64)

అనే నన్నయ కవీంద్రుల భారత పద్యాన్ని సమాపక క్రియావాక్యానికి ఉదాహరణగా వ్యాకర్తలు ఇచ్చారు. పై పద్యంలోని తలఁగఁగ, ఐనన్, తలరి అనే అసమాపక క్రియలతో కూడుకున్న వాక్యం అసమాపక వాక్యం అని తెలిపారు.

వాక్యాల సమూహం మహావాక్యమవుతుందని రామాయణం మొదలయిన గ్రంథాలు మహావృక్షానికి ఉదాహరణలు అని "వాక్య సముదాయము మహావాక్యము నాఁబడు రామాయణాదికము" (ప్రౌఢవ్యాకరణం. వాక్య పరి. సూ. 8) అనే సూత్రం ద్వారా సీతారామాచార్యుల వారు విశదపరిచారు. గ్రంథ పరిసమాప్తితోనే విషయం పాఠకుడికి లేదా శ్రోతకు అవగతమవుతుంది. కాబట్టి ఈ భారతీయ సంప్రదాయం ప్రకారం మహావృక్షాన్ని వ్యాకర్తలు చక్కగా నిర్వచించారు. పాశ్యత్యులు రచనానికి ప్రాధాన్యాన్నిచ్చి వాక్యాన్ని "మరే ఇతర వ్యాకరణ రూపంతోను కలిసి ఏర్పడని వ్యాకరణ రూపాన్ని (దేనికి అవయవంకాని లేదా దేనిలోనూ భాగం కాని భాష ఏర్పాటును) వాక్యం (A sentence is a grammatrical form which is not in construction with any other grammatrical form : a constitute which is not a constituent - A course in modern linguistics P . 199)

వాక్యాలలో అనేక రకాలున్నాయి.

నిర్దేశిక వాక్యాలు (declarative sentences) : ఇవి ఒక విషయాన్ని తెలుపుతాయి. సీత నిన్న బడికి వచ్చింది.

ప్రశ్న వాచకాలు (interogative sentences) : ఒక విషయాన్ని ప్రశ్నిస్తాయి : మీకు పరమాత్మగురించి తెలుసా ?

విధి వాక్యాలు (interactive sentences) : ఇవి శ్రోతకు ఆదేశాల్నిస్తాయి. నీవు ఈ పనిని సాయంకాలంలోపు చేయి.

పదాన్ని నిర్వచించటంలో లాగా వాక్యాలలో కూడా అనేక అంతర్విభాగాలున్న కారణంగా వాక్యంలోని రకాలను స్పష్టంగా పేర్కొని నిర్వచించటంలో అనేక కష్టాలు వున్నాయి.

సంపూర్ణార్థాన్నిచ్చేది వాక్యం అని ప్రాచ్య పాశ్చాత్య విపశ్చితులు వాక్య నిర్వచనం కావించినా సంతృప్తికరమైనది కాదు. " నాయన గారు ఎప్పుడు వస్తారు ? " అనే ప్రశ్నకు 'రేపు' అని సమాధానం.

ఇక్కడ 'రేపు' అనేది సంపూర్ణ వాక్యం. దీని అర్థం 'నాయనగారు రేపు వస్తారు' అని. ఈ అర్థం ప్రకరణం (context) వల్ల సిద్ధించిందే కాని అర్థం సిద్ధించదు.

"రేపు అనే పదానికి అర్థం ఏమిటి ? అనే వాక్యం లో 'రేపు'కు ఉన్న రెండర్థాలూ చెప్పవలసిందే కదా. ఇటువంటి చోట్ల సందర్భం (Context) చూసుకోవాలి. కొందరు భాషా శాస్త్రవేత్తలు "రెండు విరామాల మధ్య ఉండే ధ్వని సముదాయం వాక్యం" అని నిర్వచించారు. ఇటువంటి వాక్య నిర్వచనాలు ఎన్ని వున్నా వాటిలో మేలయినది ఏదో అదే నిలుస్తుంది. మేల్తరమయిన నిర్వచనం ఏదైనా ఇంకోటి వస్తే అప్పుడు ఆ నిర్వచనం వ్యాప్తిలోకి వస్తుంది. "భాషా వ్యవహారంలో వ్యవహర్తలు పాటించే నియమావళి" వ్యాకరణం అనే చేకూరి వారి వ్యాకరణ నిర్వచనం ఆధునికమయినది. "ఈ నియమాలు వ్యవహర్తల మనస్సులో ఆజ్ఞాతంగా ఉంటే' అనే వారి భావన కూడా సరియైనదే.

అన్ని భాషలలోను వాక్యాలను సామాన్య (simple), సంక్లిష్ట (complex), సంయుక్త (coordinate or compound), వాక్యా(sentence) లని విభజిస్తారు.

## 10.2 సామాన్య వాక్యాలు (simple sentence) :

సంక్లిష్ట సంయుక్త వాక్యాలు కానివి సామాన్య వాక్యాలు. సామాన్య వాక్యాల్లో అనేక భేధాలున్నాయి. సామాన్య వాక్యాల్లో అతి

సామాన్యమయిన దానికి నిశ్చయార్థక సామాన్య వాక్యమని వ్యవహరిస్తారు. ఇవే కాకుండా ప్రశ్నార్థక, విధ్యర్థక, సంప్రదానార్థది వాక్యాలున్నాయి. 'వ్యతి'రేకార్థక క్రియలు, కర్మణి ప్రయోగాలు కల వాక్యాలు తెలుగువారి వ్యవహారంలో వున్నాయి.

తెలుగు వాక్యాల్లో కొన్ని క్రియారహిత వాక్యాలు కాగా మరికొన్ని క్రియా సహిత వాక్యాలు క్రియారహిత తెలుగు వాక్యాలు. ఈ వాక్యాల్లో క్రియ సహజంగానే ఉండదు. క్రియ లేని వాక్యాల్లో ఒకటి ఉద్దేశ్యంకాగా మరొకటి విధేయం. ఈ ఉద్దేశ్య విధేయాలు రెండూ ఏకవస్తు బోధకాలుగా ఉంటాయి. వీటిని సమీకరణ వాక్యాలు (equational sentences) అంటారు.

ఉదా :-

(అ) వారు ప్రొఫెసరు గారు

(ఆ) రామారావు మంచి టీచరు విధేయంలో విశేషణం + నామం ఉంటే ఆ నామాన్ని లోపింపచేసి దాని స్థానంలో ఆ నామాన్ని లోపింపచేసి దాని స్థానంలో సత్యనామాదుల్ని లింగవచన విభక్తి ప్రత్యయాదులతో కలిపి వాక్యాన్ని ప్రయోగించాలి.

(అ) మాస్టార్లు మంచి మాస్టార్లు --> ఆ మాస్టార్లు మంచివారు.

(ఆ) ఆ కుర్చీ కొత్త కుర్చీ --> ఆ కుర్చి కొత్తది.

(ఇ) ఆ ఇల్లు పాత ఇల్లు --> ఆ ఇల్లు పాతది

ఆ కుర్చీ, ఆ ఇల్లు అనే పదాలకు మారుగా

(అ) అది కొత్త కుర్చీ

(ఆ) అది పాత ఇల్లు

అని కూడా వ్యవహరించవచ్చు.

ప్రాధాన్య వివక్షా విషయకంగా ఉద్దేశ్యవిధేయ వ్యత్యయం చేయవచ్చు.

అ... నీవు గాడిదవు --> గాడిదవు నీవు

ఆ. నేను సుబ్బారెడ్డిని--> సుబ్బారెడ్డిని నేను

ఆ ఖ్యాత (Predicate) స్థానానికి చేరిన దానికి ప్రాధాన్యముంటుంది. ప్రాధాన్య వివక్షను సూచించే మార్గాల్లో ఇది ఒకటి.

నామమయినా సర్వనామమయినా అవి పునరుక్తం కావు. అటువంటి ఆవశ్యకత (పునరుక్తి) ఉంటే తెలుగులో కొన్ని అర్థ విశేషాలను తెలిసే చోట ఏ వార్థకమయన 'ఏ' పదానికి (విశేషణం లేదా విశేషానికి) చేరుతుంది.

అ. వాడే వీడు

ఆ. గాడిద గాడిదే గుర్రం గుర్రమే

ఇ. వాడు వాడే, వీడు వీడే

క్రియారహిత వాక్యాల్లో విధేయాలుగా ఉన్న కొన్ని విశేషణ పదాలు విశేషాలుగా కూడా వాక్యంలోని స్థానాన్ని బట్టి ప్రయోగించబడతాయి.

అ) ఆ మేడ ఎత్తు --> ఎత్తు విశేషణం

ఆ) ఈ చెరువులోతు --> లోతు విశేషణం

అ) ఆ మేడ ఎత్తు 100 అడుగులు

ఆ) ఆ చెరువులోతు 40 అడుగులు

పై వాక్యాలలోని ఎత్తు, లోతు పదాలు విశేష్యాలు.

'పొట్టి' విశేషణం పై విధమయిన వాక్యాలలో విశేష్యంగా మారే అవకాశం లేదు.

తులానాత్మక వాక్యాల్లో కంటే, కన్నా, తో మొదలయిన ప్రవ్యయాల్ని ప్రయోగిస్తారు.

అ) వెంకట్రావు నా కంటే పొడుగు

ఆ) సీత కంటె లక్ష్మి చిన్న

ఇ) వాడు నాతో సమానం

ఇటువంటి వాక్యాల్లో విధేయం సమాకార్థకంగా ఉంటుంది.

క్రియారహిత వాక్యాల్లో తో, కంటె ప్రత్యాయాలతోపాటు మరికొన్ని ప్రత్యయాలు ప్రయోగించవచ్చు.

అ) ఢిల్లీ నాకు కొత్త

ఆ) ఈ ఊరు నాకు కొత్త

ఇ) మా ఊరికి నేను పెద్ద

ఈ) అందరిలో వాడు పొడుగు

ఉ) అజ్ఞానంలో వాడు గొప్ప

కొన్ని క్రియా వాచకాలు సంబంధ బోధకాలుగా గా కూడా కనిపిస్తున్నాయి.

అ) రామారావు నాకు అన్న

ఆ) ఆ అబ్బాయి నాకు తమ్ముడు

ఇ) వాడు నాకు స్నేహితుడు

ఈ) అతడు నాకు శిష్యుడు

క్రియా లోపం వల్ల క్రియా రహిత రూపాలు ఏర్పడతాయి.

అ) రామారావుకు పిల్లలు ఎంత మంది ?

ఆ) రామారావుకు పిల్లలు పదిమంది.

ఇ) కృష్ణకు తమ్ముళ్ళు ఎంత మంది ?

ఈ) కృష్ణకు ఇద్దరు తమ్ముళ్ళు

కొన్ని క్రియలు వాక్యంలో లోపించి గుప్త నిర్మాణాన్ని బట్టి క్రియారహిత వాక్యాలేర్పడతాయి.

అ) నాకు టీ అలవాటు

ఆ) నాకు మిఠాయి ఇష్టం

ఇ)ఈ పాఠం సులభం

ఈ పై వాక్యాల్లో అ. తాగటం, ఆ. తినటం, ఇ. చదవటం అనే క్రియలు లోపించినట్లు గ్రహించగలం.

**క్రియాసహిత వాక్యాలు :** క్రియా సహిత వాక్యాల్లో క్రియ సామాన్యంగా వాక్యాంతంలో వస్తుంది. క్రియాసహిత వాక్యాల్లో అ కర్మక సకర్మక విభేధం ముఖ్యమయినది. సకర్మక క్రియ కర్మ పద సాపేక్షం కాగా అకర్మక క్రియ కర్మ పద నిరపేక్షం. పోవు, చచ్చు, ఎండు, వచ్చు వంటి క్రియా పదాలు అకర్మకాలు కాగా కొను, తిను, చేయు, వండు వంటి క్రియా పదాలు సకర్మకాలు.

క్రియా విశేషణం క్రియ కంటె ముందు కర్మ పదం తర్వాత వస్తుంది. ఈ విధంగా పదాల క్రమం ఉంటే వాక్యంలో ఏ పదానికీ ప్రాధాన్యం ఉండదు. ఒక పదానికి వాక్యంలో ప్రాధాన్యమివ్వవలసి వచ్చినప్పుడు ప్రాధాన్యమివ్వదలచుకున్న పదాన్ని క్రియా పదానికి దగ్గరగా చేర్చాలి.

ఉదా : - అ. నేను రేపు విశాఖలో హిందీ సినిమాకు వెళ్తాను.

ఆ. నేను విశాఖలో హిందీ సినిమాకు రేపు వెళ్తాను.

ఇ. నేను రేపు హిందీ సినిమాకు రేపు విశాఖలో వెళ్తాను.

ఈ పై వాక్యాలలో క్రియకు దగ్గరగా ఉన్న పదానికి ప్రాధాన్యముంటుంది. కర్తృ పదం క్రియా పదాసాన్నిహిత్యం వల్ల ప్రాధాన్యాన్ని సంతరించుకుంటుంది.

అ. పద్మ పకోడీలు తింటోంది.

ఆ. పకోడీలు పద్మ తింటోంది.

పై వాటిలో మొదటి (అ) వాక్యం సాధారణ పదక్రమం కలది. రెండో (ఆ) వాక్యంలో పద వ్యతిక్రమం వల్ల కర్త పదానికి ప్రత్యేక ప్రాధాన్యం కలిగి పద్మకు ప్రాధాన్యం కలిగింది.

కొన్ని పదాలలో కర్తృ పదాన్ని నిర్ణయించటం కష్టం. కాని ఉద్దేశ్యపదాన్ని మాత్రం సులభంగా గుర్తించవచ్చు. వాక్యంలో ఉద్దేశ్యపదం వాక్యా విని వస్తుంది. ఈ క్రింది వాక్యాలలో కర్తృ పదాన్ని గుర్తించటం కష్టం కావచ్చు. కాని ఉద్దేశ్యాన్ని గుర్తించటం మాత్రం తేలిక.

అ. నాకు చలిగా ఉంది

ఆ. సీతకు భయంగా ఉంది

ఇ. మాకు ఆనందంగా ఉంది

ఈ. వాడికి ఏడ్పుగా ఉంది

ఉ. రాముడికి ఆకలిగా ఉంది

ఊ. రాముకు తలనొప్పిగా ఉంది

ఋ. నాకు వేడిగా ఉంది

ౠ. వాడికి దప్పికగా ఉంది

ఎ. వీడికి జ్వరంగా ఉంది

పై వాక్యాలలో అనుభోక్తనే కర్తగా భావిస్తే బాగుంటుంది. పై వాక్యాలు అన్నీ దేహమనఃస్థితి అనుభవ బోధక నామాలు కావటం విశేషం.

వాక్యాంతంలో ఉన్న క్రియాపదానికి 'ఆ' అనే ప్రశ్నార్థక పదాంశం చేరుతుంది.

అ. రాముడు ఇంటికి వెళ్ళాడా ?

ఆ. నీవు అన్నం తిన్నావా ?

ఇ. నీకు ఈ భోజనం రుచిస్తుందా ?

ఈ. మీ ఆరోగ్యం బాగుందా ?

ఉ. మనకు స్వాతంత్ర్యం వచ్చిందా ?

ఊ. మన దేశంలో స్వేచ్ఛ ఉందా ?

ఎక్కడ, ఎప్పుడు, ఎవడు, ఏమిటి, ఏది మొదలయిన పదాలు వాక్యంలో మొదటి లేదా మధ్యలో ప్రయోగించి ప్రశ్న వాక్యాలను తయారు చేయవచ్చు.

అ. మనకు స్వాతంత్యం ఎప్పుడు వచ్చింది ?

ఆ. నా పెన్ ఎక్కడ ఉంది ?

ఇ. వాడు ఎవడు ? ఎవడు వాడు?

ఈ. అది ఏమిటి ? ఏమిటది ?

ఉ. అది ఏది ?

ఊ. నీవు ఎప్పుడు వచ్చావు ?

ఋ. అక్కడ ఎవరున్నారు ?

ౠ. నీ మాటకు విలువేది ?

వండు, కొను, తిను మొదలయినవి సహజంగా సకర్మ క్రియలు. చచ్చు, ఎండు, పోవు మొదలయినవి అకర్మక క్రియలు.

అ. వాడు అన్నం తిన్నాడు.

ఆ. వాడు అన్నం వండాడు.

ఇ. వాడు సరుకులు కొన్నాడు.

ఈ. రాముడు పాఠం చదివాడు.

అకర్మక క్రియా పదాల్ని కొన్ని ప్రత్యయాలు లేదా కొట్టు మొదలయిన శబ్ద రూపాల్ని (పదాంశాల్ని) చేర్చటం ద్వారా సకర్మక క్రియా పదాలుగా మార్చవచ్చు. 'చనిపోవు' అకర్మక క్రియాపదం అని మనకు తెలుసు.

అ. నాయకుడు చనిపోయాడు (అకర్మ క్రియా వాక్యం)

ఆ. గుండాలు నాయకుణ్ణి చంపారు (సకర్మక క్రియా వాక్యం)

ఇ. గాంధీ చచ్చి పోయాడు (అకర్మక క్రియా వాక్యం)

ఈ. గాడ్సే గాంధీని చంపాడు (సకర్మిక వాక్యం)

అకర్మక క్రియ సకర్మక క్రియగా మారిన తర్వాత ప్రేరణ క్రియగా కూడా కొన్ని ప్రేరణ ప్రత్యయాలు చేరటం వల్ల ఏర్పడతాయి.

అ. అన్నం ఉడికింది

ఆ. వంటమనిషి అన్నం వండింది.

ఇ. యజమానురాలు వంట మనిషి చేత అన్నం వండించింది.

వండు సకర్మక క్రియా రూపం కాగా, ఇంచు ప్రేరణ ప్రత్యయం.

అకర్మక సకర్మక ప్రేరణ రూపాలు తెలుగు లోను ఇతర ద్రావిడ భాషలలోను సుప్రసిద్ధాలు

| అకర్మకం | సకర్మకం | ప్రేరణం |
|---|---|---|
| చచ్చు | చంపు | చండించు |
| చెడు | చెఱుచు | చెడగొట్టు |
| పడు | పడగొట్టు | పడగొట్టించు |
| రాలు | రాలగొట్టు | రాలగొట్టించు |
| అగు | కాజేయు | |
| పగులు | పగలగొట్టు | పగలగొట్టించు |

కొట్టు మొదలయిన క్రియావాచకాలు ప్రేరణరూపాలయ్యేటట్లుగా పగులు, రాలు వంటి శబ్దరూపాలకు చేరటం వల్ల సకర్మక క్రియారూపాలుగా మారతాయి.

తెలుగులో కర్మణి వాక్యాలు సంస్కృత భాషా ప్రభావం వల్ల ఏర్పాడ్డాయి. నిత్య జన వ్యవహారంలో కర్మణి ప్రయోగం మృగ్యం.

అ. నా చే ఈ పని చేయబడింది.

ఆ. అన్నం తినబడింది.

ఇ. నాచే గ్రామం వెళ్ళబడింది.

ఈ. నాచే సినిమా చూడబడింది

ఉ. కృష్ణ నాచే కొట్టబడ్డాడు.

ఊ. ఈ గ్రామం నాచే చూడబడింది.

ఈ పై వాక్యాలు కృతకాలు

కర్త ఎవరో తెలియనప్పుడు కర్మణి వాక్యం ప్రయోగించబడుతుంది.

అ. కార్మిక నాయకుడు చంపబడ్డాడు. కార్మిక నాయకుణ్ణి ఎవరు చంపారో తెలియదు.

ఇటువంటి సందర్భాలలో కర్మణి వాక్య ప్రయోగం తప్పుకాదు.

ఒకే ప్రేరణార్థక క్రియ వాక్య భేధాన్ని బట్టి భిన్నార్థాలను ఇవ్వవచ్చు.

అ. అప్పారావు రమను చదివిస్తున్నాడు.

రమ చదువుకోవటానికి బహుశా ఆమె కోర్సు పూర్తి అయ్యేవరకు పూర్తిగా సహాయపడుతున్నాడు అని ఈ వాక్యార్థం.

ఆ. అప్పారావు రమ చేత చదివిస్తున్నాడు. అప్పారావు రమ చేత బహుశ దగ్గర ఉండి ఏదైనా పుస్తకాన్ని చదివేటట్లు చూస్తున్నాడు అని వాక్యార్థం.

'చదివించు' అనే ఒకే క్రియకు రెండు అర్థాలు రావడానికి కారణం ఏమిటి ? విభక్తి భేధమే కారణం. మొదటి వాక్యం(అ) లో ఉన్న కర్మ ఐన రమకు ద్వితీయావిభక్తి చేరగా రెండో వాక్యంలోని రమకు తృతీయా విభక్తి ఐన చేత చేరింది. విభక్తి భేధం వల్ల అర్థ భేధం కల్గింది.

ద్రావిడ భాషలలో మొదట్లో కర్మణి ప్రయోగం లేదు. సంస్కృతంలో కర్మణి ప్రయోగ ప్రాచుర్యంలో ఉంది. ఈ సంస్కృత భాషా ప్రభావం వల్ల తెలుగులో ప్రాఙ్నన్నయయుగ శాసనాలలో ఆస్తి నాస్తి ప్రప్రాఙ్నన్నయయుగ శాసనాలన్నిటి లోను ఉన్న కర్మణి ప్రయోగాల సంఖ్య)గా ఉన్న కర్మణి ప్రయోగాలు నన్నయ కాలం నుంచి అధిక సంఖ్యలో ప్రయోగించబడ్డాయి. కాని నేటికి కూడా తెలుగులో ఈ కర్మణి ప్రయోగాలకు వ్యవహార వ్యాప్తి లేదు. కర్మణి వాక్యాలలో కర్తరి వాక్యాలలో ఉన్న కర్తృ కర్మపదాలు తారుమారవుతాయి. ఆ విధంగా వ్యత్యాసమయిన కర్తకు "చేత వర్ధకంబు కర్తకగు" (బాల వ్యాకరణం కారకవరి. సూ. 3) అన్విస్తుంది. సూరి సూత్రించిన రీతిలో చేత' వర్ణకం వస్తుంది. ఇటువంటి కర్మణి వాక్యాలలో కర్మ పదానికి ప్రాధాన్యం లభిస్తుంది.

అ. దేవదత్తుడు వంటకమును వండెను. కర్తరి ప్రయోగం

ఆ. వంటకము దేవదత్తుని చేతవండఁబడియె. కర్మణి ప్రయోగం. మొదటి వాక్యంతో దేవదత్తుడికి ప్రాధాన్యం ఉండగా రెండో వాక్యంలో వంటకానికి ప్రాధాన్యం కల్గింది. దీనికి కారణం కర్మణి ప్రయగం కావటం తెలిసిందే. ఉపన్యాసాలలోను, సంభాషణలలోను, చర్చల్లోను, గోష్ఠుల్లోను కర్మణి ప్రయోగాలు కన్పిస్తున్నాయి. కర్తృ ప్రాధాన్యాన్ని తగ్గించటమే కర్మణి ప్రయోగాల ప్రయోజనం. ఈ విషయం ఈ కింది చేరాగారి తెలుగు వాక్యంలో' లోని వాక్యాల వల్ల స్పష్టమవుతుంది. " ఈ రచనలో అక్కడక్కడ కర్మణి వాక్యాలను ప్రయోగించాను. కర్మణి వాక్యాల మీద నాకు ప్రత్యేకమైన మోజేమి లేదు. అకారణమైన ద్వేషము లేదు. సకర్మక వాక్యాల్లో కర్తృ ప్రాధాన్యాన్ని తగ్గించటానికి భాషలు అనుసరించే ఒక పద్ధతి కర్మణి ప్రయోగం. ఇది ఇతర మార్గాల ద్వారా సాధించవచ్చు గాని తెలుగులో క్రియావిభక్తులు అందుకు ఆటంకం రచనా బాషలో ముఖ్యంగా పరిశోధనా వ్యాసంగంలో ఉత్తమ పురుష కర్తృ వాక్య బాహుళ్యం తప్పించుకోటం కష్టం. ఒక్కోసారి ఆ వాక్యాలు రచయత అభీష్టానికి విరుద్ధంగా అహంకార ద్యోతకాలు కావచ్చు. ఆ ప్రమాదం నుంచి కాపాడు కోటానికి కర్మణి వాక్యాలు రచయతలకు కవచాల్లాంటివి. ఆ ఉద్దేశంతోటే ఈ పుస్తక రచనలో కర్మణి వాక్యాలు వాడబడినై" (పుట vii)

అ. నా చేత అరటి పండు తినబడింది

ఆ. కాఫీ నా చేత తాగబడింది

వంటి వాక్యాలు వ్యవహార విదూరాలు

కర్త ఎవరో తెలియనప్పుడు, కర్మణి ప్రయోగాలను ప్రయాణిస్తారు.

'వాడు చావలేదు, చంపబడ్డాడు' వంటి వాక్యాలు ఇటువంటివే.

" ప్రేమించటం కంటే ప్రేమించబడటం గొప్ప విషయం" అనే కర్మణి వాక్యం వల్ల కర్మణి వాక్యం వాక్య వైశిష్ట్యం తెలుస్తుంది.

ధాతువు అనేకార్థాల్లో ప్రయోగించబడటం విశేషం.

'ఇచ్చు' ప్రదానం చేయు అనురుత్యర్థం :

నన్ను వెళ్ళనీ.

'వచ్చు' ---> ఊహ :

రమణ రేపు రావచ్చు

అ. కర్ర విరిగింది

ఆ. గోడ తగిలింది

ఇ. రోడ్డు మీద రాయి తగిలింది

ఈ. తలుపు తగిలింది

ఈ పై వాక్యాలలో నామానికి క్రియా వ్యాసానికి ఉన్న సంబంధం ఏమిటో సంపూర్ణంగా తెలుసుకోవటానికి ప్రయత్నించాలి. ఇటువంటి వాక్యవైచిత్రులను గ్రహించినప్పుడే తెలుగు వ్యాకరణ విశేషాలు అవగతమవుతాయి.

--కు, --కి విభక్తి ప్రత్యయాలు సంబంధాద్యర్థాల్లో ప్రయోగించబడతాయి.

అ. రాముకు ఇద్దరు అన్నలు (సంబంధార్థకం)

ఆ. వాడికి పిల్లనెవరిస్తారు (సంప్రదానార్థం)

ఇ. చల్లకు వచ్చాడు (ప్రయోజనం)

ఈ. పది గంటలకు వస్తాను (సమయ నిర్దేశం)

-- నుంచి :

అ. వాడు ఊరి నుంచి ఇప్పుడే వచ్చాడు (అపానార్ధనం)

ఆ. నీ నుంచి మాటపడాల్సి వచ్చింది. హేత్వర్థనం.

--తో

అ. బాల్‌పెన్‌తో పరీక్ష రాస్తాడు (శరణార్ధనం)

ఆ. రాము పద్మతో పరీక్షకు వస్తాడు (సహార్థకం)

ఇ. కృష్ణ జ్వరంతో పరీక్ష రాశాడు (దీన స్థితి)

ఈ. కోపంతో వెళ్ళాడు (మనఃస్థితి)

ఇంకా -లో, వరకు, దాకా, గురించి, -ఒట్టి వంటి విభక్తి ప్రత్యయాలు, విభక్తి ప్రత్యయ ప్రతిరూపాలు చాలా వున్నాయి.

**10.3 సంశ్లిష్ట వాక్యాలు** (complex sentences) : ఒక ప్రధాన వాక్యానికి ఒకుపవాక్యం లేదా రెండు అంతకంటే అధిక ఉపవాక్యాలు చేరటం వల్ల సంశ్లిష్ట వాక్యం ఏర్పడుతుంది. వాక్యాల్లో ప్రధాన వాక్యం క్రియారహిత మయినట్లయితే ఒకటి కంటె ఎక్కువ క్రియలుంటాయి.

**ఏ. క్త్వార్థకం :** ప్రధాన క్రియకు ముందు (పూర్వం) జరిగిన వ్యాపారాన్ని సూచించటానికి అసమాపన క్రియను ప్రయోగిస్తారు. “సమానాశ్రయంబులం బూర్వకాలంబు నందివర్ణకంబగు” (బాల వ్యా. క్రియాపరి. సూ. 38). అని సూరి సూత్రించి “ఏకాశ్రయంబులగు క్రియల లోపల నెయ్యది పూర్వకాలికంబగుందద్వాచియగు ధాతువునకి వర్ణకంబగు. ఇది యొక్త్వార్ధంబునా “ఒడువండి, పండి, వని, కని” వృత్తి యందు వివరించారు.

అ. అప్పారావు అన్నంతిని నిద్రపోయాడు.

ఆ. అప్పారావు అన్నం తింటూ నిద్రపోయాడు.

పై ఉదాహరణలు ఏకకర్తృకాలు కావటం విశేషం. భిన్న కర్తృకాలయినవి క్త్వార్థక శత్రర్థక క్త్వార్ధన క్రియలు వ్యాకరణ విరుద్ధాలయి దుష్ట ప్రయోగాలవుతాయి.

అ. అప్పారావు అన్నం తిని రామారావు నిద్రపోయాడు.

ఆ. అప్పారావు అన్నం తింటూ రామారావు నిద్రపోయాడు.

ఈ విధమయిన వాక్యాల్లో కర్తను తెలపాలంటే కర్తృపదంగా ఒక నామాన్ని లేదా నామబంధాన్ని ఉపయోగించాలి. భిన్న నామాలు లేదా నామ బంధాలు ఉంటే ఒకే కర్తను తెలపలేవు. కాబట్టి ఇటువంటి వాక్యాలు సాధువులు కావు.

అ. రుక్మిణి అన్నంతిని పద్మ నిద్రపోయింది.

ఆ. రుక్మిణి అన్నం తింటూ పద్మ నిద్రపోయింది.

క్వార్థక వాక్యాల్లో ఏకకర్తృక నియమం సరైనదే అయినా కొన్ని వాక్యాల్లో ఇటువంటివి (ఏకకర్తృకాలు) కాని ప్రయోగాలు కనిపిస్తున్నాయి. తెలుగు సామెతల్లో ఇటువంటి విరుద్ధ ప్రయోగాలు సమ్మతమౌతాయి.

ఉదా. గొర్రెల్ని తినేవాడుపోయి బర్రెల్ని తినేవాడు వచ్చాడు.

హేత్వర్థంలో క్వార్థక ప్రయోగం

అ. డాక్టరు గారు లంచాలు తిని పెద్ద బిల్డింగు కట్టారు.

ఆ. ఆ మాస్టారు ప్రైవేటు చెప్పుకొని బతుకుతున్నాడు. అ. లో డాక్టరు బిల్లింగు కట్టటానికి లంచాలు మేయడం కారణం. ఆ. లో మాస్టారు బతకటానికి ప్రైవేట్లు చెప్పటం హేతువు.

అ ప్రాణివాచకాలు కర్తృగా పదాలుగా ఉన్నప్పుడు కూడా క్వార్థక క్రియరూపాలు ప్రయోగించబడుతున్నాయి.

అద్దం క్రింద పడి పగిలిపోయింది.

అద్దం అ ప్రాణి వాచకం, కర్తృ పదం క్రింద పడటం హేతువు.

**బి. శత్రర్థకం** : ఏకకర్తృకంగా ఏక కాలంలో జరిగే వాటిని బోధించటం శత్రర్థక క్రియా ప్రయోజనం.

అ. రామారావు ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడతాడు.

ఆ. వాడు మాట్లాడుతూ పళ్ళు కొరుక్కుంటాడు.

రెండు క్రియల మధ్య వ్యవధానం లేనప్పుడు కూడా శత్రర్థకం ప్రయోగించబడింది.

భవిష్యదర్థంలో శత్రర్థకం.

బెజవాడకు వెళ్తూ అప్పారావు మా ఇంటికి వచ్చాడు.

వెళ్తూ అంటే వెళ్ళబోతూ అని అర్థం.

**సి. చేదర్థకం** :- 'తే' అనే ప్రత్యయాన్ని ధాతువుకు చేరిస్తే చేదర్థక రూపం ఏర్పడుతుంది. చేదర్థక క్రియ తర్వాత ఉన్న ప్రధాన క్రియ భవిష్యద్బోధక క్రియ సాధారణంగా వస్తుంది.

అ. వానలు కురిస్తే పంటలు పండుతాయి.

ఆ. అడక్కపోతే అమ్మయినా పెట్టదు.

ఇ. తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి.

పై వాటిలో అ, ఇ లు సామెతలు.

**డి. అపూర్థకం** : ధాతువులకు '-ఇనా' చేర్చటం ద్వారా అప్యర్థకం ద్యోతకమవుతుంది. రెండు వాక్యల్లో మొదటి వాక్యం చివర -'ఇనా' అనే అప్యర్థకం చేరుతుంది.

అ. వాడికి చదివినా చదువురాదు.

ఆ. హైదరాబాదుకు పోయినా వాడికి పనిరాదు.

**ఇ. నామ్నీకరణాలు** : ఒక వాక్యాన్ని మరో వాక్యం లోని నామ పదం స్థానంలో ప్రయోగించినప్పుడు కొన్ని మార్పులు జరుగుతాయి.

ఆమె దిగి వచ్చిన దేవ లోకానికే తిరిగి వెళ్ళింది.

'దిగి వచ్చిన దేవలోకం' అనేది నామ్నకరణం.

**ఎఫ్. భావార్థకాలు** : సంఘటనలతో కూడి నామాలుగా ప్రవర్తించినప్పుడు 'జరుగు' అనే క్రియతో కలిసి వాక్యాలు ఏర్పడతాయి.

అ. ఈ విషయం నీకు చెప్పటం జరిగింది.

ఆ. ఎమ్.పి. గారి సభకు వెళ్ళటం జరిగింది.

ఇ. లక్ష్మి సినిమా చూడటం జరిగింది.

ఈ. రాముడు చెరువులో పడటం జరిగింది.

ఈ పై వాక్యాల ప్రయోగం తప్పుకాదు. ఇటువంటివి వాడుకలో వున్నాయి.

**జి. క్రియ భావార్థకనామంగా మారటం**

అ. మీరు ఎప్పుడు వస్తారు ? - మీరు రావటం ఎప్పుడు ?

ఆ. మీరు ఎప్పుడు భోంచేస్తారు ? మీరు భోంచేయటం ఎప్పుడు ?

ఇ. వాడు ఎప్పుడు చస్తాడు ? వాడు చావటం ఎప్పుడు ?

ఈ. వాడు ఎందుకు బతుకుతున్నాడు ? వాడు బతకటం ఎందుకు ?

-'కి' విభక్తి మారుగా - 'కోసం' వాడటం కూడా ఉంది.

అ. వాడు భోజనానికి ఇంటికి వెళ్ళాడు --> వాడు భోజనం కోసం ఇంటికి వెళ్ళాడు.

ఆ. కృష్ణారావు బతకటానికి కొట్టు పెట్టుకున్నాడు --> కృష్ణారావు బతకటం కోసం కొట్టుపెట్టుకున్నాడు.

-కోసం < -కు + అవసరం.

నామ బంధంగా ఒక వాక్యాన్ని ఉపయోగించి ఇంకో వాక్యంతో కలిపి ప్రయోగించవచ్చు.

అ. రామారావు మీతో మాట్లాడంది నాకు తెలుసు.

ఆ. వెంకట్రావు కృష్ణతో కలిసి కుట్ర చేసింది రమణకు తెలుసు.

**10.4 అనుకరణ లేదా అనుకృతి :** ఒకసారి ప్రయోగించబడ్డ (ఒకరు ఇంకొకరితో చెప్పిన) బాషాంశాలు ఇంకోసారి (మరొకరు లేదా శ్రోత అయిన వ్యక్తి) మరోవ్యక్తితో (ఇంకో వ్యక్తితో) చెప్పినట్లయితే అట్లా చెప్పబడ్డది అనుకృతి లేదా అనుకరణం అనబడుతుంది. ఒక వక్త ఒక శ్రోతతో అన్నదాన్ని ఆ శ్రోత లేదా మరో వక్త మరో శ్రోతతో చెప్పటాన్ని అనుకృతి లేదా అనుకరణం అని నిర్వచించవచ్చు. ఈ అనుకృతిని ప్రత్యక్షానుకృతి అని పరోక్షానుకృతి అని రెండురకాలుగా విభజించవచ్చు. విన్నవాటిని యథాతథంగా అనుకరించి చెప్పితే ప్రత్యక్షానుకృతి అవుతుంది. అనుకరించబడ్డ అంశంలోని విషయాన్ని మాత్రమే అనుకరించి ఇంకొకరితో చెప్పేది పరోక్షానుకృతి. ఈ అనుకృతి సర్వభాషాసామాన్య విషయం. అనుకృతిని శబ్దార్థాలు రెంటికి పరిమితం చేస్తే ఆ అనుకృతి శబ్దార్థానుకృతి (code centred) అనీ కేవలం అర్థానికే అనుకృతిని పరిమితం చేస్తే అట్టి అనుకృతిని అర్థానుకృతి (information centred) అనీ వివరించవచ్చు. మన వ్యాకరణాలలోని అనుకృతి మన శబ్దార్థానుకృతి (code centred) అని పేర్కొనవచ్చు. పరోక్షానుకృతికి పరిమితులున్న విషయం అందరికీ తెలిసిందే.

"అనుకరణము = సంస్కృత వాక్యములను యథాతథముగా (బేర్కొనుట. ఇట్టిచోట 'అను' ధాతువు సామాన్యముగా వాడఁబడుచుండును. ఉదా: - వర్ధతాంశ్రీపి' + అనియె విసర్గంబున కనుకరణంబునలో పంబగు" (బాల వ్యా. సంసం. సూ 50) అనే సూత్రంచేత విసర్గకు లోపం వచ్చి 'వర్ధతాంశ్రీ' యని యె, అనే వాక్య సిద్ధిస్తుంది అని బాలవ్యాకరణ ఘంటాపథ వ్యాఖ్య (పుట 90) అను ధాతు క్త్వార్థక క్రియా రూపం (అని) అనుకరణం లో ప్రయోగించబడుతుంది. అనుకరణ వాక్యాలలో జరిగే చిన్ని చిన్ని మార్పులను చిన్నయసూరి మొదలయిన వారు తమ వ్యాకరణాలలో సూచించారు. "అనుకరణంబునందుది హల్లునకు ద్విర్వచనంబగు

కింతత్ + అనియె - కింతత్తనియె

దాసోహమ్ + అనియె - దాసోహమ్మనియె"

(బాల వ్యా. సంధిపం. సూ. 52)

అనుకృతాంశాలు యధాతథంగా శ్రోతకు అందించటం అనుకరణ ప్రయోగం.

కొన్ని ప్రశ్నార్థక పదాలకు మరికొన్ని వాంఛాదిద్యోతకి క్రియలకు "అని, అంటే"లు ప్రయోగించబడతాయి.

అ. ఎందుకని చెప్పలేదు ?

ఆ. ఏమని చెప్పాడు ?

ఇ. ఏమని చెప్పను ?

ఈ. పిల్లలంటే ఎవరు ?

ఉ. ఏమంటే ...

ఊ. ఎందుకంటే...

మిగిలిన (అన్య) భాషలను పరిశీలించి వాటిలోని భావాలనే కాకుండా భాషను కూడ హస్తగతం చేసుకోవటానికి అనుకరణలు ఉపయోగపడతాయి.

**10.5 సంయుక్త వాక్యాలు** (Coordinate sentences) : రెండుకాని అంతకంటె ఎక్కువ కాని సమాన ప్రతిపత్తి కల వాక్యాలు కలిగి ఏకవాక్యంగా ఏర్పడితే అటువంటి వాక్యాన్ని సంయుక్త వాక్యం అంటారు. వాక్యాల కూడికను సూచంచటానికి ఇంగ్లీషులో and, or, but వంటి శబ్దాలను హిందీలో ఔర్, మగర్ శబ్దాలను సంస్కృతంలో చాదుల్ని (చ మొదలయిన వాటిని) ప్రయోగిస్తారు.

తెలుగులో రెండు లేదా అంతకంటె ఎక్కువ వాక్యాలను కలపటానికి ప్రత్యేక పదాలు లేవు. ఆ వాక్యాల సంబంధాన్ని అర్థాన్ని బట్టి గ్రహించవచ్చు. వాక్య సంబంధద్యోతక ప్రత్యేక పదం తెలుగులో లేదు. వాక్యం చివర్లో స్వరోచ్చారణ వల్ల వాక్యాల సంబంధం తెలుస్తుంది.

అ. రాము అందమైన వాడు, తెలివైనవాడు.

ఈ వాక్యంలోని కర్త ఒకడే. ఈ వాక్యాన్ని రెండు వాక్యాల సమాహారంగా భావించవచ్చు.

1. రాము అందమైనవాడు
2. సోము సినిమాకు వెళ్ళాడు.

ఈ రెండు వాక్యాల్ని కలిపి "రాము, సోము సినిమాకు వెళ్ళారు" అని సంయుక్త వాక్యాన్ని తయారు చేయవచ్చు.

రామారావు అప్పారావును కొట్టాడు

అప్పారావు రామారావును కొట్టాడు.

ఈ రెండు వాక్యాల్ని కలిపి

"రామారావు అప్పారావులు కొట్టుకున్నారు

లేదా

అప్పారావు రామారావులు కొట్టుకున్నారు"

అని ఏకవాక్యంగా ప్రయోగించవచ్చు. ఇటువంటి పరస్పరతను చూపే సంయుక్త వాక్యాలు తెలుగులో అనేకం ఉన్నాయి.

1. సమప్రశ్నార్థకాలు, సమక్రియావాచకశబ్దాలు ఉన్నప్పుడు సంయుక్త వాక్యాలేర్పడతాయి.
2. సింహాద్రి, అప్పారావు, ఎక్కడకు వెళ్తారు ?

అ. సింహాద్రి ఎక్కడకు వెళ్తాడు ?

ఆ. అప్పారావు ఎక్కడకు వెళ్తాడు ?

'ఆ-' ప్రశ్నలతో సంయుక్త వాక్యాలేర్పడతాయి.

అ. అందరూ కలిసే ఉంటున్నారా ? అందరూ కలిసే తింటున్నారా ?

అందరూ కలిసే ఉంటున్నారా ? తింటున్నారా ? (సంయుక్త వాక్యం)

ఆ. పేదవారికి కూడుందా ? పేద వారికి గుడ్డ ఉందా ? పేద వారికి నీడ ఉందా ?

పేదవారికి కూడు, గుడ్డ, నీడ ఉన్నాయా ? (సంయుక్త వాక్యం)

వాక్యంలోనిత్వాద్యర్థాల్లో ఓ శబ్దం చేరుతుంది. ఇవి సంయుక్త వాక్యాలే.

అ. రామారావు రేపో ఎల్లుండో వస్తాడు.

ఆ. వాడో వీడో రేపో ఎల్లుండో పది రోజుల తర్వాత వస్తారు.

ఇ. వాడు  మంచివాడో చెడ్డవాడో తెలియదు.

ఈ. వాడు దరిద్రుడో పరమదరిద్రుడో తెలుసుకోవాలి.

ఉ. రాముని కృష్ణుడో, దుష్టుడో, దుర్మార్గుడో, సత్పురుషుడో చెప్పలేము.

వైరుధ్య సూచకమయిన 'కాని' శబ్దాన్ని వాక్యం లో చేర్చి సంయుక్త వాక్యాలను ప్రయోగించవచ్చు.

అ. ప్రసాదు కోటీశ్వరుడు కాని కానీ ఖర్చు పెట్టడు.

ఆ. గిరీశం అందగాడే కాని బుద్ధి వంకర.

ఇ. అతడు లాయరు కాని కోర్టులో ఏమీ మాట్లాడలేడు.

ఈ. ఆమె టీచరు కాని పాఠాలు చెప్పటం చేతకాదు.

ఉ. రేపుకాని ఎల్లుండి కాని మిమ్మల్ని కలుస్తా.

## 10.6 తెలుగు వాక్య లక్షణాలు తెలుగు వాక్య వైశిష్ట్యం

ఏకభాషా లక్షణ పరిశీలన, బహుభాషా పరిశీలన సకల భాషా పరిశీలన అని భాషా లక్షణ పరిశీలన అను మూడు విధాలున్నాయి. ఒక భాషాలోని లక్షణాలు మరో భాషలో ఉండవచ్చు, ఉండకపోవచ్చు. తెలుగులో స్వర సమీకరణ లేదా సమన్వరత (vowel harmony) ఇంగ్లీషు, హిందీ మొదలయిన భాషల్లో లేదు. టర్కిష్, యావల్మనీ మొదలయిన భాషల్లో ఉంది. ప్రపంచంలో ఉన్న సుమారు 6 వేల భాషల్ని పరిశీలించిన వారు లేరు. కాబట్టి సర్వభాషా లక్షనాలు బహుభాషా పరిశీలన జన్య ఊహా లక్షణాలు. ఇవి భాషా నిర్వచనంలో భాగమై పోతాయి. అన్ని భాషా లక్షణాలకు మూలం ఏకభాషా లక్షణ పరిశీలన. తర్వాత తులనాత్మక భాషా పరిశీలన.

సాధారణమయిన సకర్మక వాక్యం పదక్రమాన్ని బట్టి ప్రపంచ భాషల్ని 1. క్రియాది, 2. క్రియా మధ్య 3. క్రియాంత భాషలుగా విభజించవచ్చు. ద్రావిడ భాషలన్నీ క్రియాంత భాషలు. తెలుగు క్రియాంత భాష అనేది స్పష్టమే. క్రియాంత భాషల్లో నామవిశేషాలు నామానికి ముందు (పూర్వం), క్రియా విశేషణాలు క్రియకు తర్వాత వస్తాయి.

తెలుగులోని పదక్రమం (word order) ఒక నిర్దిష్ట రీతిలో ఉంది. ముఖ్య కర్మకు ముందే (పూర్వమే) అముఖ్య కర్మ వుంటుంది (ప్రశ్నార్థక శబ్దాలు ప్రయుక్తమైనప్పుడు తప్ప) ముఖ్య కర్మ ఎప్పుడు క్రియకు సన్నిహితంగానే ఉంటుంది. ప్రశ్నార్థక పదాలు ఎప్పుడూ క్రియకు సన్నిహితంగానే ఉంటాయి. ఉపవాక్యాలు ప్రధాన వాక్యానికి సన్నిహితంగానే ఉంటాయి. క్రియకు దగ్గరగా ఉన్న పదానికి ప్రాధాన్యం ఉంటుంది. వాక&యంలో వక్త అభిప్రాయాన్ని సూచించే అటాది శబ్దాలు తెలుగులో ఉన్నాయి.

తెలుగులో క్రియకు ప్రాధాన్యం ఉంది. వాక్యాలను అనుసంధించే శబ్దాలు చాలామటుకు క్రియానిష్పన్నాలు. అనుకరణంలో వచ్చే 'అని' అనేది 'అను' ధాతునిష్పన్నం. అయితే / ఐతే కాని, కాకపోతే, కాదు కదా మొదలయిన పదాలన్నీ 'అగు' ధాతునిష్పన్నాలు.

తెలుగులో క్రియారహిత వాక్యాలు విశేషం. ద్రావిడ భాషలలోని క్రియారహిత వాక్య ప్రభావం వల్ల ఒరియా, బెంగాలీ, నేపాలి భాషలో క్రియా రహిత వాక్య ప్రయోగ పద్ధతి కనిపిస్తోంది. తెలుగు వాక్యాల్లో కర్త ఉద్దేశ్యం ఒకటి కావలసిన అవసరం లేదు. తెలుగు వాక్యంలో కర్త కన్నా ఉద్దేశ్యమే ప్రధానమైనది. తెలుగులోని కొన్ని వాక్యాల్లో కర్తను గుర్తించటం కూడా కష్టమే.

| తెలుగు | ఇంగ్లీషు |
|---|---|
| ఎవరక్కడ ? | Who is there ? |
| నేను | It is me. |

ఇంగ్లీషులో పదక్రమానికి ప్రత్యేక ప్రయోజనం ఉంది. తెలుగులో అటువంటి ప్రయోజనం లేదు.

ఇంగ్లీషుభాష పదక్రమ వ్యత్యయాన్ని సహించదు. తెలుగు భాష ప్రాధాన్యవివక్ష కోసం పదక్రమ వ్యత్యయాన్ని సహిస్తుంది.

తెలుగులో స్వామ్య అనుభోక్తృ ఆది అర్థాల్లో -'కు' ప్రయోగించబడుతుంది.

ఉదా : నాకు తృప్తిగా ఉంది

రాముకు 10 సూట్లున్నాయి.

తెలుగులోని అనుకరణ విధానం విస్తారమైంది. 'అని' ( < అను + - ఇ) పద ప్రయోగం ద్వారా దీన్ని సాధించారు. తెలుగులోని క్త్వార్థక వాక్యాలు విశిష్టమయినవి. తెలుగు లోని సంయుక్తా సంయుక్త వాక్యాల మధ్య కల భేధం స్వల్పం. కాని, లేక, లేదా మొదలయిన పదాలతో సంయుక్త వాక్యాలను ప్రయోగించవచ్చు.

'భాషకు వాక్యం ప్రమాణం' ప్రాణం అని ప్రపంచంలోని భాషా వేత్తలందరూ తెలిపారు. పరబ్రహ్మ స్వరూపాన్ని తెలుసుకున్న వారు, వాక్య స్వరూపాన్ని సంపూర్ణంగా వివరించినవారూ లేరు.

**సమీక్ష:-** తెలుగు వాక్య నిర్మాణ విశేషాలను, వాక్య భేదాలను, విశిష్టతను, లక్షణాలను పరిశీలించారు.

## ప్రశ్నలు

1. తెలుగులో వాక్య నిర్మాణాన్ని గూర్చి వ్రాయండి.
2. వాక్యము అంటే ఏమిటో తెలిపి తెలుగు వాక్య లక్షణాలను భేదాలను వివరించండి.
3. సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యములను గూర్చి ఉదాహరణ పూర్వకంగా విపులీకరించండి.

## ఆధారగ్రంథ పట్టిక


1. రామారావు చేకూరి 1999 తెలుగు వాక్యం చిరునవ్వు ప్రచురణలు నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ మందిరం ఎదురుగా, కాచిగూడ, హైదరాబాద్.
2. సుబ్రహ్మణ్యం, పి.ఎస్. 1984 ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పబ్లిక్‌గార్డెన్స్, హైదరాబాద్ - 4.